సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 200

గురువారం 10-10-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'



వరుసగా మూడోసారి భారత పురుషుల టీటీ జట్టుకు పతకం ఖరారు

ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 3-1తో ఆతిథ్య కజకిస్తాన్ జట్టుపై గెలిచింది. 2021, 2023 ఆసియా టీటీ టోర్నీల్లో భారత జట్టు సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకాలు సాధించింది. కజకిస్తాన్‌తో జరిగిన పోరులో తొలి మ్యాచ్‌లో మానవ్ 11-9, 11-7, 11-6తో గెరాసిమెంకోపై నెగ్గాడు. రెండో మ్యాచ్‌లో కుర్మంలియెవ్ 11-6, 11-5, 11-8తో హర్మీత్ దేశాయ్‌ను ఓడించాడు. మూడో మ్యాచ్‌లో శరత్ కమల్ 11-4, 11-7, 12-10తో కెంజిగులోవ్‌పై గెలిచాడు. నాలుగో మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 6-11, 11-9, 7-11, 11-8, 11-8తో గెరాసిమెంకోను ఓడించడంతో భారత్ 3-1తో విజయాన్ని ఖరారు చేసుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో చైనీస్ తైపీతో భారత్ ఆడుతుంది. మరోవైపు భారత మహిళల జట్టు సెమీఫైనల్లో 1-3తో జపాన్ చేతిలో ఓడిపోయి కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

న్యూఢిల్లీలో నితీశ్ 'షో'

- ఆంధ్ర క్రికెటర్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- 34 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లతో 74
- 23 పరుగులిచ్చి 2 వికెట్లు కైవసం
- రెండో టి20లోనూ భారత్ భారీ విజయం
- మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ సొంతం
- శనివారం హైదరాబాద్‌లో చివరి మ్యాచ్



నితీశ్ కుమార్ రెడ్డి

అందివచ్చిన అవకాశాన్ని రెండు చేతులా ఒడిసి పడుతూ... ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి అటు బ్యాటింగ్‌లో ఇటు బౌలింగ్‌లో విజృంభించిన వేళ... బంగ్లాదేశ్‌పై భారత్ ఘనవిజయం సాధించింది. నితీశ్, రింకూ సింగ్ అర్ధశతకాలతో టీమిండియా భారీ స్కోరు చేయగా... బంగ్లాదేశ్ కనీస ప్రతిఘటన లేకుండానే పరాజయం పాలైంది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే భారత జట్టు టి20 సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. సిరీస్‌లోని చివరిదైన మూడో టి20 మ్యాచ్ శనివారం హైదరాబాద్‌లో జరుగుతుంది.

న్యూఢిల్లీ: టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన భారత జట్టు... టి20ల్లోనూ అదే జోరు కనబర్చింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన టీమిండియా మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సిరీస్ పట్టేసింది. స్వదేశంలో టీమిండియాకు ఇది వరుసగా 16వ సిరీస్ విజయం కావడం విశేషం. ఆంధ్ర ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రదర్శన ఫలితంగా... మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన రెండో టి20లో భారత్ 86 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. పరుగుల తేడా పరంగా బంగ్లాపై టీమిండియాకిదే అతిపెద్ద విజయం. మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నితీశ్ (34 బంతుల్లో 74; 4 ఫోర్లు, 7 సిక్సర్లు) మెరిపించాడు. రింకూ సింగ్ (29 బంతుల్లో 53; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీ చేయగా... హార్దిక్ పాండ్యా (19 బంతుల్లో 32; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా దూకుడుగా ఆడాడు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 135 పరుగులకే పరిమితమైంది. మహ్ముదుల్లా (39 బంతుల్లో 41; 3 సిక్సర్లు) మినహా ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు.

వైజాగ్ కుర్రాడి వీరవిహారం...

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు శుభారంభం దక్కలేదు. రెండు బౌండరీలతో జోరు కనబర్చిన ఓపెనర్ సంజూ సామ్సన్ (10) రెండో ఓవర్ చివరి బంతికి ఔట్ కాగా.. కాసేపటికే మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (15) అతడిని అనుసరించాడు. కెప్టెన్ సూర్యకుమార్ (8) కూడా వెనుదిరగడంతో టీమిండియా 41 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో విశాఖపట్నం కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగి ఫలితం రాబట్టాడు. మహ్ముదుల్లా బౌలింగ్‌లో 6,4తో మోత ప్రారంభించిన నితీశ్... రిషాద్ వేసిన 10వ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదాడు. దీంతో 10 ఓవర్లు ముగిసేసరికి భారత స్కోరు 100 పరుగులు దాటింది. ఆడుతున్న రెండో మ్యాచ్‌లోనే భారీ సిక్సర్లతో విరుచుకుపడిన నితీశ్ 27 బంతుల్లో తొలి అంతర్జాతీయ అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. మిరాజ్ వేసిన 13వ ఓవర్‌లో నితీశ్ 6,4,2,6,6 బాది మొత్తం 26 పరుగులు రాబట్టాడు. ఇదే జోష్‌లో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి నితీశ్ ఔట్ కాగా.. ఆ తర్వాత బాదే బాధ్యత రింకూ, పాండ్యా తీసుకున్నారు. వీరిద్దరూ విజృంభించడంతో భారత్ భారీ స్కోరు చేయగలిగింది.

ఆది నుంచి తడబాటే!

ఛేదన ఏ దశలోనూ బంగ్లాదేశ్ లక్ష్యం దిశగా సాగలేదు. భారత్ తరఫున బౌలింగ్ చేసిన ఏడుగురు ప్రభావవంతంగా బంతులు వేయగా... పరుగులు రాబట్టేందుకు బంగ్లా బ్యాటర్లు అష్టకష్టాలు పడ్డారు. మూడో ఓవర్‌లో పర్వేజ్ హుస్సేన్ (16)ను ఔట్ చేసి అర్ష్‌దీప్ వికెట్ల పతనానికి తెరలేపగా... అది చివరి వరకు కొనసాగింది. వాషింగ్టన్ సుందర్, అభిషేక్ శర్మ, మయాంక్ యాదవ్, రియాన్ పరాగ్ కూడా ఒక్కో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. బ్యాట్‌తో సంచలన ఇన్నింగ్స్ ఆడిన నితీశ్ కుమార్ రెడ్డి బంతితోనూ చెలరేగి తన కోటా 4 ఓవర్లలో 23 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) నజ్ముల్ (బి) తస్కీన్ 10; అభిషేక్ (బి) తన్జీమ్ 15; సూర్య (సి) నజ్ముల్ (బి) ముస్తఫిజుర్ 8; నితీశ్ కుమార్ రెడ్డి (సి) మిరాజ్ (బి) ముస్తఫిజుర్ 74; రింకూ సింగ్ (సి) జాకిర్ అలీ (బి) తస్కీన్ 53; పాండ్యా (సి) మిరాజ్ (బి) రిషాద్ 32; రియాన్ పరాగ్ (సి) మహ్ముదుల్లా (బి) తన్జీమ్ 15; సుందర్ (నాటౌట్) 0; వరుణ్ చక్రవర్తి (సి) పర్వేజ్ (బి) రిషాద్ 0; అర్ష్‌దీప్ (సి) లిటన్ దాస్ (బి) రిషాద్ 6; మయాంక్ యాదవ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు:** 7, **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 221. వికెట్ల పతనం:** 1-17, 2-25, 3-41, 4-149, 5-185, 6-213, 7-214, 8-214, 9-220, **బౌలింగ్:** మిరాజ్ 3-0-46-0; తస్కీన్ 4-0-16-2; తన్జీమ్ 4-0-50-2; ముస్తఫిజుర్ 4-0-36-2; రిషాద్ 4-0-55-3; మహ్ముదుల్లా 1-0-15-0.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: పర్వేజ్ (బి) అర్ష్‌దీప్ 16; లిటన్ దాస్ (బి) వరుణ్ 14; నజ్ముల్ (సి) పాండ్యా (బి) సుందర్ 11; తౌహిద్ (బి) అభిషేక్ 2; మిరాజ్ (సి) (సబ్) రవి బిష్ణోయ్ (బి) రియాన్ 16; మహ్ముదుల్లా (సి) రియాన్ (బి) నితీశ్ 41; జాకీర్ అలీ (సి) సుందర్ (బి) మయాంక్ యాదవ్ 1; రిషాద్ (సి) పాండ్యా (బి) వరుణ్ 9; తన్జీమ్ (సి) పాండ్యా (బి) నితీశ్ 8; తస్కీన్ (నాటౌట్) 5; ముస్తఫిజుర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11, **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1-20, 2-40, 3-42, 4-46, 5-80, 6-83, 7-93, 8-120, 9-127, **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-26-1; నితీశ్ కుమార్ రెడ్డి 4-0-23-2; వాషింగ్టన్ సుందర్ 1-0-4-1; వరుణ్ చక్రవర్తి 4-0-19-2; అభిషేక్ 2-0-10-1; మయాంక్ యాదవ్ 4-0-30-1; రియాన్ పరాగ్ 2-0-16-1.

గెలిచి నిలిచిన భారత్

- శ్రీలంకపై 82 పరుగులతో టీమిండియా ఘనవిజయం
- హర్మన్‌ప్రీత్, స్మృతి అర్ధ సెంచరీలు
- ఆదివారం ఆస్ట్రేలియాతో కీలక పోరు



హర్మన్‌ప్రీత్



స్మృతి మంధాన

దుబాయ్: మహిళల టి20 ప్రపంచకప్ సెమీఫైనల్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు అద్భుత ఆటతీరుతో అదరగొట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం ఆసియా చాంపియన్ శ్రీలంక జట్టుతో జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 82 పరుగుల తేడాతో గెలిచింది. వరల్డ్ కప్ చరిత్రలో టీమిండియాకు ఇదే అతిపెద్ద విజయం. వరుసగా మూడో ఓటమితో శ్రీలంక సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27 బంతుల్లో 52 నాటౌట్; 8 ఫోర్లు, ఒక సిక్స్), ఓపెనర్ స్మృతి మంధాన (38 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. మరో ఓపెనర్ షఫాలీ వర్మ (40 బంతుల్లో 43; 4 ఫోర్లు) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడింది. అనంతరం ఛేదనలో శ్రీలంక మహిళల జట్టు 19.5 ఓవర్లలో 90 పరుగులకు ఆలౌటైంది. కవిషా దిల్హారి (21), అనుష్క సంజీవని (20), కాంచన (19) తలా కొన్ని పరుగులు చేశారు. భారత బౌలర్లలో హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి, కేరళ స్పిన్నర్ ఆశ శోభన చెరో మూడు వికెట్లు పడగొట్టారు. తొలి పోరులో న్యూజిలాండ్ చేతిలో ఓడిన భారత్... ఆ తర్వాత వరుసగా రెండో మ్యాచ్‌లో నెగ్గి 4 పాయింట్లతో రెండో స్థానానికి చేరింది. లీగ్ దశలో ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో భారత జట్టు తలపడనుంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ (సి) విష్మి గుణరత్నె (బి) చమరి ఆటపట్టు 43; స్మృతి మంధాన (రనౌట్) 50; హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 52; జెమీమా (సి) ప్రబోధిని (బి) కాంచన 16; రిచా ఘోష్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 5, **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు)172. వికెట్ల పతనం:** 1-98, 2-98, 3-128, **బౌలింగ్:** ప్రియదర్శిని 2-0-11-0; సుగంధిక 3-0-29-0; ప్రబోధిని 3-0-32-0; కవిషా దిల్హారి 2-0-11-0; ఇనోక 3-0-26-0; చమరి ఆటపట్టు 4-0-34-1; కాంచన 3-0-29-1.

శ్రీలంక ఇన్నింగ్స్: విష్మి గుణరత్నె (సి) (సబ్) రాధ (బి) రేణుక 0; చమరి ఆటపట్టు (సి) దీప్తి శర్మ (బి) శ్రేయాంక 1; హర్షిత (సి) రిచా ఘోష్ (బి) రేణుక 3; కవిషా దిల్హారి (సి) రేణుక (బి) అరుంధతి 21; అనుష్క (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) శోభన 20; నిలాక్షిక సిల్వా (సి) షఫాలీ (బి) అరుంధతి 8; కాంచన (సి) (సబ్) రాధ (బి) అరుంధతి 19; సుగంధిక (సి) రిచా ఘోష్ (బి) శోభన 1; ప్రియదర్శిని (సి) (సబ్) రాధ (బి) శోభన 1; ప్రబోధిని (సి) స్మృతి (బి) దీప్తి శర్మ 9; ఇనోక (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 90. వికెట్ల పతనం:** 1-0, 2-4, 3-6, 4-43, 5-57, 6-58, 7-61, 8-65, 9-86, 10-90, **బౌలింగ్:** రేణుక 4-0-16-2; శ్రేయాంక 4-0-15-1; దీప్తి 3.5-0-16-1; అరుంధతి రెడ్డి 4-0-19-3; ఆశ శోభన 4-0-19-3.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

సంక్రాంతి బరిలో..?



● రామ్‌చరణ్

'గేమ్ చేంజర్' సినిమా సంక్రాంతికి విడుదల కానుందనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేసిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్ చేంజర్'. శంకర్ దర్శకత్వంలో అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, 'దిల్' రాజు ప్రొడక్షన్స్ పతాకాలపై 'దిల్' రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో అంజలి, ఎస్‌జే సూర్య, సునీల్, జయరాం, ప్రియదర్శి, నవీన్ చంద్ర ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. కాగా 'గేమ్ చేంజర్' సినిమాను క్రిస్మస్ సందర్భంగా ఈ డిసెంబరులో విడుదల చేయనున్నట్లుగా ఇటీవల 'దిల్' రాజు పలు సందర్భాల్లో వెల్లడించారు. అయితే ఈ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేయాలనుకుంటున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. మరి... 'గేమ్ చేంజర్' వాయిదా పడిందా? ఒకవేళ పడితే వచ్చే సంక్రాంతి బరిలో నిలుస్తుందా? అనే విషయాలు తెలియాల్సి ఉంది.



● మహేశ్‌బాబు

జనవరిలో స్టార్టట

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను కేఎల్ నారాయణ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమాలోని పాత్ర కోసం మేకోవర్ పనుల్లో ఉన్నారు మహేశ్‌బాబు. వెండితెరపై మునుపెన్నడూ చూడని విధంగా ఈ సినిమాలో మహేశ్ లుక్ ఉంటుందని ఈ మధ్యకాలంలో బయటికొచ్చిన ఆయన ఫొటోలు స్పష్టం చేస్తున్నాయి. కాగా ఈ సినిమా చిత్రీకరణ ఎప్పుడు ఆరంభం అవుతుంది? అనే ప్రశ్నకు సమాధానం దొరికేసింది. వచ్చే ఏడాది జనవరిలో షూటింగ్ ప్రారంభం అవుతుందని ఈ సినిమాకు కథ అందించిన విజయేంద్రప్రసాద్ ఓ కార్యక్రమంలో వెల్లడించారు. ఇక ఈ చిత్రానికి 'మహారాజా' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, కథ 18వ శతాబ్దం నేపథ్యంలో ఉంటుందని, ఓ నిధి అన్వేషణ బ్యాక్‌డ్రాప్‌లో కథనం సాగుతుందని... ఇలా విభిన్నమైన ప్రచారాలు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందించనున్నారు.

నీటిలో డిష్యుం



● ప్రభాస్, రాజేంద్ర ప్రసాద్



● ప్రభాస్

హీరో ప్రభాస్ విలన్లను రఫ్ఫాడిస్తున్నారు. అది కూడా నేలపై కాదు... నీటిలో. ఇదంతా ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రాజా సాబ్' కోసమే. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. నగర శివార్లలో వేసిన ఓ భారీ సెట్‌లో ప్రభాస్‌పై అండర్ వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారని టాక్. కీలకమైన ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని భోగట్టా. 2025 ఏప్రిల్ 10న తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఇదిలా ఉంటే.. ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గద్దె గాయత్రి ఈ నెల 5న (శనివారం) గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో హీరో ప్రభాస్ హైదరాబాద్‌లో లేకపోవడంతో బుధవారం వెళ్లి రాజేంద్ర ప్రసాద్‌ని పరామర్శించారు.

"నేను నటించిన 'రణం, లౌక్యం' సినిమాలు వినోదాత్మకంగా ఉంటాయి. 'విశ్వం'లోనూ కామెడీ ఉంది. అయితే పూర్తి స్థాయి కామెడీగా రూపొందిన చిత్రం ఇది. ఇందులో శ్రీను వైట్లగారి నుంచి ప్రేక్షకులు ఎలాంటి వినోదాన్ని ఆశిస్తారో అందులో ఒక్క శాతం కూడా తగ్గదు. షూటింగ్ చేస్తున్నప్పుడు నవ్వు ఆపుకోలేకపోయేవాడిని. ప్రేక్షకులు కూడా రెండున్నర గంటలు నవ్వుతూనే ఉంటారు. 'విశ్వం' పర్ఫెక్ట్ పండగ సినిమా" అని హీరో గోపీచంద్ అన్నారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్, కావ్యా థాపర్ జంటగా నటించిన చిత్రం 'విశ్వం'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గోపీచంద్ పంచుకున్న విశేషాలు.

రెండున్నర గంటలు నవ్వుతూనే ఉంటారు

- హీరో గోపీచంద్




● శ్రీను వైట్లగారు, నేను ఓ సినిమా చేయాలని చాలా రోజుల నుంచి అనుకుంటున్నాం. గతంలో ఆయన చెప్పిన రెండు స్టోరీ లైన్స్ బాగున్నా, నాకు సరిపోవనిపించింది. ఆ తర్వాత 'విశ్వం' లైన్ చెప్పారు. ఇందులో అన్నీ చక్కగా కుదురుతాయనిపించింది. ఈ చిత్రంలో పూర్తిగా ఆయన మార్క్‌తో పాటు వినోదం, యాక్షన్ అన్నీ చక్కగా కుదిరాయి. అలాగే కుటుంబ భావోద్వేగాలని చాలా అద్భుతంగా తీశారు. ఈ సినిమాలో ఓ ఏడేళ్ల పాప నటించింది. తన అద్భుతమైన నటన చూసి షాక్ అయ్యాను.

● మనం చెప్పాలనుకున్న కథని వినోదాత్మకంగా చెబితే ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మి సక్సెస్ అయ్యారు శ్రీను వైట్లగారు. 'విశ్వం' కూడా అంత బాగుంటుందని మా నమ్మకం. ఈ సినిమాలో నా పాత్ర పేరు విశ్వం. అందుకే 'విశ్వం' టైటిల్ పెట్టాం. రెండు అక్షరాలు ఉన్న టైటిల్ నా సెంటిమెంట్ అనుకుంటారేమో అని శ్రీను వైట్లగారితో అన్నాను. అయితే ఈ సినిమాకి 'విశ్వం' కరెక్ట్ టైటిల్ అని చెప్పారాయన. ఎలా నటించాలో చేసి, చూపించేవారు శ్రీను వైట్ల. నేను ఆయన్ని కాపీ కొట్టానంతే.

● ఈ సినిమాలో కొంత భాగం మనాలీలో మైనస్ 15 డిగ్రీల చలిలో షూట్ చేశాం. చలికి చేతులు వంకర్లు పోయేవి. అలాగే ఇటలీలోని సార్డీనియాలో మెలోడీ సాంగ్ చిత్రీకరించడం సవాల్ అనిపించింది.

● నా 23 ఏళ్ల సినిమా జర్నీలో విజయాలు, అపజయాలు ఉన్నాయి. ఈ రెండింటి నుంచీ చాలా నేర్చుకోవచ్చు. ఏదేమైనా ఈ ప్రయాణంలో సంతృప్తిగా ఉన్నాను. ప్రభాస్‌తో కలిసి సినిమా చేయాలని అభిమానులు ఎదురు చూస్తున్నారు. మాక్కూడా చేయాలనే ఉంది. కుదిరినప్పుడు తప్పకుండా చేస్తాం. నా తర్వాతి సినిమాకి యూవీ క్రియేషన్స్‌లో కథా చర్చలు జరుగుతున్నాయి.

థ్రిల్ స్టార్టట



● సంయుక్త, రానా

హీరోయిన్ సంయుక్తా మీనన్ నటిస్తున్న తొలి ఫిమేల్ సెంట్రిక్ సినిమా ప్రారంభోత్సవం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచాన్ చేయగా, హీరో-నిర్మాత రానా క్లాప్ కొట్టారు. దర్శకులు వశిష్ఠ, రామ్ అబ్బరాజు గౌరవ దర్శకత్వం వహించారు. వెంకీ కుడుముల, కోన వెంకట్ మేకర్స్‌కి స్క్రిప్ట్‌ను అందజేశారు. సంయుక్తా మీనన్ సమర్పణలో యోగేష్ కేఎంసి దర్శకత్వంలో రాజేశ్ దండా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా సంయుక్తా మీనన్ మాట్లాడుతూ– ''బలమైన మహిళా పాత్రతో ఆకట్టుకునే కథ ఇది. ఈ స్క్రిప్ట్‌లో చాలా సామాజిక, రాజకీయ అంశాలు ఉన్నాయి. నెగటివిటీ తగ్గించాలనుకున్నప్పుడు మ్యాన్ పవర్, మ్యాన్ హ్యాండిలింగ్‌నే ఉపయోగించాల్సిన అవసరం లేదు. ఒక స్త్రీ తనదైన శైలిలో నెగటివిటీని తగ్గించే మార్గం ఉంది. ఆమె ఎలా చేస్తుంది? అనేది ఈ చిత్రకథ'' అని అన్నారు. ''కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఒకే ఒక సిట్టింగ్‌లో ఈ సినిమా స్క్రిప్ట్‌ను సంయుక్త అంగీకరించారు'' అని తెలిపారు రాజేశ్ దండా. ''ఈ కథ సంయుక్తగారికి నచ్చడంతో ఈ సినిమాకు ఆమె సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు'' అని చెప్పారు యోగేష్ కేఎంసి.

సినిమాను సినిమాలా చూడండి

- నిర్మాత 'దిల్' రాజు



● డి. సురేష్‌బాబు, 'దిల్' రాజు

''**త**మిళంలో ఒకప్పుడు తమిళ టైటిల్స్ మాత్రమే పెట్టాలని అనుకున్నారు. కానీ ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలు చేసేప్పుడు కొన్ని భాషల్లో టైటిల్ విషయంలో ఇబ్బందులు ఉంటున్నాయి. 'గేమ్ చేంజర్' టైటిల్ విషయంలోనూ ఇబ్బంది పడ్డాం. వేరే భాషల్లో అనువాద టైటిల్స్ దొరికితే పెడుతున్నారు. లేదంటే ఒకే టైటిల్‌తో అన్ని భాషల్లోనూ రిలీజ్ చేస్తున్నారు. సినిమాని సినిమాలా చూడండి'' అన్నారు 'దిల్' రాజు. రజనీకాంత్ హీరోగా అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'వేట్టయాన్'. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. తెలుగు వెర్షన్‌ను డి. సురేష్‌బాబు, 'దిల్' రాజు, ఏషియన్ సునీల్ రిలీజ్ చేస్తున్నారు. అయితే 'వేట్టయాన్' చిత్రాన్ని తెలుగు టైటిల్‌తో రిలీజ్ చేయడం లేదని, తెలుగు భాషను తక్కువగా చూస్తున్నారని, ఈ సినిమాను బాయ్‌కాట్ చేయాలని సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. ఈ వివాదంపై లైకా ప్రొడక్షన్స్ సంస్థ స్పందించింది. ''వేట్టయాన్' సినిమా తెలుగు వెర్షన్‌కి టైటిల్‌గా 'వేటగాడు' అని అనుకున్నాం. అయితే ఈ టైటిల్‌ను ఆల్రెడీ రిజిస్టర్ చేసుకున్నారని తెలిసింది. అందుకే 'వేట్టయాన్: ది హంటర్' పేరుతో రిలీజ్ చేస్తున్నాం'' అని లైకా ప్రొడక్షన్స్ ఓ నోట్‌ను రిలీజ్ చేసింది. ఇక ఈ వివాదంపై బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో డి. సురేష్‌బాబు మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో హంటర్ అన్నదే మెయిన్ పాయింట్. 'వేట్టయాన్: ది హంటర్' చిత్రం ఆడియన్స్‌కు కొత్త అనుభూతినిస్తుంది'' అన్నారు. ''రజనీకాంత్‌గారి ముందు నిలబడి డైలాగ్స్ చెప్పే అవకాశం రావడం నా అదృష్టం'' అని చెప్పారు రానా.

అల్లుకున్న కథ



● శ్రీరామ్

శ్రీరామ్ హీరోగా, శ్రుతీ మీనన్, ఆరుషి హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కోడి బుర్ర'. 'అల్లుకున్న కథ' అనేది ఉపశీర్షిక. చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో కంచర్ల సత్యనారాయణరెడ్డి, గట్టు విజయ్ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్ గౌడ్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాలోని క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''యాక్షన్ థ్రిల్లర్‌గా 'కోడి బుర్ర' రూపొందుతోంది. ఈ కథలో ఎన్నో మలుపులుంటాయి'' అన్నారు. ''క్లైమాక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అని చంద్రశేఖర్ కానూరి చెప్పారు. ''మా చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం'' అని వట్టం రాఘవేంద్ర, గట్టు విజయ్, కంచర్ల సత్యనారాయణ రెడ్డి తెలిపారు.


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 200

గురువారం 10-10-2024



న్యూఢిల్లీలో నితీశ్ 'షో'

ఆంధ్ర క్రికెటర్ ఆల్‌రౌండ్ ప్రదర్శన.. 2వ టి20లో బంగ్లాపై భారత్ గెలుపు -IIలో



రేటు కోతకు వేళాయెనా!

వరుసగా పదోసారి 6.5% రెపో రేటు.. ఆర్బీఐ పాలసీ కమిటీ సంకేతాలు -11లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

వ్యాపార దిగ్గజం.. దాతృత్వ శిఖరం

రతన్ టాటా అస్తమయం



ముంబై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస

దేశ పారిశ్రామిక రంగానికి దశ దిశ చూపిన ధీశాలి

ఆదాయంలో 65 శాతం దాత్రుత్వానికే..

కరోనాపై పోరుకు రూ.1,500 కోట్లు విరాళమిచ్చిన వితరణశీలి

2 లో

అనితర సాధ్యుడు

ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ నావల్ టాటా బుధవారం రాత్రి 11.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. టాటా వ్యాపార సామ్రాజ్యాన్ని దేశవిదేశాల్లో విస్తరించి.. పేదవాడి కారు కలను తీర్చాలని 'నానో' తెచ్చిన టాటా.. గొప్ప వితరణశీలి. యువతకు ఆదర్శప్రాయుడు. విలువలపై వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన దార్శనికుడు. ఆయన చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశారు.

ఆయన మార్గదర్శకత్వం అమూల్యం



రతన్ టాటా లేరన్నది నేను అంగీకరించలేకపోతున్నా. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ముందడుగులో ఉంది. మనం ఈ స్థానంలో ఉండటానికి రతన్ జీవితం, పని తీరుతో చాలా సంబంధం కలిగి ఉంది. ఈ సమయంలో అతని మార్గదర్శకత్వం అమూల్యం. మన ఆర్థిక సంపద, విజయాలకు ఆయన సేవలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. లెజెండ్స్‌కి మరణం లేదు.

\- ఆనంద్ మహీంద్రా

టాటా జీవితం స్ఫూర్తిదాయకం



కార్పొరేట్ వృద్ధిని దేశ నిర్మాణంతో, నైతికతతో మిళితం చేసిన ఒక చిహ్నాన్ని.. రతన్ టాటా మరణంతో భారతదేశం కోల్పోయింది. టాటా జీవితం స్ఫూర్తిదాయకం. దాతృత్వానికి నిదర్శనంగా నిలిచారు.

\- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

దూరదృష్టి కలిగిన దిగ్గజ వ్యాపారవేత్త



రతన్ టాటా దూరదృష్టి కలిగిన దిగ్గజ వ్యాపారవేత్త. దయార్ద్ర హృదయం కలిగిన అసాధారణ వ్యక్తి. భారత దేశంలోని ప్రతిష్టాత్మక వ్యాపార సంస్థలకు స్థిరమైన నాయకత్వాన్ని అందించారు. ఇదే సమయంలో ఆయన సహకారం బోర్డు రూమ్‌ను మించి పోయింది. ఎంతో మందికి ఆప్తుడయ్యారు.

\- ప్రధాని నరేంద్ర మోదీ

లక్షలాది మంది జీవితాలను తాకిన దాతృత్వం



ఎంతో మందికి అమూల్యమైన సహకారం అందించిన అసాధారణ నాయకుడు రతన్ టాటా. ఆయన దాతృత్వం లక్షలాది జీవితాలను తాకింది. ఆయన చేపట్టిన కార్యక్రమాలు రాబోయే తరాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయి.

\- ఎన్.చంద్రశేఖరన్, చైర్మన్, టాటా సన్స్

ఈ ఫలితాలతో ప్రజాభిప్రాయం

గందరగోళం

ఇందుకు మరో తార్కాణం హరియాణా ఫలితాలే

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టీకరణ



హరియాణా, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు భిన్నంగా లేవు

ఏపీ ఎన్నికల ఫలితాలపై కోర్టుల్లో విచారణలో కేసులు

2 లో

అభివృద్ధి చెందిన దేశాల్లో బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికల నిర్వహణ

మన దేశంలో కూడా ఎన్నికలు అలానే నిర్వహించడం మంచిది

ఓటర్లలో విశ్వాసాన్ని నింపడానికి చట్టసభ సభ్యులు ముందుకు రావాలి

మీది రెడ్ బుక్.. మాది గుడ్ బుక్

వివక్ష, పక్షపాత, కక్ష పూరిత పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం: వైఎస్ జగన్

- వివరాలు 2లో

యంత్రమా..? కుతంత్రమా?

హరియాణా ఎన్నికల ఫలితాలతో ఈవీఎంలపై మరింత బలపడ్డ అనుమానాలు

- వివరాలు 9లో

ప్రకృతి విపత్తులకు భారీ వ్యయం

తుపానులు, వరదలు, పిడుగుపాట్లు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు దేశంలో ఏటా వేలాదిమందిని బలి తీసుకుంటున్నాయి. రూ. లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు నాశనమైపోతున్నాయి. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన ప్రజలకు సాయం చేయడం, నాశనమైన రోడ్లు, విద్యుత్ వంటి వ్యవస్థలను పునరుద్ధరించడం వంటి చర్యల కోసం ఏటా రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నాయి. 2022-23లో మహారాష్ట్ర రూ.7,948 కోట్లు, ఏపీ రూ.1,021 కోట్లు వెచ్చించాయి.

రాష్ట్రం	వ్యయం రూ.కోట్లలో
మహారాష్ట్ర	7,948
బిహార్	4,116
ఉత్తరప్రదేశ్	3,757
అస్సాం	3,474
ఒడిశా	3,295
కర్ణాటక	2,960
రాజస్థాన్	2,296
జార్ఖండ్	1,496
మధ్యప్రదేశ్	1,433
ఉత్తరాఖండ్	1,401



విశాఖ ఉక్కుపై నాడు ప్రగల్భాలు.. నేడు బేల మాటలు

బాబు అండ్ కో యూటర్న్

ఎందాకైనా వెళ్లి పోరాడతామని నాడు బాబు, పవన్ శపథాలు, హామీలు

అఖిల పక్షం వేయాలని, అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్

ప్రైవేటీకరణను నిలవరించలేని జగన్ రాజీనామా చేయాలని గగ్గోలు

ప్రైవేటీకరణను గతంలో తానే అడ్డుకున్నానని, ఇప్పుడూ అడ్డుకుంటానన్న బాబు

కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ఢిల్లీలో బలంగా మన వాణి వినిపిద్దామన్న పవన్

తీరా అధికారంలోకి వచ్చాక ఏ మాత్రం నిలువరించలేని వైనం

ఒకవైపు 4,800 మంది ఉద్యోగుల తొలగింపునకు యత్నాలు

500 మంది కార్మికుల డిప్యుటేషన్‌కు రంగం సిద్ధం.. ఉత్పత్తిలో కోత..రుణానికి నిబంధనల కొర్రీ.. మరోవైపు కార్మికుల జీతాల్లో, హెచ్ఆర్ఏ, విద్యుత్ బిల్లుల్లో కోత

తాజా పరిణామాలపై నోరు మెదపక పోవడమే ఇందుకు నిదర్శనం

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏదో మాట్లాడతామని చంద్రబాబు సమర్థింపు

7 లో

సెయిల్‌లో విలీనానికి ఆ సంస్థ, కేంద్రం ఒప్పుకోవాలంటూ మెలిక

కార్మికులే కారణమంటూ జనసేన నేతల విమర్శలు.. ఖండించని పవన్



బాబు గారి 'కొవ్వు' బాగోతం బట్టబయలు

అవే నిబంధనలతో

టీటీడీ టెండర్

10 లక్షల టన్నుల ఆవు నెయ్యి కొనుగోలుకు నోటిఫికేషన్

అంటే టెండర్‌పై బాబు ఆరోపణలన్నీ అబద్ధాలేగా!

అయిన వారి కోసమే టెండర్ నిబంధనలు మార్చారని బాబు గగ్గోలు


5 లో

అందులో నిజం లేదని నిరూపించిన తాజా నోటిఫికేషన్

గత ప్రభుత్వ హయాంలో టెండర్ నిబంధనలు కఠినతరం.. రివర్స్ టెండరింగ్‌తో ఆదా



స్వచ్ఛమైన ఆవు నెయ్యి సరఫరా కోసం టెండర్ నిబంధనలు కఠినతరం చేస్తూ 2023 నవంబర్ 14న టీటీడీ బోర్డు ఆమోదించిన తీర్మానం



18. The dairy should have been operational at least for the **past 5 years**.

20. The dairies shall have to furnish the details of minimum procurement of 4.0 lakh liters of cow milk per day throughout the year for the production of ghee to enable to meet the requirement of TTD.

21. The minimum quantity of Ghee production/sales of a dairy per month shall be not less than 360 Tons.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూపొందించిన నిబంధనలతోనే ఈనెల 7న నెయ్యి సరఫరాకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిన టీటీడీ



దుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ

5 లో

పూర్ణకుంభంతో సీఎం చంద్రబాబుకు స్వాగతం

కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి దర్శనం



పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న చంద్రబాబు దంపతులు



దేవిడ్ బెకర్



జాన్ జంపర్



డెమిస్ హసాబిస్

ప్రొటీన్లపై పరిశోధనకు ముగ్గురికి రసాయన నోబెల్

మనిషి ఆరోగ్యకరమైన జీవనానికి మూలస్తంభాలైన ప్రొటీన్ల డిజైన్లు, వాటి పనితీరుపై విశేష పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ సంవత్సరం రసాయనశాస్త్ర విభాగంలో నోబెల్ అవార్డ్ వరించింది. ప్రొటీన్లపై శోధనకు గాను శాస్త్రవేత్తలు డేవిడ్ బెకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లకు 2024 ఏడాదికి కెమిస్ట్రీ నోబెల్ ఇస్తున్నట్లు కమిటీ సారథి హెనర్ లింక్ ప్రకటించారు.

- వివరాలు 6లో



బాపట్ల తీర ప్రాంతంలో సాగులో ఉన్న లైన్‌ఆకు

కాసులు కురిపిస్తున్న 'అలంకరణ' ఆకు!

బాపట్ల ఇసుక నేలల్లో పండే డెకరేషన్ ఆకుకు భలే డిమాండ్

పూలదండలు, ఫంక్షన్ అలంకరణల్లో విరివిగా వినియోగం

హైదరాబాద్ గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు పెద్ద ఎత్తున సరఫరా

అక్కడి నుంచి పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్న 'లైన్ ఆకు'

సముద్ర తీరప్రాంతంలో 400 ఎకరాల్లో సాగు

రెండు నుంచి నాలుగేళ్ల పాటు దిగుబడి..

40 రోజులకు ఒక కోత.. ఏడాదిలో 8 కోతలు

7 లో

మిగిలిన పంటలతో పోల్చితే లాభదాయకమంటున్న రైతులు

ఇదండీ సంగతి



మితిమీరిన అతి విశ్వాసం ఉన్నది మనకేనేమో సార్

దుర్గమ్మ సన్నిధిలో పోలీసుల క్రౌర్యం

మూలా నక్షత్రం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులు

8 లో

క్యూలైన్లలో సామాన్యులపై అడుగడుగునా ఖాకీల జులుం

చిన్నారులు, వృద్ధులను సైతం లాగిపడేసిన పోలీసులు.. పలువురికి గాయాలు..

ప్రశ్నించిన వారిపై దుర్భాషలు

వీఐపీల రాకతో భక్తులకు మరిన్ని తిప్పలు

జమిలి ఎన్నికలకు మద్దతివ్వాలి

- సుపరిపాలన వల్లే హరియాణాలో బీజేపీ గెలిచింది
- మహారాష్ట్ర, జార్ఖండ్‌లోనూ గెలుస్తుంది
- కచ్చితంగా వరద సాయం అందరికీ వెళ్లలేదు
- మీడియాతో సీఎం చంద్రబాబు

5 లో

దేశంలో 'ఐఐఎస్సీ' టాప్


- టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ వర్సిటీ ర్యాంకుల విడుదల
- గతేడాది కంటే బెంగళూరు విద్యా సంస్థకు కొద్దిగా తగ్గిన ర్యాంకు
- వరల్డ్ టాప్-250 నుంచి చోటు కోల్పోయినా.. భారత్‌లో అగ్ర వర్సిటీగా కొనసాగిన ఆధిక్యత
- ప్రపంచ టాప్ వర్సిటీగా వరుసగా తొమ్మిదోసారి ఆక్స్‌ఫర్డ్‌కే పట్టం

9 లో



రతన్ టాటా అస్తమయం

ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ నావల్ టాటా బుధవారం రాత్రి 11.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. టాటా వ్యాపార సామ్రాజ్యాన్ని దేశవిదేశాల్లో విస్తరించి.. పేదవాడి కారు కలను తీర్చాలని 'నానో' తెచ్చిన టాటా గొప్ప వితరణశీలి. యువతకు ఆదర్శప్రాయుడు. విలువలపై వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన దార్శనికుడు. ఆయన చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయసు 86 ఏళ్లు. రతన్ టాటా మృతిని టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ధ్రువీకరించారు. ఆయన తనకు గొప్ప మిత్రుడు, గురువు, మార్గదర్శకుడు అని చెప్పారు. రతన్ టాటా మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంతాపం ప్రకటించారు. ఆయనొక విజనరీ బిజినెస్ లీడర్, అసాధారణమైన వ్యక్తి అని కొనియాడారు. దేశంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక వ్యాపార సంస్థలకు సుస్థిరమైన నాయకత్వాన్ని అందించారని చెప్పారు. మెరుగైన సమాజం కోసం కృషి చేశారని, ఎన్నో సేవా కార్యక్రమాలకు చేయూత అందించారని గుర్తుచేశారు. విద్యా, వైద్యం, పారిశుధ్యం, జంతు సంరక్షణ తదితర రంగాల్లో విశేషమైన సేవలు అందించారని పేర్కొన్నారు. విశిష్టమైన వ్యక్తిత్వంతో ఎంతోమందికి ఆప్తుడైన రతన్ టాటా దూరం కావడం చాలా బాధాకరమని ఉద్ఘాటించారు. రతన్ టాటా కుటుంబానికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు. 'రతన్ టాటా ఒక టైటాన్' అని ప్రశంసిస్తూ వ్యాపారవేత్త హర్ష్ గోయెంకా 'ఎక్స్'లో పోస్టు చేశారు. రతన్ టాటా ఇక లేరు అనే నిజాన్ని తాను అంగీకరించలేకపోతున్నానని ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు.





సంపదలో 65% విరాళం

రతన్ టాటా 1937 డిసెంబర్ 28న ముంబైలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు నావల్ టాటా, సూనూ టాటా. ముంబై, సిమ్లాలో విద్యాభ్యాసం చేశారు. అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చదివారు. అవివాహితుడైన రతన్ టాటా 1962లో టాటా సన్స్‌లో చేరారు. 1991 నుంచి 2012 దాకా, తర్వాత 2016 నుంచి 2017 టాటా సంస్థ చైర్మన్‌గా సేవలందించారు. పారిశ్రామిక రంగానికి అందించిన సేవలకుగాను రతన్ టాటాను భారత ప్రభుత్వం 2000 సంవత్సరంలో పద్మభూషణ్, 2008లో పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది. రతన్ టాటా వితరణశీలిగా పేరుగాంచారు. తన సంపదలో దాదాపు 65 శాతం భాగాన్ని వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలకు విరాళంగా ఇచ్చారు. పలు స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు.

రతన్ టాటా.. రతనాల మాట..

'జీవితంలో విజయం సాధించాలంటే ఒడిదొడుకులు ఉండటం చాలా ముఖ్యం. ఈసీజీలో సరళ రేఖ ఉన్నదంటే ప్రాణం లేదనే అర్థం'

కేవలం భౌతిక విషయాలతోనే జీవితం ముడిపడిలేదని ప్రతివాళ్లూ ఎప్పుడో ఒకప్పుడు గ్రహిస్తారు. మనం ప్రేమించే వారిని ఆనందంగా ఉంచడంలోనే మన సంతోషమూ ఉంది.

తన కోసం పని చేస్తున్న వారి మేలు కోరే వాడే ఉత్తమ నాయకుడు

వృత్తిని - జీవితాన్ని సమతులం చేయడంపై నాకు నమ్మకంలేదు. వృత్తిని - జీవితాన్ని మమేకం చేయాలి. మీ వృత్తిని, జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దుకోవాలి.

ఏ ఇబ్బందినీ స్వీకరించకపోవడమే పెద్ద ప్రమాదం. అతి వేగంగా మారుతున్న ఈ ప్రపంచంలో ఏ సవాల్‌నూ స్వీకరించలేకపోతే అపజయం తప్పదు.

ఎన్ని కష్టాలనైనా పట్టుదలతో ఎదుర్కోండి. అవే మీ విజయానికి పునాది రాళ్లు

ఎదుటివాళ్ల దయా గుణాన్ని, ప్రేమను ఏమాత్రం తక్కువగా అంచనా వేయకండి

మీ జీవితం సాఫీగా ఉండకపోవచ్చు. సమాజంలోని సమస్యలను పరిష్కరించలేకపోవచ్చు. అలాగని సమాజంలో మీ ప్రాముఖ్యాన్ని తక్కువగా అంచనావేయొద్దు. ధైర్యం, నమ్మకం మనకో దారి చూపిస్తాయి.

అవకాశాల కోసం ఎదురు చూడకూడదు. అవకాశాల్ని సృష్టించుకోవాలి.

నాయకత్వమంటే బాధ్యత తీసుకోవడం

సరైన నిర్ణయాలు తీసుకోవడంపై నాకు దృష్టి లేదు. నిర్ణయం తీసుకొని దానిని విజయవంతం చేయడమే నా పని.

విజయం అనేది నీవు చేపట్టిన పదవిపై ఆధారపడి ఉండదు. నీవు ఇతరులను ఎంతగా ప్రభావితం చేస్తున్నావన్న దానిపై ఆధారపడి ఉంటుంది.


చిన్ననాటి రతన్ టాటా (ఎడమవైపు)


జేఆర్‌డీ టాటాతో రతన్ (ఫైల్)


ప్రధాని మోదీతో రతన్ టాటా (ఫైల్)


2008లో నాటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతులమీదుగా పద్మవిభూషణ్ అందుకుంటున్న రతన్ టాటా (ఫైల్)


ఎఫ్18, ఎఫ్16 యుద్ధవిమానాల్లో ప్రయాణిస్తున్న రతన్ (ఫైల్)

అనితరసాధ్యుడు..

పుట్టిన తేదీ, స్థలం:	విద్యాభ్యాసం:	తల్లిదండ్రులు:	పురస్కారాలు:
1937 డిసెంబర్ 28, ముంబై (అప్పట్లో బాంబే)	కార్నెల్ యూనివర్సిటీ (బీఆర్క్)	నావల్ టాటా, సూనూ టాటా	పద్మవిభూషణ్ (2008), మహారాష్ట్ర భూషణ్ (2006), పద్మభూషణ్ (2000)

బాల్యం..విద్యాభ్యాసం..

పారిశ్రామిక దిగ్గజం, వితరణశీలి రతన్ టాటా చాలా సాధారణ జీవితం గడిపేవారు. ఆయన 1937 డిసెంబర్ 28న ముంబైలో జన్మించారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెడ్‌జీ టాటా కుమారుడు రతన్‌జీ టాటా దత్తత తీసుకున్న నావల్ టాటా, సూనూ టాటా ఆయన తల్లిదండ్రులు. 1948లో ఆయన తల్లిదండ్రులు విడిపోవడంతో రతన్‌జీ టాటా సతీమణి అయిన నవాజ్‌బాయ్ టాటా సంరక్షణలో పెరిగారు. జిమ్మీ టాటా ఆయనకు సోదరుడు కాగా, నోయెల్ టాటా సవతి సోదరుడు. రతన్ టాటా ముంబై, సిమ్లాలో విద్యాభ్యాసం చేశారు. అటుపైన అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చదివారు.

100 బిలియన్ డాలర్లకు టాటా గ్రూప్..

రతన్ టాటా 1962లో టాటా సన్స్‌లో చేరారు. సాధారణ ఉద్యోగి తరహాలోనే పని చేస్తూ కుటుంబ వ్యాపార మెళకువలు తెలుసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఆర్థిక సమస్యల్లో ఉన్న నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ (నెల్కో)కి డైరెక్టర్ ఇంచార్జ్‌గా 1971లో ఆయన నియమితులయ్యారు. కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగాన్ని గాడిలో పెట్టేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ, ఆర్థిక మందగమనం, కార్మిక సంఘాలపరమైన సమస్యల కారణంగా ఆ ప్రయత్నాలు అంతగా సఫలం కాలేదు. 1977లో సంక్షోభంలో ఉన్న మరో గ్రూప్ సంస్థ ఎంప్రెస్ మిల్స్‌కి ఆయన బదిలీ అయ్యారు. మిల్లును పునరుద్ధరించేందుకు ఆయన ప్రణాళికలు వేసినప్పటికీ మిగతా అధికారులు కలిసి రాకపోవడంతో సంస్థను అంతిమంగా మూసివేయాల్సి వచ్చింది. మొత్తానికి 1991లో జేఆర్‌డీ టాటా ఆయన్ను టాటా గ్రూప్ చైర్మన్‌గా నియమించారు. భారీ బాధ్యతలను మోయడంలో ఆయనకున్న సామర్థ్యాలపై సందేహాల కారణంగా మిగతా అధికారుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ రతన్ టాటా వాటన్నింటినీ తోసిరాజని తన సత్తా నిరూపించుకున్నారు. గ్రూప్‌ను అగ్రగామిగా నిలిపారు. తన హయాంలో మేనేజ్‌మెంట్ తీరుతెన్నులను పూర్తిగా మార్చేసి గ్రూప్ కంపెనీలను పరుగులు తీయించారు. 2012లో ఆయన టాటా గ్రూప్ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత చైర్మన్‌గా నియమితులైన సైరస్ మిస్త్రీతో విభేదాలు రావడంతో తిరిగి 2016 అక్టోబర్ నుంచి 2017 ఫిబ్రవరి వరకు మరోసారి చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. అటు తర్వాత ఎన్.చంద్రశేఖరన్‌కు పగ్గాలు అప్పగించారు. 21 ఏళ్ల పాటు సాగిన రతన్ టాటా హయాంలో గ్రూప్ ఆదాయాలు 40 రెట్లు, లాభాలు 50 రెట్లు పెరిగాయి. టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయిలో భారీగా విస్తరించారు రతన్ టాటా. ఆయన సారథ్యంలో టాటా గ్రూప్ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. సాఫ్ట్‌వేర్, టెలికం, ఫైనాన్స్, రిటైల్ తదితర రంగాల్లోకి గ్రూప్ విస్తరించింది. రతన్ టాటా బాధ్యతలు చేపట్టినప్పుడు 1991లో రూ. 10,000 కోట్లుగా ఉన్న గ్రూప్ టర్నోవరు 2011–12లో ఆయన తప్పుకునే సమయానికి 100 బిలియన్ డాలర్లకు ఎగిసింది. సాల్ట్ నుంచి సాఫ్ట్‌వేర్ వరకు అన్ని విభాగాల్లోకి విస్తరించింది. పలు విదేశీ కంపెనీలను కొనుగోలు చేయడంతో గ్రూప్ ఆదాయాల్లో దాదాపు సగ భాగం విదేశాల నుంచే ఉంటోంది. ఆయన సాహసోపేత నిర్ణయాల కారణంగా కోరస్, జాగ్వార్ ల్యాండ్ రోవర్, టెట్లీ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు టాటా గ్రూప్‌లోకి చేరాయి. నానో, ఇండికా కార్లు ఆయన విజనే.

వితరణశీలి.. ఇన్వెస్టరు..

రతన్ టాటా గొప్ప వితరణశీలి. తన సంపదలో దాదాపు 60–65% భాగాన్ని ఆయన వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలకు విరాళమిచ్చారు. 2008లో కార్నెల్ వర్సిటీకి 50 మిలియన్ డాలర్ల విరాళమిచ్చారు. ప్రధానంగా విద్య, ఔషధాలు, గ్రామీణాభివృద్ధి మొదలైన వి భాగాలపై దృష్టి పెట్టారు. ఆయన పలు అంకుర సంస్థల్లో విస్తృతంగా పెట్టుబడులు పెట్టారు. వ్యక్తిగత హో దాలో అలాగే ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ద్వారా 30కి పైగా స్టార్టప్స్‌లో ఇన్వెస్ట్ చేశారు. శ్నాప్‌డీల్, షావోమీ, ఓలా క్యాబ్స్, మొదలైన వాటిలో పెట్టుబడులు పెట్టారు. సీనియర్ సిటిజన్ల కోసం ఉద్దేశించిన గుడ్‌ఫెలోస్ అనే స్టార్టప్‌కు తోడ్పాటు అందించారు. కరోనా నియంత్రణ కోసం రూ.1,500 కోట్లు అందించారు.



వివిధ రంగాలలో రతన్ టాటా సంస్థలు

పురస్కారాలు
పారిశ్రామిక దిగ్గజంగానే కాకుండా వితరణశీలిగా కూడా పేరొందిన రతన్ టాటాను పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు వరించాయి. పద్మభూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలతో పాటు ఆయన మహారాష్ట్ర భూషణ్, అస్సాం వైభవ్ వంటి అవార్డులను కూడా అందుకున్నారు.

సిమీ గ్రేవాల్‌తో అనుబంధం..
రతన్ టాటా వివాహం చేసుకోవాలనుకున్నా సాధ్యపడలేదని ఆయనే పలు సందర్భాల్లో తెలిపారు. నాలుగు సార్లు వివాహానికి దగ్గరగా వచ్చినా పలు కారణాల వల్ల వెనక్కి తగ్గాల్సి వచ్చిందని చెప్పారు. అప్పట్లో బాలీవుడ్ నటి సిమీ గ్రేవాల్‌తో ఆయన ప్రేమలో పడినట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆమె ఆ తర్వాత మరొకరిని వివాహం చేసుకున్నారు.

మిస్త్రీతో వివాదం..
టాటా గ్రూప్ చైర్మన్‌గా రతన్ టాటా ఏరి కోరి సైరస్ మిస్త్రీని తన వారసుడిగా నియమించారు. కానీ మిస్త్రీ పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంతో వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. చివరికి 2016లో మిస్త్రీ ఉద్వాసనకు దారి తీశాయి. దీనిపై ఇరువర్గాల మధ్య సుదీర్ఘ న్యాయపోరాటం జరిగింది.

మీది రెడ్‌బుక్.. మాది గుడ్‌బుక్

వివక్ష, పక్షపాత, కక్ష పూరిత పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ నేతల సమావేశంలో వైఎస్ జగన్

- రెడ్‌బుక్ పెద్ద విషయమా? మేమైతే గుడ్ బుక్ రాస్తున్నాం
- ఇక్కట్లు పడుతున్న పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం.. మేలు చేసిన వారికి అధికారంలోకి రాగానే మంచి చేస్తాం
- కష్టపడిన వారికి తప్పకుండా అవకాశాలు, ప్రమోషన్లు.. అర్హతే ప్రామాణికంగా అందరికీ మంచి చేశాం
- 4 నెలల్లోనే మొత్తం యూటర్న్
- పథకాల అమలు లేదు.. మహిళలకు భద్రతా లేదు
- కష్టాలు ఎల్లకాలం ఉండవు.. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ అంటూ ఎప్పుడూ లేని దుష్ట సంప్రదాయాన్ని తీసుకొచ్చింది. వివక్ష, పక్షపాత, కక్ష పూరిత పాలన సాగిస్తోంది. రెడ్‌బుక్ అనేది పెద్ద విషయమా? మేమైతే గుడ్‌బుక్ రాసుకోవడం మొదలు పెట్టాం. పార్టీకి మంచి చేసిన వారిని, కష్టపడే వారి పేర్లన్నీ రాసుకుంటున్నాం. వారందరికీ తప్పకుండా అవకాశాలు, ప్రమోషన్లు ఉంటాయి' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలు, చేసేవన్నీ మోసాలేనని.. ఆ మోసం వల్ల ప్రజల కోపం నుంచి పుట్టే ఓటు చంద్రబాబుకు సింగిల్ డిజిట్ కూడా రాని పరిస్థితి తెస్తుందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై వారికి దిశా నిర్దేశం చేశారు. 'మంగళగిరి నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. మితిమీరిన అధికార దుర్వినియోగంతో మన కార్యకర్తలకు నష్టం చేస్తున్నప్పుడు కచ్చితంగా భరోసా ఇవ్వాలి. వారికి పార్టీ తోడుగా ఉంటుందనే విశ్వాసం కల్పించాలి. ఆ ఉద్దేశంతోనే ఈ సమావేశం ఏర్పాటు చేశాం. పార్టీ పరంగా కొన్ని నిర్ణయాలు కూడా తీసుకున్నాం. అన్నింటినీ తట్టుకుని పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటారని భావించి వేమారెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించాం. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఎలా పాలన సాగిస్తుందో మీ అందరికీ తెలుసు. నాలుగు నెలలుగా రాష్ట్రంలో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారం లేనప్పుడే మనిషి వ్యక్తిత్వం బయటకు వస్తుంది. చీకటి తర్వాత కచ్చితంగా వెలుతురు వస్తుంది' అని చెప్పారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఇప్పుడు పరిస్థితులు ఏంటో మీరే చూడండి. కేవలం నాలుగు నెలల్లోనే మొత్తం యూటర్న్. ప్రతి అడుగులోనూ, ప్రతి విషయంలోనూ తిరోగమనమే కనిపిస్తోంది. ప్రతి చోటా వివక్ష, పక్షపాతం కనిపిస్తున్నాయి. ప్రతి ఇంట్లోనూ దీనిపై చర్చ జరుగుతోంది. 'జగన్ పలావు పెట్టాడు. బాబు బిర్యానీ పెడతానన్నాడు. ఇప్పుడు పలావూ పోయింది. బిర్యానీ పోయింది' అనే చర్చ జరుగుతోంది.

ఇప్పుడు పథకాలు అమలు కాకపోగా, వ్యవస్థలన్నీ పతనం అవుతున్నాయి. ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ అటకెక్కింది. బిల్లులు చెల్లించడం లేదు. నెట్‌వర్క్ ఆస్పత్రుల బిల్లులు దాదాపు రూ.2,300 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని పేషెంట్ ఆస్పత్రికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఆరోగ్య ఆసరాను పూర్తిగా ఎగరగొట్టారు. ఒకేసారి 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టగా, ఇప్పటికే 5 కాలేజీలు ప్రారంభమయ్యాయి. మిగిలిన 5 కాలేజీలు ఈ ఏడాది ప్రారంభం కావాల్సి ఉంది. అన్నీ వెనుకడుగే. ప్రభుత్వం ఎందుకు ఉందో అర్థం కావడం లేదు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు ఉంటాయి. ఆ కష్టాల నుంచే నాయకులు పుడతారు. కేసులు పెడతారు. జైళ్లకు పంపిస్తారు. నన్ను 16 నెలలు జైల్లో పెట్టి తీవ్రంగా వేధించారు. ఇంతకంటే దారుణంగా ఎవరినీ వేధించి ఉండరు. అయినా ప్రజల ఆశీస్సులతో మనం ముందడుగు వేశాం. ప్రజల ఆశీస్సులతో సీఎం అయ్యాను. కష్టాలు ఎక్కువ కాలం ఉండవు. వచ్చేది మన ప్రభుత్వమే.

\- వైఎస్ జగన్

మన మంచి ప్రతి ఇంట్లో ఉంది

- 2019 నుంచి 2024 వరకు ప్రతి ఇంటికీ మనం మంచి చేశాం. ఆ మంచి ప్రతి ఇంట్లోనూ బతికే ఉంది. అందుకే ప్రతి ఇంటికీ మనం గర్వంగా తలెత్తుకుని వెళ్లగలం. రాష్ట్రంలో ఇంతకు ముందు ఎప్పుడూ జరగని విధంగా పాలన చేస్తూ.. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాం. గతంలో మేనిఫెస్టో అంటే ఎన్నికలప్పుడు పెద్ద డాక్యుమెంట్ తయారు చేసి, ఎన్నికలవ్వగానే చెత్తబుట్టలో వేసే సంప్రదాయం. కానీ మొట్టమొదటిసారిగా మేనిఫెస్టో అన్నదానికి అర్థం తీసుకొచ్చిన పాలన మాత్రం కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగింది.
- మేనిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి అందులో ఇచ్చిన ప్రతి హామీని.. గతంలో రాష్ట్రంలో ఎప్పుడూ జరగని విధంగా, చూడని విధంగా బడ్జెట్‌తో పాటు సంక్షేమ క్యాలెండర్ కూడా విడుదల చేశాం. ఏ నెలలో ఏ పథకం వస్తుందో ముందుగానే చెప్పి.. ఆ ప్రకారం ప్రతి నెలలో క్రమం తప్పకుండా బటన్ నొక్కి పథకాలు అమలు చేశాం. ఇది కేవలం ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలోనే జరిగింది. గతంలో రాష్ట్రంలోనే కాదు.. బహుశా దేశంలోనే ఈ తరహాలో క్యాలెండర్ ద్వారా పథకాలు అమలు చేసిన చరిత్ర లేదు.

విప్లవాత్మక మార్పులు తెచ్చాం

- స్కూళ్లు, ఆస్పత్రులను సమూలంగా మార్చాం. మంచి వైద్యాన్ని గ్రామాలకే తీసుకువచ్చాం. ఇంగ్లిష్ మీడియం చదువులు, టోఫెల్ క్లాసులు, ప్రభుత్వ బడుల్లో డిజిటల్ ప్యానెల్స్, ఎనిమిదో తరగతి పిల్లల చేతుల్లో ట్యాబ్‌ల వంటి మార్పులు చేశాం. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గొప్ప మార్పులు తెచ్చాం. ఉచిత పంటల బీమా అమలు చేశాం. రైతులకు ఈ–క్రాప్ చేశాం. దళారీ వ్యవస్థ లేకుండా ఆర్బీకేల ద్వారా రైతుల వద్ద నుంచి కొనుగోళ్లు చేపట్టాం.
- చివరకు పాలనలో సైతం మార్పులు తెచ్చాం. పాలన అంటే ప్రజల వద్దకు మాత్రమే కాదు.. ప్రజల ఇంటికే పంపించే కార్యక్రమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగింది. వివక్ష లేకుండా, రాజకీయాలు చూడకుండా పథకాలు ఇచ్చాం. కేవలం అర్హత మాత్రమే ప్రామాణికంగా తీసుకుని.. మనకు ఓటు వేయని వారికి కూడా అడగకుండా పథకాలు ఇచ్చాం. ప్రతి ఇంటి గడప వద్దకే పెన్షన్, రేషన్ సరుకులతో పాటు అన్ని పథకాలు అందించాం.
- దిశ యాప్ ద్వారా అక్కచెల్లెమ్మలకు భద్రత కల్పించాం. ఒకవేళ వారు ఇబ్బందుల్లో ఉంటే దిశ యాప్ బటన్ నొక్కిన 10 నిమిషాల్లోపే పోలీసులు వచ్చి భద్రత కల్పించేలా చేశాం. ఇవన్నీ గతం. ఇవాళ ఏ ఒక్కటీ అమలు కావడం లేదు. అక్కచెల్లెమ్మలకు భద్రత కరువైంది.

పార్టీని మరింత బలోపేతం చేద్దాం

సంస్థాగతంగా పార్టీ అత్యంత బలంగా ఉండాలి. గ్రామ స్థాయి నుంచి బూత్ కమిటీల ఏర్పాటు జరగాలి. ఆ స్థాయిలో పార్టీ ఏకం కావాలి. మన కార్యకర్తలను, అభిమానులను ఏకం చేయాలి. వారందరి ద్వారా బలమైన పార్టీ నిర్మాణం జరగాలి. ఆ తర్వాత ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మనం సన్నద్ధంగా ఉంటాం. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే.


ఈ ఫలితాలతో ప్రజాభిప్రాయం గందరగోళం

ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని గందరగోళానికి గురి చేస్తున్నాయనడానికి మరో తార్కాణం హర్యానా ఎన్నికల ఫలితాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. హర్యానా ఎన్నికల ఫలితాలపై 'ఎక్స్' వేదికగా బుధవారం ఆయన స్పందించారు. 'హర్యానా, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు భిన్నంగా లేవు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలపై కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మనలాంటి ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్యం ప్రబలంగా ఉండటమే కాదు.. దృఢంగా ఉన్నట్లు కన్పించాలి. ఈ రెండింటినీ నిర్ధారించడానికి ఏకైక మార్గం పేపర్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించడమే. యూఎస్ఏ, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, నార్వే, డెన్మార్క్‌తో సహా చాలా అభివృద్ధి చెందిన దేశాలు పేపర్ బ్యాలెట్‌ను ఉపయోగిస్తున్నాయి. మనం ప్రపంచంలోని ఇతర దేశాలలో మార్పులు చూసి పేపర్ బ్యాలెట్ వైపు వెళ్లే సమయం ఇది. బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే ఓటర్ల విశ్వాసాన్ని పెంచుతుంది. ఇలా విశ్వాసాన్ని నింపేందుకు చట్టసభ సభ్యులు ముందుకు రావాలి' అని పిలుపునిచ్చారు. ఈ మేరకు దేశంలోని జాతీయ, ప్రాంతీయ పార్టీలను ట్యాగ్ చేస్తూ వైఎస్ జగన్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

సాకులు చూపకుండా పథకాల అమలు

- పథకాల అమలులో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పథకాలు అమలు చేయకుండా ఉండేందుకు చాలా కారణాలు కనిపించాయి. గతంలో చంద్రబాబు చేసిన అప్పులు, మన హయాంలో చేసిన వాటి కన్నా చాలా ఎక్కువ. ఆ అప్పుల బరువు మనం మోశాం. కోవిడ్ లాంటి మహా సంక్షోభాన్ని ఎదుర్కొన్నాం. రెండేళ్ల పాటు కోవిడ్‌తో యుద్ధం చేస్తున్న సమయంలో అనూహ్యంగా రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు కూడా తగ్గిపోయాయి. మరోవైపు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఇలాంటి అనేక పరిస్థితులు చూశాం.
- అయినా ఏరోజూ కూడా సాకులు చూపకుండా పథకాలు అమలు చేశాం. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి ఒక్కటీ చేయాల్సిన ధర్మం మన మీద ఉందని నమ్మి అన్నీ నడిపించాం. చిరునవ్వుతోనే పాలన సాగించి, చెప్పిన ప్రతి మాట నెరవేర్చుతూ, రాష్ట్రంలో ఎప్పుడూ చూడని విధంగా పాలన చేస్తూ మార్పులు తీసుకువచ్చాం.


TATA
TATA.ev
FESTIVAL OF CARS
పెట్రోల్ మరియు డీజిల్ కార్ల వ్యయంతోనే TATA.ev పొందండి —
31 అక్టోబరు 2024 వరకు గతంలో ఎప్పుడూ లేని ధరలు*
₹1/km^ కి అతితక్కువ రన్నింగ్ వ్యయం | ప్రతి సంవత్సరం ₹1.2 లక్షల వరకు పొదుపు చేయండి
6 months free charging
₹75000/-
Nexon.ev
పండగ ధర ప్రారంభం ₹12.49 Lakh*
ఇప్పుడే ప్రారంభించబడింది
45 kWh ధర ప్రారంభం ₹13.99 Lakh*
డ్రైవింగ్ రేంజ్ 489km
పండగ ధర తగ్గుదల ₹3 Lakh+ వరకు
Punch.ev
పండగ ధర ప్రారంభం ₹9.99 Lakh*
పండగ ధర ₹1.2 Lakh+ తగ్గించబడింది
Tiago.ev
ధర ప్రారంభం ₹7.99 Lakh*
పండగ ప్రయోజనాలు ₹60,000 వరకు+
కేవలం ₹6499** వద్ద ప్రారంభమయ్యే EMI | 100% వరకు ఆన్-రోడ్ ఫైనాన్సింగ్ | ఎంపికచేసిన కార్పొరేట్‌లకు ప్రత్యేక ఆఫర్‌లు లభిస్తున్నాయి
మీకు దగ్గరలో ఉన్న TATA MOTORS షోరూమ్‌ని సందర్శించండి ఇప్పుడే.
1,65,000+ మంది సంతృప్తి చెందిన కస్టమర్లు | భారతదేశంలో 4 బిలియన్+~ km నడపబడ్డాయి | భారతదేశమంతటా 13,500+ పెరుగుతున్న పబ్లిక్ ఛార్జర్ల నెట్‌వర్క్### | ఉచిత మరియు తక్షణ హోమ్ ఛార్జర్ ఇన్‌స్టలేషన్+++
టెస్ట్ డ్రైవ్ చేసేందుకు స్కాన్ చేయండి
స్కాన్ అండ్ ప్లాన్- మీ రూట్‌లో EV ఛార్జర్లను కనుక్కోండి
book TATA.ev
EVల గురించి మరింత తెలుసుకునేందుకు, సందర్శించండి: ev.tatamotors.com లేదా కాల్ చెయ్యండి: +91 92402 92401
భారతదేశంలో అతి సురక్షితమైన ఎలక్ట్రిక్ SUVs*
TATA.ev
VIJAYAWADA: JASPER INDUSTRIES, VIJAYAWADA – 7506024539; JASPER INDUSTRIES, KANURU, MACHILLAPATNAM - 8291096098; GARAPATI AUTOVENTURES, VIJAYAWADA, JAGGAYYAPETA, GUDIVADA, TENALI – 9167543406
Images and illustrations are indicative and for information purpose only. All feature / specifications mentioned may vary from model to model and may not be available across all personas / variants. Features and specifications are subject to change without prior information. Please consult an authorized Tata Motors dealer for latest information on features / specifications before deciding to place an order. Colours may not match actual colours due to printing limitations. The running cost of ₹1 per km is based on slow charging using a 3.3 kW charging source. Actual costs may vary depending on electricity tariffs, charging infrastructure, driving conditions, and usage patterns. Faster charging methods or higher-powered chargers may result in higher running costs. Free charging is available only on TATA power chargers on TATA evs purchased between 10th September 2024 to 31st October 2024. Offer is valid only on personal vehicle and not on fleet. As per usage policy of 1000 units (kWh) per vehicle during the 6 month offer validity. Calculation based on a standard usage limit of 1,000 units, which equates to 6,000-7,000 kilometers and a comparison to a petrol automatic car with a average running cost of ₹10-12 per kilometer. Offer valid till 31st October 2024 and till stock last. EMI calculated is based on flexi scheme of ₹809 per lac installment for 6 months. The subsequent EMIs after 6 months will be higher. The final EMI and funding decision will be at the sole discretion of the Financier. Benefits available from multiple financiers. Based on internal calculation. As per internal data provided by charging point operators. For terms and conditions refer to ev.tatamotors.com. As per Bharat NCAP 2024 score. Based on a comparison between the running cost of an electric vehicle @₹1/km and a petrol vehicle @ ₹8/km, assuming an average driving distance of 1,500 km per month. Actual savings may vary depending on individual driving habits, electricity rates, fuel prices, and vehicle efficiency. ARAI Certified Urban+ Extra Urban (MIDC Part 1 + Part 2) under standard testing conditions, actual performance figures may vary depending on various conditions including driving pattern, etc. Offer valid for a limited period till stocks last. All India ex-showroom price. Terms & conditions apply.
12222421


mahindra Rise
ఆలోచన కంటే ముందు
కొత్త మహీంద్రా
VEERO
18.4 km/l మైలేజ్*
1600 kg పేలోడ్
3035 mm కార్గో లెంత్
ఎయిర్‌బ్యాగ్
26.03 cm టచ్ స్క్రీన్
రివర్స్ కెమెరా
ధర ₹7.99 లక్షలతో ప్రారంభం**
త్వరగా బుక్ చెయ్యండి!
with you hamesha
xmart
UDAY
పది లక్షల రూపాయల దుర్ఘటన బీమా
**ప్రారంభ ధర కేవలం Veero 1.6 XL CBC V2 వేరియంట్ కోసం మాత్రమే వర్తిస్తుంది. *ARAI సర్టిఫికేట్ ప్రకారం. ప్రమాణిత డ్రైవింగ్ పరిస్థితుల క్రింద. చూపబడిన ఆక్సెసరీలు, స్టాండర్డ్ ఉపకరణాలలో భాగం కావు. స్టాకుఉన్నంత వరకు. *షరతులు నిబంధనలు వర్తిస్తాయి.
AUTOMOTIVE MANUFACTURERS PVT. LTD.: VIJAYAWADA, GUDIVADA, MACHILIPATNAM, NANDIGAMA, NUZIVEEDU, KAIKALURU - 8886608336, 7799739098.



భవిష్యత్ సంతోషాలకు దెబ్బ తగలకుండా
ప్రస్తుత సంతోషాల్ని అనుభవించండి.
– సెనెకా

సాక్షి
గురువారం, 10 అక్టోబర్ 2024

సరికొత్త అధ్యాయమయ్యేనా?!

అక్టోబర్ 8 నాటి ఎన్నికల ఫలితాలు కేంద్రంలోని అధికార ఎన్డీఏ కూటమికీ, ప్రతిపక్ష 'ఇండియా' కూటమికీ సమాన స్కోర్లు అందించాయి. హర్యానాలో బీజేపీ, జమ్ము–కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) – కాంగ్రెస్ కూటమి విజయం సాధించడంతో లెక్క సమం అయింది. అయితే, ఈ ఫలితాల అసలు ప్రభావం ఈ అంకెల లెక్కకు మించినది. అన్ని అంచనాలనూ తలకిందులు చేస్తూ... హర్యానాలో వరుసగా మూడోసారి విజయంతో బీజేపీ రికార్డ్ సృష్టించడం ఒక ఎత్తయితే, జమ్ము–కశ్మీర్‌లో దాదాపు ఆరేళ్ళ పైచిలుకు తర్వాత మళ్ళీ ప్రజలెన్నుకున్న ప్రభుత్వం కొలువు తీరనుండడం మరో ఎత్తు. కశ్మీర్ ఎన్నికల ఫలితాలు అనేక కారణాల రీత్యా అత్యంత కీలకమైనవి. వాటి ప్రకంపనలు, ప్రభావం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కావు. లెఫ్టినెంట్ గవర్నర్‌కు ప్రాధాన్యమిచ్చి, శాసనవ్యవస్థ అధికారానికి రెక్కలు కత్తిరించిన పరిస్థితుల్లో కశ్మీర్‌లో ప్రభుత్వాన్ని నడపడం కత్తి మీద సాము కానుంది. అదే సమయంలో రాష్ట్రహోదాను పునరుద్ధరించాలన్న ప్రజాకాంక్ష అక్కడి ఎన్నికల ఫలితాల్లోనూ ప్రతిఫలించడంతో ఎన్సీ కూటమి ఆ దిశగా కృషి చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర హోదాపై ఎన్నికల వేళ ఇచ్చిన హామీని కేంద్ర పెద్దలు, బీజేపీ అధినాయకులు నిలబెట్టుకుంటారా, లేక తమ పార్టీ అధికారంలోకి రాలేదు గనక 'అంతా తూచ్' అనేస్తారా అన్నది చర్చనీయాంశమైంది.

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దు తర్వాత, రాష్ట్రాన్ని జమ్ము – కశ్మీర్, లద్దాఖ్ అంటూ రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత జరిగిన తొట్టతొలి ఎన్నికలు ఇవే. ఆసక్తిగా చూస్తుండగా, పోటాపోటీగా, అదే సమయంలో శాంతియుతంగా ఈ ఎన్నికలు సాగడం విశేషం. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల కన్నా 5 శాతం పైచిలుకు ఎక్కువగా, పెద్దయెత్తున 63.9 శాతం వరకు ఓటింగ్ జరగడం గమనార్హం. అంటే, ఎన్నికల ప్రజాస్వామ్యం వైపు ప్రజల మొగ్గు సుస్పష్టం. జనమిచ్చిన మెజారిటీతో కశ్మీర్‌లో ఇక ఎన్సీ – కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం కొలువు తీరనుంది. అతి పెద్ద పార్టీగా అవతరించిన ఎన్సీ పక్షాన ఒమర్ అబ్దుల్లా సీఎం కానున్నారు. ఇలా కశ్మీర్‌లో ప్రజాస్వామ్యబద్ధ ప్రభుత్వం తిరిగి రావడం ఒక శుభసూచన. ఎన్నికైన సర్కారుండడంతో స్థానిక ప్రజలు తమ కష్టనష్టాల పరిష్కారానికై ప్రజాప్రతినిధుల్ని ఆశ్రయించే వీలు చిక్కింది.

అతివాద బీజేపీని ద్వితీయ స్థానానికే పరిమితం చేసి, మితవాద దృక్పథమున్న ఎన్సీకి పట్టం కట్టడం ద్వారా ప్రజాపాలనకై తాము తహతహలాడుతున్నట్టు కశ్మీరీలు చెప్పకనే చెప్పారు. ఒమర్ తండ్రి ఫరూఖ్ అబ్దుల్లా నేతృత్వంలోని ఎన్సీ – కాంగ్రెస్ కూటమి కశ్మీర్ లోయ వరకు మొత్తం 47 సీట్లలో 42 స్థానాలను గెలవడం విశేషం. ముస్లిమ్ జనాభా అధికంగా ఉండే లోయలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల స్థానిక ప్రజల వ్యతిరేకతకు అది అద్దం పడుతోంది. ఇక లోయలో ఖాతా తెరవలేకపోయినా, హిందువులు ఎక్కువైన జమ్ములో మాత్రం పోటీ చేసిన 43 సీట్లలో 29 గెలిచి, బీజేపీ తన బలం నిరూపించుకుంది. కాంగ్రెస్ మొత్తం 6 సీట్లలో విజయంతో మూడో స్థానంలో నిలిచింది. మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీ 3 సీట్లు, 'ఇంజనీర్' రషీద్ సారథ్యంలోని వేర్పాటువాద అవామీ ఇత్తెహాద్ పార్టీ ఒక సీటే గెలిచి, బరిలో చతికిలబడ్డాయి.

ఒకప్పుడు ఉమ్మడి కశ్మీర్‌కు సీఎంగా పనిచేసిన ఒమర్ ఇప్పుడు లద్దాఖ్‌ను విడగొట్టిన తర్వాత ఏర్పడ్డ విభజిత కశ్మీర్‌కు తొలి సీఎం. కానీ, ప్రభుత్వాన్ని నడపడం సులభం కాదు. సవాళ్ళు తప్పవు. ఆ మాట అంగీకరిస్తూనే, కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు పెట్టుకుంటామనీ, అదే సమయంలో రద్దయిన ప్రత్యేక ప్రతిపత్తి ఆర్టికల్ 370 పునరుద్ధరణకు డిమాండ్ చేస్తూనే ఉంటామనీ ఒమర్ స్పష్టం చేశారు. అది ఆయన అనివార్యత, లోయ ప్రజల ఆకాంక్ష. అయితే అంతకన్నా ముఖ్యం... జనం వర్గాలుగా చీలి, ఓటేసిన నేపథ్యంలో జమ్మూను వేరుగా చూడకుండా కలుపుకొని పోతూ, అక్కడి ప్రజాప్రతినిధులకు క్యాబినెట్‌లో పెద్దపీట వేయడం! ఆ సంగతి ఒమర్‌కూ తెలుసు. జమ్ముతో పోలిస్తే కశ్మీర్ లోయలోనే ఎక్కువ స్థానాలొచ్చినా రెండు ప్రాంతాలూ తమకు సమానమేననీ, అందరి ప్రభుత్వంగా ప్రాంతాల మధ్య అంతరాన్ని తొలగిస్తామనీ ఆయన ప్రకటించారు.

ఆర్టికల్ 370 పాత చరిత్ర, తప్పొప్పుల మాట అటుంచితే, అంత కన్నా ముఖ్యమైనది జమ్ము – కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడం! ఎందుకంటే, కేంద్రపాలిత ప్రాంతమయ్యే సరికి 370 రద్దుకు ముందు రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నన్ని అధికారాలు ఉండవు. చివరకు పోలీసులు సైతం కేంద్రం కనుసన్నల్లోనే ఉంటారు. ఎన్నికలు పూర్తయి, ప్రజాప్రభుత్వం వచ్చింది గనక, తక్షణమే రాష్ట్రహోదా దిశగా అడుగులేయాలి. గత డిసెంబర్‌లో సుప్రీమ్‌కోర్ట్ సైతం సత్వరమే పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని చెప్పిందన్నది గమనార్హం. అన్ని రాజకీయ పక్షాలూ కోరుతున్నట్టు ఆ విషయంలో కేంద్రం తన హామీని నిలబెట్టుకోవాలి. కశ్మీర్‌లో సైతం అన్ని రాష్ట్ర ప్రభుత్వాల తరహాలోనే కొత్త సర్కార్ పని చేసే వీలు కల్పించాలి. కశ్మీర్‌కి ప్రత్యేక భౌగోళిక, సాంస్కృతిక చరిత్ర ఉన్న మాట నిజమే కానీ, దాన్ని గుర్తిస్తూనే ఆ ప్రాంతం మిగతా దేశంతో కలసి అడుగులు వేసేలా కృషి సాగాలి. యువతరంలో నిరుద్యోగం దేశంలోనే అధికంగా ఉన్న ఆ ప్రాంత సామాజిక, ఆర్థిక పురోగతి అందుకు కీలకం. అలాగే గత అయిదేళ్ళలో స్థానిక ఆకాంక్షలకు భిన్నంగా తీసుకున్న మైనింగ్, భూసేకరణ లాంటి విధానాల పునఃసమీక్ష అవసరం. లెఫ్టినెంట్ గవర్నర్, కేంద్రం సహకరిస్తేనే అది సాధ్యం. లేదంటే, ఢిల్లీలో ఆప్ సర్కార్ తరహా కథే కశ్మీర్‌లో పునరావృతమవుతుంది. ఎన్నికలు జరిపి కూడా ప్రజాతీర్పును తోసిపుచ్చినట్టే అవుతుంది. పైగా, సరిహద్దులో శత్రువులు పొంచి ఉండే సున్నితమైన ప్రాంతంలో అలాంటి రాజకీయ క్రీడలు ప్రమాదకరం.

అభద్రతను పెంచుతున్న యుద్ధం

విశ్లేషణ



హ్యాపీమాన్ జాకబ్

హమాస్–ఇజ్రాయెల్‌ల మధ్య యుద్ధం ప్రారంభమై ఏడాది పూర్తయింది. ఉక్రెయిన్–రష్యా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధాలను నిరోధించవలసిన ఐక్యరాజ్య సమితి లాంటివి నిర్వీర్యమై పోతున్నాయి. ముఖ్యంగా గాజా యుద్ధంలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఐరాస సిబ్బందికే రక్షణ లేని పరిస్థితి. ఇక అంతర్జాతీయ న్యాయస్థానాన్ని నెతన్యాహూకు అరెస్ట్ వారెంట్ జారీ చేసినందుకు ఇజ్రాయెల్, దాని మిత్ర దేశాలు ఆంక్షల విధింపు బెదిరింపులకు పాల్పడుతున్నాయి. వైరి పక్షాలను చర్చల వేదికపైకి తేగలిగిన మధ్యవర్తులు కానరాని పరిస్థితి! ఇదే సమయంలో ఇజ్రాయెల్‌కు తన శత్రువులపై దాడిచేసే సామర్థ్యం పెరుగుతున్నప్పటికీ... దాని పౌరులు రోజు రోజుకూ అభద్రతాభావంలో కూరుకుపోతుండటం గమనార్హం.

ఒక సంవత్సరం క్రితం, అక్టోబర్ 7న జరిగిన ఘటన ఉక్రెయిన్‌లో యుద్ధం నుండి ప్రపంచం దృష్టిని మళ్లించింది. నేడు, హమాస్ తీవ్రవాద దాడిపట్ల ఇజ్రాయెల్ ప్రతిస్పందన చాలా తీవ్రంగా మారిపోయింది. దీనితో పోలిస్తే మిగతావన్నీ అప్రధానంగానే ఉన్నాయి. దాదాపు 45,000 మంది, వీరిలో ఎక్కువగా పౌరులు మరణించారు. కనుచూపు మేర కాల్పుల విరమణ లేదు. పైగా వేగంగా పెరుగుతున్న సంఘర్షణ కారణంగా, పశ్చిమాసియాను యుద్ధం చుట్టుముట్టే అవకాశం ఒక ప్రమాదకరమైన వాస్తవంగానే కనబడుతోంది. కొంత వరకు ఉక్రెయిన్ యుద్ధం, ప్రధానంగా ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం... ప్రాంతీయ యుద్ధాలకు మధ్యవర్తిత్వం వహించే లేదా వాటికి ముగింపు పలికే సామర్థ్యం గల మధ్యవర్తులు కనిపించని ప్రపంచంలో మనం ఈ రోజు ఉన్నామనే వాస్తవాన్ని ఎత్తి చూపుతున్నాయి.

ఇజ్రాయెల్, ఇరాన్ లేదా అమెరికాను చేరుకోగల ఉపయోగకరమైన పరోక్ష మార్గాలు కానీ లేదా వారిని సంధానించేవారు కానీ ఇప్పుడు ఎవరూ లేరు. సైద్ధాంతికంగా చెప్పాలంటే, ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించే లేదా పొడిగించే స్థితిలో అమెరికా ఉండవచ్చు, కానీ పశ్చిమాసియా విషయానికి వస్తే దాని నిస్సహాయత ఆశ్చర్యకరంగా ఉంది. ఈ ప్రాంతంలో పరిష్కారం కోసం ప్రపంచం వాషింగ్టన్ వైపు చూస్తూనే ఉంది, కానీ దాని స్వీయ అధ్యక్ష ఎన్నికల కారణంగా, అమెరికన్ బాడీ పాలిటిక్స్‌పై ఇజ్రాయెల్ ప్రభుత్వం చూపే ప్రభావం కారణంగా అమెరికాకు పరిష్కారం సాధ్యం కావడం లేదు.

మరోవైపున అగ్రరాజ్య స్థాయి కోసం ఎదురుచూస్తున్న చైనా మౌనం కూడా ఆసక్తి గొల్పుతోంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా పక్షాన చైనా ఉండగా, ఎర్ర సముద్రం సంక్షోభం సమయంలో అది నిష్క్రియాపరత్వంతో వేచి ఉంటోంది. పైగా ఇతర చోట్ల ప్రపంచ సంక్షోభాలను తగ్గించే విషయంలో చైనా పాత్ర తక్కువే అని చెప్పాలి. ఇక పశ్చిమాసియా సంక్షోభంపై మధ్యవర్తిత్వం వహించడంలో చైనా ఏమాత్రం ఆసక్తి చూపలేదు. భారతదేశం ఇప్పటికీ అలాంటి కర్తవ్యాలను చేపట్టేంత శక్తిమంతమైన దేశంగా తనను తాను భావించడం లేదు. రెండో ప్రపంచ యుద్ధానంతర సంస్థలు ప్రపంచ స్థాయిలో నిర్మాణాత్మక అసమానతలను కొనసాగించినప్పటికీ, సంస్థలు, నిబంధనలు లేని ప్రస్తుత ప్రపంచం అధ్వాన్నంగానే ఉంటుంది.

ఐక్యరాజ్యసమితిని పరిశీలిస్తే... అది రోగలక్షణంతో అసమర్థమంతంగానూ, నిస్సహాయంగానూ మారిపోయినట్లుంది. అందుకే యుద్ధంలో పాల్గొంటున్న పక్షాలు... ఐరాస సిబ్బంది ఉన్న ప్రాంతాలలో కూడా బాంబు దాడి చేయడానికి ఏమాత్రం సంకోచించడం లేదు. పోరాడుతున్న పక్షాలకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి చేసిన విజ్ఞప్తులను ఇజ్రాయెల్ ఇటీవల ధిక్కరించినట్లుగానే, మీడియా కూడా దాన్ని సీరియస్‌గా పరిగణించడం లేదు.



అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐసీసీ) ఉదంతాన్ని తీసుకోండి. ఇది ఇజ్రాయెల్ ఆగ్రహ జ్వాలలకు గురవుతూ ఉండడం మాత్రమే కాకుండా... అమెరికా, ఐరోపాలోని ఇజ్రాయెల్ సన్నిహిత మిత్రుల ఆగ్రహాన్ని కూడా చవిచూస్తూ ఉంది. హాస్యాస్పదంగా, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఐసీసీ అరెస్ట్ వారెంట్లు జారీ చేయాలనే విషయంపై ఆసక్తిగా ఉన్న దేశాలు, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అదే విధంగా అరెస్ట్ వారెంట్ జారీ చేసినందుకు మాత్రం ఐసీసీపై ఆంక్షలు విధిస్తామని హెచ్చరించాయి.

రెండు యుద్ధాలూ నైతిక పరిగణనలు వాడుకలో లేని ప్రపంచం వైపు మనల్ని తీసుకెళ్తున్నాయి. ఇంకా, నైతిక రాజకీయం రోజువారీ ప్రభుత్వ ఆచరణలో చెడుకు చెందిన సామాన్యతను కొలిచేందుకు ఒక కొలమానాన్ని అందిస్తుంది. దేశీయ రాజకీయాలు లేదా అంతర్జాతీయ సంబంధాలలో, నైతిక ప్రమాణాలు లేనిదాని కంటే నైతిక ద్వంద్వ ప్రమాణాలు ఉత్తమం. ఆచరణలో లోపభూయిష్ఠంగా ఉన్నప్పటికీ, కొలత కోసం మనకు ఒక టేప్ అవసరం. ఈ యుద్ధంలో చెడుకు సంబంధించిన సామాన్యత విషయంలో అత్యంత కలతపెట్టే ఉదాహరణ ఏదంటే హమాస్ టెర్రరిస్టులను గాజా ప్రజలతో సమానం చేయడం– అలాంటి చిత్రాలను మనం మౌనంగా ఆమోదించడం!

ఏ రకంగా చూసినప్పటికీ ఇజ్రాయెల్ మరింత ఒంటరిగా, అభద్రతతో ఉంది. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై ఉగ్రదాడులు, దాని అసమాన ప్రతీకార చర్యలు జరిగి ఒక సంవత్సరమైంది. కానీ ఇజ్రాయెల్ అనుభూతి చెందుతున్న శాశ్వతమైన అభద్రతా భావం ఇప్పుడు పెరుగుతున్న ఒంటరితనంతో పాటు మరింత తీవ్రమైంది.

ఇజ్రాయెల్‌కు తన శత్రువులను మరింత ఎక్కువ శక్తితో కొట్టే సామర్థ్యం పెరుగుతున్నప్పటికీ, ఈ ప్రాంతంలో సంపూర్ణ దుర్బలత్వం కూడా స్పష్టంగా ఉంది. ఇరాన్ దాని ప్రాక్సీ గ్రూపులుగా గాజా, ఇరాక్, లెబనాన్, సిరియా గురించి ఇజ్రాయెలీలు పిలుస్తున్న 'రింగ్ ఆఫ్ ఫైర్' అనేది ఇప్పుడు మరింత తీవ్రమైంది. ఇజ్రాయెల్ పౌరులు కొన్ని సంవత్సరాల క్రితం కంటే ఈ రోజు మరింత సురక్షితంగా ఉన్నారా అనేది సందేహమే. ఒక దేశం ఎంత శక్తిమంతమైన దేశమైనప్పటికీ, నిశ్చయాత్మకమైన, సైద్ధాంతికంగా ప్రేరేపితులైన విరోధుల నుండి తనను తాను రక్షించుకోలేకపోతుంది, ప్రత్యేకించి దాని సొంత చర్యలు విరోధుల లక్ష్యాన్ని మరింతగా నిలబెడుతున్నప్పుడు అది అసలు సిద్ధించదు.

నేడు ఇజ్రాయెల్ మరింత అభద్రతాభావంతో ఉండటమే కాకుండా ప్రపంచం సానుభూతిని కూడా కోల్పోతోంది. ఇజ్రాయెల్ ఇప్పుడు దాని మితిమీరిన చర్యలకూ, అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించినందుకూ, ప్రత్యేకించి గ్లోబల్ సౌత్‌లోని వారిచే వివిధ అంతర్జాతీయ ఫోరమ్‌లలో సాధారణంగా ఆక్షేపించబడుతూ, విమర్శల పాలవుతోంది. గ్లోబల్ సౌత్ మద్దతుపై ఇజ్రాయెల్‌కు పెద్దగా పట్టింపు లేకపోయినా, ఇజ్రాయెల్ వైపు నిలిచిన యూరోపియన్, ఉత్తర అమెరికా మద్దతుదారులు కనీసం భౌగోళిక రాజకీయ కారణాల వల్ల దక్షిణాదిని విస్మరించడం కష్టం. అమెరికా ఇప్పటికీ ఇజ్రాయెల్ కోసం బ్యాటింగ్ చేస్తున్న తరుణంలో అమెరికా యువతరంలో ఇజ్రాయెల్‌కి చెందిన సమస్యపై, విభేదాలు పెరుగుతున్నాయి.

మొత్తం మీద చూస్తే అబ్రహం ఒప్పందాలు ప్రమాదకరమైన స్థితిలో ఊగిసలాడుతున్నాయి, వీధుల్లో జనాదరణ పొందిన మనోభావాల ద్వారా నడపబడుతున్న యుద్ధ స్వభావం పెరుగుతున్న కొద్దీ అది ఎక్కువగా ఒత్తిడికి లోనవుతుంది. ఫలితంగా, గల్ఫ్ దేశాలు, ప్రత్యేకించి, పాలస్తీనా ఉచ్చులోంచి బయటపడాలని కోరుకున్నప్పటికీ అవి బలవంతంగా తిరిగి యుద్ధబాటలోకి వెళ్లవచ్చు కూడా.

ఇజ్రాయెల్ ప్రభుత్వానికీ, ప్రజలకూ దీని అర్థం ఏమిటంటే పెరుగుతున్న అభద్రత, ప్రపంచ సానుభూతిని కోల్పోవడంతో పాటు కనికరం లేని విలన్‌లుగా ముద్ర వేయబడటమే. ఈ యుద్ధం నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్రజల నిరసనలను కప్పిపుచ్చడమే కాకుండా ఇజ్రాయెల్ ఉదారవాద, ప్రజాస్వామ్య విలువలను అణిచివేసే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్ ప్రజలు తమను తాము ప్రజలుగా ఊహించుకునే భవిష్యత్తు ఇదేనా? గాజా ప్రజలకు ఇజ్రాయెలీలు ఏమి చేస్తున్నారో అది ఇజ్రాయెల్ ప్రజలుగా వారిపై కూడా ఒక నిర్దిష్ట ప్రభావాన్ని చూపుతుంది.

భారతదేశంలోని మనకు, ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని 'శ్వేత జాతీయులు శ్వేతజాతీయులను చంపేస్తున్నారు' అనేటటువంటి కేవల యూరోప్ సమస్యగా మాత్రమే విస్మరించడం సులభం. కానీ పశ్చిమాసియాలో యుద్ధం ప్రాథమికంగా భిన్నమైనది – అది ప్రత్యక్షంగా, పరోక్షంగా, ఊహించని మార్గాల్లో మనపై ప్రభావం చూపుతుంది.

వ్యాసకర్త జేఎన్‌యూలో భారత విదేశీ విధాన బోధకుడు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో...)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నిందించడమేనా?



బహుజన్ సమాజ్ పార్టీ ఉత్తర ప్రదేశ్‌లో ఓడిపోయినప్పుడు: ముస్లింలు మాకు ఓటు వేయలేదు! హరియాణాలో ఓడిపోయినప్పుడు: జాట్లు మాకు ఓటు వేయలేదు.

– ఇస్మత్ ఆరా, కాలమిస్ట్

కృత్రిమ రాజ్యం



కృత్రిమ మేధ (ఏఐ) శాస్త్రవేత్తలు రసాయన శాస్త్రంలో కూడా నోబెల్ పురస్కారాన్ని గెలుచుకున్నారు. నిన్న గెలుచుకున్న భౌతిక శాస్త్ర నోబెల్‌కు అదనంగా! దీనితో అన్ని శాస్త్రాల మీద కృత్రిమ మేధ ఆధిపత్యం పూర్తయింది.

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

వీరులకు వందనం



ఎయిర్ ఫోర్స్ దినోత్సవం (8 అక్టోబర్) రోజున మా అంకుళ్ళు, వారి సహచరులకు నా నివాళులు. మా మామ హంటర్, డకోటా విమానాలను నడిపాడు. మా చిన్నాన్న (మౌసా–చిన్నమ్మ భర్త) నాట్, మిగ్ విమానాలను నడిపాడు. వాళ్లు ధైర్యంగా భారత గగనతలాన్నీ, దాని ప్రాదేశిక సమగ్రతనూ కాపాడారు. సలామ్!

– తుషార్ గాంధీ, రచయిత


జవాబుల్లేకా?



అమెరికా రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ తన '60 మినిట్స్' ఇంటర్వ్యూను రద్దు చేసుకున్నారు. ఎందుకంటే, 'సీబీఎస్' ఛానల్ ఇంటర్వ్యూలో వచ్చే కఠినమైన ప్రశ్నలను ఎదుర్కోలేక! అవి 'ఫాక్స్ న్యూస్' వారి మృదువైన ప్రశ్నల్లా ఉండవుగా!

– స్టీఫెన్ కింగ్, రచయిత

అమ్మకానికి డేటా




ఇండియాలో అతి భారీ హ్యాకింగ్ సంచలనం! 'స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్' తాలూకు 3.1 కోట్ల వరుసల సమాచారం – పేరు, పుట్టినరోజు, ఫోన్ నంబర్, పాన్ కార్డ్ నంబర్, వేతనం అంతా 1,50,000 డాలర్లకు అమ్ముడైంది. దాన్ని స్వయంగా సీఐఎస్ఓ (చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్) అమర్‌జీత్ ఖురానా అమ్మినట్టుగా హ్యాకర్ చెబుతున్నారు. ఇండియాలో ఏదీ గోప్యం కాదు.

– దేబర్ఘ్య దాస్, ఇన్వెస్టర్

నిజాం పాలనపై అగ్నికణం!

నిజాం పాలనకు, భూస్వాములకు వ్యతిరేకంగా కలాన్ని కదిపి పాటల అగ్ని వర్షం కురిపించిన కవి యోధుడు సుద్దాల హనుమంతు. బుర్ర కథలు, హరి కథలు, యక్షగానాలు, గొల్ల సుద్దులు... ఇలా అనేక ప్రక్రియలలో ప్రజల వాడుక భాషను వినియోగించుకుని గుండెకు చేరువయ్యే బాణీలతో పాటలు రాశారు. రజాకార్లకు వ్యతిరేకంగా ధిక్కార స్వరాన్ని వినిపించి ప్రజలను యుద్ధం వైపు నడిపించారు.

నల్గొండ జిల్లా, రామన్నపేట తాలుకా పాలడుగు గ్రామంలో 1910 జూన్ 6న హనుమంతు జన్మించారు. శతకాలు, కీర్తనలు చిన్న నాడే కంఠస్థం చేసి యక్షగానాలపై పట్టు పెంచుకున్నారు. ఉత్పల వెంకటరావు సాహచర్యంలో ఆర్య సమాజం ఆశయాల పట్ల ఆకర్షితులై వితంతు పునర్వివాహాలు, సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పొట్టకూటి కోసం హైదరాబాద్ వలస వచ్చాక వృక్షశాఖకు చెందిన కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ



సుద్దాల హనుమంతు

నిజాం అధికారుల జులుం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ తరువాత కొంత కాలానికి ఉద్యోగాన్ని వదిలేసి సామాజిక పోరాటంలో నిమగ్నమయ్యారు. 1943లో హైదరాబాద్‌లో జరిగిన 'ఆంధ్ర మహాసభ'లో పాల్గొన్నారు. జానకమ్మతో జీవితాన్ని పంచుకున్నారు. భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభ (1947)లో వాలంటీర్‌గా పాల్గొని రావి నారాయణరెడ్డి ఉపన్యాసంతో ప్రేరణ పొందారు. తదనంతరం కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యత్వం పొందారు. కళారూపాలను ప్రజాచైతన్యానికి ప్రతిరూపాలుగా మలచిన హనుమంతు 'సంఘం వచ్చిందిరో రైతన్న – మనకు బలం చాలా తెచ్చిందిరో కూలన్న' అని సంఘం వల్ల జరిగిన మేలేమిటో పాట కట్టి వివరించారు. 'పల్లెటూరి పిల్లగాడా పశులగాసే మొనగాడా పాలు మరచి ఎన్నాళ్లయిందో' అంటూ ప్రజల నాలుకల మీద నాట్యమాడే అనేక పాటలు రాశారు. ప్రతి పాటలో తన ప్రత్యేక ముద్ర కలిగి ఉన్నారు.

భూస్వాముల ఆగడాలను ఎదిరించి ఏ గ్రామంలో ఇబ్బందులకు గురయ్యారో... అదే గ్రామంలో తరువాతి కాలంలో కమ్యూనిస్ట్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 'ప్రజా ప్రభుత్వం – ప్రజా ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం సాధిస్తాం, నిజాములో ప్రతి బజారులో – మా ధ్వజం ఎర్రనిది ఎగరేస్తాం' అని ఘంటాపథంగా హనుమంతు ప్రకటించారు. చదివింది సెకండ్ ఫారమే అయినా జనక్షేత్రంలో అపారమైన ఆదరణ పొందిన గీతాలు రాశారు. 1982 అక్టోబర్ 10న కన్నుమూశారు. పాట ఉన్నంత కాలం హనుమంతు అందించిన ఉద్యమ స్ఫూర్తి తరతరాలకు అందుతూనే ఉంటుంది.

– డా॥ తిరునగరి శ్రీనివాస్, రచయిత
(నేడు ప్రజాకవి సుద్దాల హనుమంతు వర్ధంతి)

చేగువేరా టు సనాతని హిందూ!

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

"సముద్రం ఒకడి కాళ్ళ ముందు కూర్చొని మొరగదు/ తుఫాన్ గొంతు 'చిత్తం' అనడం ఎరగదు/ పర్వతం ఎవ్వరికీ వంగి సలాం చెయ్యదు.' పదేళ్ళ కిందట జనసేన పార్టీ విశాఖ సభలో పవన్ కల్యాణ్ తనని తాను వేలితో చూపించుకుంటూ సముద్రంగా, తుఫాన్‌గా, పర్వతంగా అభివర్ణించుకుంటూ చెప్పిన మాటలివి. 'చుట్టూ గాఢాంధకారం, ఇల్లేమో దూరం, చేతిలో దీపం లేదు' వంటి స్థితిలో ప్రజలున్నారని, వారి ఆశలు నిలబెట్టి, వారి జీవితాల్లో వెలుగు పంచి అపర చేగువేరాగా అవతరించాలన్న పవన్ ఉద్దేశాలు జగమెరిగిన వారికి అమాయకంగా కనిపించినా ఎంతోమంది యువత అతన్ని నమ్మారు. పవన్ ఒంటిమీద పిచ్చుక వాలినా జనసేన కార్యకర్తలు బ్రహ్మాస్త్రాలు సంధించారు.

సినీహీరోగా తనకున్న ఇమేజ్‌ని గుడ్ విల్‌గా పెడితే చాలదని, అంతకి మించి ఏదో చేయాలన్న తపనని వ్యక్తం చేయడానికి ఆయన పలుమార్లు ప్రగతిశీల సాహిత్యాన్ని తన ప్రచారానికి వాడుకున్నారు. ఏ ప్రాంతానికి ప్రచారానికి వెళితే అక్కడి స్థానిక రచయితలను గుర్తించి వారి రచనల్లోని ప్రజా సమస్యలను ప్రస్తావించేవారు. గుంటూరు శేషేంద్ర శర్మ, శ్రీశ్రీ కవితలు తరుచుగా చదివేవారు. ఆ యా సాహిత్య అంశాలలోని అభ్యుదయం, ప్రజాపక్షపాతం, నిర్భీతి వంటివి పవన్ వ్యక్తిత్వ సుగుణాలని జనం నమ్మేలా బట్వాడా అయ్యాయి కూడా. తద్వారా మిగతా రాజకీయ నాయకులకి భిన్నమైన ఇమేజ్‌ని సొంతం చేసుకున్నారు. విప్లవకారులుగా చలామణీ అవ్వడానికి మొహం చెల్లని రాజకీయాల్లో అట్టడుగు ప్రజల కష్టాలు తీర్చగల రాబిన్ హుడ్‌నని ఆయన నమ్మే ఉండాలి. లేకపోతే అంత సులువుగా 'జై భీమ్' అని, అంతే సులువుగా 'గోమాంసం, బీఫ్ తినడం తప్పయితే, అవి తినే ముందుకు వెళ్తాన'ని ఎలా అనగలరు! ఇఫ్తార్‌లో కూర్చుని గడ్డం పెంచుకుని, టోపీ పెట్టుకుని మీలో ఒకడిని అనడం, గోధ్రా, గుజరాత్ అల్లర్ల గురించి ప్రశ్నించడం, తన నాయనమ్మ దీపారాధన చేస్తే దాంతో వాళ్ళ నాన్న సిగరెట్ ముట్టించుకుని, దేవుడూ దయ్యమూ లేవు' అనేవాడని గుర్తు చేసుకోవడం, మతపరమైన గొడవలు పెడుతున్నది ముఖ్యంగా హిందూ నాయకులని గట్టిగా చెప్పడం ద్వారా పవన్ కొన్నివర్గాల నుంచి మైలేజ్ పొందారు.

ఇక ఇపుడు తరం మారకుండానే స్వరం మార్చారు పవన్ కల్యాణ్. అధికారంలోకి రాగానే వేషభాషలు మారాయి. ఇపుడు తనని తాను 'సనాతని హిందు'గా ప్రకటించుకున్నారు. సనాతన ధర్మాన్ని కాపాడతానని,



సనాతన ధర్మ బోర్డు ఏర్పాటు చేస్తానని అంటూ అన్ని మతాలకీ ఒకటే న్యాయం అని ద్వంద్వానికి గురయ్యారు.

అంబేద్కర్‌ని బాగా చదివి ఆయన భావజాలాన్ని అవగాహనలోకి తెచ్చుకున్నానని పవన్ కొన్నిసార్లు అన్నారు. అన్ని కులాలకి ఒకటే న్యాయం అని అంబేడ్కర్, ఇతర రాజ్యాంగ రూపకర్తలు అనుకోలేదు కనుక అణచివేతకి గురయ్యి శతాబ్దాలుగా ఎదుగుదల లేని కులాలకి రిజర్వేషన్లు ఇచ్చారు. అన్ని కులాలూ ఒకటి కానట్లే అన్ని మతాలు కూడా ఒకటి కావు. ఎక్కడైనా మెజారిటీ మతాలు, మైనారిటీల హక్కులకి భంగం కలిగించే సందర్భాలు ఉంటాయి కనుక సెక్యులరిస్టులు మైనారిటీ మతాల హక్కులకి అండగా నిలబడతారు. దానర్థం పవన్ విరుచుకు పడినట్లు వారు ఆ యా మతాలకి భయపడతారని, వలపక్షం చూపుతారని కాదు.

తిరుపతి సభలో వారాహి డిక్లరేషన్ ఇచ్చారు. దాని సారాంశం ఏమిటో ప్రజలమైన మాకు సరిగ్గా అర్థం కావడం లేదు. డిప్యూటీ సీఎంగా లడ్డు నాణ్యత మీద రోజుల తరబడి పోరాడటం ముఖ్యమా లేక కనీస అవసరాలు తీరని పేద ప్రజకోసం ఏవైనా చేయడం ముఖ్యమా అని అడగము, మెల్లిగా తెలుగుదేశాన్ని పక్కకి జరిపి జనసేన, బీజేపీతో ఎటువంటి రాజకీయం చేయబోతోంది అని కూడా అడగము, సరేనా! కానీ జస్ట్ ఆస్కింగ్! సనాతన ధర్మం అంటే ఏమిటి? బోర్డులు గట్రా ఏర్పాటు చేసి, జాతీయ స్థాయిలో మీరు చేయబోతున్న పోరాటపు అనుపానులు మాకు కాస్త ముందుగానే చెప్పగలరా? వర్ణవ్యవస్థ ఇందులో భాగమా, మనుధర్మ శాస్త్రం ఏమైనా పరిపాలనకి దిక్సూచి కానుందా? స్త్రీలను ఇంట్లో కూచోమంటారా, శూద్రులు సేవకులుగా, శ్రామిక కులాలను అంటరానివారిగా నిశ్చయం చేయబోతున్నారా? 'మతి ఎంతో గతి అంతే' అన్నది మీకు ఇష్టమైన కొటేషన్. ఇపుడు సనాతన హిందూగా మీ 'మతి' ఆంధ్రప్రదేశ్ ప్రజలమైన మా 'గతి'ని ఎలా మార్చబోతోందో తెలుసుకోవాలని జస్ట్ ఆస్కింగ్.

పవన్ కల్యాణ్ గారూ! ప్రసాదాలు, ప్రమాణాలు సంబంధిత శాఖలకి వదిలిపెట్టి పదేళ్ళ పైబడిన మీ రాజకీయ ప్రయాణాన్ని సమీక్ష చేసుకోండి. మారిన వేషభాషలకి, మీరేంటో గర్జించి ఇచ్చిన ప్రకటనకి మీరే జవాబుదారీ. నచ్చిన మతాన్ని ప్రచారం చేసుకోవడానికి మీరు సాధారణ పౌరుడు కాదు, ఒక రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి. మీరు సెక్యులరిస్ట్‌గా వినపడటమే కాదు కనపడటం కూడా ప్రజాస్వామిక అవసరం. ఇప్పటికీ మిమ్మల్ని నమ్ముతున్న లక్షలాది యువత కోసం నిజాయితీ మాత్రమే మీ ప్రమాణం అయితే మంచిది. మీరు ధైర్యం విసిరిన రాకెట్టో, చేగువేరా బుల్లెట్టో సనాతని హిందూనో, బీజేపీ ప్రేరిత కాబోయే ముఖ్యమంత్రో, మరొకటో ఇంకొకటో– నాలుగు రోజులైనా కాస్త ఒకచోట ఆగండి. మీరేంటో అర్థంకాక ప్రజలు అయోమయంలో ఉన్నారు.


వ్యాసకర్త 'ప్రరవే' ఏపీ కార్యదర్శి

సమదృష్టి

ఆధ్యాత్మికంగా వృద్ధి చెందడానికి, మానసిక ప్రశాంతతకు సమత్వ భావన చాలా ముఖ్యమైంది. ఇటువంటి సల్లక్షణం పెంపొందించు కోవాలంటే, ప్రతి ఒక్కరూ నిందాస్తుతుల విషయంలో జాగ్రత్తగా ఉండవలసి ఉంటుంది.

జీవితాన్ని ఒక నాణెం అనుకుంటే... దానికి గల ఇరువైపులలో ఒకవైపు నిందలు, రెండవ వైపు

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

స్తుతులు ఉంటాయి. నిందలను భరించడం చాలా కష్టం. కాని పొగడ్త ప్రతి ఒక్కరికీ ఇష్టమే. ఎవరైనా పొగడితే అది చాలా ఇష్టంగా ఉంటుంది.

మన తప్పులను ఎత్తి చూపు వారిపై మనం ఎప్పుడూ కూడా కోపగించుకోకూడదు. ఇందుకు భిన్నంగా, మనం మన తప్పులను సంతోషంగా ఒప్పుకొని, వాటిని ఎత్తిచూపు వారిపట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఈ విధంగా చేస్తే మనం మోస్తున్న 'అహంకారం' అనే భారం క్రమంగా, తప్పనిసరిగా తగ్గిపోతుంది.

నిరంతరం మనం పొగడ్తలనే వినడం వలన మన అహంకారం పొంగిపోతుంది. అందరూ మనల్ని పొగడాలి అనే కోరిక మితిమీరిపోతుంది. ఇది మనల్ని చాలా తొందరగా పతనం చేస్తుంది. కాబట్టి ఎవరైనా మనల్ని నిందించినపుడు లేక పొగడినపుడు నిశ్చలంగా ఉండటం ఎంతైనా అవసరం.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.సప్తమి ఉ.7.17 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.1.49 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ఉ.11.22 నుండి 12.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.34 నుండి 3.22 వరకు, **అమృతఘడియలు:** రా.8.50 నుండి 10.33 వరకు, దుర్గాష్టమి; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.40.


బాబు గారి 'కొవ్వు' బాగోతం బట్టబయలు
అవే నిబంధనలతో టీటీడీ టెండర్



సాక్షి, అమరావతి: తిరుమలలో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కలిపే ఆవు నెయ్యి సరఫరాకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్వహించిన టెండర్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనన్న విషయం మరోసారి బహిర్గతమైంది. అయిన వారికి కట్టబెట్టడం కోసం అడ్డగోలుగా నిబంధనలు మార్చేశారంటూ ఆయన చేసిన ఆరోపణల్లో వీసమెత్తు నిజం లేదన్నది మరోసారి వెల్లడైంది. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నప్పుడు పది లక్షల కిలోల ఆవు నెయ్యి సరఫరాకు నిర్వహించిన టెండర్లలో ఏఆర్ డెయిరీ ఫుడ్స్ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇప్పుడు అదే టెండర్ నిబంధనలతో తాజాగా పది లక్షల కిలోల ఆవు నెయ్యి సరఫరాకు ఈనెల 7న (సోమవారం) టీటీడీ మార్కెటింగ్ విభాగం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడం సీఎం చంద్రబాబు బండారాన్ని బయటపెట్టింది. చంద్రబాబు ఆరోపణలన్నీ రాజకీయ దురుద్దేశంతో చేసినవేనన్న విషయాన్ని స్పష్టం చేసింది.

స్వచ్ఛత కోసం ప్రమాణాలు పెంపు

తిరుమల శ్రీవారికి సమర్పించే నైవేద్యాలు, లడ్డూ, అన్న ప్రసాదాల తయారీలో వినియోగించే ఆవు నెయ్యి, ముడి సరుకుల సేకరణకు టీటీడీ మార్కెటింగ్ విభాగం ఎప్పటికప్పుడు టెండర్లు నిర్వహిస్తుంది. స్వచ్ఛమైన ఆవు నెయ్యి సేకరణకు ఆర్నెల్లకు ఓ సారి టెండర్లు పిలుస్తుంది. నెయ్యిలో తేమ శాతం 0.3 శాతానికి మించకూడదని, బూటిరో రిఫ్రాక్టో (బీఆర్) మీటర్ రీడింగ్ 40 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద 40–43 మధ్య ఉండాలని, ఆర్ఎం వాల్యూ కనిష్ఠంగా 26 ఉండాలని, బౌడౌన్, మినరల్ ఆయిల్, ఫారిన్ కలర్స్ టెస్టుల్లో నెగెటివ్ రావాలని, మెల్టింగ్ పాయింట్ 27–37 డిగ్రీల మధ్య ఉండాలనే ఎనిమిది ప్రమాణాలతో 2019 మే 29 వరకూ టెండర్లు పిలిచేవారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత స్వచ్ఛమైన ఆవు నెయ్యి సేకరణకు మరో తొమ్మిది ప్రమాణాలను అదనంగా చేర్చింది. మొత్తం 17 ప్రమాణాలతో రివర్స్ టెండరింగ్ విధానంలో టెండర్లు నిర్వహించి, శ్రీవారి ఖజానాకు భారీగా ఆదా చేశారని టీటీడీ అధికారవర్గాలే చెబుతున్నాయి.



స్వచ్ఛమైన ఆవు నెయ్యి సరఫరా కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెంచిన ప్రమాణాలతోనే తాజాగా టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిన టీటీడీ

నిబంధనలు మరింత కఠినతరం

భూమన కరుణాకర్‌రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు స్వచ్ఛమైన ఆవు నెయ్యి సేకరణకు నిబంధనలను మరింత కఠినతరం చేశారు. ఈమేరకు 2023 నవంబర్ 14న టీటీడీ బోర్డు సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించి అమలు చేశారు. ఆవు నెయ్యి సేకరణ టెండర్లలో పాల్గొనాలంటే కనీసం ఐదేళ్ల వరుసగా డెయిరీలో నెయ్యిని ఉత్పత్తి చేసి ఉండాలని, జాతీయ డెయిరీలైతే రోజుకు 4 లక్షల లీటర్లు, 1500 కిలోమీటర్ల పరిధిలోని డెయిరీలైతే రోజుకు 2 లక్షల లీటర్లు, రాష్ట్రంలోని డెయిరీలైతే రోజుకు లక్ష లీటర్ల పాలను సేకరిస్తుండాలని నిబంధనలు పెట్టారు. జాతీయ డెయిరీలైతే నెలకు 360 టన్నులు లేదా ఏడాదికి 5 వేల టన్నుల ఆవు నెయ్యి ఉత్పత్తి చేసి ఉండాలని, రూ.500 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలని షరతు విధించారు. 1,500 కిలోమీటర్ల పరిధిలోని డెయిరీలైతే నెలకు 180 టన్నులు లేదా ఏడాదికి 2,750 టన్నుల ఆవు నెయ్యిని ఉత్పత్తి చేసి ఉండి, రూ.250 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగి ఉండాలని నిబంధన పెట్టారు. రాష్ట్రంలోని డెయిరీలకైతే నెలకు 90 టన్నులు లేదా ఏడాదికి 1,500 టన్నుల ఆవు నెయియని ఉత్పత్తి చేసి ఉండి.. రూ.వంద కోట్ల టర్నోవర్ ఉండాలని షరతు విధించారు. వాటిని నిక్కచ్చిగా అమలుచేయడంతో కాంట్రాక్టు పొందిన డెయిరీలు స్వచ్ఛమైన ఆవు నెయ్యిని టీటీడీకి సరఫరా చేశాయి. ఇదే నిబంధనలతో ఎన్నికల సంఘం పర్యవేక్షణలో 2024 మార్చి 12న టీటీడీ పిలిచిన టెండర్లలో ఏఆర్ డెయిరీ ఫుడ్స్ నెయ్యి సరఫరా కాంట్రాక్టును దక్కించుకుంది. ఇప్పుడూ అవే నిబంధనలతో టీటీడీ టెండర్లు పిలవడం గమనార్హం.

క్లుప్తంగా...

'కులం- ప్రత్యామ్నాయ సంస్కృతి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన కత్తి పద్మారావు

పొన్నూరు: గుంటూరు జిల్లా పొన్నూరులోని అంబేడ్కర్ నగర్ లుంబినీ వనంలోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో బుధవారం ప్రముఖ కవి డాక్టర్.కత్తి పద్మారావు 'పెరియార్ రీడర్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తుల విల్సన్ బాబు, కార్యదర్శి కనకవల్లి వినయ్ బాబు, గేరా ప్రసన్నకుమారి పాల్గొని కత్తి పద్మారావు రచించిన 'కులం–ప్రత్యామ్నాయ సంస్కృతి' నాలుగో ముద్రణను ఆవిష్కరించారు. పద్మారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ అన్ని ఉద్యమాలకు దిక్సూచి కావడానికి 'కులం–ప్రత్యామ్నాయ సంస్కృతి' గ్రంథమే మూలమైందన్నారు.

కొత్త వైద్య కళాశాలల పట్ల నీతి ఆయోగ్ సానుకూల స్పందన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెండు, మూడు దశల్లో నిర్మాణంలో ఉన్న కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను అవసరాల మేరకు అందించడానికి నీతి ఆయోగ్ సానుకూల స్పందన తెలిపిందని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ అంశంపై ఢిల్లీలో నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ కె.వినోద్ పాల్‌తో చర్చలు జరిపినట్లు మంత్రి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు, మూడు దశల్లో 12 కళాశాలలు నిర్మాణంలో ఉండగా.. వాటిలో పిడుగురాళ్ల, పాడేరుకు కేంద్ర సహకారం ఉందని తెలిపారు. మిగిలిన ఒక్కో కళాశాలకు రూ. 500 కోట్ల ఖర్చుతో నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే కళాశాల నిర్వహణకు ఏడాదికి దాదాపు రూ. 200 కోట్ల ఖర్చవుతుందని అంచనా ఉందని పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రుల్లో క్రిటికల్ కేర్ బ్లాకుల్ని అభివృద్ధి చేయడానికి అవసరమయ్యే సాయం పైనా చర్చించినట్లు వివరించారు. జల్ జీవన్ మిషన్ అమలును అవిభక్త అనంతపురం జిల్లాలోని సాగునీటి పారుదల పథకాల అమలుతో అనుసంధానం చేయాలని కోరామని తెలిపారు. వైఎస్సార్ జిల్లాలోని కాశీనాయన ఆశ్రమం, లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి అటవీ శాఖ పరంగా ఎదురవుతున్న సమస్యల్ని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖా మంత్రి భూపేంద్ర యాదవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

ముగ్గురు ఐపీఎస్‌లపై కేసులు నమోదు చేశాం

ఒక ఉన్నతాధికారిని ఇంటికి పంపాం: సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఒక ఉన్నతాధికారిని ఇంటికి పంపించామని, ముగ్గురు ఐపీఎస్‌లపై కేసులు నమోదు చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలా మందితో తప్పులు చేయించిందని, అందరినీ పక్కన పెడితే ప్రభుత్వం నడిచే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో అధికారుల సంఖ్య తక్కువగా ఉందని తెలిపారు. 2, 3 పోస్టుల పని ఒకరితోనే చేయిస్తున్నామన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో బుధవారం మీడియా సమావేశం తర్వాత చంద్రబాబు కొద్దిమంది మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. మద్యం టెండర్లలో నేతల జోక్యాన్ని సహించబోనని చెప్పారు. ఇసుక విషయంలో తాము ఆందోళనలో ఉన్నామని తెలిపారు. వర్షాలు, వరదల వల్ల డిమాండ్‌కు తగ్గ లభ్యత లేదని, ఎన్జీటీ నిబంధనల వల్ల రాత్రిళ్లు ఇసుక తవ్వలేమన్నారు. రాజమండ్రి జైల్లో ఉన్నప్పుడు తనను చంపాలని చూసినట్లు ప్రచారం జరిగిందని గుర్తు చేశారు. తాను ఉన్న జైలుపై డ్రోన్లు ఎగురవేశారని, తన ప్రతి కదలికను గమనించేందుకు జైలు గదిలో సీసీ కెమెరా కూడా పెట్టారని ఆరోపించారు. కనీసం వేడి నీళ్లు ఇవ్వలేదని, దోమలు కుడుతుంటే దోమ తెర లేదని, ఎంతో ఇబ్బంది పడ్డానని చెప్పారు. ఇంత అనుభవించిన తాను బయటకు రాగానే కక్ష తీర్చుకోవాలిగానీ తనది ఆ స్వభావం కాదన్నారు.

నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

11 ఎర్రచందనం దుంగల స్వాధీనం




పోలీసులు పట్టుకున్న స్మగ్లర్లు, ఎర్రచందనం

తిరుపతి మంగళం: చిత్తూరు సమీపంలోని సంతపేట అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం నలుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, డీఎస్పీ జి.బాలిరెడ్డి సూచనలతో ఆర్ఐ (ఆపరేషన్స్) కె.సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐలు కె.సురేష్ బాబు, వై.విశ్వనాథ్ బృందం చిత్తూరు సమీపంలో కూంబింగ్ చేపట్టారు. సంతపేట బీట్ పరిధిలోని కాజూరు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు స్మగ్లర్లను పట్టుకున్నారు. వారిని విచారించి 11 ఎర్రచందనం దుంగలను, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన స్మగ్లర్లు చిత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు.

జమిలి ఎన్నికలకు మద్దతివ్వాలి

- సుపరిపాలన వల్లే హరియాణాలో బీజేపీ గెలిచింది
- కచ్చితంగా వరద సాయం అందరికీ వెళ్లలేదు
- మీడియాతో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: జమిలి ఎన్నికలకు దేశం మొత్తం మద్దతు తెలపాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానం వల్ల ప్రజలకు, రాష్ట్రాలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఉండవల్లిలోని తన నివాసంలో మీడియాతో బుధవారం మాట్లాడుతూ.. హరియాణాలో మూడోసారి బీజేపీ గెలవడం కేంద్ర సుపరిపాలనకు నిదర్శనమన్నారు. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగిందన్నారు. విభజన వల్ల జరిగిన నష్టం కంటే గత ఐదేళ్లలో రాష్ట్రానికి జరిగిన నష్టం ఎక్కువని చెప్పారు. రాబోయే రోజుల్లో ఒక్క ఏపీలోనే రూ.75 వేల కోట్లను ఒక్క రైల్వే మౌలిక సదుపాయాల కోసమే ఖర్చు చేస్తున్నారని తెలిపారు. బెంగళూరు–చెన్నయ్–అమరావతి–హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలను కలిపేలా బుల్లెట్ రైలు తెచ్చే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు.

కేంద్ర మంత్రుల్ని కలిసి చర్చిస్తా

విశాఖ రైల్వే జోన్, 90–95 రైల్వే బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలతోపాటు అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు, విజయవాడ తూర్పు బైపాస్ నిర్మాణంపై కేంద్ర మంత్రులతో చర్చించానని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకూడదన్నారు. బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీ కోసం రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాలను పరిశీలిస్తున్నారని, దాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

వరద సాయం చాలామందికి వెళ్లలేదు

వరద సాయం చాలామందికి వెళ్లలేదని చంద్రబాబు అన్నారు. చివరివరకూ సాయాన్ని అందించలేకపోయామని ఒప్పుకున్నారు. కచ్చితంగా 5,10 శాతం వేస్ట్ అవుతుందని, దానికి ఎవరూ ఏమీ చేయలేరని తెలిపారు. అగ్గిపెట్టెలు ఇవ్వలేదనడం సిగ్గుచేటన్నారు. ప్రకాశం బ్యారేజీని బోట్లతో గుద్దించి ధ్వంసం చేయాలనుకున్న వాళ్లు తమను విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. తిరుమల బ్రహ్మోత్సవాలు, దసరా ఉత్సవాలు ఎంతో కన్నుల పండువగా జరుగుతున్నాయని, గత ఐదేళ్లలో ఎప్పుడైనా ఇలా జరిగాయా అని ప్రశ్నించారు.

దుర్గమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ/ఇంద్రకీలాద్రి, భవానీపురం (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సీఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్‌తో కలిసి బుధవారం దర్శించుకున్నారు. కనకదుర్గమ్మకు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించారు. సీఎంకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వదించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను, చిత్ర పటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మూలా నక్షత్రం రోజున అమ్మవారి దర్శనానికి 5,85,651మంది భక్తులు వచ్చారని తెలిపారు. 6,96,396 లడ్డూ ప్రసాదాలను అందించినట్లు పేర్కొన్నారు. కాగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన కుమార్తె ఆద్యతో కలిసి అమ్మవారిని దర్శించుకొన్నారు.

రేపటి నుంచి 'శక్తి విజయోత్సవ్' వేడుకలు

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 'శక్తి విజయోత్సవ్' పేరుతో మూడు రోజులపాటు వేడుకలను నిర్వహించనుంది. వీటిని విజయవాడ భవానీపురంలోని పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన పత్రికలో ముద్రించారు. అయితే స్థలాభావం కారణంగా భవానీపురం కరకట్ట సౌత్ (కృష్ణానదీ తీరాన) రోడ్‌లో గల బబ్బూరి గ్రౌండ్స్ (ప్రైవేట్ స్థలం)ను వేదికగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

'సుప్రీం' హెచ్చరించినా

తీరు మారదా చంద్రబాబూ?

సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేసేలా చంద్రబాబు వ్యాఖ్యలు: భూమన



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తన ప్రాణాలు కాపాడిన పరమాత్ముడితో పరాచికాలు ఆడితే ఆ పైశాచిక చేష్టలకు ఫలితం ఎలా ఉంటుందో ఆ దేవదేవుడే నిర్ణయిస్తాడని సీఎం చంద్రబాబునుద్దేశించి టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్వార్థ రాజకీయాల కోసం శ్రీవారి లడ్డూపై పదేపదే ఆయన చేస్తున్న ఆరోపణలను భగవంతుడు క్షమించడన్నారు. తాజాగా ఢిల్లీ పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. బుధవారం తిరుపతిలో భూమన మీడియాతో మాట్లాడారు.

సుప్రీం స్పష్టంగా ఆదేశించినా..

తిరుమల లడ్డూపై ఎవరూ మాట్లాడొద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా సీఎం చంద్రబాబు ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. రాష్ట్రానికి ఆర్థిక సాయం కోసం ప్రధానిని కలుస్తానని వెళ్లిన చంద్రబాబు తిరుపతి లడ్డూ అందచేశారు. ఇది కల్తీ లడ్డూ కాదు సార్... స్వచ్ఛమైన నెయ్యితో తయారు చేసిందని చెబితే బాబు చమత్కారానికి మోదీ విరగబడి నవ్వారట. దీనిపై చంద్రబాబును మందలిస్తే బాగుండేది. కల్తీ నెయ్యి ఆరోపణలపై స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరపనున్న నేపథ్యంలో ప్రధానితో పాటు సీబీఐని ప్రభావితం చేసేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. సిట్ నివేదిక తనకు అనుకూలంగా తెచ్చుకునేలా కుట్ర చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా తప్పు జరగలేదు. తిరుమల వైభవానికి భంగం వాటిల్లలేదు. దీనిపై పీఠాధిపతులతో చర్చకు సిద్ధంగా ఉన్నా. చంద్రబాబుకు దమ్ముంటే నా సవాల్‌పై స్పందించాలి. కార్యక్రమంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, జిల్లా యువత విభాగం అధ్యక్షుడు అజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొమ్మగుంట రవి తదితరులు పాల్గొన్నారు.

పందెం కోళ్లను ఈతకు తీసుకెళ్లి..తండ్రీ, ఇద్దరు కొడుకులు మృతి

- పోలవరం కుడికాలువలో దుర్ఘటన
- ఏలూరు జిల్లా పెదవేగి మండలం కవ్వగుంటలో విషాదం



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పెదవేగి : పందెం కోళ్ల పెంపకం సరదా ఒక కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. వాటికి ఈతలో శిక్షణను ఇద్దామనుకున్న ఆ తండ్రీ కొడుకులు ప్రమాదవశాత్తూ కాల్వలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కవ్వగుంటలో చోటుచేసుకున్న ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. కవ్వగుంట గ్రామానికి చెందిన శెట్టిపల్లి వెంకటేశ్వరరావు (45) రైతు. సంక్రాంతికి ఏలూరు జిల్లా కోడిపందేలకు ప్రసిద్ధి. దీంతో వెంకటేశ్వరరావు తన పందెం కోళ్లను తన వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్నాడు. వాటికి శిక్షణలో భాగంగా ఈతకూ తీసుకెళ్తుంటారు. దీంతో తమకు సమీపంలో ఉన్న పోలవరం కుడికాలువలో ఈత శిక్షణ ఇచ్చేందుకు వాటిని తీసుకువెళ్లాడు. వెంకటేశ్వరరావుతోపాటుగా అతని ఇద్దరు కుమారులు శెట్టిపల్లి మణికంఠ (16), శెట్టిపల్లి సాయి (14)లు సైతం తోడుగా వెళ్లారు. కాలువలో లోతును గ్రహించని ముగ్గురూ కాలువలో ఉన్నపళంగా మునిగిపోయారు. ఈత రాకపోవడంతో వారు ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకునేలోపే వారు మృతిచెందారు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రాజేంద్రప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని రెస్క్యూ బృందం, స్థానికుల సాయం మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పండగ సమయంలో ఒకే కుటుంబంలో తండ్రీ కొడుకులు చనిపోవడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. భర్త, ఇద్దరు కుమారులు విగత జీవులుగా కళ్లముందు కనిపించడంతో భార్య దేవి, ఇతర కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ప్రభుత్వానికి జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నోటీసులు

మాజీ ఎంపీ నందిగం సురేష్ ఫిర్యాదుపై స్పందించిన కమిషన్

సాక్షి, అమరావతి: తనపై అక్రమంగా కేసులు బనాయించి వేధిస్తున్నారంటూ అక్టోబర్ 1న వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్పందించింది. ఈ ఫిర్యాదును పరిశీలించిన కమిషన్ 15 రోజుల్లోగా దీనిపై స్పందించాలంటూ గుంటూరు కలెక్టర్, ఎస్పీలకు నోటీసులను జారీచేసింది. అసలు సంఘటనలు ఎప్పుడు జరిగాయి, ఈ కేసులో ఎంతమందిపై, ఎప్పుడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి, ఎంతమందిని అరెస్ట్ చేశారు, చార్జిషీట్ ఎప్పుడు ఫైల్ చేశారు, బాధితులకు ఏమైనా పరిహారం అందించారా.. వంటి వివరాలతో 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొంది. సమాధానం ఇవ్వని పక్షంలో రాజ్యాంగంలోని 338 ఆర్టికల్ కింద సమన్లను జారీచేస్తామని హెచ్చరించింది.

నన్ను సంప్రదించకుండా ఉద్యోగులను బదిలీ చేశారు

- సీఈవో నిబంధనలను తుంగలో తొక్కారు
- బదిలీ ఉత్తర్వులు అమలు చేయకుండా ఉత్తర్వులివ్వండి
- హైకోర్టులో నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిటిషన్
- నేడు విచారణ జరపనున్న హైకోర్టు

సాక్షి, అమరావతి: తనను సంప్రదించకుండా, తన ఆమోదం లేకుండానే జిల్లా పరిషత్ (జెడ్పీ) ఉద్యోగులు, సిబ్బందిని జెడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) బదిలీ చేశారని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (ఎంపీడీవో), జిల్లా పరిషత్ (జెడ్పీ), మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ)ల్లో పనిచేసే ఉద్యోగులను బదిలీ చేస్తూ సీఈవో ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, డైరెక్టర్, జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈవోను ప్రతివాదులుగా పేర్కొన్నారు. '1996లో జారీ చేసిన జీవో 3, 1999లో జారీ చేసిన మెమో ప్రకారం జిల్లా పరిషత్ పరిధిలోకి వచ్చే ఉద్యోగులను బదిలీ చేసే ముందు సీఈవో తప్పనిసరిగా జెడ్పీ చైర్‌పర్సన్ అనుమతి తీసుకోవాలి. 2016లో జారీ చేసిన జీవో 594 ప్రకారమూ ఎంపీడీవోలు, జెడ్పీ, ఎంపీపీ ఉద్యోగుల బదిలీలను చైర్‌పర్సన్‌ను సంప్రదించిన తరువాతే చేపట్టాలి. నెల్లూరు జెడ్పీ సీఈవో ఈ నిబంధనలను తుంగలో తొక్కి, ఏకపక్షంగా వ్యవహరించారు. నన్ను సంప్రదించకుండానే నెల్లూరు జిల్లా పరిషత్ పరిధిలో బదిలీలకు ఆమోదం తెలిపారు. ఆ మేరకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని సంబంధిత విభాగాలకు ఉత్తర్వులిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రధాన కార్యనిర్వాహక అధికార వ్యవస్థపై నాకు అధికారం ఉంది. నా అనుమతి లేకుండా జరిగిన బదిలీల వ్యవహారంలో జోక్యం చేసుకోండి' అని అరుణమ్మ ఆ పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరపనుంది.

చరిత్ర ఎలా గుర్తుపెట్టుకుంటుందో?!


అంకితభావంతో సేవలందించా: సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పూర్తి అంకితభావంతో దేశానికి సేవలందించానని జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పారు. తన పదవీ కాలాన్ని చరిత్ర ఎలా గుర్తు పెట్టుకుంటుందో అనే భయం, ఉత్కంఠ తనలో ఉన్నాయని తెలిపారు. భారతదేశ సుప్రీంకోర్టు 50వ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ చంద్రచూడ్ పదవీ కాలం నవంబర్ 10వ తేదీన ముగియనుంది. మరో నెల రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్నారు. బుధవారం భూటాన్‌లోని 'జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ స్కూల్ ఆఫ్ లా' మూడో స్నాతకోత్సవంలో జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడారు. ''నా పదవీ కాలం ముగింపునకు వచ్చింది. భవిష్యత్తు, గతానికి సంబంధించి భయాలు, ఆందోళనలు నా మనసులో నిండిపోయాయి. ఎన్నో ప్రశ్నలు నాలో తలెత్తుతున్నాయి. నేను సాధించాల్సినవన్నీ సాధించానా? ప్రధాన న్యాయమూర్తిగా నా పదవీ కాలాన్ని చరిత్ర ఏ విధంగా నిర్ణయిస్తుంది? ఎలా గుర్తుపెట్టుకుంటుంది? చేయాల్సిన పనులు భిన్నంగా చేశానా? లేదా? భవిష్యత్తు తరాల న్యాయమూర్తులకు, న్యాయ నిపుణులకు, న్యాయవాద వృత్తిలో ఉన్న వారికి ఎలాంటి వారసత్వాన్ని అందించబోతున్నాను? ఈ ప్రశ్నల్లో చాలావాటికి సమాధానాలు నా నియంత్రణలో లేవు. బహుశా కొన్ని ప్రశ్నలకు ఎప్పటికీ సమాధానాలు కనిపెట్టలేనేమో! గత రెండేళ్లుగా అంకితభావంతో పనిచేశా. పదవికి పూర్తి న్యాయం చేయాలని ప్రతినిత్యం ఉదయం నిద్రలేవగానే నిర్ణయించుకునేవాడిని. రాత్రి సంతృప్తితో నిద్రకు ఉపక్రమించేవాడిని. న్యాయవాద వృత్తి అనే ప్రయాణంలో ఎన్నో అవరోధాలు ఎదురవుతాయి. అలాంటప్పుడు ఒక అడుగు వెనక్కి వేయడానికి, మనల్ని మనం పునఃసమీక్షించుకోవడానికి సంకోచించాల్సిన పనిలేదు. లక్ష్యం వైపు ప్రయాణిస్తున్నానా? లేక నా వైపు నేను ప్రయాణిస్తున్నానా? అని న్యాయవాదులు, న్యాయమూర్తులు ప్రశ్నించుకోవాలి. భయాలు, సందేహాలు విడిచిపెట్టాలి. లక్ష్యం వైపు సాగే ప్రయాణాన్ని ఆస్వాదించాలి. భయాలను ఎదిరించడంలోనే మన అభివృద్ధి దాగి ఉంటుంది'' అని జస్టిస్ చంద్రచూడ్ ఉద్బోధించారు. ఆయన 2022 నవంబర్ 9న సీజేఐగా బాధ్యతలు చేపట్టారు. ఎన్నో కీలకమైన తీర్పులు వెలువరించారు. న్యాయ వ్యవస్థలో పారదర్శకతకు పెద్దపీట వేశారు.

18 ఏళ్లకే 14 పర్వతాల అధిరోహణ

- 740 రోజుల్లోనే లక్ష్యం పూర్తి
- నేపాల్‌కు చెందిన నిమా రింజీ షెర్పా కొత్త రికార్డు



కఠ్మాండు: ప్రపంచంలోని తొలి 14 అత్యంత ఎత్తయిన పర్వతాలను అత్యంత పిన్నవయసులో అధిరోహించిన వ్యక్తిగా నేపాల్‌కు చెందిన 18 ఏళ్ల టీనేజర్ నిమా రింజీ షెర్పా రికార్డు సృష్టించాడు. బుధవారం ఉదయం 6.05 గంటలకు టిబెట్‌లోని మౌంట్ శిషాపాంగ్మాను అధిరోహించడం ద్వారా ఈ రికార్డు నెలకొల్పాడు. కేవలం 740 రోజుల్లోనే మొత్తం 14 పర్వతాలను అధిరోహించడం గమనార్హం. ఇవన్నీ 8,000 మీటర్లకుపైగా ఎత్తయిన పర్వతాలే. వీటిని 'ఎయిట్ థౌజెండర్స్' అని పిలుస్తారు. ఇంటర్నేషనల్ మౌంటైనీరింగ్, క్లైంబింగ్ ఫెడరేషన్(యూఐఏఏ) ఈ ర్వతాలను గుర్తించింది. పర్వతారోహకుల కుటుంబంలో జన్మించిన నిమా రింజీ షెర్పా పదో తరగతి పరీక్షలు పూర్తయిన వెంటనే 2022 సెప్టెంబర్ 30న పర్వతారోహణకు శ్రీకారం చుట్టాడు. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన ఎనిమిదో పర్వతం, నేపాల్‌లోని 'మనాస్లూ' శిఖరాన్ని చేరుకున్నాడు. అప్పటినుంచి వీలు దొరికినప్పుడల్లా ఒక నూతన పర్వతాన్ని అధిరోహించాడు. ఎవరెస్టు పర్వతాన్ని, దాని సమీపంలోని లోట్సే పర్వతాన్ని నిమారింజీ షెర్పా 10 గంటల కంటే తక్కువ వ్యవధిలోనే అధిరోహించాడు. బుధవారం నాటికి మొత్తం 14 ఎత్తయిన పర్వతాలను అధిరోహించడం పూర్తిచేశాడు. కొత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటిదాకా ఈ రికార్డు నేపాల్‌కు చెందిన మింగ్మా గ్యాబు డేవిడ్ షెర్పా పేరిట ఉంది. అతడు 2019లో 30 ఏళ్ల వయసులో 14 పర్వత శిఖరాలు అధిరోహించాడు. నిమా రింజీ షెర్పా మాత్రం కేవలం 18 ఏళ్లలోనే ఈ రికార్డును తిరగరాయడం గమనార్హం. షెర్పాలు అంటే సాధారణంగా హిమాలయాల్లో పర్వతారోహకులకు సహకరించే పనివాళ్లుగా పేరుంది. కానీ, షెర్పాలు అందుకు మాత్రమే పరిమితం కాదని, ప్రపంచ రికార్డులు సృష్టించగలరని నిరూపించడమే తన లక్ష్యమని నిమా రింజీ షెర్పా చెప్పాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ప్రపంచంలోని తొలి 14 ఎత్తయిన పర్వతాలు ఆసియా ఖండంలోని హిమాలయాలు, కారాకోరం ప్రాంతంలోనే ఉన్నాయి.

మీకూ గాజా గతే!

లెబనాన్‌కు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ హెచ్చరిక



బీరుట్: లెబనాన్‌కూ గాజా గతి పట్టిస్తామని, మునుపెన్నడూ లేనంతగా పెనుదాడులకు పాల్పడతామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం లెబనాన్ పౌరులనుద్దేశిస్తూ ఆయన ఒక వీడియో సందేశం వినిపించారు. ''హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లాను అంతం చేశాం. అతని స్థానంలో హెజ్‌బొల్లా కాబోయే చీఫ్‌ను, ఆ తర్వాతి వారసుడు, తదుపరి నేతనూ చంపేశాం. గతంలో ఎన్నడూలేనంతగా హెజ్‌బొల్లా ఇప్పుడు బలహీనపడింది' అని నెతన్యాహూ అన్నారు. నెతన్యాహూ వ్యాఖ్యలపై లెబనాన్ ఇంకా స్పందించలేదు. మరోవైపు దక్షిణ లెబనాన్‌లోని కుగ్రామంలో రెసిడెన్షియల్ భవంతి భూగర్భంలో హెజ్‌బొల్లా స్థావరాన్ని ఇజ్రాయెల్ సైన్యం గుర్తించింది. అక్కడి భారీ స్థాయిలో ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో హెజ్‌బొల్లా మిలిటెంట్లతో జరిగిన పరస్పర కాల్పుల్లో ఇజ్రాయెల్ సైన్యాధికారి కెప్టెన్ బెంజిన్ ఫాలక్ చనిపోయాడు. కాగా, లెబనాన్‌లోని పావువంతు భాగం ఇప్పటికే ఇజ్రాయెల్ సైన్యం అధీనంలోకి వెళ్లిపోయిందని ఐక్యరాజ్యసమితి మానవతా సంబంధాల విభాగం తెలిపింది. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌లో 1,400 మంది పౌరులు మరణించగా, 12 లక్షల మంది వలసపోయారని పేర్కొంది.

విద్వేషాల ఫ్యాక్టరీ కాంగ్రెస్

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం
- కుల, మత రాజకీయాలు చేస్తోంది
- కాంగ్రెస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



నాగపూర్: దేశంలో కాంగ్రెస్‌తోపాటు అర్బన్ నక్సలైట్ల విద్వేషపూరిత కుట్రలను ప్రజలు ఎంతమాత్రం సహించడం లేదని, హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే అందుకు ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. కుట్రలకు బలి కావాలని ప్రజలు కోరుకోవడం లేదన్నారు. హరియాణాలో బీజేపీ విజయం దేశ ప్రజల మూడ్‌ను ప్రతిబింబిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ బాధ్యత లేని పార్టీ, అది విద్వేషాలను వ్యాప్తి చేసే ఫ్యాక్టరీ అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హిందువుల మధ్య విభజన తీసుకురావాలన్నదే కాంగ్రెస్ ప్రయత్నమని ఆరోపించారు. దేశంలో భిన్నవర్గాల మధ్య చిచ్చు పెడుతోందని కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ బుధవారం మహారాష్ట్రలో రూ.7,600 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 10 నూతన మెడికల్ కాలేజీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహారాష్ట్రలో విపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) కూటమి అధికారం కోసం రాష్ట్రాన్ని బలహీన పర్చాలని చూస్తోందని విమర్శించారు. బీజేపీ, శివసేన, ఎన్సీపీతో కూడిన అధికార మహాయుతి కూటమి రాష్ట్రాన్ని మరింత బలోపేతం చేయడానికి అంకితభావంతో కృషి చేస్తోందని ప్రశంసించారు. రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతోందని, ఇలాంటి పరిణామం గతంలో ఎన్నడూ చూడలేదని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో కేవలం అవినీతి అక్రమాల్లోనే వేగం కనిపించిందని ఎద్దేవా చేశారు

హరియాణాలో కాంగ్రెస్‌కు గుణపాఠం

విభజన రాజకీయాలు చేస్తూ స్వలాభం కోసం ఓటర్లను తప్పుదోవ పటిస్తున్న కాంగ్రెస్ పట్ల దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ముస్లిం వర్గంలో భయోత్పాతం సృష్టించి, వారిని ఓటుబ్యాంక్‌గా మార్చుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం హిందువులను విభజించడమే లక్ష్యంగా కుల రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. హరియాణాలో చరిత్రాత్మక విజయం సాధించామని, మహారాష్ట్రలోనూ అంతకంటే పెద్ద విజయం సాధించబోతున్నామని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తంచేశారు.

ముస్లిం కులాలపై మాట్లాడరా?

ముస్లిం వర్గంలోనూ ఎన్నో కులాలు ఉన్నాయని ఇప్పటిదాకా ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా చెప్పలేదని ప్రధానమంత్రి మండిపడ్డారు. ముస్లిం కులాల ప్రస్తావన వచ్చినప్పుడల్లా కాంగ్రెస్ నేతలు నోటికి తాళం వేసుకుంటున్నారని విమర్శించారు. హిందువుల విషయంలో మాత్రం కులం కోణంలో మాట్లాడుతుంటారని ధ్వజమెత్తారు. హిందువుల్లో ఒక కులంపైకి మరో కులాన్ని ఉసిగొల్పడమే కాంగ్రెస్ విధానమని ఆక్షేపించారు. హిందువులు ఎంతగా చీలిపోతే రాజకీయంగా అంత లాభమని ఆ పార్టీ భావిస్తోందన్నారు. హిందువుల మధ్య నిప్పు పెట్టి చలి కాచుకోవాలన్నదే కాంగ్రెస్ ఆలోచన అని నిప్పులు చెరిగారు.


డేవిడ్ బేకర్


డెమిస్ హసాబిస్


జాన్ జంపర్

ప్రోటీన్లపై పరిశోధనకు నోబెల్

డేవిడ్ బెకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లకు రసాయన నోబెల్

స్టాక్‌హోమ్: మనిషి ఆరోగ్యకరమైన జీవనానికి మూలస్తంభాలైన ప్రోటీన్ల డిజైన్లు, వాటి పనితీరుపై విశేష పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ సంవత్సరం రసాయనశాస్త్ర విభాగంలో నోబెల్ అవార్డ్ వరించింది. ప్రోటీన్లపై శోధనకుగాను శాస్త్రవేత్తలు డేవిడ్ బెకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లకు 2024 ఏడాదికి కెమిస్ట్రీ నోబెల్ ఇస్తున్నట్లు కెమిస్ట్రీ నోబెల్ కమిటీ సారథి హెనర్ లింక్ బుధవారం ప్రకటించారు. పురస్కారంతోపాటు ఇచ్చే దాదాప రూ.8.4 కోట్ల నగదు బహుమతిలో సగం మొత్తాన్ని బేకర్‌కు అందజేయనున్నారు. మిగతా సగాన్ని హసాబిస్, జాన్ జంపర్‌లకు సమంగా పంచనున్నారు.

జీవరసాయన శాస్త్రంలో గొప్ప మలుపు

''అమైనో ఆమ్లాల క్రమానుగతి, ప్రోటీన్ల నిర్మాణం మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. వీరి పరిశోధన రసాయనరంగంలో ముఖ్యంగా జీవరసాయన శాస్త్రంలో మేలి మలుపు. ఈ ముందడుగుకు కారకులైన వారికి నోబెల్ దక్కాల్సిందే'' అని నోబెల్ కమిటీ కొనియాడింది. అమెరికాలోని సియాటెల్‌లో ఉన్న వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో డేవిడ్ బేకర్ పనిచేస్తున్నారు. హసాబిస్, జాన్ జంపర్ లండన్‌లోని గూగుల్ సంస్థకు చెందిన డీప్‌మైండ్ విభాగంలో పనిచేస్తున్నారు. ''బేకర్ 2003లో ఒక కొత్త ప్రోటీన్‌ను డిజైన్‌చేశారు. అతని పరిశోధనా బృందం ఇలా ఒకదాని తర్వాత మరొకటి కొత్త ప్రోటీన్లను సృష్టిస్తూనే ఉంది. వాటిల్లో కొన్నింటిని ప్రస్తుతం ఫార్మాసూటికల్స్, టీకాలు, నానో మెటీరియల్స్, అతి సూక్ష్మ సెన్సార్లలో వినియోగిస్తున్నారు. వీళ్ల బృందం సృష్టించిన సాంకేతికతతో వెలువడిన ఎన్నో కొత్త డిజైన్ల ప్రోటీన్లు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి''అని నోబెల్ కమిటీలో ప్రొఫెసర్ జోహాన్ క్విస్ట్ శ్లాఘించారు.

నిర్మాణాలను అంచనా వేసే ఏఐ మోడల్

డెమిస్ హసాబిస్, జంపర్‌లు సంయుక్తంగా ప్రోటీన్ల నిర్మాణాలను ఊహించగల కృత్రిమమేధ నమూనాను రూపొందించారు. దీని సాయంతో ఇప్పటిదాకా కనుగొన్న 20 కోట్ల ప్రోటీన్ల నిర్మాణాలను ముందే అంచనావేయొచ్చు.

మోదీ విధానాలే గెలిపించాయి


- హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీ వెల్లడి
- ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులతో భేటీ


మోదీకి కృష్ణుని విగ్రహాన్ని బహూకరిస్తున్న సైనీ

న్యూఢిల్లీ: హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా తదితరులను కలిశారు. వారు ఆయనకు అభినందనలు తెలియజేశారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వరుసగా మూడోసారి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. సైనీ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నట్లు సమాచారం. ఓబీసీ నాయకుడైన సైనీ ఈ ఏడాది మార్చి నెలలో మనోహర్ లాల్ ఖట్టర్ స్థానంలో హరియాణా సీఎంగా ప్రమాణం చేశారు. పార్టీ మళ్లీ గెలిస్తే సైనీ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని అప్పట్లో సంకేతాలిచ్చింది. బీజేపీ పెద్దలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ విధానాలే హరియాణాలో తమ పార్టీని మళ్లీ గెలిపించాయని చెప్పారు. గత పదేళ్లలో అన్ని వర్గాల సంక్షేమం కోసం మోదీ ఎన్నో పథకాలు తీసుకొచ్చారని వివరించారు. ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాల విషయంలో ప్రతిపక్షాలు అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. అబద్ధాలతో ప్రజల్లో అనుమానాలు రేకెత్తించాలన్నదే ఆ పార్టీ ప్రయత్నమని విమర్శించారు.

బీజేపీ నుంచి ఆశించడం మూర్ఖత్వం

ఆర్టికల్ 370 పునరుద్ధరణపై ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ప్రజల ప్రత్యేక హక్కులను లాక్కున్న బీజేపీ నుంచి ఆర్టికల్ 370 పునరుద్ధరణను ఆశించడం మూర్ఖత్వమని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా అన్నారు. అయితే బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ అంశంపై తమ పార్టీ వైఖరి మారబోదన్నారు. ఆర్టికల్ 370పై మాట్లాడబోమని కానీ, అదిప్పుడు సమస్య కాదని తామెప్పుడూ చెప్పలేదని అబ్దుల్లా స్పష్టం చేశారు. భవిష్యత్‌లో దేశంలో ప్రభుత్వం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన ఒమర్... అప్పుడు జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక సదుపాయాలు కల్పించే కొత్త వ్యవస్థ ఏర్పడుతుందని ఆశిస్తున్నామన్నారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్దరించాలని కోరుతూ ఎన్సీ–కాంగ్రెస్ ప్రభుత్వం తొలి కేబినెట్ సమావేశంలో తీర్మానం చేస్తుందని తెలిపారు. ఢిల్లీ తరహాలో కాకుండా జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం సజావుగా నడుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీకి జమ్మూకశ్మీర్‌కు చాలా తేడా ఉందని, 2019కు ముందు జమ్మూకశ్మీర్ ఒక రాష్ట్రమని గుర్తుచేశారు. జమ్మూకశ్మీర్‌లో మూడు చర్యలు తీసుకుంటామని చెప్పిన ప్రధాని, హోంమంత్రి, సీనియర్ మంత్రులు చెప్పారని, డీలిమిటేషన్, ఎన్నికలు జరిగాయని, రాష్ట్ర హోదా మాత్రమే మిగిలి ఉందని, దానిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో ఘర్షణ పడటం వల్ల సమస్యలను పరిష్కరించలేమన్నారు. ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించడానికి ఎన్సీ గురువారం శాసనసభాపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తుందని అబ్దుల్లా చెప్పారు. ఆ తర్వాత కూటమి సమావేశంలో నాయకుడిని ఎన్నుకుంటారని, ఆ తర్వాత రాజ్‌భవన్‌కు వెళ్లి ప్రభుత్వ ఏర్పాటుకు హక్కును కోరుతామని తెలిపారు. మరికొద్ది రోజుల్లో కొత్త ప్రభుత్వం కొలువుదీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంకీర్ణ ప్రభుత్వంలో పీడీపీ భాగస్వామ్యం అవుతుందా అన్న ప్రశ్నకు ఎన్సీ నేత సమాధానమిస్తూ ప్రస్తుతానికి దానిపై ఎలాంటి చర్చలు జరగలేదని చెప్పారు.

హిందువుల్లో విశ్వాసాన్ని పెంచుతాం: ఫరూక్

జమ్మూకశ్మీర్ మధ్య బీజేపీ సృష్టించిన విభేదాలను తగ్గించి, హిందువుల్లో విశ్వాసాన్ని పెంపొందించడమే ఎన్సీ–కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. రెండు ప్రాంతాల మధ్య భేదం చూపబోమని తెలిపారు. కొత్త ప్రభుత్వం ముందు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం అతిపెద్ద సవాళ్లన్నాయన్నారు. యువతకు అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అయితే ముఖ్యమంత్రి ఎవరనేది కూటమి నిర్ణయిస్తుందని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించడంపై ఫరూక్ స్పందిస్తూ.. తాను నిర్ణయించిందే జరుగుతుందని స్పష్టం చేశారు. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అభ్యర్థని ఫరూక్ అబ్దుల్లా మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే.

అనూహ్య ఫలితాల్ని విశ్లేషిస్తున్నాం

'ఎక్స్'లో స్పందించిన రాహుల్ గాంధీ



సాక్షి, న్యూఢిల్లీ: హరియాణాలో చవిచూసిన అనూహ్య ఫలితాలను తమ పార్టీ విశ్లేషిస్తోందని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు.

హరియాణాలోని వేర్వేరు నియోజకవర్గాల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘం ఎదుట ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. హరియాణా, జమ్మూకశ్మీర్ శాసనసభల ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారిగా ఆయన బుధవారం తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో హిందీలో పలు పోస్టులు చేశారు. ''కూటమికి విజయం అందించిన జమ్మూకశ్మీర్ ప్రజలకు కృతజ్ఞతలు. ఇక్కడ విపక్షాల 'ఇండియా' కూటమి విజయం సాధించి రాజ్యాంగానికి సైతం విజయం చేకూర్చింది'' అని అన్నారు. ఇక్కడి గెలుపును ప్రజాస్వామ్య ఆత్మగౌరవ విజయంగా రాహుల్ అభివర్ణించారు. ''మాకు మద్దతిచ్చిన హరియాణా ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా. పార్టీ విజయం కోసం 'బబ్బర్ షేర్' కార్యకర్తలు అవిశ్రాంతంగా కష్టపడ్డారు. ఇకమీదటా సామాజిక, ఆర్థిక న్యాయం, సత్యం కోసం పోరాడుతూ మా గొంతుకను వినిపిస్తాం'' అని రాహుల్ అన్నారు.

కాంగ్రెస్‌కు సమాజ్‌వాది ఝలక్!

ఏకపక్షంగా ఆరు సీట్లకు అభ్యర్థుల ప్రకటన

లక్నో: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమిని చవిచూసిన కాంగ్రెస్‌పై ఇండియా కూటమి పక్షాలు స్వరం పెంచుతున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ అయితే ఉత్తరప్రదేశ్‌లో 10 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు ఏకపక్షంగా ఆరుసీట్లకు బుధవారం అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్‌కు ఝలక్ ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో కుదిరిన పొత్తును కొనసాగిస్తూ 10 అసెంబ్లీ స్థానాల్లో ఐదు సీట్లను తమకు ఇవ్వాలని కాంగ్రెస్ కోరింది. కానీ కాంగ్రెస్‌ను సంప్రదించకుండానే సమాజ్‌వాదీ పార్టీ ఆరుగురు అభ్యర్థులను ప్రకటించేసింది. ఇందులో కాంగ్రెస్ ఆశిస్తున్న నియోజకవర్గాలు కూడా ఉండటం గమనార్హం. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ, కాంగ్రెస్‌లు కలిసి పోటీచేసి.. బీజేపీకి చెక్ పెట్టిన విషయం తెలిసిందే.

బలంగా ఉన్నచోట మిత్రపక్షాలకు పట్టించుకోదు: శివసేన (యూబీటీ)

హరియాణాలో ఓటమికి కాంగ్రెస్ అతివిశ్వాసమే కారణమని శివసేన (యూబీటీ) విమర్శించింది. బలహీనంగా ఉన్నచోట మిత్రపక్షాలపై ఆధారపడి, తాము బలంగా ఉన్నచోట్ల ప్రాంతీయ పార్టీలను అసలు పట్టించుకోదని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ ఆరోపించారు.

ఈవీఎంలలో తేడాలపై విచారణ జరపండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల లెక్కింపులో కొన్ని ఈవీఎంలలోని తేడాలపై విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. విచారణ ముగిసేదాకా సదరు ఈవీఎంలను సీల్ చేసి, భద్రపరచాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. మాజీ సీఎంలు భూపిందర్ హుడా, అశోక్ గహ్లోత్, ఏఐసీసీ ప్రధానకార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ తదితరులతో కూడిన కాంగ్రెస్ బృందం బుధవారం ఈసీ సీనియర్ అధికారులను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించింది. హరియాణాలోని పలు నియోజకవర్గాల్లో ఈవీఎంల పనితీరులో తేడాలున్నాయని ఫిర్యాదులు వచ్చాయని ఈసీ దృష్టికి తెచ్చింది. ఇలాంటివి తమకు 20 ఫిర్యాదులు అందాయని, ఏడు రాతపూర్వకంగా అందాయని వివరించింది. కొన్ని ఈవీఎంలు 99 శాతం బ్యాటరీతో పనిచేశాయని, వేరే ఈవీఎంలు 60 నుంచి 70 శాతం బ్యాటరీ సామర్థ్యంతో పనిచేశాయని తెలిపింది. ఈవీఎంల పనితీరులో వ్యత్యాసాలు కొట్టొచ్చినట్లు కనిపించాయని, వీటిపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది.

ఇలాంటిది ఎన్నడూ వినలేదు


కాంగ్రెస్‌పై ఈసీ మండిపాటు

న్యూఢిల్లీ: హరియాణా ఎన్నికల్లో ఓటమిని చవిచూశాక కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రకటనపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు బుధవారం ఒక లేఖ రాసింది. హరియాణా ఎన్నికల ఫలితాలను ఆమోదించబోమని కాంగ్రెస్ మంగళవారం ఒక ప్రకటన చేయడం తెల్సిందే. ''ఘన ప్రజాస్వామ్య వారసత్వమున్న దేశంలో ఇలాంటి విరుద్ధ ప్రకటనలు ఎన్నడూ వినలేదు. భావ ప్రకటనా స్వేచ్ఛకు ఇది సత్యదూరంలో ఉంది. మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు జైరాం రమేశ్, పవన్ ఖేడాలు చేసిన విమర్శలు చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఈ ప్రజాతీర్పును అప్రజాస్వామ్యంగా తిరస్కరించినట్లుగా ఉంది. ఇవి ఊహించని ఫలితాలంటూ మీరు(ఖర్గే), రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యానాలనూ మేం పరిగణనలోకి తీసుకున్నాం'' అని ఖర్గేకు రాసిన లేఖలో ఈసీ పేర్కొంది.

సీఎం సామాన్లనే బయటపడేశారు

ఢిల్లీ సీఎం అధికారిక నివాసం వద్ద ఘటన

కేజ్రీవాల్ తర్వాత అతిశి ఆ బంగ్లాలోకి అక్రమంగా వచ్చారన్న బీజేపీ


లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా


ఢిల్లీ సీఎం అతిశి

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అధికార నివాసం వేదికగా ఆప్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాల మధ్య మరోసారి అధికార ఆధిపత్యపోరు కనిపించింది. ఇటీవల ఢిల్లీ ముఖ్యమంత్రిగా పగ్గాలు స్వీకరించిన ఆప్ నాయకురాలు అతిశికి ఇంకా అధికారిక బంగ్లా కేటాయించకపోవడం ఈ వివాదానికి ఆజ్యంపోసింది. దీంతో సీఎం హోదాలో గతంలో అరవింద్ కేజ్రీవాల్‌కు కేటాయించిన ఢిల్లీలోని ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డు, నంబర్ 6 అధికారిక బంగ్లాలోకి అతిశి మారారు. దీంతో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తన అధికారాన్ని ఉపయోగించి అతిశికి సంబంధించిన సామగ్రిని బయట పడేశారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ బుధవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ''సీఎం అతిశికి అధికారిక బంగ్లాను కేటాయించలేదు. అందుకే ఇన్నాళ్లు సీఎంగా ఉన్నపుడు వినియోగించి, కేజ్రీవాల్ ఖాళీ చేసిన అధికారిక బంగ్లాలోకే అతిశి మారారు. దీనిని జీర్ణించుకోలేని బీజేపీ ప్రభుత్వం ఎలాగైనా ఆ బంగ్లాను బీజేపీ అగ్రనేతకు కేటాయించాలని కుట్ర పన్నింది. లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలను అడ్డుపెట్టుకుని అతిశికి చెందిన సామగ్రిని బయట పడేశారు. అంతకుముందు అదే బంగ్లాలోని క్యాంప్ ఆఫీస్‌లో అతిశి ఒక సమావేశం కూనిర్వహించారు. ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల్లో మూడుసార్లు ఓడిపోయిన బీజేపీ ఇలా చవకబారు బంగ్లా రాజకీయాలు చేస్తోంది'' అని సంజయ్ వివరించారు.

బంగ్లాకు సీలు వేయాల్సిందే: బీజేపీ

వివాదంపై బీజేపీ దీటుగా స్పందించింది. ఢిల్లీ శాసనసభలో విపక్షనేత, బీజేపీ నాయకుడు విజేందర్ గుప్తా మీడియాతో మాట్లాడారు. ''గత ఏడాది కేజ్రీవాల్ మంత్రివర్గంలోకి అతిశి చేరినప్పుడే కేబినెట్ మంత్రి హోదాలో ఆమెకు మథుర రోడ్డులోని ఏబీ–17 బంగ్లాను ప్రజాపనుల విభాగం(పీడబ్ల్యూడీ) గతంలోనే కేటాయించింది. ఆ బంగ్లా ఉండగా ఈ బంగ్లాతో సీఎంకు పనేంటి?. కేజ్రీవాల్ వెళ్లిపోయినా సీఎం బంగ్లా తాళాలు పీడబ్ల్యూడీకి అప్పజెప్పలేదు. ఇప్పుడు అతిశి అక్రమంగా ప్రవేశించిన ఈ బంగ్లాకు సీలు వేయాల్సిందే'' అని గుప్తా డిమాండ్‌చేశారు.

అక్రమంగా తరలించారు: సీఎం కార్యాలయం

''దేశ చరిత్రలో తొలిసారిగా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. బీజేపీ ఆదేశాలను శిరసావహిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా.. అతిశి వస్తువులను బయట పడేయించారు. బీజేపీ బడా నేతకు ఈ బంగ్లాను కేటాయించాలను ఎల్జీ ఉవ్విళ్లూరుతున్నారు. ఢిల్లీ రాష్ట్రంలో 27 ఏళ్లుగా అధికారాన్ని అందుకోలేని బీజేపీ ఇప్పుడు సీఎం బంగ్లాను ఆక్రమించాలని చూస్తోంది'' అని ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది.

అది అధికారిక బంగ్లా కాదు: ఎల్జీ వర్గాలు

సీఎంఓ ప్రకటన తర్వాత ఎల్జీ కార్యాలయం వర్గాలు స్పందించాయి. ''సీఎం హోదాలో అతిశికి ఆ బంగ్లాను కేటాయించలేదు. అనుమతి లేకుండా అతిశి ఆమె సామగ్రిని బంగ్లాలోకి తరలించారు. తర్వాత ఆమెనే వాటిని బయటకు తరలించారు. ప్రస్తుతా నికి ఆ బంగ్లా పీడబ్ల్యూడీ అధీనంలోనే ఉంటుంది. గతంలో సమకూర్చిన వస్తువులను సరిచూసు కున్నాకే కేటాయిస్తారు'' అని ఎల్జీ ఆఫీస్ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా...

ఆ పనులన్నీ ఆపేయండి

- గత ప్రభుత్వంలో మంజూరై ప్రారంభం కాని పనులన్నీ రద్దు
- ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ

సాక్షి, అమరావతి : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అన్ని మౌలిక సదుపాయాల పనులను నిలుపుదల చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీకి ముందు గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులు ప్రారంభించకపోతే ఆ పనులన్నింటినీ రద్దు చేయాల్సిందిగా ఆర్థిక శాఖ అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 1వ తేదీకి గత ప్రభుత్వం చాలా పనులు మంజూరు చేసినప్పటికీ, ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ఇప్పుడు ఆ పనులన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతోపాటు ఏప్రిల్ 1వ తేదీకి ముందు పనులు మంజూరై, అగ్రిమెంట్ విలువలో 25 శాతం కంటే తక్కువగా అయిన పనులన్నింటినీ నిలుపుదల చేయాలని ఆదేశించింది. ఇలాంటి పనులకు ముగింపు పలికిన తర్వాతే బిల్లులు ప్రాసెస్ చేయాలని స్పష్టం చేసింది.

వరద సాయంలో అవినీతి జరగలేదు

- మంత్రులు వంగలపూడి అనిత, నారాయణ, అనగాని

సాక్షి, అమరావతి: బుడమేరు వరదల సమయంలో గతంలో ఏ ప్రభుత్వం చేయనంత పనిచేశామని రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, పి.నారాయణ, అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. వరద సాయంలో భారీగా అవినీతి జరిగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం వారు మాట్లాడారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా వరద సాయాన్ని పంపిణీ చేసిందని దానిపై చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీకి సవాల్ విసిరారు. ఎన్టీఆర్ జిల్లాలో రూ.92 కోట్లు మాత్రమే ఆహారం కోసం ఖర్చు చేశామన్నారు. సాయం కింద ఎన్టీఆర్ జిల్లాకు విడుదల చేసింది రూ.139 కోట్లు మాత్రమేనన్నారు. కానీ రూ.534 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం సరికాదన్నారు. వరదలో మునిగిన గ్యాస్ స్టవ్‌లను సీఎం చంద్రబాబు బాగు చేయించారని విమర్శించారు. సీఎంగా ఉన్నప్పుడు జగన్ హెలికాప్టర్‌లో వెళ్లేవారని, ఇప్పుడు చంద్రబాబు జేసీబీల్లో పర్యటించారన్నారు. నీట మునిగిన ప్రతి ఇంటిని కడిగించారని తెలిపారు. పుంగనూరులో ఒక అమ్మాయిని ఎవరో చంపేస్తే, నలుగురు రేప్ చేసి చంపేశారని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాలుష్యరహిత పరిశ్రమలకు ప్రోత్సాహం


ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి: పర్యావరణ హితం పరిశ్రమల బాధ్యత కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, అదే సమయంలో సాధ్యమైనంతగా కాలుష్య రహిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. విజయవాడలోని ఓ హోటల్‌లో బుధవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎన్జీవోలు, నిపుణులు, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకోవడం, అభివృద్ధి పథంలో ముందుకు సాగడం రెండూ కీలకమైనవేనని చెప్పారు. విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో జల, వాయు కాలుష్యాలను నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణం మేలు గురించి ఎన్జీవోలు చేస్తున్న కృషి అభినందనీయమని, వారి సేవలను కాలుష్య నియంత్రణ మండలి ఉపయోగించుకుంటుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య, ఏపీఐఐసీ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం నేడు ధర్నా

- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి వెలంపల్లి వెల్లడి
- బాబు ప్రభుత్వం వరద బాధితులను నిండా ముంచిందని ధ్వజం



సాక్షి,అమరావతి: వరద బాధితులను ఆదుకోవాలని, వారికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం ధర్నా చౌక్‌లో ధర్నా చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు ప్రభుత్వం వరద బాధితులను నిండా ముంచిందని దుయ్యబట్టారు. సంక్షోభంలో అవకాశాలను సృష్టిస్తానని చెప్పుకొనే సీఎం చంద్రబాబు.. విజయవాడ వరదల్లో సంపద సృష్టించుకున్నారని, వరద బాధితులకు దక్కాల్సిన సాయం నాయకుల జేబుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. వరద ప్రాంతాల్లో పర్యటించి, బాధితులను కలుసుకునే ధైర్యం మంత్రులకు ఉందా అని నిలదీశారు. దమ్ముంటే విజయవాడ సింగ్‌నగర్, కుమ్మరిపాలెం, కబేళా, జ్యోతినగర్, లూనా సెంటర్‌కు రావాలని సవాల్ విసిరారు. వరద బాధితులకు వైఎస్సార్‌సీపీ కోటి రూపాయల విలువైన సాయం చేస్తుందని ప్రకటించినా, అంతకు మూడింతల సాయాన్ని అందించామని తెలిపారు. తాము వరద బాధితులకు సాయం చేసేందుకు పడవలు అడిగితే ఇవ్వలేదని, చివరకు తమ ట్రాక్టర్లను కూడా అనుమతించలేదని చెప్పారు.

కాసులు కురిపిస్తున్న అలంకరణ ఆకు!

బాపట్ల ఇసుక నేలల్లో పండే డెకరేషన్ ఆకుకు భలే డిమాండ్

- పూలదండలు, ఫంక్షన్ అలంకరణల్లో విరివిగా వినియోగం
- హైదరాబాద్ గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు పెద్ద ఎత్తున సరఫరా
- అక్కడి నుంచి పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్న 'లైన్ ఆకు'
- సముద్ర తీరప్రాంతంలో 400 ఎకరాల్లో సాగు
- రెండు నుంచి నాలుగేళ్ల పాటు దిగుబడి..
- 40 రోజులకు ఒక కోత.. ఏడాదిలో 8 కోతలు



బాపట్ల తీర ప్రాంతంలో సాగులో ఉన్న లైన్‌ఆకు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: శుభకార్యం ఏదైనా సరే అలంకరణలో ''డెకరేషన్ ఆకు'' ఉండి తీరాల్సిందే! బాపట్ల తీర ప్రాంతంలోని ఇసుక నేలల్లో సాగు చేసే ఈ ప్రత్యేకమైన ఆకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు దక్కించుకుంది. మన రైతులు డెకరేషన్ ఆకు (లైన్ ఆకు)ను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతోపాటు తెలంగాణలోని గుడి మల్కాపూర్ పూల మార్కెట్‌కు పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నారు. అక్కడి నుంచి పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఆకర్షణీయంగా, వాడిపోకుండా ఉండే లైన్ ఆకును పూలమాలల్లో కలుపుతారు. ప్రధానంగా శుభకార్యాల సందర్భంగా ఫంక్షన్ డెకరేషన్‌లో విరివిగా వినియోగిస్తున్నారు. అందువల్లే దీన్ని ఫంక్షన్ ఆకు, డెకరేషన్ ఆకు అని కూడా వ్యవహరిస్తారు. ఇసుక నేలలు అనుకూలం కావడంతో బాపట్ల పరిసరాల్లోని దరివాద కొత్తపాలెం, వెదుళ్లపల్లి కొత్తపాలెం, పోతురాజు కొత్తపాలెం, నాగేంద్రపురం, సుబ్బారెడ్డిపాలెం, కుక్కలవారిపాలెం, మరుప్రోలువారిపాలెం, బసివిరెడ్డిపాలెం, తులసీనగర్ తదితర గ్రామాల్లో దాదాపు 400 ఎకరాల్లో రైతులు దీన్ని విరివిగా సాగు చేస్తున్నారు.

నెల రోజులకు తొలి కోత

డెకరేషన్ ఆకును ఒకసారి సాగుచేస్తే రెండు నుంచి నాలుగేళ్ల పాటు దిగుబడి వస్తుంది. తొలి ఏడాది రూ.లక్షకు పైగా పెట్టుబడి వ్యయం అవుతుంది. నాటిన నెల రోజులకు కోతకు వస్తుంది. నాలుగు నుంచి ఆరు అంగుళాలు పెరగ్గానే ఆకును కోస్తారు. ప్రతి 40 నుంచి 50 రోజులకు ఒకసారి కోసి మార్కెట్‌కు తరలిస్తారు. ఆకు పెరిగేందుకు ఎరువుల వాడకంతోపాటు పాచి తెగులు, కుళ్లు తెగుళ్ల నివారణకు ఐదు రోజులకు కొకసారి మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. పెట్టుబడి ఖర్చు అధికంగానే ఉన్నప్పటికి ఆకుకు ధర ఉంటే మంచి లాభాలే ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు.

లాభదాయకమే..

రెండు నెలల క్రితం కిలో రూ.25 పలికిన డెకరేషన్ ఆకు ప్రస్తుతం రూ.20 ఉంది. 70 క్వింటాళ్లు దిగుబడి వస్తే ఎకరాకు రూ.1.40 లక్షలు రాబడి వస్తుంది. ఏడాదిలో 8 కోతలు ద్వారా రూ.10 లక్షలు ఆర్జిస్తే పెట్టుబడి వ్యయం రూ.3 - 4 లక్షలు పోనూ ఎకరాకు రూ.6 లక్షల వరకు రైతుకు ఆదాయం వస్తుంది. కిలో రూ.5 నుంచి రూ.10 లోపు అమ్మిన సందర్భాల్లో నష్టాలు వచ్చాయని రైతులు చెబుతున్నారు. అయితే మిగిలిన పంటలతో పోలిస్తే లైన్ ఆకు సాగు లాభదాయకమేనన్నది రైతుల అభిప్రాయం. సీజన్‌తో నిమిత్తం లేకుండా ఏడాది పొడవునా దిగుబడి వస్తుండడంతో రైతులు ప్రతి 40 రోజులకు కోత కోసి 70 కిలోల చొప్పున బస్తాల్లో నింపి హైదరాబాద్‌లోని గుడి మల్కాపూర్ మార్కెట్‌కు లారీల్లో తరలిస్తున్నారు. కొందరు విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, చెన్నై తదితర మార్కెట్లకు విక్రయిస్తున్నారు. మొత్తంగా డిమాండ్ నేపథ్యంలో లైన్‌ఆకు రైతులకు లాభాలు ఆర్జించి పెడుతోంది.

ధర ఉంటే మంచి రాబడి



20 సెంట్లలో లైన్‌ఆకు సాగు చేశా. తొలుత రూ.40 వేలు పెట్టుబడి పెట్టా. ఒకసారి సాగు చేస్తే మూడు సంవత్సరాలు పంట ఉంటుంది. ప్రతి 40 రోజులకొకసారి ఆకు కోత కోసి గుడిమల్కాపూర్ మార్కెట్‌కు పంపుతున్నాం. ప్రస్తుతం కిలో ఆకు రూ.20 ఉంది. ఈ మాత్రం ధర ఉంటే రైతుకు గిట్టుబాటు అవుతుంది.

– ఎం.నారాయణరెడ్డి, రైతు, దరివాద కొత్తపాలెం

కొమ్మ తెచ్చి నాటాలి



70 సెంట్లలో లైన్ ఆకు సాగుచేశా. కొమ్మ తెచ్చి నాటితే మూడు నాలుగేళ్లు ఉంటుంది. కోసిన ఆకును 70 కిలోల బస్తాల్లో నింపి గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు పంపుతున్నాం.

– రామకృష్ణారెడ్డి, రైతు, దరివాద కొత్తపాలెం

జాగ్రత్తగా పెంచుకోవాలి



ఎకరం పొలంలో డెకరేషన్ ఆకు సాగు చేశా. తొలుత రూ.లక్ష పెట్టుబడి పెట్టా. ఆకు కోసిన ప్రతిసారీ ఎరువులు వేయడంతోపాటు వారానికి ఒకసారి పురుగు మందులు పిచికారీ చేస్తున్నా. ఆకును జాగ్రత్తగా పెంచుకోవాలి. నెల క్రితం కిలో రూ.25 చొప్పున ధర ఉంది. రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. రేటు తగ్గితే మాత్రం పెట్టుబడులు కూడా రావు.

– కుక్కల కోటిరెడ్డి, రైతు, కుక్కలవారిపాలెం

ఏడాది పొడవునా పంట



డెకరేషన్ ఆకు నాటిన నెలకే కోతకు వస్తుంది. పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ప్రతి 40 రోజులకొకసారి కోతకు వస్తుంది. ఏడాది పొడవునా పంట ఉంటుంది. ఒకసారి సాగుచేస్తే మూడు నాలుగేళ్లు ఉంటుంది. ప్రస్తుతం దరలు బాగున్నాయి.

– ఏ.రవణమ్మ, రైతు, దరివాద కొత్తపాలెం

ముంపు పరిహారం అందలేదని చెట్టెక్కిన రైతు



ఏలేరు వరద ముంపు పరిహారం అందలేదని మనస్తాపం చెందిన పిఠాపురం మండలం గోకివాడకు చెందిన ఓ కౌలు రైతు గ్రామ శివారులోని చింతచెట్టు పైకి ఎక్కి నిరసన తెలిపాడు. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కౌలు రైతు ఎన్ సూరిబాబు తొమ్మిది ఎకరాల భూమి కౌలుకు చేస్తున్నాడు. ఎకరాకు రూ.20 వేల చొప్పున రూ.2.70 లక్షల పెట్టుబడి పెట్టి సాగు చేశాడు. ఈ పెట్టుబడికి కౌలు సొమ్ము అదనంగా రూ.1.80 లక్షలు రైతుకు చెల్లించాడు. ఈ నేపథ్యంలో గత నెలలో ఏలేరు వరద నీటితో పంట ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయాడు. ముంపుతో నష్టపోయిన తనకి నష్టపరిహారం అందకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక ఏలేరు కాలువ గట్టు పైన ఉన్న చింతచెట్టు ఎక్కి నిరసన తెలిపాడు. వరద వల్ల అంతా నష్టపోయానని, అధికారులు న్యాయం చేయాలని అప్పటి వరకు కిందికి దిగేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ సచివాలయ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి అచ్యుతరావు, వీఆర్వో నరసింహమూర్తి హామీతో రైతును పోలీసులు కిందకు దించారు.

-పిఠాపురం

విశాఖ ఉక్కుపై నాడు ప్రగల్భాలు.. నేడు బేల మాటలు

బాబు అండ్ కో యూటర్న్

ఎందాకైనా వెళ్లి పోరాడతామని నాడు చంద్రబాబు, పవన్ శపథాలు, హామీలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : ఎన్నికల ముందు, ఆ తర్వాత ఒకవైపు చంద్రబాబు నాయుడు, మరోవైపు పవన్ కళ్యాణ్ విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి కోటలు దాటేలా మాటలు మాట్లాడారు. దానిని కాపాడుకునేందుకు ఎంత వరకైనా వెళతామని ఇద్దరూ హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక మాత్రం నాలుక మడతేశారు. నిర్భీతిగా మాట మార్చేస్తున్నారు. 'ప్రైవేటీకరణను నిలవరించలేని జగన్.. రాజీనామా చెయ్యి' అంటూ నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటానని ఎన్నికలకు ముందు ప్రజాగళం సభలో శపథం చేశారు. వాజపేయి హయాంలో స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోతే తానే అడ్డుకున్నానని, కేంద్రం నుంచి ఆర్థిక సాయం రాబట్టి ఫ్యాక్టరీని ఆదుకున్నామని.. ఇప్పుడూ కాపాడుకుంటామని గద్దె నెక్కిన కొత్తలో సెలవిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారం యూనియన్ నాయకులకూ మొన్న ఆగస్టులో అదే హామీ ఇచ్చారు. 'విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం కానివ్వం. అసెంబ్లీలో తీర్మానం చేయాలి. వారంలో అఖిలపక్షం ఏర్పాటు చేయాలి. నాతో కలిసి రండి, ఢిల్లీకి తీసుకువెళ్తా. ఇక్కడ కూటమి అభ్యర్థిని గెలిపిస్తే ఢిల్లీలో మన వాణి బలంగా వినిపిద్దాం..' అని ఎన్నికలకు ముందు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బల్లగుద్ది చెప్పారు. 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు తీర్చాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరుతానని హామీ ఇచ్చారు. ఇన్ని మాటలు మాట్లాడిన ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. ఇప్పుడు మాట మార్చేశారు. పవన్ మౌన వ్రతం పాటిస్తుండగా.. చంద్రబాబు తన ఒక్కడి చేతుల్లో లేదంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. 'వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంపై ఢిల్లీ వెళదామని నేను పిలిస్తే స్పందించారా? ప్రైవేటు ఉక్కు కర్మాగారాలన్నీ లాభాల బాటలో నడుస్తుంటే.. విశాఖ ఉక్కు కర్మాగారం ఇలా భ్రష్టు పట్టడానికి కారణమేంటో యాజమాన్యం, సిబ్బంది ఆలోచించుకోవాలి' అంటూ చంద్రబాబు గత నెల 17న మీడియాతో రివర్స్‌లో మాట్లాడారు.

అప్పుడు మొత్తం పిక్చర్ తెలీదట!

''విశాఖ స్టీలు ప్లాంటును ఏ విధంగా రివైవ్ చేసుకోవాలి? ఏ విధంగా ట్రాక్‌లో పెట్టాలి.. ఏ విధంగా చేస్తే ముందుకు వెళుతుంది.. అనే అంశాల గురించి సీరియస్‌గా ఆలోచిస్తున్నాం. సెయిల్‌లో విలీనం చేయాలనేది ఒక ప్రత్యామ్నాయం. అందుకు సెయిల్, కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోవాలి. అదొక సమస్య. ఎన్ఎండీసీకి భూమి ఇస్తే.. వారు డబ్బులిచ్చినా అది తాత్కాలికం. ఆ డబ్బులు చాలవు. రూ.వెయ్యి కోట్లు, రెండు వేల కోట్లతో రివైవ్ కాదు. దీనికి ఒక పూర్తి ప్యాకేజీ ఇవ్వాలి. ముడి సరుకు కూడా లేదు. ఇన్ని సమస్యలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు మేం ఆలోచిస్తున్నాం. మొత్తం మీద ఫెయిర్‌గా డిస్కస్ చేయకపోతే ఏం జరుగుతుందో నాకైతే తెలీదు. ఎవరో ఒకరు.. కేంద్రమో, రాష్ట్ర ప్రభుత్వమో, బ్యాంకులో ఎవరో ఒకరు డబ్బులు ఇవ్వాలి. మేనిఫెస్టోలో విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణను ఆపేస్తాం అని చెప్పాం. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు మొత్తం పిక్చర్ ఉండదు. వెరీ క్లియర్. అందరూ గుర్తు పెట్టుకోవాలి'' అని తాజాగా అమరావతిలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు కుండబద్దలు కొట్టారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏదో ఉన్న సమాచారంతో హామీ లిచ్చామని, ఇప్పుడు పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని దాటవేసే ప్రయత్నం చేశారు. పైగా సెయిల్‌లో విలీనానికి సెయిల్, కేంద్రం ఒప్పుకోవాలని.. ఇది తమ చేతుల్లో లేదనే రీతిలో వ్యాఖ్యానించారు. తద్వారా విశాఖ స్టీలు ప్లాంటుపై ఎన్నికల ముందు, ఆ తర్వాత కూడా కొద్ది రోజులు మాట్లాడిన మాటలు అంతా హంబక్ అని చంద్రబాబు తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

అసెంబ్లీ తీర్మానంతో వైఎస్సార్‌సీపీ అడ్డుకునే యత్నం

- స్టీల్ ప్లాంట్‌ను దివాలా పరిశ్రమగా చూపించే కుట్ర జరుగుతోంది. 2021లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. వెంటనే అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్లాంట్ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రానికి లేఖలు రాశారు.
- అంతటితో ఆగకుండా అసెంబ్లీలో సైతం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. విశాఖలో భారీ బహిరంగ సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చిన సందర్భంలో కూడా వేదికపై లక్షల మంది ప్రజల సమక్షంలో ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.
- రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ఆశీల్‌మెట్ట జంక్షన్ నుంచి కూర్మన్నపాలెం జంక్షన్ వరకు అప్పటి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో భారీ పాదయాత్ర చేపట్టారు. స్టీలు ప్లాంట్ ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ నుంచి లభించిన మద్దతు కార్మికుల్లో ధైర్యాన్ని పెంచింది. ఫలితంగా కేంద్రం దూకుడుగా ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా ఎన్నికలకు వెళ్లింది.
- ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు స్టీలు ప్లాంటులో ఇంత జరుగుతున్నా... ఏ ఒక్క రోజూ నోరు విప్పి మాట్లాడేందుకు సాహసించ లేదు. పైగా జనసేన నేతలు నెపమంతా కార్మికులపై నెట్టేందుకు యత్నించారు. సీఎం చంద్రబాబు మరో అడుగు ముందుకు వేసి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏదో ఉన్న సమాచారంతో మాట్లాడతామని, ఇప్పుడు అంత సులువు కాదంటూ చావు కబురు చల్లగా చెప్పారు.

రుణం పేరుతో నిబంధనలు, బెనిఫిట్స్‌లో కోత

- స్టీల్ ప్లాంట్ కోసం రూ.12 వేల కోట్ల బెయిల్ అవుట్ ప్యాకేజీ కావాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, కేంద్రం రూ.2 వేల కోట్ల రుణాన్ని (ఎస్‌బీఐ ద్వారా) అందిస్తున్నట్టు పైకి నటిస్తూ.. ఈ నిధులను జీఎస్టీ, పీఎఫ్ బకాయిలు, ప్రభుత్వ లెవీ, వెండర్స్‌కు చెల్లింపులు చేయాలని నిబంధనలు విధించింది. ఇతరత్రా అంశాలకు ఖర్చు చేస్తే.. ఆ నిధుల్ని ఫ్రీజ్ చెయ్యాలంటూ ఆదేశించింది.
- వాస్తవానికి స్టీలు ప్లాంటు పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యం 7.9 మిలియన్ టన్నులు. పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు 30 వేల మంది కార్మికులు ఉండాలి. ఒకవైపు సెయిల్‌లో 19 మిలియన్ టన్నుల సామర్థ్యానికి లక్ష మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. ఇందుకు భిన్నంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉన్న 14 వేల మందిలోనే 4 వేల మందిని తొలగించేందుకు ప్రయత్నించడాన్ని కార్మిక సంఘాలు గట్టిగా ప్రతిఘటించాయి.
- దీంతో రానున్న రోజుల్లో విడతలు విడతలుగా కార్మికులను తొలగించేందుకు రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్‌లోనూ భారీగా కోతలకు యాజమాన్యం దిగింది. గత ఆరు నెలలుగా ఉద్యోగులు జీతం ఒకేసారి అందుకున్న దాఖలాలు లేవు. సగం జీతం కూడా నెలాఖరున చెల్లిస్తుండడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించలేక డీఫాల్టర్లుగా మారుతున్నారు. ఉద్యోగుల ఆర్థిక అవసరాలకు అండగా ఉండే పీఎఫ్, త్రిఫ్ట్ సొసైటీలకు యాజమాన్యం సకాలంలో నగదు చెల్లించడం లేదు. టౌన్‌షిప్‌లో నివసిస్తున్న కార్మికులకు విద్యుత్ చార్జీల పెంపు, పీఆర్‌పీ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ తాత్కాలికంగా నిలుపుదల వంటి అనేక చర్యలకు దిగింది. వీటన్నింటిపై ఏ ఒక్క రోజు కూడా కూటమి నేతలు కార్మికుల పక్షాన నిలబడి మాట్లాడిన దాఖలాలు లేవు.

జగన్ చెప్పిందే నిజమవుతోంది..

వాస్తవానికి ఎన్నికల ముందు గాజువాకలో జరిగిన సభలో అప్పటి ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ... గాజువాక అసెంబ్లీ, విశాఖ పార్లమెంటు సీట్లల్లో టీడీపీకి ఓటు వేయడం అంటే స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణకు ఓటు వేయడమేనని స్పష్టంగా తేల్చి చెప్పారు. రాష్ట్రంలో గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ వచ్చి గెలుపొందారు. ఆ తర్వాత స్టీలు ప్లాంట్ ఉన్న నియోజకవర్గంలో తమకు వచ్చిన భారీ మెజార్టీ ధైర్యంతోనే ప్రైవేటీకరణ ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయని అర్థమవుతోంది. ప్రతి రోజూ ఏదో ఒక సమస్యతో కార్మికులు, ఉద్యోగులు పోరుబాట పడుతున్నప్పటికీ కూటమి నేతలెవ్వరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

పరిస్థితి తారుమారు

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్ పరిస్థితి తారుమారైందని స్పష్టంగా కనిపిస్తోంది. తెలుగుదేశం మద్దతుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ ఎన్డీయే సర్కారు వరుస నిర్ణయాలతో స్టీల్ ప్లాంట్‌ను దివాలా దిశగా తీసుకెళ్తోంది. ఇందుకు రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. ముందుగా మూల ధనం సమీకరణ పేరుతో ఆస్తుల వేలానికి సిద్ధమైంది.
- ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఉన్న ఖరీదైన భవనాలు, స్టాక్ యార్డుల విక్రయానికి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మొత్తం ఆస్తుల మార్కెట్ విలువ రూ.476.18 కోట్లుగా లెక్కగట్టింది. ఆ వెంటనే ఉత్పత్తిని తగ్గించే కుట్రలో భాగంగా రెండు నెలల క్రితం బ్లాస్ట్ ఫర్నేస్-1ను మూసివేసింది.
- స్టీల్ ప్లాంట్‌కు ఏటా 73 లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. కానీ సంస్థ నిర్వీర్యం చేయడానికి బ్లాస్ట్ ఫర్నేస్-1ను మూసేసిన కూటమి ప్రభుత్వం.. గత నెలలో బొగ్గు కొరతను కారణంగా చూపిస్తూ... బ్లాస్ట్ ఫర్నేస్-3ని బ్లోడౌన్ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం బ్లాస్ట్ ఫర్నేస్-2 ద్వారా మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. సాధారణంగా ఒక్కో బ్లాస్ట్ ఫర్నేస్ నుంచి రోజుకు 7 వేల టన్నుల ఉత్పత్తికి అవకాశమున్నప్పటికీ.. బీఎస్-2 ద్వారా కేవలం 4 నుంచి 5 వేల టన్నులు స్టీల్‌ను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు.
- మరో వైపు సుమారు 4 వేల మంది ఉద్యోగులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపించడానికి రూ.1,261 కోట్లు కేటాయించింది. రాత్రికి రాత్రి రేపటి నుంచి ఉద్యోగాల్లోకి రావద్దంటూ కార్మికులకు కబురు పంపింది. అయితే, కార్మికుల నుంచి వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా స్టీలు ప్లాంటు యాజమాన్యం వెనక్కు తగ్గింది. మరోవైపు 500 మంది ప్లాంట్ అధికారులను ఛత్తీస్‌గఢ్‌లోని నగర్‌నార్ స్టీల్ ప్లాంటుకు డిప్యూటేషన్‌పై పంపాలని తీర్మానించారు. వీరితో పాటు 25 శాతం మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తగ్గించాలని నిర్ణయించారు.
- మరోవైపు జనసేన నేత బొలిశెట్టి సత్య నోటి దురుసుతో అసలు ప్రైవేటీకరణకు కారణం కార్మికులే అని నేరుగా విమర్శలు గుప్పిస్తున్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఆ వ్యాఖ్యలను ఆ పార్టీకి చెందిన ఏ ఒక్కరూ ఖండించలేదు. పైగా పవన్ కళ్యాణ్ మౌనం కాస్తా ఇదే తమ పార్టీ స్టాండ్ అనే రీతిలో ప్రజలకు అర్థమవుతోంది.



విశాఖ స్టీలు ప్లాంట్ ప్రైవేటీకరణను నిలవరించలేని జగన్.. రాజీనామా చెయ్యి.
- 2021 ఫిబ్రవరి 16న పల్లా శ్రీనివాసరావు దీక్షలో చంద్రబాబు



విశాఖలో పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తా. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటా.
- 2024, ఏప్రిల్ 14న గాజువాక ప్రజాగళం సభలో చంద్రబాబు



స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం వారంలో అఖిలపక్షం పెట్టాలి.. 2021 అక్టోబర్ 31 స్టీల్ ప్లాంట్ వద్ద జరిగిన బహిరంగ సభలో పవన్



వాజపేయి హయాంలో స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోతే నేనే అడ్డుకున్నా. కేంద్రం నుంచి ఆర్థిక సాయం రాబట్టి ఫ్యాక్టరీని ఆదుకున్నాం. ఇప్పుడూ కాపాడుకుంటాం. - 2024 జూలై 12న అనకాపల్లి జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు



గతంలో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నేనే కాపాడాను. భవిష్యత్తులోనూ కాపాడతాను. త్వరలోనే ఉక్కు కర్మాగారం ఉద్యోగులతో మాట్లాడతా. - 2024 ఆగస్టు 3న విశాఖ ఉక్కు కర్మాగారం యూనియన్ నాయకులతో సీఎం చంద్రబాబు



విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానివ్వం. గతంలోనే నాతో కలిసి రండి, ఢిల్లీకి తీసుకువెళ్తానన్నాను. ప్రైవేటీకరణ ఆపడం నా ఒక్కడి చేతిలో లేదు. మీరంతా కలిసి రావాలి. ఇక్కడ కూటమి అభ్యర్థిని గెలిపిస్తే ఢిల్లీలో మన వాణి బలంగా వినిపిస్తారు.
- 2024 ఏప్రిల్ 7న అనకాపల్లి సభలో జనసేన అధ్యక్షుడు పవన్



వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంపై ఢిల్లీ వెళదామని నేను పిలిస్తే స్పందించారా? విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా మా ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. ప్రైవేటు ఉక్కు కర్మాగారాలన్నీ లాభాల బాటలో నడుస్తుంటే.. విశాఖ ఉక్కు కర్మాగారం ఇలా భ్రష్టు పట్టడానికి కారణమేంటో యాజమాన్యం, సిబ్బంది ఆలోచించుకోవాలి. విశాఖ ఉక్కును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చేయాల్సిందంతా చేస్తోంది.
- 2024 సెప్టెంబర్ 17న సచివాలయంలో మీడియాతో సీఎం చంద్రబాబు



5 కోట్ల మంది రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు తీర్చాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరుతాను. విశాఖ ఉక్కు కర్మాగారం, రైల్వే జోన్, యువతకు ఉపాధి కల్పన అంశాలపై ఆయనతో మాట్లాడతా.
- 2024 జూలై 16న మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



విశాఖ ఉక్కుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి 2021 మార్చి 18న వీడియో సందేశంలో పవన్



ఉక్కు ఫ్యాక్టరీపై వైఎస్సార్‌సీపీ తన అభిప్రాయం చెప్పడానికి వారం రోజులు గడువిస్తున్నా.. - 2021 అక్టోబర్ 31న విశాఖలో జనసేన నిర్వహించిన బహిరంగ సభలో పవన్ కళ్యాణ్

‘శ్రీవారి’ పాదయాత్రికుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



తిరుపతి కల్చరల్ : అందరూ బాగుండాలి అన్న నినాదంతో కొత్తగూడేనికి చెందిన త్రివేణి-కృష్ణవేణి విద్యాసంస్థల అధినేత జి.వీరేంద్రచౌదరి భద్రాచలం నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్రకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లభించింది. ఈ మేరకు ఏడో యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయనకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధి డాక్టర్ పుష్కర్ కుమరం మెడల్, నమోదు పత్రాలను అందించారు. డాక్టర్ పుష్కర్ కుమరం మాట్లాడుతూ సమాజ హితం కోరుతూ ఏడు పర్యాయాలు భద్రాచలం నుంచి తిరుమలకు 19 రోజుల్లో 619 కిలోమీటర్లు స్పీడ్ వాక్ చేయడాన్ని గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించినట్టు తెలిపారు. వీరేంద్రచౌదరి మాట్లాడుతూ 2004లో తమ పాదయాత్రను భద్రాచలం రామాలయం నుంచి తిరుమల శ్రీవారి ఆలయం వరకు 11 మందితో చేపట్టినట్టు తెలిపారు. ఇలా ప్రతి లీపు సంవత్సరంలో యాత్రతో ఏడు సార్లు పాదయాత్రను చేపట్టినట్టు చెప్పారు. మొన్న చేపట్టిన ఏడో పాదయాత్ర ముగింపుతో శ్రీవారిని దర్శించుకుని టీటీడీ నిత్య అన్నదానం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం ఇచ్చినట్టు తెలిపారు.

ఫేక్ వీడియోలతో అసత్య ప్రచారం చేస్తున్నారు

యూట్యూబర్‌పై దేవదాయ శాఖ మాజీ ఏసీ శాంతి ఫిర్యాదు



తాడేపల్లి రూరల్ : తనపై ఫేక్ వీడియోలతో అసత్య ప్రచారం చేస్తున్నారంటూ దేవదాయ శాఖ మాజీ అసిస్టెంట్ కమిషనర్ శాంతి యూట్యూబర్ దాసరి విజ్ఞాన్‌పై బుధవారం రాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె తరఫున హైకోర్టు న్యాయవాది అంకాల పృథ్వీరాజు విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ అసిస్టెంట్ కమిషనర్ శాంతిపై సోషల్ మీడియా, కొన్ని పత్రికల్లో, యూట్యూబ్‌లలో మార్ఫింగ్ చేసి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. దీంతో హైకోర్టును ఆశ్రయించి ఈ ఏడాది జూన్ 20న గాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి పత్రికల్లో, మీడియాల్లో ఆమెపై ఎలాంటి ప్రచారం జరగలేదని, అయినా ఇప్పటికీ కొందరు సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పలు కేసులు ఉన్న యూ ట్యూబర్ దాసరి విజ్ఞాన్ సినీ క్రియేషన్ పేరుతో ఆగస్టు 5 నుంచి పలు ఫేక్ వీడియోలతో అసత్య ప్రచారం చేశారన్నారు. కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ ఇలాంటి ప్రచారం చేయడంతో బాధితురాలు శాంతి తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకున్నారని చెప్పారు.

స్వర్ణరథంపై సప్తగిరీశుని దివ్యదర్శనం

ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనం

మూడు వాహన సేవల్లో దర్శనమిచ్చిన మలయప్ప

తిరుమల: తిరుమలేశుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు బుధవారం స్వర్ణరథోత్సవం వైభవంగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప బంగారు కాంతులీనే స్వర్ణరథంపై ఊరేగుతూ భక్తకోటికి తన దివ్యమంగళ రూప దర్శనంతో సాక్షాత్కరించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు స్వర్ణరథోత్సవం ఊరేగింపు వైభవంగా సాగింది. ఈ సేవను తిలకిస్తూ భక్తులు హారతులు పట్టడం విశేషం.

ఉదయం భక్తశిఖామణిపై శ్రీరామచంద్రుడు.. రాత్రి గజరాజుపై రారాజు దర్శనం

బుధవారం ఉదయం శ్రీరామచంద్రుని రూపంలో మలయప్ప స్వామి తన భక్తశిఖామణి హనుమంతుని వాహనంగా మలుచుకుని ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి గజ వాహనంపై శ్రీనివాసుడు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీనివాసుడు గజ వాహనంపై ఆశీనుడై రాజసంగా నాలుగు మాడ వీధుల్లో సంచరించి భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ గరుడ వాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. టీటీడీ ఉద్యోగులు, విజిలెన్స్, పోలీసులు, సిబ్బంది సమష్టిగా పనిచేసి వాహన సేవల్ని వైభవంగా నిర్వహించారని కొనియాడారు.



స్వర్ణ రథంపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి

కాళరాత్రి అలంకారంలో శ్రీశైల భ్రమరాంబ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడోరోజు బుధవారం భ్రమరాంబాదేవి కాళరాత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాళరాత్రి అలంకారంలోని అమ్మవారిని ప్రత్యేక వేదికపై ఉంచి అర్చకులు, వేదపండితులు విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లను గజ వాహనంపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం కాళరాత్రి అమ్మవారిని, గజవాహనాధీశులైన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ ఉత్సవం నిర్వహించారు.



నేటి అలంకారం.. శ్రీదుర్గాదేవి

ఇంద్రకీలాద్రి: దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గమ్మ శ్రీదుర్గాదేవిగా దర్శనమివ్వనున్నారు. లోక కంటకుడైన దుర్గామాసురుడిని వధించి దుర్గాదేవిగా ఇంద్రకీలాద్రిపై స్వయంగా శ్రీ అమ్మవారు ఆవిర్భవించింది. ‘దుర్గే దుర్గతినాశని’ అనే వాక్యం భక్తులకు శుభాలను కలుగచేస్తుంది. దివ్యరూపిణి అయిన శ్రీదుర్గమ్మ దర్శనం సకల శ్రేయోదాయకం.



దుర్గమ్మ సన్నిధిలో పోలీసుల క్రౌర్యం

మూలా నక్షత్రం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులు

- క్యూలైన్లలో సామాన్యులపై అడుగడుగునా ఖాకీల జులుం
- చిన్నారులు, వృద్ధులను సైతం లాగిపడేసిన పోలీసులు
- పలువురికి గాయాలు
- ప్రశ్నించిన వారిపై మహిళా పోలీసుల దుర్భాషలు
- వీఐపీల రాకతో భక్తులకు మరిన్ని తిప్పలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): మూలా నక్షత్రం రోజు బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో సామాన్య భక్తులపై పోలీసులు దౌర్జన్యపూరితంగా వ్యవహరించారు. మహిళలు, వృద్ధులు, బాలలని కూడా చూడకుండా లాగిపడేశారు. పోలీసుల క్రౌర్యానికి ఓ బాలుడు, మహిళ గాయపడ్డారు. రౌడీలు, నేరస్తులతో కూడా పోలీసులు ఈ విధంగా వ్యవహరించరని పలువురు భక్తులు మండిపడ్డారు. ఎన్నో ప్రయాసలకోర్చి దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు పోలీసుల చేష్టలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీఐపీ దర్శనాల రద్దు ఉత్తి మాటే!

మూలా నక్షత్రం కావడంతో వీఐపీల దర్శనాలు రద్దు చేశామని, సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తామని అధికారులు, నేతలు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాల సమర్పణ సమయంలో కూడా మూడు క్యూలైన్లలో భక్తులను దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు. అయితే ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా జరిగింది. చంద్రబాబు పట్టు వస్త్రాల సమర్పణ సమయంలోనే 35 నిమిషాలకు పైగా భక్తులకు దర్శనం నిలిపివేశారు. ఉదయం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వచ్చిన సమయంలోనూ క్యూలైన్లు ఆపారు. మిగతా వీఐపీలూ పెద్ద సంఖ్యలో రావడంతో సామాన్య భక్తులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మాటిమాటికీ క్యూలను ఆపడంతో వినాయకుడి గుడి, కుమ్మరిపాలెం సెంటర్‌ల నుంచి క్యూలైన్లలో చంటి బిడ్డలను తీసుకొని వచ్చే భక్తులకు దర్శనానికి దాదాపు 6 గంటల సమయం పట్టింది. వీఐపీలకు తోడు ఉత్సవ కమిటీ సభ్యులు, అధికార పార్టీ నేతల సంబంధీకులు అనేక మంది కింద ఉన్న క్యూలైన్లలో కాకుండా నేరుగా కొండ పైకి చేరుకున్నారు. దీంతో ఓం టర్నింగ్ వద్ద తీవ్ర తోపులాటలు జరిగాయి. మగ పోలీసులే మహిళలను తోసుకుంటూ వెళ్లటం, కొంతమంది కింద పడిపోవటం వంటి ఘటనలు జరిగాయి. ఆ తోపులాటకు కొందరు విలపించారు. ఏటా మూలా నక్షత్రం రోజున భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తారని తెలిసినప్పటికీ, పోలీసుల వద్ద నిర్దిష్టమైన ప్రణాళిక లేకపోవటమే ఈ విధమైన తోపులాటలు, గందరగోళ పరిస్థితులకు కారణమని భక్తులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం కాక పోలీసు స్టేషన్‌లో ఉండే పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆలయంలోని సీనియర్ సిబ్బంది సైతం వ్యాఖ్యానిస్తున్నారు.



ఫ్లైవోవర్ సబ్ వేలో వేచి చూస్తున్న భక్తులు



మహిళలను తోసేస్తున్న పోలీసులు

బాలుడికి, తల్లికి గాయాలు

బుధవారం మూలా నక్షత్రం, సరస్వతి దేవి అలంకారం కావడంతో బెజవాడ దుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం రాత్రి 11 గంటల నుంచే వేలాదిగా భక్తులు వచ్చారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి అనుమతించారు. భక్తులకు అడుగడుగునా పోలీసుల నుంచి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఎక్కడెక్కడి నుంచో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను సౌకర్యవంతంగా క్యూలో పంపించాల్సిన పోలీసులే వారి పట్ల దౌర్జన్యంగా వ్యవహరించారు. ఇదే క్రమంలో హనుమాన్ జంక్షన్ నుంచి వచ్చిన ఒక మహిళ, ఆమె కుమారుడు గాయపడ్డారు.



గాయం చూపుతున్న మహిళ

కొండ కింద నుంచి ఐదు గంటలపాటు క్యూలో నడుచుకుంటూ ఆ మహిళ కుటుంబం అమ్మవారి చెంతకు చేరింది. అదే సమయంలో మహిళా పోలీసులు ఆమెను, ఆమె కుమారుడిని తోసేయడంతో వారిద్దరూ ముందు ఉన్న బారికేడ్‌పై పడిపోయారు. బాలుడి తలకు బారికేడ్ బలంగా తగిలింది. చెవికి తీవ్రమైన గాయమైంది. చెంప వాచింది. ఆ బాలుడు నొప్పితో విలవిల్లాడాడు. మహిళ చేతికి గాయమైంది. ఇదేమిటని ప్రశ్నించిన మహిళపై మహిళా పోలీసులు బూతులతో విరుచుకుపడ్డారు. ఆమె చెయ్యిని గిచ్చినట్లుగా ఆ మహిళ మీడియా వద్ద వాపోయారు. కొండపైన ఉన్న హెల్త్ సెంటర్‌లో సిబ్బంది బాలుడిని పరిశీలించి ఈఎస్‌టీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు.

సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



దసరా ఉత్సవాల్లో కీలకమైన మూలా నక్షత్రం సందర్భంగా బెజవాడ కనక దుర్గ అమ్మవారు బుధవారం సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మ నక్షత్రం చాలా విశిష్టమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో రాష్ట్రం నలుమూలల, ఇతర రాష్ట్రాల నుంచి అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చారు.. భక్త జనుల అజ్ఞానాన్ని పారద్రోలి, జ్ఞానజ్యోతిని వెలిగించే జ్ఞాన ప్రదాయినిగా అమ్మవారిని భక్తులు కొలుస్తారు. అమ్మవారి స్తోత్రాలు, ఓంకార మంత్రంతో ఇంద్రకీలాద్రి మార్మోగింది. సాయంత్రం నగరోత్సవం కనులపండువగా జరిగింది. కనకదుర్గా నగర్‌లో కళావేదికపై ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకొన్నాయి. బుధవారం 2 లక్షల మంది పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నట్లు అంచనా వేస్తున్నారు.

‘పద్మభూషణ్’ డాక్టర్ వేణుగోపాల్ కన్నుమూత



రాజమహేంద్రవరం రూరల్: న్యూఢిల్లీలోని ఎయిమ్స్ మాజీ డైరెక్టర్, దేశంలో మొదటి గుండె మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించిన డాక్టర్ పాణింగిపల్లి వేణుగోపాల్ (82) మంగళవారం న్యూఢిల్లీలో కన్నుమూశారు. రాజమహేంద్రవరంలోజన్మించిన ఆయన ఇక్కడే డిగ్రీ పూర్తిచేశారు. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదివి, చండీఘడ్‌లో ఎంఎస్, అమెరికాలోని టెక్సాస్ ఇనిస్టిట్యూట్‌లో కార్డియోథొరాసిక్ సర్జరీ కోర్సు చదివారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో కార్డియోథొరాసిక్ విభాగాన్ని ప్రారంభించారు. 1994లో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి గుండెను తీసి దేవీరామ్ అనే వ్యక్తికి అమర్చారు. ఇది దేశంలో మొదటి గుండెమార్పిడి శస్త్రచికిత్స. 1998లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేసింది. ఆయన బెంగళూరులో స్థిరపడ్డారు.

ఆలయ ఆగమాలు, ఆచారాల్లో జోక్యం వద్దు

- ఆ విషయాల్లో నిర్ణయాలకు సీనియర్ అర్చకుల అభిప్రాయాలే కీలకం
- అవసరమైతే ఈఓ. వైదిక కమిటీలను ఏర్పాటు చేసుకోవచ్చు
- దేవదాయ శాఖ కమిషనర్ సహా ఆలయ ఈవోలకు ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: ఆలయాల ఆగమ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల్లో దేవదాయ శాఖ కమిషనర్ సహా ఆలయ ఈవో, తదితర అధికారులెవ్వరూ జోక్యం చేసుకోవద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వైదిక ఆగమ విషయాల్లో ఆలయాలకు స్వయం ప్రతిపత్తిని నిర్ధారించడానికి 1987 నాటి దేవదాయ శాఖ చట్టంలోని సెక్షన్-13(1)కి అనుగుణంగా అధికారులు ఆలయాల ఆచారాలు, సంప్రదాయాల పవిత్రతకు ఎలాంటి భంగం కలగకుండా ఉండేందుకు చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ ఆదేశాలు జారీచేస్తున్నట్లు దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సత్యనారాయణ బుధవారం జీఓ-223ను జారీచేశారు. వివిధ ఆలయాల్లో స్వామివార్లకు నిర్వహించే సేవలకు సంబంధించిన విధానాలు.. యాగాలు, కుంభాభిషేకాలు, ఇతర ఉత్సవాల నిర్వహణ వంటి విషయాలపై నిర్ణయాలు తీసుకోవడానికి అక్కడి సీనియర్ అర్చకులు, ఇతర మతపరమైన సిబ్బంది అభిప్రాయాలే పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఈఓ. వైదిక కమిటీలను ఏర్పాటుచేసుకోవచ్చని ఆయన ఆ ఉత్తర్వుల్లో సూచించారు. ఏదైనా సందేహం, అభిప్రాయభేదం ఏర్పడితే ప్రఖ్యాత పీఠాధిపతులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి అంశాల్లో ఏ ఆలయానికి ఆ ఆలయం లేదా ఇతర దేవదాయ ధార్మిక సంస్థలు ఒక స్వతంత్ర సంస్థగా పరిగణించబడతాయన్నారు. అలాగే, ఒకే రకమైన ఆగమాలకు సంబంధించిన ఆలయాలు, ధార్మిక సంస్థలైనప్పటికీ సంబంధిత ఆలయ ఆచారాలు, సంప్రదాయాలకు భిన్నంగా వేరొక ఆలయ సంప్రదాయాలు పాటించాలనిలేదని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

బ్రౌన్ ‘బంగారం’!



పత్తిని తెల్లబంగారం అంటున్నాం.. ఇక ముందు బ్రౌన్ బంగారం అని కూడా పిలవాల్సి వస్తుందేమో. ఎందుకంటే బ్రౌన్ కాటన్ కూడా త్వరలో మార్కెట్‌లోకి రాబోతోంది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన కొందరు రైతులు ఈ ఏడాది ప్రయోగాత్మకంగా బ్రౌన్ కాటన్ సాగు చేశారు. యువ రైతు బాపతు శశిధర్‌రెడ్డి ఐదెకరాల్లో ఎన్‌ఎస్‌ఎల్‌కు చెందిన ఆద్య రకం బ్రౌన్ కాటన్ సాగును చేపట్టారు. అతనితో పాటు మరి కొందరు రైతులూ ఈ ఏడాది బ్రౌన్ కాటన్ వైపు మొగ్గు చూపారు. ఈ రకంపై దిగుబడి అధికంగా రావడంతో పాటు మార్కెట్ రేటుపై 25 శాతం అధికానికి కొనుగోలు చేస్తారు. ఈ సీజన్‌లో ఇప్పుడిప్పుడే కాయలు పగిలి బ్రౌన్ కాటన్ బయటికొస్తోంది. - ప్రత్తిపాడు

జనవరి నాటికి పల్లె పండుగ పనుల పూర్తి

మార్గదర్శకాలు జారీ చేసిన గ్రామీణాభివృద్ధి శాఖ

సాక్షి, అమరావతి: పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు పేరిట ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రామాల్లో కొత్తగా చేపట్టే పనులను జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణతేజ ఆదేశించారు. దీనికి సంబంధించి గ్రామీణాభివృద్ధి శాఖ బుధవారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ పనులు తప్పనిసరిగా ఉపాధి హామీ పథకం నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, గ్రామ పంచాయతీ లేదా మండల, జిల్లా పరిషత్ ఆమోదం పొంది ఉండాలని ఆ ఆదేశాల్లో సూచించారు. పనులు చేపట్టే ప్రాంతం జియో ట్యాగింగ్ సహా అన్ని వివరాలను ‘పీఆర్ వన్’ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పనులకు ఉపయోగించే సిమెంట్‌ను బహిరంగ మార్కెట్‌లో రూ.260-రూ.270 ధరకు గరిష్టంగా 5 మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేసుకోవాలని, మిగిలిన సిమెంట్ ప్రభుత్వ నిర్మాణ పోర్టల్ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఇసుకను ప్రభుత్వ ఆమోదం పొందిన రీచ్‌ల నుంచే సేకరించాలన్నారు. పనులకు సంబంధించిన బిల్లులను ఉపాధి హామీ పథకం నిబంధనలకు అనుగుణంగా క్వాలిటీ కంట్రోల్ నిర్ధారణ, సోషల్ ఆడిట్ నిర్వహణ అనంతరం చెల్లించనున్నట్టు పేర్కొన్నారు.

బర్త్‌డే పార్టీలో డ్రగ్స్!

రాజమహేంద్రవరం సమీపంలో కలకలం

రాజానగరం: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నంలో డ్రగ్స్ వ్యవహారం కలకలం రేపింది. రాజమహేంద్రవరానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో భూపాలపట్నం నుంచి జి.యర్రంపాలెం వెళ్లే రోడ్డులో పుంత రోడ్డును ఆనుకుని ఉండే ఒక గెస్ట్‌హౌస్‌లో రెండు రోజుల క్రితం కొందరు యువకులు పుట్టిన రోజు పార్టీ చేసుకున్నారు. ఈ పార్టీలో డ్రగ్స్‌ను విచ్చలవిడిగా ఉపయోగించారని విశ్వసనీయ సమాచారం. రాజానగరం పోలీసులు 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ ప్రాంతానికి వెళ్లగా.. మత్తులో తూగుతున్న యువకులు వారి కంటపడ్డారు. అదే ప్రాంతంలో నిలిపి ఉంచిన కారులో డ్రగ్స్ మత్తులో ఉన్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అక్కడే రెండు గ్రాముల డ్రగ్స్ కూడా పోలీసులకు దొరికినట్టు సమాచారం. ఈ గెస్ట్‌హౌస్‌ను సినిమా షూటింగ్‌లకు కూడా వినియోగించుకుంటున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. దర్యాప్తు జరుగుతోందని, పూర్తి వివరాలకు సమయం పడుతుందని చెప్పారు. ఏపీలో గెస్ట్‌హౌస్‌లను విలాస పురుషులు డ్రగ్స్ వినియోగానికి అడ్డాగా మార్చుకుంటున్నట్టు చెబుతున్నారు.

కులగణన చేయకుంటే సర్కారును గద్దె దించుతాం

కులగణన కోసం మహాధర్నాలో బీసీ సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: కులగణనపై ఆలస్యం చేస్తే ఊరుకునేది లేదని.. త్వరగా చేయకపోతే ఈ సర్కారును బీసీలు గద్దె దించుతారని బీసీ సంఘాల నేతలు హెచ్చరించారు. కాన్షీరాం వర్ధంతి సందర్భంగా బీఎస్పీ ఆధ్వర్యంలో కులగణన డిమాండ్‌తో విజయవాడ ధర్నాచౌక్ వద్ద బుధవారం మహాధర్నా నిర్వహించారు. రాష్ట్రం నలుమూల నుంచి బీసీ సంఘాల నేతలు పాల్గొని తమ నినాదాన్ని వినిపించారు. టీడీపీ కూటమి ఎన్నికలకు ముందు తన మేనిఫెస్టోలో బీసీలకు చట్టసభల్లో 33, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామనే హామీని ప్రకటించిందని, అది సాకారం కావాలంటే, కోర్టుల్లో కొట్టేయకుండా నిలవాలంటే కులగణన చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జుజ్జవరపు పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక కులగణన చేయకుండా, సర్వేలు, నైపుణ్య గణనలు అంటూ నాటకాలడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి మాట్లాడుతూ కులగణన చేయకపోతే బీసీలు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించి ఈ సర్కారును దింపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీఎస్పీ నాయకులు బందెల గౌతమ్ కుమార్, ఎల్ వందన్ కుమార్, బి పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కాపు సంఘం అధ్యక్షుడు దాసరి రాము ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.



ధర్నా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ బీఎస్పీ నేతలు, బీసీ సంఘాల నాయకులు

దేశంలో టాప్ వర్సిటీ ఐఐఎస్సీ

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ వర్సిటీ ర్యాంకుల విడుదల

సాక్షి, అమరావతి



దేశంలో అగ్రశ్రేణి వర్సిటీగా బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) మరోసారి తన స్థానాన్ని నిలబెట్టుకుంది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ తాజా వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకుల ఓవరాలవిభాగంలో 251–300 మధ్య కొనసాగుతోంది. అయితే, గతేడాదితో 201–250 బాండ్ నుంచి స్వల్పంగా పడిపోయింది. ఫలితంగా వరల్డ్ టాప్–250లోకి ప్రవేశించలేకపోయింది. ఈ క్రమంలో 53.7–55.7 స్కోరు సాధించింది. పరిశోధన, ఇంటెన్సివ్ వర్సిటీలను ఐదు ప్రధాన అంశాల ఆధారంగా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రపంచ ర్యాంకులు కేటాయిస్తోంది. వీటిల్లో బోధన, పరిశోధన వాతావరణం, పరిశోధన నాణ్యత, అంతర్జాతీయ అవుట్‌లుక్, ఇండస్ట్రీ ఆదాయం వంటి అంశాలను పరిశీలిస్తుంది. ఈ ఏడాది 115 దేశాలకు చెందిన 2,092 ఉత్తమ విద్యా సంస్థలకు ర్యాంకులను విడుదల చేసింది. గతేడాదితో పోలిస్తే 185 కొత్త ఎంట్రీలు వచ్చినట్లు పేర్కొంది. ఈ ఏడాది ర్యాంకుల్లో భారతీయ వర్సిటీలు కేవలం మిశ్రమ ఫలితాలు మాత్రమే చూశాయి. బెనారస్ హిందూ వర్సిటీ, భారతియార్ వర్సిటీ, ఐఐటీ గౌహతి వంటివి 2025లో భారతీయ టాప్–10 జాబితా నుంచి చోటుకోల్పోయాయి. ప్రపంచ వేదికపై బలమైన పోటీదారులు ఉండటంతోనే భారతీయ వర్సిటీలు కొంత వెనుకబడినట్లు విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఐఐటీల్లో కేవలం ఇండోర్ ఐఐటీ మాత్రమే మెరుగైన ప్రదర్శన కనబరిచింది.

భారతీయ వర్సిటీల పురోగతి..

అన్నా వర్సిటీ, మహాత్మా గాంధీ వర్సిటీ, సవిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్, శూలినీ వర్సిటీ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ ర్యాంకులను మెరుగుపర్చుకుని 401–500 బాండ్‌లోకి చేరుకున్నాయి. ఈ సంస్థల్లో ప్రతి ఒక్కటి 46–49.2 మధ్య స్కోర్‌ను సాధించాయి. అయినప్పటికీ కొన్ని వర్సిటీలు వెనుకబడ్డాయి. ఇక్కడ జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ ర్యాంకు గతేడాదితో పోలిస్తే తగ్గింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–ఇండోర్, యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ (యూపీఈఎస్)తో కలిసి 501–600 ర్యాంకును పంచుకుంది. ఈ రెండు సంస్థలు గణనీయమైన పురోగతి ప్రదర్శించడం విశేషం. 601–800 బెల్ట్‌లో 14 భారతీయ విద్యా సంస్థలు నిలిచాయి. వీటిల్లో అలీఘర్ ముస్లిం వర్సిటీ, అమిటీ వర్సిటీ, బెనారస్ హిందూ వర్సిటీ, బిట్స్ పిలానీ, చిత్కారా వర్సిటీ, ఐఐటీ పాట్నా, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కేఐఐటీ), లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీ, పంజాబ్ వర్సిటీ, సింబయాసిస్ ఇంటర్నేషనల్ వర్సిటీ, థాపర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, విట్ వర్సిటీ (తమిళనాడు) స్థానం దక్కించుకున్నాయి.

జేఎన్‌టీయూ అనంతపురం.. ఎస్వీయూలకు చోటు..

ఇక 801–1000 మధ్య 22 భారతీయ విద్యా సంస్థలు ఉండగా.. మన రాష్ట్రం నుంచి జేఎన్‌టీయూ అనంతపురం, కేఎల్‌యూ (34.5–38.1)లకు మాత్రమే చోటుదక్కింది. అలాగే, 1,201–1,500 మధ్య 23 సంస్థలు ఉండగా.. తిరుపతి శ్రీ వేంకటేశ్వర వర్సిటీ–ఎస్వీయూ (25.2–30.6)తో పాటు తెలంగాణకు చెందిన ఉస్మానియా, ఎన్ఐటీ–నిట్ (25.2–30.6) ఉంది. 1,501 ప్లస్ విభాగంలో.. ఆచార్య నాగార్జున వర్సిటీ, గీతం, జీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విజ్ఞాన్ (10.5–25.1) నిలిచాయి. ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యలతో సంచలనం సృష్టించిన ఐఐటీ గౌహతి 801–1000 బెల్ట్‌కు దిగజారింది.

అగ్రస్థానంలో ఆక్స్‌ఫర్డ్..

మరోవైపు.. ప్రపంచ అత్యుత్తమ వర్సిటీగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం వరుసగా తొమ్మిదో ఏడాది అగ్రస్థానంలో నిలిచింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)ని ఆరో స్థానానికి నెడుతూ స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ రెండో స్థానానికి చేరుకుంది. ఈ ఏడాది బ్రెజిల్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విద్యా సంస్థలు టాప్–200లో చోటు దక్కించుకోవడం విశేషం. కానీ, ఆస్ట్రేలియాలోని టాప్–5 విశ్వవిద్యాలయాలు ర్యాంకింగ్స్‌లో పడిపోయాయి. చైనా విశ్వవిద్యాలయాలు అద్భుత ప్రదర్శనతో టాప్–10కి చేరువలోకి రావడం విశేషం. యూఎస్, యూకే ఉన్నత విద్యా రంగాల ప్రతిష్ట క్షీణిస్తున్నట్లు టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదికలు స్పష్టంచేస్తున్నాయి.

టాప్–10 భారతీయ విశ్వవిద్యాలయాలు ఇలా..

నెం.	వర్సిటీ	ర్యాంకు	స్కోరు
1.	ఐఐఎస్సీ బెంగళూరు	251-300	53.7-55.7
2.	అన్నా వర్సిటీ (గిండి)	401-500	46-49.2
3.	మహాత్మా గాంధీ వర్సిటీ (కొట్టాయం)	401-500	46-49.2
4.	సవిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్, టెక్నికల్ సైన్సెస్ (చెన్నై)	401-500	46-49.2
5.	శూలిని వర్సిటీ (బజోల్)	401-500	46-49.2
6.	ఐఐటీ ఇండోర్ (సిమ్రోల్)	501-600	43.3-45.9
7.	జామియా మిలియా ఇస్లామియా	501-600	43.3-45.9
8.	యూపీఈఎస్ (డెహ్రాడూన్)	501-600	43.3-45.9
9.	అలీఘర్ ముస్లిం వర్సిటీ (అలీఘర్)	601-800	38.2-43.2
10.	అమిటీ వర్సిటీ (నోయిడా)	601-800	38.2-43.2

ప్రపంచ టాప్–10 వర్సిటీలు ఇలా.. (వర్సిటీ / స్కోరు)

వర్సిటీ	స్కోరు
ఆక్స్‌ఫర్డ్ (యూకే)	98.5
ఎంఐటీ (యూఎస్)	98.1
హార్వర్డ్ (యూఎస్)	97.7
ప్రిన్స్‌టన్ (యూఎస్)	97.5
కేంబ్రిడ్జ్ (యూకే)	97.4
స్టాన్‌ఫోర్డ్ (యూఎస్)	97.2
కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (యూఎస్)	96.3
వర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా (బర్కిలీ)	94.5
ఇంపీరియల్ కాలేజీ ఆఫ్ లండన్	94.4
యేల్ వర్సిటీ (యూఎస్)	94.1

క్లుప్తంగా...

మా ఊరికి మద్యం షాపు వద్దు!

- సాయినగర్ గ్రామ సభ తీర్మానం
- జిల్లా అధికారులకు వినతిపత్రం



డీపీవో సుశీలాదేవికి వినతిపత్రాన్ని అందిస్తున్న సాయినగర్ సర్పంచ్ డీవీ రమణ, స్థానికులు

తిరుపతి అర్బన్: తమ ఊరికి మద్యం షాపు వద్దంటూ ఈనెల 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా తిరుపతి రూరల్ మండలం పరిధిలోని సాయినగర్ గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో ప్రజలు తీర్మానించారు. ఈ మేరకు సాయినగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ డీవీ రమణ బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంతో పాటు జిల్లా పంచాయతీ అధికారి సుశీలా దేవికి వినతిపత్రం అందజేశారు. డీవీ రమణ మాట్లాడుతూ గతంలో 2014–15 సంవత్సరంలో ఒకసారి సాయినగర్ గ్రామపంచాయతీ పరిధిలోని జయనగర్‌లో మద్యం షాపు ఏర్పాటు చేశారన్నారు. ఆ సమయంలో స్థానిక ప్రజలందరూ అనేక రోజులపాటు సదరు మద్యం షాపు తొలగించే వరకు ప్రజా ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. గ్రామసభలో తీర్మానం మేరకు మద్యం షాపులు వద్దని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ఆమోదించామని తెలిపారు. తమ గ్రామపరిధిలో నూతన మద్యం షాపులు ఏర్పాటు చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

కౌలు రైతు ఆత్మహత్య

పల్నాడు జిల్లాలో ఘటన



చిన్నపరెడ్డి(ఫైల్)

అచ్చంపేట: అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పల్నాడు జిల్లా తాళ్లచెరువుకు చెందిన తుమ్మా చిన్నపరెడ్డి(51) తన సొంత భూమి రెండెకరాలకు తోడు మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి, మొక్కజొన్న, మిర్చి వేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి గూడ, పిందె రాలిపోవడంతో దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వర్షాలకు మొక్కజొన్న మొక్కలు నేలవాలాయి. పరిహారం వర్తించదని అధికారులు తేల్చి చెప్పడంతో తీవ్ర ఆందోళనకు లోనయ్యాడు. అప్పులు కూడా రూ.20 లక్షలకు చేరాయి. ఈ ఏడాది పంటలపై దిగుబడి వచ్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్థాపానికి లోనై బుధవారం తన పత్తి చేనుకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య జోస్నతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ కేసు నమోదు చేశారు.

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఆలయ ట్రస్టు బోర్డులో సభ్యుల సంఖ్య పెంపు

ఆలయాల ట్రస్టు బోర్డు నియామకాల్లో ప్రస్తుతం ఉండే సభ్యుల సంఖ్యను మరో ఇద్దరు చొప్పున పెంచేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై గురువారం జరిగే మంత్రి వర్గం సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. పెంచే ఇద్దరేసి సభ్యుల్లో ఒకరిని ప్రత్యేకంగా బ్రాహ్మణ సామాజికవర్గం నుంచే నియమించాలన్న నిబంధనను తీసుకురానున్నారు.

సదరం స్లాట్‌ల విడుదల

సాక్షి, అమరావతి: దివ్యాంగులకు వైకల్యం నిర్ధారిస్తూ సదరం సర్టిఫికెట్‌ల జారీకి బుధవారం వైద్యశాఖ అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించి స్లాట్‌లను విడుదల చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలు, మీ–సేవా కేంద్రాల్లో పౌరులు ఆన్‌లైన్‌లో స్లాట్స్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించింది. స్లాట్‌ల వారీగా ఈనెల 14వ తేదీ నుంచి ఆస్పత్రుల్లో క్యాంప్‌లు నిర్వహించి వైద్యులు స్క్రీనింగ్ నిర్వహించనున్నారు. జీజీహెచ్‌లు, జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో ఎప్పటిలాగానే మంగళ, శుక్రవారాల్లో క్యాంప్‌లు ఉండనున్నాయి. అందుబాటులో ఉన్న స్లాట్‌లకు అనుగుణంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో స్క్రీనింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తారు. ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు స్క్రీనింగ్ క్యాంప్‌ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ ఆదేశాలు జారీ చేసింది.

మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు 11 వరకు పొడిగింపు

సాక్షి, అమరావతి: మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7గంటల వరకు పొడిగించింది. ఈ నెల 12, 13 తేదీల్లో దరఖాస్తులను పరిశీలించనుండగా.. లైసెన్సుల కేటాయింపునకు 14న లాటరీ ప్రక్రియ నిర్వహిస్తారు. 16 నుంచి రాష్ట్రంలో ప్రైవేటు మద్యం దుకాణాలు తెరచుకోనున్నాయి. టెండర్లు పిలిచిన మొత్తం 3,396 మద్యం దుకాణాల కోసం బుధవారం సాయంత్రానికి 57,325 దరఖాస్తులొచ్చాయి. రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసేందుకు నాన్ రిఫండబుల్ డిపాజిట్ల ద్వారా ప్రభుత్వానికి ఇప్పటికే రూ.వేయి కోట్లకుపైగా ఆదాయం లభించింది. కలెక్టర్ల సమక్షంలోనే లాటరీ ద్వారా లైసెన్సులు కేటాయిస్తామని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాంత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఒక్క బిల్లు.. 40 లారీలు



- టీడీపీ ఎమ్మెల్యేల గ్రానైట్ దందా
- ఆడియో లీకేజీతో బయటపడిన చీకటి బాగోతం
- జీరో బిల్లులతో తరలిపోతున్న గ్రానైట్
- ప్రభుత్వాదాయానికి గండికొట్టి జేబులు నింపుకుంటున్న ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ ఎమ్మెల్యేల గ్రానైట్ దందా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒకే బిల్లు.. 40 లారీల తరలింపు అనే చందంగా సాగిపోతోంది. పొరుగు రాష్ట్రాలకు వెళ్లే గ్రానైట్ కంటైనర్లకు బిల్లు తప్పనిసరిగా చూపించాలి. అయితే.. ప్రతి కంటైనర్‌కు బిల్లు తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ, జీఎస్టీ కింద రూ.40 వేలు చెల్లించాలి. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకుల అండదండలతో ఒక కంటైనర్‌కు మాత్రమే బిల్లు చెల్లించి.. దానినే చూపిస్తూ సుమారు 40 కంటైనర్లను పొరుగు రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ఇలా తమిళనాడు, తెలంగాణకు రోజుకు 150కి పైగా కంటైనర్లు అక్రమంగా తరలిపోతున్నాయని విశ్వసనీయ సమాచారం. రోజూ అక్రమ రవాణాదారులు ఒక్కో కంటైనర్‌కు రూ.15 వేల లెక్కన.. టీడీపీ నేతలకు కప్పం కడుతున్నట్టు తెలుస్తోంది. టీడీపీ పెద్దలు జేబులు నింపుకోవడం కోసం ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్ల మేర గండి కొడుతున్నారని సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆడియో లీక్‌తో బండారం బట్టబయలు

గ్రానైట్ అక్రమ రవాణాలో ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు సాగిస్తున్న వసూళ్ల వ్యవహారంపై బయటకొచ్చిన ఆడియో కలకలం సృష్టిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఓ ఎమ్మెల్యే రూ.కోట్లు సంపాదిస్తుంటే.. ఇంకో ఎమ్మెల్యే అంతకంటే ఎక్కువ సంపాదిస్తున్నాడని ఆ పార్టీ కార్యకర్తలే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. జిల్లా నడిబొడ్డున ఉన్న చీమకుర్తి నుంచి కృష్ణపట్నం పోర్టు, హైదరాబాద్, బెంగళూరుకు కొందరు వ్యాపారులు అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్నారు. ఒంగోలు, సింగరాయకొండ మీదుగా కృష్ణపట్నం వైపు.. పొదిలి, మార్కాపురం, యర్రగొండపాలెంల మీదుగా హైదరాబాద్ వైపు అక్రమ రవాణా సాగిపోతోంది. బేస్తవారిపేట జంక్షన్, రాచర్ల, గిద్దలూరు మీదుగా బెంగళూరు తరలిస్తున్నారు. ఈ మూడు రహదారులపై టీడీపీ ఎమ్మెల్యేల అనుచరులు పట్టుబిగించారు.

రూట్లను వేలం వేసి మరీ..

ఒక్కో రూట్‌ను ఎమ్మెల్యే మనుషులు రూ.40 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు వేలం నిర్వహించి మరీ పంచుకున్నారు. వేలం సొమ్మును ఎమ్మెల్యేకు ముట్టచెబుతున్నారు. ఈ క్రమంలో ఎవరైనా ఆ మార్గాల్లో గ్రానైట్ తరలించాలంటే టీడీపీ ట్యాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఇటీవల మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అనుచరులు చీమకుర్తి కంపెనీల వద్ద గల లారీల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే పేరు చెప్పి నగదు వసూలు చేయడం మొదలెట్టారు. ఈ విషయంలో టీడీపీకే చెందిన మరో వ్యాపారి తాను కంపెనీకి బిల్లు చెల్లించానని, కనుక డబ్బులు ఇవ్వనని వారికి స్పష్టం చేశారు. దాంతో వారి మధ్య వివాదం చోటుచేసుకొంది. పొదిలి ఎస్సై వేమన, తాడివారిపల్లిలో బ్రహ్మనాయుడు, గిద్దలూరులో రామకోటయ్య, మార్కాపురంలో సుబ్బారావు ఉన్నారని, ఎలాంటి ఇబ్బంది ఉండదని, బండి చేయి దాటిపోతే మాత్రం విమానం ఎక్కిస్తానంటూ కందుల అనుచరులు బెదిరింపులకు దిగడం కలకలం సృష్టించింది. ఈ మొత్తం వివాదాన్ని సదరు వ్యక్తి రికార్డు చేసి ఆడియో విడుదల చేయడంతో గ్రానైట్ రవాణాలో జీరో వ్యాపారం వెనుక ఉన్న టీడీపీ ఎమ్మెల్యేల ముసుగు తొలిగింది.

ఇతర ఎమ్మెల్యేలకూ వాటాలు

మార్కాపురం ఎమ్మెల్యే కందుల మాత్రమే కాకుండా ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలకు కూడా ఈ దందాలో వాటాలు ముడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మంగళవారం ఒంగోలులో జరిగిన స్వర్ణాంధ్ర విజన్ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు వచ్చిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని గ్రానైట్ దందాపై ప్రశ్నించిన మీడియా ప్రతినిధిపై చిందులు తొక్కారు. కుక్కలు మొరుగుతుంటాయంటూ నోరుపారేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగినప్పుడు ఒక్కడు కూడా రాయలేదని ఎదురుదాడికి ప్రయత్నించారు. గ్రానైట్ అక్రమ రవాణాలో పోలీసుల పాత్ర ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు.




వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌తో హిందూపురం నేతలు

తిరిగి వైఎస్సార్‌సీపీలోకి ఆ నలుగురు కౌన్సిలర్లు

- ఇక బెదిరింపులకు తలొగ్గం.. తప్పు తెలుసుకున్నాం
- వైఎస్ జగన్‌తో హిందూపురం నేతలు

సాక్షి, అమరావతి: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన నలుగురు కౌన్సిలర్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. బుధవారం వారు ఆ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్, హిందూపురం సమన్వయకర్త దీపికతో కలిసి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే హిందూపురం మునిసిపాలిటీలో కౌన్సిలర్లను భయపెట్టి, మభ్యపెట్టి ఆ పార్టీలో చేర్చుకుని మునిసిపల్ చైర్మన్ స్థానం దక్కించుకునేందుకు కుట్ర పన్నారని చెప్పారు. అధికార పార్టీ నేతల ప్రలోభాలు, బెదిరింపులకు తామిక తలొగ్గేదిలేదని, ప్రజల పక్షాన నిలబడి వైఎస్సార్‌సీపీ వెంటే నడుస్తామని కౌన్సిలర్లు మల్లిఖార్జున, పరుశురాముడు, రహమత్‌బీ, మణిలు స్పష్టం చేశారు. అనంతరం మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్ మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై నమ్మకంతో తిరిగి ఆ నలుగురు కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీలోకి వచ్చారని చెప్పారు. వారిని సాదరంగా ఆహ్వానిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. నాలుగు నెలల్లోనే కూటమి ప్రభుత్వం అన్నింటా వైఫల్యం చెందిందని.. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల మాన ప్రాణాలకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రశ్నిస్తుంటామని తేల్చి చెప్పారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తమ ఊపిరి ఉన్నంత వరకు జగనన్న వెంటే ఉంటామని, పార్టీ కోసం శ్రమిస్తామని స్పష్టం చేశారు.



- మొన్నటి సాధారణ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా ఫలితాలపై ఏడీఆర్, వీడీఎఫ్ అనుమానాలు
- ఏపీలో పార్లమెంట్ సీట్ల లెక్కింపుల్లో.. పోలైన ఓట్లకంటే 49 లక్షల ఓట్లు పెరిగాయన్న వీడీఎఫ్
- ఆ రెండు సంస్థలు వ్యక్తం చేసిన అనుమానాలను ఇప్పటికీ నివృత్తి చేయని ఈసీ

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎంలు) పనితీరుపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజికవేత్తల నుంచి సాధారణ ప్రజల వరకూ వ్యక్తం చేస్తున్న అనుమానాలను తాజాగా వెల్లడైన హరియాణా ఎన్నికల ఫలితాలు మరింత పెంచాయి. అత్యధిక ఓటింగ్ శాతంతో అత్యధిక ఓట్లు పొందిన కాంగ్రెస్ పార్టీ 37 స్థానాలకు పరిమితం కాగా ఆ పార్టీ కంటే తక్కువ ఓట్లు వచ్చిన బీజేపీకి 48 సీట్లు రావడంతో ఈ సందేహాలు మరింత పెరిగాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంల వినియోగానికి సంబంధించి పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు హరియాణా ఎన్నికల ఫలితాల అనంతరం ఈ అనుమానాలు బలపడటంతో ప్రజాస్వామ్య పరిరక్షణకు బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్ దేశవ్యాప్తంగా పెరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లకు, లెక్కింపులో వచ్చిన ఓట్లకు మధ్య భారీ తేడాలు ఉన్నట్లు వోట్ ఫర్ డెమొక్రసీ (వీఎఫ్‌డీ), అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థలు ఆధారాలతో సహితంగా బహిర్గతం చేసిన విషయం తెలిసిందే. వైఎస్సార్ సీపీ కూడా ఈవీఎంల పనితీరుపై పలు సందేహాలను వ్యక్తం చేయడం విదితమే.

భారీగా పెరిగిన పోలింగ్ శాతం

ప్రతి ఎన్నికల్లో పోలింగ్ రోజు ఈసీ ప్రాథమికంగా పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తుంది. ఆ తర్వాత రోజు తుది శాతాలను ప్రకటిస్తుంది. అయితే ఈసారి పోలింగ్ తుది శాతాన్ని ప్రకటించేందుకు ఏకంగా నాలుగు రోజుల సమయం తీసుకుంది. అందులోనూ ప్రాథమికంగా పోలైన ఓట్లకు, తుది ఓట్లకు మధ్య భారీ తేడాలు ఉన్నాయి. ఇలా తుది శాతాల ప్రకటనకు సుదీర్ఘ సమయం తీసుకోవడం, భారీ తేడాలు రావడంతో అనుమానాలకు బీజం పడింది. మే 13న రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. ఆరోజు రాత్రి 8 గంటలకు తొలుత పోలింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం ప్రకటించింది. తుది శాతాన్ని నాలుగు రోజులు ఆలస్యంగా మే 17న ప్రకటించింది. రాష్ట్రంలో ఈ రెండు పోలింగ్ శాతాల మధ్య 12.54 శాతం పెరుగుదల ఉంది. రాష్ట్రంలో పోలైన ఓట్లలో ఏకంగా 49 లక్షల ఓట్లు అదనంగా పెరిగాయి. రాష్ట్రంలోని 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో సగటున 1.96 లక్షల ఓట్లు అదనంగా పోలయ్యాయి. ఇది ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని వోట్ ఫర్ డెమొక్రసీ (వీఎఫ్‌డీ) సంస్థ స్పష్టం చేసింది.

దేశవ్యాప్తంగా 538 స్థానాల్లో తేడాలు..

దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 538 ఎంపీ స్థానాల్లో పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్లకు మధ్య భారీ తేడాలు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), వీఎఫ్‌డీ సంస్థలు పేర్కొన్నాయి. 362 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే 5,54,598 ఓట్లను తక్కువగా లెక్కించినట్లు తమ అధ్యయనంలో వెల్లడైందని తెలిపాయి. 176 లోక్‌సభ స్థానాల్లో 35,093 ఓట్లకుపైగా అదనంగా లెక్కించారని వెల్లడించాయి. పోలైన ఓట్ల ప్రకారం చూస్తే ఏపీలో కూటమికి 14, వైఎస్సార్‌సీపీకి 11 లోక్‌సభ స్థానాలు దక్కాలని వీడీఎఫ్ స్పష్టం చేసింది. తమ అధ్యయన నివేదికలను ఎన్నికల సంఘానికి కూడా పంపాయి. పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటానికి కారణాలు ఏమిటో వెల్లడించాలని ఏడీఆర్, వీఎఫ్‌డీ సంస్థల ప్రతినిధులు ఎన్నికల సంఘాన్ని అప్పట్లోనే ప్రశ్నించారు. కానీ.. ఎన్నికల సంఘం ఇప్పటికీ దీనిపై స్పందించకపోవడం గమనార్హం.

ఈసీ మౌనంతో పెరుగుతున్న అనుమానాలు

ఈవీఎంలపై తలెత్తిన సందేహాలను నివృత్తి చేయాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తొలి నుంచీ మౌనం వహిస్తుండటం అనుమానాలను మరింత పెంచుతోంది. ఫలితాలు వెల్లడైన వెంటనే అప్‌లోడ్ చేయాల్సిన ఫారం– 20 వివరాలపై తీవ్ర జాప్యం చేయడం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. ఫారం – 20లో ఆయా అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రతి అభ్యర్థికి పోలైన ఓట్ల వివరాలు ఉంటాయి. దీని ద్వారా ప్రతి నియోజకవర్గంలో పోటీ చేసిన ఒక్కో అభ్యర్థికి ఎన్ని ఓట్లు పోలయ్యాయి? లెక్కింపులో ఎన్ని ఓట్లు వచ్చాయి? అనేది తెలిసిపోతుంది. సాధారణంగా ఫారం–20ని ఓట్ల లెక్కింపు జరిగిన వారం రోజుల్లోనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. అయితే ఎన్నికల సంఘం ఈసారి ఈ వివరాలను వెంటనే వెల్లడించలేదు. ఎన్నికల కౌంటింగ్ జరిగిన 108 రోజుల తర్వాత తాపీగా గత నెల 19న నియోజకవర్గాలవారీగా పార్లమెంటు, శాసన సభ స్థానాలకు లెక్కించిన ఓట్ల వివరాలతో ఫారం-20ని 'సీఈవో ఆంధ్ర' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఇంత ఆలస్యంగా వెల్లడించడంపై అనుమానాలు ముసురుకుంటున్నాయి.

ఏపీ జెన్‌కోలో డైరెక్టర్ పోస్టులకు మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ జెన్‌కో)లో ఐదు డైరెక్టర్ పోస్టుల భర్తీకి మార్గదర్శకాలను విడుదల చేస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫైనాన్స్ అండ్ కమర్షియల్, థర్మల్, హైడల్, కోల్ అండ్ లాజిస్టిక్స్, హెచ్‌ఆర్ అండ్ ఐఆర్ విభాగాలకు కొత్త డైరెక్టర్లను నియమించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పోస్టుకు దానికి తగ్గట్లుగా వేర్వేరు అర్హతలను నిర్ణయించారు. అయితే, ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్, ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ తదితర సర్వీసుల్లో పనిచేస్తున్న వారికి ఫైనాన్స్, కమర్షియల్ డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్హత నుంచి మినహాయింపునిచ్చారు. మిగతా వారికి ఈ పోస్టుతో పాటు ప్రతి పోస్టుకు సంబంధిత రంగంలో 25 ఏళ్ల వృత్తి అనుభవం ఉండాలనేది ప్రాథమిక నిబంధన. ఇందులో 15 ఏళ్ల పాటు థర్మల్, హైడల్ కేంద్రాల్లో పనిచేసి ఉండాలని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్, సూపరింటెండెంట్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్, చీఫ్ జనరల్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా వాటి అనుబంధ సంస్థల్లో మూడేళ్ల పాటు సీనియర్ అధికారిగా పనిచేసి ఉండాలని పేర్కొన్నారు.

టీడీపీలో చేరిన మోపిదేవి, బీద మస్తాన్‌రావు

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీలు మోపిదేవి వెంకట రమణారావు, బీద మస్తాన్‌రావు టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని తన నివాసంలో సీఎం చంద్రబాబు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైజాగ్‌లో టీసీఎస్ సెంటర్

లోకేశ్ ట్వీట్

సాక్షి, అమరావతి: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వైజాగ్‌లో డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' లో ప్రకటించారు. మంగళవారం ముంబైలో టాటా గ్రూపు చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో కలిసిన తర్వాత బుధవారం ఒక భారీ ప్రకటన ఉంటుందంటూ ఆయన ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. దానికి కొనసాగింపుగా విశాఖలో 10,000 సీటింగ్ సామర్థ్యంతో డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు బుధవారం ట్వీట్ చేశారు. వ్యాపారం ప్రారంభించడానికి ఏపీ మొదటిస్థానంలో ఉంటుందనడానికి టీసీఎస్ రాక ఓ కీలకమైన ఘట్టమని అభివర్ణించారు. ఇదిలా ఉండగా.. ఇందుకు సంబంధించి టీసీఎస్ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. టీసీఎస్ బుధవారం విండ్ ఎనర్జీ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందే కానీ డెవలప్‌మెంట్ సెంటర్ గురించి ఎటువంటి ప్రకటన చేయలేదు.

2022లోనే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు టాటాసన్స్ చైర్మన్ ఆసక్తి..

టాటాసన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ 2022 సెప్టెంబర్ 21న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో భేటీ అయ్యి రాష్ట్రంలో పెట్టుబడులపై ఆసక్తిని వ్యక్తం చేశారు. అప్పటికే విశాఖలో ఇన్ఫోసిస్ తన కార్యకలాపాలను ప్రారంభించడంతో అదే బాటలో టీసీఎస్, విప్రో తదితర ప్రముఖ సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించడానికి ప్రభుత్వంతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. వాస్తవం ఇది కాగా తమ హయాంలోనే టీసీఎస్ విశాఖకు వస్తుందని లోకేశ్ ట్వీట్ చేయడంపై సెటైర్లు పడుతున్నాయి.

వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి



తమను విధుల్లోకి తీసుకోవాలని విశాఖపట్నంలో వలంటీర్ల ర్యాలీ

సాక్షి, అమరావతి: గ్రామ వార్డు సచివాలయాల వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు.. తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలు జిల్లాల్లో బుధవారం వలంటీర్లు మరో విడత ఆందోళనకు దిగారు. అనకాపల్లి, తిరుపతి, విశాఖపట్నంలో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీలు నిర్వహించారు. గత నాలుగు నెలలుగా వలంటీర్లకు చెల్లించాల్సిన పెండింగ్ గౌరవ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ. 10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

రోగాలను తాగేస్తున్నామా!

ప్రపంచవ్యాప్తంగా నిమిషానికి 10 లక్షలకుపైగా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల అమ్మకం

- ఒక లీటర్ నీటిలో దాదాపు 3 లక్షల మైక్రో ప్లాస్టిక్ కణాలు
- అనేక రోగాలకు ఇవి కూడా కారణం
- పర్యావరణంపై తీవ్ర ప్రభావం
- బ్రిటిష్ మెడికల్ జర్నల్ అధ్యయనంలో వెల్లడి





1 గ్యాలన్- 3.78 లీటర్లతో సమానం.. 1 బిలియన్- 100 కోట్లతో సమానం

సాక్షి, సెంట్రల్ డెస్క్: హోటల్‌కు వెళ్లి టిఫిన్ చేస్తే వాటర్ బాటిల్.. ఫంక్షన్లలో భోజనం చేస్తే వాటర్ బాటిల్.. ప్రయాణాల్లో దాహం వేస్తే వాటర్ బాటిల్.. ఇలా ఇబ్బడిముబ్బడిగా వాడేస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషానికి పది లక్షలకుపైగా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల అమ్మకాలు జరుగుతున్నట్లు తేలింది. ఈ విషయం బ్రిటిష్ మెడికల్ జర్నల్ అధ్యయనంలో వెల్లడైంది. తాగునీరు మన ఆరోగ్యాన్ని కాపాడడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే రోజుకు కనీసం మూడు లీటర్ల నీళ్లయినా తాగాలని డాక్టర్లు చెప్తుంటారు. దీంతో పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ నీళ్లు తాగుతున్నారా, లేదా అని చూసుకుంటారు కానీ.. దేనిలో తాగుతున్నామనే విషయాన్ని మాత్రం ప్రతి ఒక్కరూ విస్మరిస్తున్నారు. సమృద్ధిగా నీళ్లు తాగితే ఆరోగ్యంగా ఉంటామనే భావనతో రోజువారీ జీవితంలో ఎడాపెడా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు కొనేసి ఉపయోగిస్తున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషానికి పది లక్షలకు పైగా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను వినియోగిస్తుండగా.. ఈ ధోరణి భవిష్యత్తులో విపరీతంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీని వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పర్యావరణం, వాతావరణం పరంగా ప్రపంచం భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోందని అధ్యయనం వెల్లడించింది.

ఎందుకిలా?

ప్రపంచవ్యాప్తంగా కుళాయి నీటి నాణ్యత మీద ప్రజలకు నమ్మకం లేకపోవడమే వాటర్ బాటిళ్ల వినియోగం పెరగడానికి ముఖ్య కారణమని అధ్యయనంలో తేలింది. అలాగే ఇవి ఎక్కడపడితే అక్కడ సులభంగా అందుబాటులో ఉండటం, వాటి ధర కూడా తక్కువగా ఉండటం, ఎక్కడికైనా తీసుకెళ్లడానికి అనువుగా ఉండటం మరో కారణమని నివేదిక తెలిపింది.

లీటర్ నీటిలో 3 లక్షల మైక్రో ప్లాస్టిక్ కణాలు..

ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి.. అందులోని నీటిలోకి మైక్రో ప్లాస్టిక్‌లు, బీపీఏ(బిస్‌ఫెనాల్-ఏ) తదితర హానికర రసాయనాలు విడుదలవుతుంటాయి. ఒక లీటర్ వాటర్ బాటిల్‌లో లక్ష నుంచి మూడు లక్షల వరకు మైక్రో ప్లాస్టిక్ కణాలు ఉన్నట్లు తేలిందని ఓ అధ్యయనం వెల్లడించింది. ఇందులో 90 శాతం నానో ప్లాస్టిక్ కణాలే. ఇవి అత్యంత ప్రమాదకరమైనవి. పునరుత్పత్తి హార్మోన్లు, థైరాయిడ్ హార్మోన్లు, రోగ నిరోధక శక్తిపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని నివేదిక తెలిపింది. రక్తపోటు, గుండె, మధుమేహం, ఊబకాయంతో పాటు మానవ అవయవాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది.

పర్యావరణంపై ప్రభావం..

పర్యావరణం మీద అత్యంత ప్రభావం చూపిస్తున్న వాటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా ఒకటి. సముద్ర కాలుష్య కారకాల్లో మొదటి స్థానంలో ప్లాస్టిక్ సంచులు ఉండగా.. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లది రెండో స్థానం. ప్రపంచవ్యాప్తంగా కేవలం 30 శాతం ప్లాస్టిక్ బాటిళ్లు మాత్రమే రీసైక్లింగ్ అవుతున్నాయని తెలిపింది. మిగిలిన 70 శాతం నేలలో, నీటిలో చేరి పర్యావరణానికి, అనంత జీవరాశికి అనర్థం కలుగజేస్తున్నాయని వెల్లడించింది. అలాగే ప్రతి లీటర్ ప్లాస్టిక్ బాటిల్ కోసం 1.39 లీటర్ల నీటిని ఉపయోగిస్తూ.. నీటిని కూడా వృథా చేస్తున్నారని తెలిపింది. అంతేకాకుండా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు ఏటా 600 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తున్నాయని పేర్కొంది. తద్వారా వాతావరణ మార్పులకు దోహద పడుతున్నాయని వెల్లడించింది.

ఏం చేయాలి..?

'ప్రభుత్వాలు ప్రజలందరికీ సురక్షిత తాగునీటిని విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలి. దాని మీద ఉన్న అపోహలు తొలగించాలి. ప్లాస్టిక్ బాటిళ్లు వినియోగించకుండా అవగాహన కల్పించాలి. వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలను తెలియజేయాలి. అలాగే ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయంగా మట్టి, రాగి, స్టెయిన్ లెస్ స్టీల్ నీటి సీసాలను ఉపయోగించేలా ప్రజలను ప్రోత్సహించాలి' అని నిపుణులు సూచిస్తున్నారు.

'సీఎంఆర్ షాపింగ్‌మాల్‌పై దుష్ప్రచారం'

సీతమ్మధార (విశాఖ): తెలుగు రాష్ట్రాల ప్రజలకు నాలుగు దశాబ్దాలుగా సుపరిచితమైన సీఎంఆర్ సంస్థపై పోటీదారులు కొందరు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని ది వైజాగ్‌పటం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కంకటాల మల్లిక్ విచారం వ్యక్తం చేశారు. విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల కొందరు పోటీదారులు సీఎంఆర్ ప్రతిష్ట దెబ్బతీసే ఉద్దేశంతో సీఎంఆర్ లోగోను మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టుపై తగిన ఆధారాలతో ఏపీ, తెలంగాణ సైబర్ క్రైమ్, సీఎంఆర్ స్టోర్లు గల సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశామన్నారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్‌పై ఇటువంటి దుష్ప్రచారాన్ని తెలిసీ తెలియక ఇతరులకు ఫార్వార్డ్ చేస్తే సైబర్ క్రైమ్ విభాగం చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అసోసియేషన్ చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. సీఎంఆర్ వ్యాపార రంగంలోనే కాకుండా సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే సంస్థ అన్నారు. వీసీసీఐ అధ్యక్షుడు ఎం.సుదర్శన్ స్వామి మాట్లాడుతూ.. సీఎంఆర్ సంస్థల మీద సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారంతోపాటు మత పరమైన అంశాలను జోడించి ఫేక్ పోస్టులతో ప్రచారం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. అలాంటి పోస్టర్‌ను సీఎంఆర్ ఎప్పుడూ ముద్రించలేదన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. సీఎంఆర్ సంస్థపై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు.



మాట్లాడుతున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

మద్యంలో లూటీకి బాబు స్కెచ్

గతంలోనూ టీడీపీ హయాంలో రూ.2.50 లక్షల కోట్ల దోపిడీ: కాకాణి

నెల్లూరు (బారకాసు): నూతన మద్యం విధానం పేరుతో సీఎం చంద్రబాబు లిక్కర్ సిండికేట్ మాఫియాను నడుపుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఉచిత ఇసుక అంటూ లూటీ చేస్తున్నారని, తాజాగా మద్యం పాలసీ పేరుతో రూ.వేల కోట్లు దోచుకునేందుకు చంద్రబాబు స్కెచ్ వేశారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం దుకాణాల నుంచి వచ్చే ప్రతి పైసా ప్రభుత్వానికే చేరిందని గుర్తు చేశారు. ఇప్పుడు వాటిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం టీడీపీ ప్రజా ప్రతినిధులకు వరంగా మారిందన్నారు. గతంలో మద్యాన్ని విషం అని అభివర్ణించిన చంద్రబాబు ఇప్పుడు అది అమృతం అయిపోయిందా? అని ప్రశ్నించారు. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో మద్యం ద్వారా రూ.2.50 లక్షల కోట్లు దోపిడీ జరిగిందన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు సూచించిన వారికే దుకాణాలు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు వెళ్లాయన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో తన పార్టీ వారికే షాపులు ఇస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించడం సిగ్గు చేటన్నారు. ఇతరులు దరఖాస్తు చేయకుండా టీడీపీ సిండికేట్ బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. తమకు 30 శాతం వాటా ఇవ్వాలని టీడీపీ ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారని, గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఘటన ఒక్కటైనా ఉందా? అని ప్రశ్నించారు. మద్యం నూతన పాలసీని రద్దు చేసి పారదర్శక విధానాన్ని తేవాలని డిమాండ్ చేశారు.



ఏ పదవైతే నాకేంటి.. ప్రమాణ స్వీకారం చేసేస్తా

- అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు తాతయ్య తీరుతో తలలు పట్టుకున్న అధికారులు

సాక్షి, అమరావతి: హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఆయనను హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవిలో నియమించాల్సి ఉండగా.. హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా నియమించింది. ఈ విషయాన్ని అధికారులు గానీ.. తాతయ్యబాబు గానీ గమనించలేదు. కాగా.. గురువారం మంచి ముహూర్తం ఉండటంతో తాను బాధ్యతలు స్వీకరిస్తానని అధికారులకు తాతయ్యబాబు సమాచారం ఇచ్చారు. ఆయన నియామకం విషయంలో తప్పు జరిగిన విషయాన్ని గ్రహించిన కార్పొరేషన్ అధికారులు తాతయ్యకు చెప్పడంతో ఆయన తెల్లమొహం వేశారు. గురువారం బాధ్యతలు స్వీకరించేందుకు విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద తాతయ్య ఫ్లెక్సీలు, భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఉత్తర్వులు వస్తే కానీ బాధ్యతలు తీసుకోవడానికి వీల్లేదని అధికారులు చెప్పడంతో 'అవన్నీ నాకు తెలియదు. గురువారం ఎట్టి పరిస్థితుల్లో ప్రమాణ స్వీకారం చేసి తీరతానని తాతయ్యబాబు భీష్మించడంతో అధికారులు తలలు పట్టుకున్నారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఇంటర్ + ఎంట్రన్స్.. రాణించేలా!

ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్.. ఇంజనీరింగ్ లక్ష్యంతో ఎక్కువ మంది ఎంచుకునే గ్రూప్! ఐఐటీలు, నిట్‌లు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్‌లో అడ్మిషన్ పొందేందుకు ఇంటర్‌లో చేరిన తొలిరోజు నుంచి ప్రిపరేషన్ ప్రారంభిస్తారు. ఇప్పుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇటు బోర్డు పరీక్షలతోపాటు అటు జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, ఈఏపీసెట్‌లకు సన్నద్ధత కొనసాగించాల్సి పరిస్థితి. త్వరలో జేఈఈ మెయిన్స్ 2025 తొలి సెషన్ నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో.. ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులు.. బోర్డ్ పరీక్షలతోపాటు ఎంట్రన్స్ టెస్టుల్లో రాణించేందుకు అనుసరించాల్సిన ప్రిపరేషన్ మార్గాలపై ప్రత్యేక కథనం..

- » బోర్డ్ పరీక్షలతోపాటు ప్రవేశ పరీక్షలకు సన్నద్ధత
- » సిలబస్ బేరీజు వేసుకుంటూ చదవాలి
- » సమయ పాలన, ప్రాక్టీస్‌తోనే పరీక్షల్లో విజయం

మూడు ఎంట్రన్స్‌లు

ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులు ముందుగా బోర్డు పరీక్షల్లో బెస్ట్ స్కోర్ కోసం కృషిచేయాలి. అదే సమయంలో కోరుకున్న కాలేజీలో బీటెక్‌లో చేరేందుకు ముఖ్యంగా మూడు ఎంట్రన్స్‌లు.. జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్, ఈఏపీసెట్‌లపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. దీంతో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఒకవైపు అకడమిక్స్‌లో రాణిస్తూనే.. మరోవైపు పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ సాగించాలి. అప్పుడే ఇంటర్ బోర్డు పరీక్షలతోపాటు జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చూపేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకోసం విద్యార్థులు అధ్యయనంతోపాటు సమయ పాలన, ప్రశ్నల ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి ప్రిపరేషన్

విద్యార్థులు అకడమిక్ కరిక్యులంతోపాటు, పోటీ పరీక్షల సిలబస్‌కు ఉమ్మడి ప్రిపరేషన్ సాగించాలి. ఇంటర్మీడియెట్ సిలబస్‌ను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసుకునే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆ తర్వాత తాము లక్ష్యంగా పెట్టుకున్న జేఈఈ- మెయిన్‌పై దృష్టి పెట్టాలి. జేఈఈ-మెయిన్ జనవరి సెషన్‌కు హాజరయ్యే విద్యార్థులు.. జనవరి నుంచి పరీక్ష తేదీ వరకూ.. ఇంటర్ + జేఈఈ-మెయిన్‌లోని ఉమ్మడి అంశాల పునశ్చరణకు అధిక సమయం కేటాయించాలి. ఏప్రిల్ సెషన్ సమయంలో విద్యార్థులు ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు కూడా సన్నద్ధమవ్వాల్సి ఉంటుంది.

అప్లికేషన్ అప్రోచ్

ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. ప్రధానంగా ఆయా సబ్జెక్ట్‌ల బేసిక్ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. వాటిని వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ చదవాలి. తద్వారా ఇంటర్ సబ్జెక్ట్‌లపై పూర్తి స్థాయి అవగాహనతోపాటు జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్, ఈఏపీసెట్‌ల్లో ప్రతిభ చూపేందుకు అవకాశం లభిస్తుంది. జేఈఈ- మెయిన్, అడ్వాన్స్‌డ్‌ల్లో న్యూమరికల్ టైప్ కొశ్చన్స్ అడుగుతున్నారు. కాబట్టి విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లలో న్యూమరిక్స్ ఆధారంగా సమాధానం సాధించాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

షార్ట్ నోట్స్

సబ్జెక్టులకు ప్రిపరేషన్ సాగించే సమయంలో ముఖ్యమైన ఫార్ములాలు, కీ పాయింట్స్‌ను షార్ట్ నోట్స్‌గా రూపొందించుకోవాలి. ఇది ఇంటర్‌తోపాటు పోటీ పరీక్షల రివిజన్‌కు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ షార్ట్ నోట్స్ రివిజన్ సమయంలో సులువుగా అర్థమయ్యేలా సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా షార్ట్ కట్ మెథడ్స్, ఫార్ములాలు, ప్రాబ్లమ్స్‌లో ఏ షార్ట్ కట్‌ను ఎక్కడ వినియోగించాలో అర్థ మయ్యేలా రాసుకోవాలి. అప్పుడే రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది.



ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ఇంటర్మీడియెట్, ఎంట్రన్స్ టెస్టులు రెండింటికీ హాజరయ్యే విద్యార్థులు.. ప్రాక్టీస్ ఎంతో ప్రధానమని గుర్తించాలి. ఇప్పటి నుంచే ప్రతిరోజు తాము చదివిన సబ్జెక్ట్‌కు సంబంధించి ప్రశ్నలు అడిగే ఆస్కారం ఉన్న అంశాలను ప్రాక్టీస్ చేయాలి. వాస్తవానికి పోటీ పరీక్షల సిలబస్‌లో ఇంటర్మీడియెట్ రెండు సంవత్సరాల టాపి క్స్ ఉంటాయి. దీంతో విద్యార్థులు ఆయా టాపిక్స్‌కు సంబంధించి మొదటి సంవత్సరం అంశాలను కూడా అవలోకనం చేసుకోవాలి. మొదటి సంవత్సరం అంశాలను, రెండో సంవత్సరం టాపిక్స్‌తో అనుసంధానం చేసుకుంటూ అధ్యయనం సాగించాలి. ఫలితంగా సంబంధిత అంశంపై పూర్తి స్థాయిలో అవగాహ నతోపాటు ప్రశ్నను ఏ రూపంలో అడిగినా సమాధా నం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

మాక్ టెస్టులు, ప్రీ-ఫైనల్ టెస్టులు

మాక్ టెస్టులకు, ఇంటర్ ప్రీ-ఫైనల్ టెస్టులకు హాజరవడం, వాటి ఫలితాలను విశ్లేషించుకోవడం పరీక్ష ల్లో రాణించేందుకు దోహదపడుతుంది. ఇంటర్ వా ర్షిక పరీక్షల తర్వాత ఆయా ఎంట్రన్స్‌లకు నెల నుంచి 50 రోజుల సమయం మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ సమయాన్ని పునశ్చరణకు, వీక్లీ టెస్టులకు, మాక్ టెస్టులకు కేటాయించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

విద్యార్థులు టైమ్ మేనేజ్‌మెంట్ ఎంతో ముఖ్యమని గుర్తించాలి. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివే విధంగా సమయ పాలన పాటించాలి. ప్రతి సబ్జెక్ట్‌కు ప్రతి రోజూ కనీసం రెండు గంటలు కేటాయించాలి. తమకు సులభమైన సబ్జెక్ట్‌కు కొంత తక్కువ సమయం కేటాయించి.. క్లిష్టంగా భావించే వాటికి కొంత ఎక్కువ సమయం కేటాయించడం మేలు. అంతకుముందు రోజు చదివిన అంశాల పునశ్చరణకు కొంత సమయం కేటాయించాలి. ఈ విధంగా ప్రతి రోజు నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. ఒకే సమయంలో బోర్డు పరీక్షలతోపాటు ఎంట్రన్స్ టెస్టులకు సన్నద్ధత పూర్తవుతుంది.

సబ్జెక్ట్‌ల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్ట్‌లో రెండేళ్ల సిలబస్‌కు సంబంధించి ప్రతి చాప్టర్‌ను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా 3- డి జామెట్రీ, కో ఆర్డినేట్ జామెట్రీ, వెక్టార్ ఆల్జీబ్రా, ఇంటిగ్రేషన్, కాంప్లెక్స్ నెంబర్స్, పారాబోలా, ట్రిగ్నో మెట్రిక్ రేషియోస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. వీటితో పాటు క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేష న్స్, పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలపైనా దృష్టిపెట్టాలి.

ఫిజిక్స్

ఇందులో ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్య మివ్వాలి. వీటితో పాటు సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్, సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ప్రిప రేషన్ సమయంలోనే ఆయా అంశాల ప్రాథమిక భావనలను వాస్తవ పరిస్థితులతో అన్వయించుకుంటూ ప్రాక్టీస్ చేయాలి.

కెమిస్ట్రీ

విద్యార్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్.. కెమిస్ట్రీ. ఇందులో కెమికల్ బాండింగ్, పిరియాడిక్ టేబుల్, బ్రేకింగ్‌ల మూలాలపై అవగాహనను పరీక్షించేలా ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కాబట్టి విద్యార్థులు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

ఇంటర్ +ఎంట్రన్స్.. ముఖ్యాంశాలు

- డిసెంబర్ చివరి నాటికి జేఈఈ మెయిన్ సిలబస్, ఇంటర్మీడియెట్ రెండు సంవత్సరాల సిలబస్‌లోని ఉమ్మడి అంశాల ప్రిపరేషన్ పూర్తి చేయాలి.
- జేఈఈ-మెయిన్ జనవరి సెషన్‌కు హాజరవుతున్న విద్యార్థులు చివరి రెండు వారాలు పునశ్చరణ, మాక్ టెస్టులకు కేటాయించాలి.
- ఫిబ్రవరి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలకే సమయం కేటాయించాలి. ఆ తర్వాత మెయిన్, అడ్వాన్స్‌డ్, ఈఏపీసెట్‌పై దృష్టి పెట్టాలి.
- ప్రతి రోజు ఇంటర్‌తోపాటు ఎంట్రన్స్ టెస్ట్‌ల ప్రిపరేషన్‌కు సమయం కేటాయించే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- ప్రతి రోజు కనీసం ఆరు గంటలు పోటీ పరీక్షలు, ఇంటర్మీడియెట్ అంశాల ప్రిపరేషన్‌కు కేటాయించాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ గ్రాడ్యుయేట్స్ కోర్సు

డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో జూలై-2025లో ప్రారంభమయ్యే 141వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశానికి అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 30.
- » **కోర్ ఇంజనీరింగ్ స్ట్రీమ్:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంజనీరింగ్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- » **వయసు:** 01.07.2025 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, స్టేజ్-1/స్టేజ్-2 టెస్టులు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.10.2024.
- » **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in/

కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- » **అర్హత:** ఇంటర్మీడియట్‌తోపాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 31.12.2024 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** జీఎన్ఎం మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.10.2024.
- » **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in/

కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూని వర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
- » **అర్హత:** కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) లేదా ఇంటర్ ఒకేషనల్ బ్రిడ్జ్ కోర్సు/సార్వత్రిక విద్యలో ఇంటర్(ఫిజికల్ సైన్సెస్/ బయాలజికల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. టీజీ ఈఏపీసెట్-2024 స్కోరు ఉండాలి.
- » **వయసు:** 31.12.2024 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** టీజీ ఈఏపీసెట్-2024 స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.10.2024.
- » **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in/


అలహాబాద్ హైకోర్టులో 3,306 గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టులు

ఉత్తరప్రదేశ్ జిల్లా సివిల్ కోర్టుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 3,306.
- » **పోస్టుల వివరాలు:** స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3(హిందీ/ఇంగ్లిష్)-583, జూనియర్ అసిస్టెంట్/పెయిడ్ అప్రెంటిస్-1054, డ్రైవర్‌లు(గ్రేడ్-4)-30, గ్రూప్ డి పోస్టులు-1639.
- » **అర్హత:** పోస్టును అనుసరించి ఆరో తరగతి, పదో తరగతి, 12వ తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **పే స్కేల్:** నెలకు రూ.5200 నుంచి రూ.20,200.
- » **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, హిందీ-ఇంగ్లిష్ కంప్యూటర్ టైప్ టెస్ట్, హిందీ/ఇంగ్లిష్ స్టెనోగ్రఫీ టెస్ట్ అండ్ టెక్నికల్ డ్రైవింగ్ టెస్ట్ ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.10.2024.
- » **వెబ్‌సైట్:** www.allahabadhighcourt.in/



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
168	31
81,467	24,982

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,258	△ 74
డోజోన్స్	42,465	△ 385
ఎఫ్‌టీఎస్ఈ 100	8,244	△ 53
డాక్స్	19,255	△ 188
షాంఘై	3,259	▽ 231
నికాయ్	39,278	△ 340

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	75,009 ▽ 717
బంగారం (99.5 స్వచ్ఛత)	74,709 ▽ 713
వెండి (కేజీ)	88,661 ▽ 1,751

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	83.53	84.59
£	బ్రిటన్ పౌండ్	[illegible]	108.69	111.40
€	యూరో	[illegible]	91.00	93.55
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	56.17	57.49
AUS	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.62	57.63
S$	సింగపూర్ డాలర్	[illegible]	62.05	66.73
SAR	సౌదీ రియాల్	[illegible]	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.97	23.75
¥	చైనా యువాన్	[illegible]	11.00	12.83

రేటు కోతకు వేళాయెనా..!

- ఆర్‌బీఐ పాలసీ కమిటీ సంకేతాలు
- 'కఠినం' నుంచి 'తటస్థం' వైపునకు విధాన వైఖరి మార్పు
- అయితే వరుసగా 10వ సారీ రెపో రేటు యథాతథంగా 6.5%గా కొనసాగింపు..
- జీడీపీ వృద్ధి రేటు, ద్రవ్యోల్బణం అంచనాలూ అక్కడే...



వృద్ధికి వడ్డీరేట్లు అడ్డుకాదు...

ద్రవ్యోల్బణాన్ని తగ్గించడంపై సెంట్రల్ బ్యాంక్ నిస్సందేహంగా దృష్టి సారించింది. ద్రవ్యోల్బణం దిగివస్తుందన్న విశ్వాసంతోనే పాలసీ విధాన వైఖరిని మార్చడం జరిగింది. అయితే రేటు కోత ఇప్పుడే మాట్లాడుకోవడం తగదు. ఇక వృద్ధిపై ప్రస్తుత వడ్డీ రేట్ల ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు గత 18 నెలల కాలంలో మాకు ఎటువంటి సంకేతాలు లేవు. భారత్ ఎకానమీ పటిష్ట వృద్ధి బాటలో పయనిస్తోంది. బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు రుణ నాణ్యతపై అత్యధిక దృష్టి సారించాలి.

– శక్తికాంతదాస్, ఆర్‌బీఐ గవర్నర్

ముంబై: పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణంసహా భౌగోళిక ఉద్రిక్తతలు, దీనితో పొంచిఉన్న ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ద్రవ్య పరపతి విధానాన్ని ఆరుగురు సభ్యుల రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) యథాతథంగా కొనసాగించింది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు రెపోను వరుసగా 10వ పాలసీ సమీక్షలోనూ 6.5% వద్దే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. అయితే విధాన వైఖరిని మాత్రం 2019 జూన్ నుంచి అనుసరిస్తున్న 'సరళతర ఆర్థిక విధాన ఉపసంహరణ' నుంచి 'తటస్థం' వైపునకు మార్చాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఇది సానుకూలాంశమని, సమీప భవిష్యత్తులో రెపో రేటు తగ్గింపునకు సంకేతమని అసోచామ్ సెక్రటరీ జనరల్ దీపక్‌సూద్ సహా పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ద్రవ్యోల్బణం దిగొస్తుందన్న భరోసాతో పాలసీ వైఖరి మార్పు నిర్ణయం తీసుకోవడం జరిగింది తప్ప, రేటు కోతపై మాట్లాడ్డానికి ఇది తగిన సమయం కాదని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ స్పష్టం చేశారు.

పాలసీ సమీక్షలో ముఖ్యాంశాలు...

- ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో 2023 ఫిబ్రవరి నుంచి రెపో రేటు యథాతథంగా 6.5% వద్ద కొనసాగుతోంది.
- 2024–25 ఆర్థిక సంవత్సరం దేశ ఎకానమీ వృద్ధి రేటు అంచనాను యథాతథంగా 7.2 శాతంగా పాలసీ కొనసాగించింది. ఇప్పటికే వెల్లడైన అధికారిక గణాంకాల ప్రకారం ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) ఎకానమీ 6.7 శాతం పురోగతి సాధించగా, క్యూ2, క్యూ3, క్యూ4లలో వృద్ధి రేట్లు వరుసగా 7, 7.4, 7.4 శాతాలుగా నమోదవుతాయని పాలసీ అంచనావేసింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పాలసీ నిర్ణయానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉంటుందన్న గత విధాన వైఖరిలో మార్పులేదు. క్యూ2, క్యూ3, క్యూ4లలో వరుసగా 4.1 శాతం, 4.8 శాతం, 4.2 శాతాలుగా రిటైల్ ద్రవ్యోల్బణం ఉంటుందని, 2025–26 తొలి త్రైమాసికంలో ఈ రేటు 4.3 శాతమని పాలసీ అంచనావేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం అటుఇటుగా 4 శాతం వద్ద ఉండాలని ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తోంది. అయితే 4 శాతమే లక్ష్యమని ఆర్‌బీఐ గవర్నర్ పలు సందర్భాల్లో పేర్కొంటున్న సంగతి తెలిసిందే.
- ఫీచర్ ఫోన్ యూపీఐ123పే పరిమితిని లావాదేవీకి ప్రస్తుత రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచడం జరిగింది.
- లైట్ వాలెట్ పరిమితి ప్రస్తుత రూ.2,000 నుంచి రూ.5,000కు పెరిగింది. లావాదేవీ పరిమితి రూ.500 నుంచి రూ.1,000కి ఎగసింది.
- తదుపరి పాలసీ సమీక్ష డిసెంబర్ 4 నుంచి 6వ తేదీల మధ్య జరగనుంది.



వృద్ధికి దోహదం..

ఆర్‌బీఐ విధాన ప్రకటన పటిష్ట వృద్ధికి, ద్రవ్యోల్బణం కట్టడికి దోహదపడే అంశం. పాలసీ వైఖరి మార్చుతూ తీసుకున్న నిర్ణయం.. ద్రవ్యోల్బణాన్ని 4% వద్ద కట్టడి చేయడానికి ఆర్‌బీఐ తగిన చర్యలు తీసుకుంటుందన్న అంశాన్ని స్పష్టం చేస్తోంది.

– సీఎస్ శెట్టి, ఎస్‌బీఐ చైర్మన్



రియల్టీకి నిరాశ..

హౌసింగ్ డిమాండ్‌ను పెంచే అవకాశాన్ని ఆర్‌బీఐ కోల్పోయింది. రియల్టీకి ఊపునివ్వడానికి రేటు తగ్గింపు కీలకం. వచ్చే పాలసీ సమీక్షలోనైనా రేటు తగ్గింపు నిర్ణయం తీసుకోవాలని ఈ రంగం విజ్ఞప్తి చేస్తోంది.

– బొమన్ ఇరానీ, క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్



వైఖరి మార్పు హర్షణీయం..

ఆర్‌బీఐ పాలసీ వైఖరి మార్పు హర్షణీయం. రానున్న సమీక్షలో రేటు కోత ఉంటుందన్న అంశాన్ని ఇది సూచిస్తోంది. ఎకానమీ పురోగతికి తగిన పాలసీ నిర్ణయాలను ఆర్‌బీఐ తగిన సమయాల్లో తీసుకుంటుందని పరిశ్రమ విశ్వసిస్తోంది.

– దీపక్‌సూద్, అసోచామ్ సెక్రటరీ జనరల్

హ్యుందాయ్ మెగా ఐపీవో రెడీ

దక్షిణ కొరియా కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ దేశీ అనుబంధ యూనిట్ మెగా పబ్లిక్ ఇష్యూకి రంగం సిద్ధమైంది. 2003లో జపనీస్ అగ్రగామి మారుతీ సుజుకీ ఐపీవో తర్వాత మరో టాప్ ఆటోమొబైల్ సంస్థ లిస్ట్ కానుంది. భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద ఐపీవోగా హ్యుందాయ్ సరికొత్త రికార్డ్ సృష్టించనుంది.

- ధరల శ్రేణి రూ. 1,865–1,960
- ఈ నెల 15–17 మధ్య ఆఫర్
- రూ. 27,870 కోట్ల సమీకరణ
- అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డ్

భారీ ఐపీవోల తీరిలా

కంపెనీ పేరు	తేదీ	ఇష్యూవిలువ రూ. కోట్లలో
హ్యుందాయ్	2024 అక్టోబర్	27,870
ఎల్ఐసీ	2022 మే	21,000
పేటీఎమ్	2021 నవంబర్	18,300
కోల్ ఇండియా	2010 అక్టోబర్	15,199
రిలయన్స్ పవర్	2008 జనవరి	11,563
జనరల్ ఇన్సూరెన్స్	2017 అక్టోబర్	11,176

న్యూఢిల్లీ: రెండు దశాబ్దాల తదుపరి మరో ఆటో రంగ దిగ్గజం నిధుల సమీకరణకు వస్తోంది. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్(హెచ్ఎంఐఎల్) పబ్లిక్ ఇష్యూ ఈ నెల15న ప్రారంభంకానుంది. 17న ముగియనున్న ఇష్యూకి ఒక్కో షేరుకి రూ. 1,865–1,960 చొప్పున ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా ప్రమోటర్ సంస్థ హ్యుందాయ్ మోటార్ కంపెనీ 14,21,94,700 షేర్లను విక్రయానికి ఉంచనుంది. తద్వారా 3.3 బిలియన్ డాలర్ల(రూ. 27,870 కోట్లు) సమీకరించాలని భావిస్తోంది. దీంతో ఇంతక్రితం 2022 మే నెలలో బీమా దిగ్గజం ఎల్ఐసీ రూ. 21,000 కోట్లు సమీకరించిన ఇష్యూని అధిగమించనుంది. వెరసి దేశీయంగా అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డు నెలకొల్పనుంది. లిస్టింగ్ తదుపరి కంపెనీ మార్కెట్ విలువ 19 బిలియన్ డాలర్ల (రూ.1.6 లక్షల కోట్లు)కు చేరనుంది.



సీఈవో అన్సూకిమ్, సీవోవో తరుణ్ గార్గ్

క్రెటా ఈవీ వస్తోంది..

దేశీయంగా కార్ల తయారీ, అమ్మకాలలో మారుతీ సుజుకీ తదుపరి హ్యుందాయ్ మోటార్ ఇండియా రెండో ర్యాంకులో నిలుస్తున్న సంగతి తెలిసిందే. 2025 జనవరి–మార్చి కాలంలో క్రెటా ఈవీని ప్రవేశపెట్టాలని చూస్తున్నట్లు హెచ్ఎంఐఎల్ పేర్కొంది. రానున్న కొన్నేళ్లలో మరో 4 ఈవీలను విడుదల చేసే యోచనలో ఉన్నట్లు తెలియజేసింది. 1996లో కార్యకలాపాలు ప్రారంభించిన కంపెనీ వివిధ విభాగాలలో 13 మోడళ్లను విక్రయిస్తోంది. ప్రపంచంలోనే ఇండియా అత్యంత ఆసక్తికరమైన మార్కెట్‌గా కంపెనీ ఎండీ, సీఈవో అన్సూ కిమ్ ఐపీవో రోడ్‌షో సందర్భంగా పేర్కొన్నారు. ఐపీవో ద్వారా కంపెనీ బ్రాండ్ మరింత మందికి చేరువవ్వుతుందన్నారు.



నాగ్‌పూర్ విమానాశ్రయం ఆధునీకరణ

ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎయిర్‌పోర్ట్స్ డెవలపర్ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ తాజాగా నాగ్‌పూర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రమాణాల పెంపు, ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ ప్రాజెక్టుకు బుధవారం శంకుస్థాపన చేశారు. విమానాశ్రయాన్ని అధునాతన సౌకర్యాలతో ఆధునిక విమానయాన హబ్‌గా మార్చనున్నట్టు జీఎంఆర్ తెలిపింది. 'వ్యూహాత్మకంగా మధ్య భారత్‌లో ఉన్న నాగ్‌పూర్ ప్రయాణికులకు, సరుకు రవాణాకు కీలక కేంద్రంగా పనిచేస్తుంది. దశలవారీగా ఏటా 3 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే స్థాయికి అభివృద్ధి చేస్తాం. కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం 20,000 టన్నులకు చేరనుంది. తద్వారా నాగ్‌పూర్‌ను లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతుంది. తొలి దశలో ప్యాసింజర్ టెర్మినల్ సామర్థ్యం 40 లక్షల మంది ప్రయాణికుల స్థాయి లో తీర్చిదిద్దుతాం. మల్టీ మోడల్ ఇంటర్నేషనల్ కార్గో హబ్, ఎయిర్‌పోర్ట్ ఎట్ నాగ్‌పూర్‌తో (మిహా న్) జీఎంఆర్ నాగ్‌పూర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పో ర్ట్‌కు కన్సెషన్ ఒప్పందం కుదిరింది' అని జీఎంఆర్ తెలిపింది.



శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కు రెండు జాతీయ అవార్డులు

హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్‌కు జాతీయ స్థాయిలో రెండు అవార్డులు లభించాయి. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గోల్డ్ ఎక్సలెన్స్ అండ్ స్టాండర్డ్స్, వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నిర్వహించిన నేషనల్ జ్యువెలరీ అవార్డ్స్ 13వ ఎడిషన్‌లో 'ఇన్నోవేషన్ జ్యువెలరీ ఆఫ్ ఇయర్', 'బెస్ట్ కలర్ స్టోన్ రింగ్ ఆఫ్ ది ఇయర్' అవార్డులు దక్కాయి. అత్యంత సృజనాత్మక, నైపుణ్యం గల తమ బృందం అంకిత భావానికి అవార్డులు నిదర్శమని జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ చెప్పారు.

ఆరంభ లాభాలు ఆవిరి



- సెన్సెక్స్ 168 పాయింట్లు, నిఫ్టీ 31 పాయింట్లు డౌన్

ముంబై: ఆఖర్లో అమ్మకాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలకు లాభాలు ఒకరోజుకే పరిమితమయ్యాయి. ఆరంభ లాభాలు కోల్పోయిన సెన్సెక్స్ 168 పాయింట్లు నష్టపోయి 81,467 వద్ద నిలిచింది. నిఫ్టీ 31 పాయింట్లు పతనమై 24,982 వద్ద స్థిరపడింది. సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఆర్‌బీఐ ద్రవ్య విధాన ప్రకటన తర్వాత కొనుగోళ్లు మరింత పెరిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 684 పాయింట్లు పెరిగి 82,319 వద్ద, నిఫ్టీ 221 పాయింట్లు బలపడి 25,234 వద్ద గరిష్టాన్ని అందుకున్నాయి. అయితే క్యూ3 ఫలితాల సీజన్ ప్రారంభం (గురువారం) నేపథ్యంలో మిడ్ సెషన్ నుంచి అధిక వెయిటేజీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మెర్సిడెజ్ కొత్త ఈ-క్లాస్ @ 78.5 లక్షలు	9 బిలియన్ డాలర్లకు ఆన్‌లైన్ గేమింగ్!

ఆయుష్ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ ఇచ్చింది. నీట్ యూజీ–2024లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 14వ తేదీ రాత్రి తొమ్మిది గంటల్లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.2,950, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.2,360 రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్టైతే 9000780707, 8008250842 నంబర్‌లను సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి వెల్లడించారు. అదే విధంగా ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా రెండో దశ కౌన్సెలింగ్‌లో సీట్ పొందిన విద్యార్థులు ఆ సీట్ వదులుకోవడం/కొనసాగడంపై ఈనెల 13లోగా సెల్ఫ్ డిక్లరేషన్‌కు ఆదేశించారు. క్యాప్, దివ్యాంగ కోటాలో కన్వీనర్ అడ్మిషన్‌లు పొందిన ఎంబీబీఎస్ విద్యార్థులు కళాశాలల్లో రిపోర్ట్ చేసే గడువును శుక్రవారం (11వ తేదీ) మధ్యాహ్నం మూడు గంటల వరకూ పొడిగించారు.

14 వరకూ ఫ్రీ ఎగ్జిట్‌కు అవకాశం

తొలి రెండు కౌన్సెలింగ్‌లలో యాజమాన్య కోటా సీట్లలో చేరిన విద్యార్థులు ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల్లోగా ఫ్రీ ఎగ్జిట్ అవ్వచ్చని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి ప్రకటించారు. ఎగ్జిట్ అయిన వారు యాజమాన్య కోటా మూడో దశ కౌన్సెలింగ్‌లో అనుమతిస్తామని స్పష్టం చేశారు. అన్ని పబ్లిక్ హాలిడేస్‌ను పనిదినాలుగానే పరిగణిస్తున్నట్టు కళాశాలల యాజమాన్యాలకు తెలియజేశారు.

ఏఎన్‌యూ దూరవిద్యలో పీజీ సైన్స్ కోర్సులు

ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం పీజీలో 10 సైన్స్ కోర్సులు నిర్వహించేందుకు యూజీసీకి చెందిన డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) అనుమతి ఇచ్చింది. అనుమతి పత్రాలను బుధవారం దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కో–ఆర్డినేటర్ డి.రామచంద్రన్ వీసీకి అందజేశారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, సైకాలజీ, స్టాటిస్టిక్స్, మేథమెటిక్స్, మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, బోటనీ కోర్సుల నిర్వహణకు అనుమతి లభించింది. ఈ కోర్సులలో అడ్మిషన్ పొందగోరు విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని దూరవిద్యాకేంద్రం అధికారులు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 10 । అక్టోబర్ । 2024



శక్తి గుడిని సందర్శించిన కృష్ణా ఎస్పీ

దేవీనవరాత్రులను పురస్కరించుకుని బుధవారం కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్‌రావు మచిలీపట్నంలోని శక్తిగుడిని సందర్శించారు. బందోబస్తును పరిశీలించారు. -IIలో▸



పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 32,364 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 30,247 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో 45.10 టీఎంసీలు నిల్వ ఉంది.



ఉత్సాహంగా బ్యాడ్మింటన్ టోర్నీ

యోనెక్స్ సన్‌రైజ్ కలగార నాగబాబు మెమోరియల్ ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ రెండో రోజు బుధవారం ఉత్సాహభరితంగా సాగింది. -IIలో▸

న్యూస్‌రీల్

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు సత్వరమే నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె బుధవారం కృష్ణలంకలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య సేవల కోసం వచ్చిన వారితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. ఆరోగ్య విద్య బోధించడంతో పాటు, పోషకాహార ఆవశ్యకతను తెలియజేశారు. ఇక్కడకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోవచ్చు



గన్నవరం: ఉమ్మడి కృష్ణాజిల్లాలో మద్యం దుకాణాల లైసెన్స్‌లు కోసం ఆసక్తి కలిగిన ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వై. శ్రీనివాసచౌదరి తెలిపారు. స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో జరుగుతున్న మద్యం దుకాణాల లైసెన్స్‌లకు దరఖాస్తు స్వీకరణ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో 236 మద్యం దుకాణాలకుగాను ఈ నెల 8వ తేదీ వరకు 4,633 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. వీటిలో ఎన్టీఆర్ జిల్లాలో 113 షాపులకు 3,276, కృష్ణాజిల్లాలో 123 షాపులకు 1,357 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్, హైబ్రీడ్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల నుంచి దరఖాస్తులు తక్కువగా వస్తున్నట్లు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 11వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీన మచిలీపట్నంలోని హిందూ కళాశాల, ఇబ్రహీంపట్నంలోని శ్రీస్వర్ణ కల్యాణ మండపంలో డ్రా తీసి లైసెన్స్‌లను కేటాయించనున్నట్లు తెలిపారు. కొన్నిచోట్ల సిండికేట్లుగా ఏర్పడి ఇతరులు దరఖాస్తులు వేయకుండా అడ్డుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎక్కడైన దరఖాస్తుదారులను బెదిరించిన, అడ్డగించిన తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ యు. సుబ్బారావు, ఎక్సైజ్ సీఐ డి. సురేఖ పాల్గొన్నారు.

అడుగులు వడివడిగా.. ఇంద్రకీలాద్రి నిండుగా.. భక్తజనం ఉప్పొంగగా.. అందరి మదిలో అమ్మ రూపం అపురూపంగా కొలువుదీరింది. బుధవారం దుర్గమ్మ జన్మనక్షత్రం మూలానక్షత్రం కావడంతో దారులన్నీ ఇంద్రకీలాద్రి వైపు నడిచాయి. సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ తన బిడ్డలకు దర్శనమిచ్చింది. భక్తజనం మదిలో దివ్యానందం నింపింది. ఉదయమంతా భక్తి పారవశ్యం, సాయంత్రం సాంస్కృతిక వైభోగంతో ఇంద్రగిరి మెరిసిపోయింది.



తెల్లవారుజామున వీఎంసీ కార్యాలయం వద్ద వేచి ఉన్న భక్తులు, (ఇన్‌సెట్) సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ

విద్యాధరి.. భక్తఝరి

- మంగళవారం అర్ధరాత్రి నుంచే బారులు తీరిన భక్తులు
- 21 గంటల పాటు అమ్మవారి దర్శనం
- చదువుల తల్లికి పలువురు ప్రముఖుల పూజలు

సరస్వతీదేవి అలంకారంలోని దుర్గమ్మకు నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో ఏడో రోజు దుర్గమ్మ శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని సరస్వతీదేవిగా దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 00.50 అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం దర్శనం ప్రారంభమైంది. అమ్మవారిని సరస్వతీదేవిగా సీఎం చంద్రబాబునాయుడు దంపతులు దర్శించుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్ దంపతులు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్ బాబు, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఈవో కేఎస్ రామరావు దంపతులతో పాటు పలువురు అధికారులు దర్శించుకున్నారు.

పోలీసుల అతి..

మూలా నక్షత్రం కావడంతో దేవస్థానం టికెట్ల విక్రయాలను రద్దు చేసి అన్ని క్యూలైన్‌లోనూ భక్తులను ఉచితంగా అనుమతించారు. ఘాట్‌రోడ్డులో కొండపైకి వస్తున్న భక్తులను పోలీసులు నియంత్రించే క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఓ మహిళకు పోలీసు అధికారి చేయి బలంగా తగలడంతో ఆ భక్తురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది.

తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు వినాయకుడి గుడి నుంచి అన్ని క్యూలైన్లు కిటకిటలాడాయి. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు అమ్మవారికి మహా నివేదన, పంచహారతుల నేపథ్యంలో గంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. రాత్రి 12 గంటల వరకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించామని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రికార్డు స్థాయిలో అమ్మవారి దర్శనం కల్పించినట్లయింది. అమ్మవారికి బాలభోగ నివేదన, మహా నివేదన, పంచహారతుల సమయం మినహాయిస్తే 21 గంటల పైగా అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

ఆర్జిత సేవలలో ఉభయదాతలు

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక లక్ష కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేక చండీహోమంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దేవస్థానం ఘాట్‌రోడ్డు మీదగా వచ్చే అన్ని వాహనాలను నిలిపివేసింది. ఉభయదాతల కోసం గాంధీజీ మున్సిపల్ హైస్కూల్, పున్నమీ, భవానీ ఘాట్ల నుంచి దేవస్థానం బస్సులను నడిపింది. దీంతో ఉభయదాతలు దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకుని ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. వీఐపీల పేరిట వచ్చే వారిని కొంత వరకూ కట్టడి చేశారు.



ఆ'మూలా'గ్రం.. జన సందోహం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మూలానక్షత్రం రోజున అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో మంగళవారం అర్ధరాత్రి ఇంద్రకీలాద్రి పరిసరాలన్ని కిక్కిరిసిపోయాయి. ఇంద్రకీలాద్రికి రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర అన్ని ప్రాంతాల్లోనూ అర్ధరాత్రి భక్తజనమే దర్శనమిచ్చారు. మంగళవారం రాత్రి పదకొండు గంటల నుంచి అనూహ్యంగా తరలివచ్చిన భక్తులతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కెనాల్‌రోడ్డు పరిసరాల్లో ఎటువంటి వాహనాలు తిరగకుండా దానికి అనుబంధంగా ఉన్న అన్ని వీధులకు బారికేడ్లను ఏర్పాటు చేశారు.

బ్లాక్‌లుగా విభజించి క్యూలైన్లలోకి..

వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఒక్కసారిగా క్యూలైన్లలోకి వెళ్తే సరిపోయే పరిస్థితులు ఉండవు. దాంతో వచ్చిన భక్తుల సమూహాలను పూర్తిగా నగరపాలకసంస్థ కార్యాలయం వైపు మళ్లించారు. అటు నుంచి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో బ్లాక్‌లుగా భక్తులను విభజించి కొద్దికొద్దిగా ముందుకు నడపటం చేశారు. తోపులాటలు జరగకుండా బ్లాక్‌కు బ్లాక్‌కు మధ్య కొన్ని అడుగుల మేర ఖాళీ వదిలి రోప్‌లను పట్టుకొని వారిని నిలువరించారు. వినాయకునిగుడి వద్ద ఉన్న క్యూలైన్‌లోకి అనుమతించారు. అక్కడి నుంచి సుమారు ఒక్కటిన్నర కిలో మీటరు మేర భక్తులు నడుచుకుంటూ వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.



దుర్గమ్మ దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

అవాక్కయిన అధికారులు..

అధికారులు ఊహించిన దానికన్నా భక్తులు అధికంగా హాజరుకావటంపై వారు విస్తుపోతున్నారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ స్థానిక ఏసీపీ, సీఐ తదితర అధికారులందరూ కొత్తగా విజయవాడ విధులకు వచ్చారు. ప్రత్యక్షంగా ఇంతమంది భక్తులను వారు గతంలో చూసి ఉండలేదు. మూలానక్షత్రం రోజున భక్తుల రద్దీ ఉంటుందని తెలుసు, కానీ ఈ రీతిలో వస్తారని వారికి అవగాహన లేదు. రాత్రి భక్తుల రాకను చూసి కొంతమంది పోలీసు అధికారులు ఆందోళన చెందారని తెలిసింది.

కనులపండువగా..

శ్రీగంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి నగరోత్సవ సేవ బుధవారం కనుల పండువగా సాగింది. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల నుంచి ఊరేగింపును ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. ఆది దంపతులు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువై ఉండగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య నగరోత్సవ సేవ అంగరంగ వైభవంగా సాగింది. మహా మండపం, కనకదుర్గనగర్, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు, ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద దేవతామూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



ఊరేగుతున్న ఉత్సవమూర్తులు



దుర్గమ్మ సన్నిధిలో సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబం

సీఎంకు స్వాగతం

దుర్గమ్మకు పట్టువస్త్రాలను సమర్పించేందుకు విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సాదరంగా స్వాగతం పలికారు. అలాగే సరస్వతీ అలంకారంలోని దుర్గమ్మ దర్శనానికి విచ్చేసిన డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అధికారులు ఆహ్వానించారు.



డెప్యూటీ సీఎం పవన్‌కు చిత్రపటం అందిస్తున్న అధికారులు, చిత్రంలో హోంమంత్రి, ఎంపీ



కుంకుమ పూజ చేస్తున్న కుటుంబం

అడుగడుగునా వైఫల్యం

శాఖల మధ్య సమన్వయ లోపం.. భక్తులకు శాపం

విజయవాడస్పోర్ట్స్: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం భక్తులకు శాపంగా పరిణమించింది. దసరా ఉత్సవాల్లో సాధారణ భక్తుల శ్రేయస్సుకే ప్రాధాన్యం ఇస్తాం.. వీవీఐపీ, వీఐపీల వాహనాలను కొండపైకి అనుమతించం అంటూ కలెక్టర్‌తో పాటు పోలీస్ కమిషనర్, ఆలయాధికారులు బాహాటంగా ప్రకటించారు. అయితే ఈ ప్రకటనలకు పూర్తి విరుద్ధమైన ఘటనలు క్షేత్ర స్థాయిలో చోటు చేసుకుంటున్నాయి. భక్తుల సేవలో తరిస్తామని.. పైపై మాటలు చెబుతూనే.. దీనికి వ్యతిరేకమైన ఆదేశాలను విధుల్లో ఉన్న సిబ్బందికి ఇస్తూ.. పవిత్రమైన ఉత్సవాలను వివాదాస్పదంగా మార్చారంటూ భక్తులు మండిపడుతున్నారు.

పేరుకే నిబంధనలు..

ఓ నిబంధన విధించడం, అదే నిబంధనను అతిక్రమించడం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాగానికే చెల్లింది. ఘాట్ రోడ్డు గాలిగోపురం వద్ద భారీ స్థాయిలో బారికేడ్లను ఏర్పాటు చేసి, అక్కడ అధిక సంఖ్యలో పోలీసులను ఏర్పాటు చేశారు. అయితే అక్కడ నుంచే అనేక ప్రైవేటు వాహనాలు కొండపైకి యథేచ్ఛగా చేరుకుంటున్నాయి. కొన్ని వాహనాలను నిలిపివేస్తూ.. మరి కొన్ని వాహనాలను అనుమతించడం ఇక్కడ వివాదాస్పదమైంది. ప్రైవేటు వాహనాలను కొండపైకి అనుమతిస్తున్న వైనంలో పలువురు పోలీసు అధికారుల చేతివాటం ఉందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అమ్మవారి భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మూలా నక్షత్రం రోజున అధిక సంఖ్యలో ప్రైవేటు వాహనాలను కొండపైకి అనుమతించారు. ఓ రింగ్ నుంచి వీఐపీ ప్రొటోకాల్ వరకు బారులు తీరాయి.



కొండపై ఓం టర్నింగ్ వద్ద నుంచి ప్రొటోకాల్ వరకు బారులుతీరిన ప్రైవేటు వాహనాలు

ఎటు చూసినా ఆటంకాలు..

పోలీసు ఉన్నతాధికారుల నుంచి సెట్‌లో, మొబైల్ ఫోన్‌లలో వస్తున్న ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు పలు విమర్శలను ఎదుర్కొంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి బస్సుకు వచ్చే భక్తులు పాత పీసీఆర్ జంక్షన్‌లోని కనకదుర్గ ఫ్లై ఓవర్ మీదుగా వినాయకస్వామి గుడి వద్దకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటుచేసిన క్యూలైన్‌లోకి చేరుకుని అమ్మవారి దర్శనానికి వెళుతుంటారు. కనకదుర్గ ఫ్లై ఓవర్‌కు పాత పీసీఆర్ జంక్షన్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి కొన్ని సమయాల్లో భక్తులను అనుమతించలేదు. ఫ్లై ఓవర్ దాటుకుని వెళ్లిన భక్తులను సైతం క్యూలైన్‌లోకి వెళ్లకుండా పలుమార్లు అడ్డుకున్నారు. కొండ పైన ప్రొటోకాల్ వద్ద నుంచి అనధికార వ్యక్తులను ఇష్టానుసారంగా వీఐపీ గ్యాలరీలోకి అనుమతించడం, వీరందరినీ అడ్డదారిలో రూ.500 క్యూ లైన్‌లోకి పోలీసులు దగ్గరుండి పంపడంతో రూ.500 టికెట్ కొనుగోలు చేసిన భక్తులకు అమ్మవారి దర్శనం ఆలస్యమైంది. ఫలితంగా వారు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఫుట్ పాత్‌పైనే నిద్రిస్తున్న భవానీలు, (ఇన్‌సెట్) ఆ పక్కనే సంచరిస్తున్న ఎలుకలు

భక్తుల పాట్లు..

భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని తెలిసినా అధికారులు ఆ దిశగా పకడ్బందీ ఏర్పాట్లు చేయలేదు. దీంతో తోపులాట జరిగి పలువురు స్పృహ కోల్పోయారు.



బారికేడ్ దాటిన మహిళను రోప్‌తో కొడుతున్న పోలీసు



క్యూలైన్లో స్పృహ కోల్పోయిన మహిళను తరలిస్తున్న సిబ్బంది



తెల్లవారుజామున పడిపోయిన మహిళను అంబులెన్స్ ఎక్కిస్తున్న సిబ్బంది

బ్రాహ్మణుల సంక్షేమానికి అగ్రతాంబూలం

రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత

భవానీపురం(విజయవాడపశ్చిమ): బ్రాహ్మణ సామాజికవర్గం సంక్షేమానికి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. విజయవాడ గొల్లపూడి పరిధిలోని బ్రాహ్మణ కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఏయే పథకాలు అమలు చేస్తున్నారు, వాటి వలన ఎంత మందికి లబ్ధి చేకూరుతుంది వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్ పరిధిలో ఉన్న భూములు, ఆస్తుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ బ్రాహ్మణుల ఆర్థిక భరోసాకు 2014–19లో అప్పటి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. బ్రాహ్మణుల స్వయం ఉపాధి కోసం కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పేరుతో ఉన్న భూములు, ఆస్తులను పరిరక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు సొంతంగా ఆదాయ వనరులను సమకూర్చుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. వివాదాల్లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించి వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీ ఎం. మహేశ్వరరెడ్డి, జనరల్ మేనేజర్ నాగసాయి, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పంట రుణాల రీషెడ్యూల్‌కు అవకాశం

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు వారు తీసుకున్న పంట రుణాలు రెండు సంవత్సరాల వరకు రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లింపు మారటోరియంతో రెండు సంవత్సరాల వరకు పొడిగింపు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా చేసుకుంటే రైతుల నుంచి అదనంగా ఎలాంటి వడ్డీ వసూలు చేయటం జరగదన్నారు. ఈ సౌకర్యం వర్తించాలంటే పంట రుణం చెల్లించే గడువు దాటిపోయి ఉండకూడదన్నారు. బ్యాంకర్లు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సహకారం అందించి పంట రుణాలు రీషెడ్యూల్ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

క్లుప్తంగా

కొండలమ్మ ఆలయంలో విద్యార్థుల పూజలు



ఆలయంలో సామూహిక సరస్వతీ పూజలు చేసిన విద్యార్థులు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం కొండలమ్మ తల్లి అమ్మవారు శ్రీసరస్వతీదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు భారీ సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి సామూహిక పూజలు చేశారు. విద్యార్థులకు ఈడ కొండలరావు నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ జాతీయ ర్యాంకింగ్ టోర్నీ



బ్యాడ్మింటన్ జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్: యోనెక్స్ సన్‌రైజ్ కలగార నాగబాబు మెమోరియల్ ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో రెండోవ రోజు బుధవారం ఉత్సాహభరితంగా సాగింది. అండర్–15 సింగిల్స్ విభాగం రెండో రౌండ్‌లో క్రీడాకారులు తలపడ్డారు. అండర్–15 డబుల్స్, మిక్సిడ్ డబుల్స్‌లో జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో పోటీపడ్డాయి. అదేవిధంగా అండర్–17 సింగిల్స్ విభాగంలోనూ క్రీడాకారులు రెండో రౌండ్‌లో తలపడగా, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్‌లో ప్రీ క్వార్టర్స్‌లో జట్లు పోటీ పడ్డాయి. ఈ నెల 11వ తేదీ వరకు ఈ పోటీలు కొనసాగుతాయి.

యంత్రంలా మారిన మనిషి

రమేష్ విజయవాడ నగరంలోని ఓ కార్పొరేట్ సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన పనితీరును మెచ్చిన యాజమాన్యం ఏడాది కిందట మేనేజర్‌గా పదోన్నతి కల్పించారు. అప్పటి నుంచి కొన్ని టార్గెట్‌లు అప్పగించి వాటిని రీచ్ అవ్వాలనే ఆదేశాలు ఇచ్చారు. దీంతో తన టీమ్‌తో పనిచేయించేందుకు నిమిషం ఖాళీ లేకుండా బిజీగా ఉండేవారు. ఈ తరుణంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోను కావడంతో ఆ ప్రభావం పనిపై పడింది. యాజమాన్యం ఇచ్చిన టార్గెట్‌లు రీచ్ కాలేకపోయాడు. దీంతో డిప్రెషన్‌కు లోనయ్యారు.

అరుణ్‌కుమార్ ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. డ్యూటీకి వెళ్లిన తర్వాత నిమిషం కూడా ఖాళీ ఉండేది కాదు. కనీసం టాయిలెట్‌కు వెళ్లేందుకు కూడా సమయం దొరికేది కాదు. దీంతో మానసికంగా ఒత్తిడికి లోనయ్యాడు. క్రమేణా అతని పనిపై ప్రభావం చూపింది. అధిక సమయం కార్యాలయంలోనే ఉంటున్నా తాను చేయాల్సిన పనులను పూర్తి చేయలేకపోతున్నాడు. ఇలా ఎంతో మంది కార్పొరేట్ ఉద్యోగులు పనిచేసే ప్రాంతంలో తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. వీటిని తొలిదశలో గుర్తించకపోవడంతో రాను రాను తీవ్రమైన డిప్రెషన్‌కు దారి తీస్తున్నట్లు పేర్కొంటున్నారు.

- మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ఒత్తిళ్లతో పనిపై దృష్టి పెట్టలేకపోతున్న వైనం
- ఫలితంగా ప్రొడక్టవిటీ తగ్గుతున్నట్లు నిపుణులు వెల్లడి
- పని ప్రదేశంలో మానసిక ఆరోగ్యంపై దృష్టి అవసరం



పనిచేసే చోట మానసిక ఒత్తిళ్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కార్పొరేట్ ఉద్యోగులు తీవ్రమైన మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. తమకు తెలియకుండానే డిప్రెషన్‌కు లోనవుతున్నారు. ఆ ఫలితంగా ఎక్కువ సేపు కార్యాలయంలోనే ఉన్నా ఉత్పాదక శక్తి తగ్గిపోతున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. నేటి పోటీ ప్రపంచంలో మనిషి యంత్రంలా మారిపోయాడు. తాము పనిచేసే సంస్థ ఇచ్చిన, తాము ఎంచుకున్న టార్గెట్‌ను రీచ్ అయ్యేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉరుకుల పరుగుల జీవనానికి అలవాటు పడ్డారు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చేదాకా సెల్‌ఫోన్‌లలో మాట్లాడటానికే కాలం సరిపోతుంది. నలుగురిలో కలిసి చెప్పుకునే ముచ్చట్లు లేవు, కుటుంబ సభ్యులంతా కలిసి ఒకేసారి భోజనం చేసే పరిస్థితులు అంతకంటే లేవు. రోజు రోజుకు మానసిక పరిస్థితి దిగజారడం, ఉత్పాదక శక్తి తగ్గిపోతుండటంతో ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పనిచేసే ప్రాంతంలో మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలనే నినాదంతో జరుపుకోనున్నారు.

రిలాక్సేషన్‌పై దృష్టి పెట్టాలి....

➡ పనిచేసే చోట ఉద్యోగులు మానసిక ఒత్తిడికి లోను కాకుండా రిలాక్సేషన్‌పై దృష్టి పెట్టాలి

➡ ప్రతి రెండు గంటలకు ఒకసారి రిలాక్స్ అయ్యేందుకు సమయం ఇవ్వాలి.

➡ పనిలో ఒత్తిడిని ఎదుర్కొనే ఉద్యోగులు వ్యాయామం యోగా, మెడిటేషన్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

➡ కార్యాలయాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి.

➡ కొన్ని చోట్ల టాయిలెట్‌కు వెళ్లేందుకు కూడా సమయం ఉండటం లేదని ఇటీవల సర్వేలు చెప్పాయి. అలాంటి పరిస్థితులు లేకుండా చూడాలి.

➡ మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేలా కార్యాలయాల్లో చర్యలు తీసుకోవాలి.

➡ పది నిమిషాలు మనస్సుకు రిలాక్సేషన్ ఇస్తే అది ఉత్పాదకత పెరిగేందుకు దోహదపడుతుందనే విషయాన్ని గ్రహించాలి.

➡ వారానికి ఒకసారైనా రిలాక్సేషన్ కోసం ఆత్మీయ బంధువులు, మిత్రులను కలవడం ద్వారా మానసిక ఉల్లాసం పెంపొందుతుంది.

➡ చేసే పనిని ప్రణాళిక బద్ధంగా విభజించి చేసుకుంటూ ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలి. ముఖ్యంగా పనిచేసే ప్రాంతంలో మానసిక ఒత్తిళ్ల కారణంగా ఉత్పాదకతపై ప్రభావం చూపుతుంది. డ్యూటీ సమయంలో ఉద్యోగుల రిలాక్సేషన్‌పై యాజమాన్యాలు దృష్టి పెట్టాలి. పని చేసేటప్పుడు రిలాక్సేషన్ కోసం కొంత సమయం కేటాయించాలి. మనస్సు ప్రశాంతంగా ఉండేలా వాతావరణం కల్పించాలి.

–డాక్టర్ పర్వతనేని కృష్ణమోహన్, మానసిక వైద్య నిపుణులు

పర్సనల్ లైఫ్‌పై ప్రభావం



పనిచేసే చోట ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిళ్లు పర్సనల్ లైఫ్‌పై ప్రభావం చూపుతున్నాయి. ఉద్యోగానికి, కుటుంబాన్ని బ్యాలెన్స్ చేసుకోలేక పోతున్నారు. దాంపత్య జీవితంపై కూడా తీవ్రమైన ప్రభావం చూపుతున్నట్లు ఇటీవల సర్వేల్లో తేలింది. ముఖ్యంగా కార్పొరేట్ ఉద్యోగులు ఎక్కువగా మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారు. వారు మనుషుల్లా కాకుండా నిర్దేశించిన పనిని పూర్తి చేసే రోబోల్లా మారుతున్నారు.

– డాక్టర్ గర్రే శంకరావు, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని కోళ్లఫారం రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం కోళ్లఫారం రోడ్డుకు చెందిన డి.అనూష బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. ఆమెకు కూతురు రిషిత, కుమారుడు నేహంత్ ఇద్దరు పిల్లలు. భర్త జమ్మూకశ్మీర్ బోర్డర్‌లో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. దీంతో ఆమె పిల్లలతో కలిసి పుట్టింటి వద్దే ఉంటుంది. ఈ నెల 4వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో సినిమాకు వెళ్తున్నానని చెప్పి పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి 12 గంటలు దాటినా ఇంటికి రాలేదు. ఆమె సోదరుడు సునీల్ స్నేహితులు, బంధువులు, చుట్టు పక్కల వారిని ఆరా తీశాడు. ఆమె ఆచూకీ దొరకకపోవడంతో తన సోదరి, పిల్లలు కనిపించడం లేదంటూ బుధవారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనూషకు ఇటీవల ఇన్‌స్టాగామ్‌లో దాసరి ప్రకాష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడని, తరచూ మాట్లాడుకుంటున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): చెల్లని చెక్కు కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎస్.మేరి బుధవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నం నగరంలోని రామానాయుడుపేటకు చెందిన గుగ్గిళ్ల శివనాగమురళీకృష్ణ నుంచి నగరానికి చెందిన బేతపూడి మధుసూదనరావు 2017 ఏప్రిల్ 16వ తేదీ రూ. 3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీని నిమిత్తం 2019 సెప్టెంబరు 17వ తేదీన యాక్సిస్ బ్యాంకులో చెల్లుబాటు అయ్యేలా రూ. 3 లక్షలకు చెక్కును మురళీకి అందజేశారు. మురళీకృష్ణ చెక్కును బ్యాంకులో సమర్పించగా నిధులు లేకపోవటంతో చెక్ బౌన్స్ అయింది. దీంతో ఆయన ఎక్సైజ్ కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయగా న్యాయమూర్తి విచారణ జరిపిన అనంతరం ఆరు నెలలు జైలు శిక్ష, అప్పుగా తీసుకున్న రూ. 3 లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు. వెంటనే చెల్లించకపోతే మరో మూడు నెలలు జైలు శిక్ష విధిస్తామని ఆమె తీర్పులో పేర్కొన్నారు.

వడ్డీతో అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారునికి వడ్డీతో అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. గుడివాడ పట్టణానికి చెందిన తమ్మా రమేష్ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లోని మూడో ఫ్లోర్‌లో ఫ్లాట్ కొనుగోలు నిమిత్తం రూ. 90 వేలు పట్టణానికి చెందిన రాజశేఖరం 2022 సెప్టెంబరు 22వ తేదీన అడ్వాన్స్‌గా చెల్లించారు. అనంతరం ఈ అపార్ట్‌మెంట్ మూడో ఫ్లోర్‌కు అనుమతి లేదని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకున్న రాజశేఖరం అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇచ్చేయాలని తమ్మా రమేష్‌ను కోరారు. ఎన్నిసార్లు అడిగినా ఆయన అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించకపోవటంతో రాజశేఖరం వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలను విచారించిన అనంతరం కమిషన్ సభ్యులు అడ్వాన్స్‌గా తీసుకున్న రూ. 90 వేలు 2022 సెప్టెంబరు 22వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదన కలిగించినందుకు రూ. 15 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు 30 రోజుల్లోగా రాజశేఖరానికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ ఆటకట్టు

- నిందితుడిని అరెస్టు చేసిన కంకిపాడు పోలీసులు
- రూ.20.04 లక్షలు విలువైన 38 ద్విచక్రవాహనాలు సీజ్
- జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు వివరాలు వెల్లడి



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు

కంకిపాడు: నకిలీ తాళాలతో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు చోరీ చేసే దొంగ ఆటను కట్టించారు. నిందితుడుని కంకిపాడు పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసి రూ.20.04 లక్షలు విలువైన 38 ద్విచక్రవాహనాలు సీజ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు కంకిపాడు పోలీసుస్టేషన్ ప్రాంగణంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. పెద పారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామానికి చెందిన అప్పికట్ల రాజీవ్ బడ్డీ కొట్టు నడుపుకుంటూ కుటుంబాన్ని సాకుతుంటాడు. విలాసాలకు అలవాటు పడ్డ రాజీవ్ సులభంగా డబ్బు సంపాదించాలనే మోజులో ద్విచక్రవాహనాల చోరీకి తెగించాడు. సీఐ జె.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.సందీప్ పునాదిపాడు కాటన్ సర్కిల్‌లో ఇటీవల వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా పోలీసులను గుర్తించిన రాజీవ్ ద్విచక్రవాహనం ఆపకుండా పారిపోయేందుకు యత్నించాడు. దీంతో అనుమానించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ సాగించారు.

భారీగా బైక్‌లు స్వాధీనం...

విచారణలో భాగంగా అప్పికట్ల రాజీవ్ తాను ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నట్లు అంగీకరించాడు. అతను ఇచ్చిన సమాచారం మేరకు కంకిపాడు, చల్లపల్లి, గన్నవరం, గుడివాడ రూరల్, పామర్రు, తోట్లవల్లూరు, ఉయ్యూరు టౌన్, ఉయ్యూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో రూ.20.04 లక్షలు విలువైన 38 మోటరు బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించాడు. బస్టాండు, రైల్వేస్టేషన్, హాస్పిటల్స్ వద్ద పార్కు చేసిన ద్విచక్రవాహనాలను లక్ష్యంగా చేసుకుని నకిలీ తాళాలను వినియోగించి బైక్‌లను చోరీ చేస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి 38 మోటరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. కంకిపాడు పోలీసులు మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి అనుమానితుల కదలికలను గుర్తించి నేరాలను అరికట్టేందుకు పటిష్టంగా చర్యలు తీసుకుంటున్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యం...

జిల్లాలో నేరాల నియంత్రణే లక్ష్యంగా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు అన్నారు. జిల్లా వ్యాప్తంగా 32 వేల సీసీ కెమెరాలను ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని పేర్కొన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగానే నిందితుల గుర్తింపు సాధ్యమైందని చెప్పారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. క్రైం రేటు పూర్తి స్థాయిలో తగ్గించేందుకు ఎంతో సమర్థంగా విధులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో బైక్ చోరీల కేసును పరిష్కరించటంలో ముఖ్య పాత్ర పోషించిన సీఐ జె.మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్, హెచ్‌సీ కె.చంద్రబాబు, పిసిలు పిఎస్‌ఎన్ మూర్తి, ఎస్‌డి బాజీబాబు, ఎం.వీరాంజనేయులు, ఎస్.దిలీప్‌కుమార్, హెచ్‌సీలు విఎస్ పిళ్లై, జి.మొరార్జీలను అభినందించి రివార్డులు అందజేశారు.

ఏడో రోజు టెట్ పరీక్షకు 2128 మంది హాజరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ టీఈటీ -2024 ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం ఏడో రోజు ప్రశాంతంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక జిల్లాతో పాటుగా ఖమ్మం జిల్లాలోని తొమ్మిది పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే బుధవారం ఎన్టీఆర్ జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. ఏడో రోజు జరిగిన పరీక్షలో రెండు షిఫ్టులు కలిపి 2383 మంది అభ్యర్థులను కేటాయించగా అందులో 2128 మంది హాజరయ్యారు. 255 మంది గైర్హాజరయ్యారు. శ్రీవాహిణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, (తిరువూరు), పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (విజయవాడ), ఐయాన్ డిజిటల్ జోన్ (కండ్రిక, విజయవాడ), ఎస్వీ ఇన్ఫోటెక్ (రామమందిరం రోడ్డు విజయవాడ), లైఫ్‌బ్రిడ్జి ఇన్ఫో టెక్నాలజీస్ (గొల్లపూడి విజయవాడ), శ్రీ విజయదుర్గా ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ (ఎనికేపాడు విజయవాడ రూరల్), తదితర పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగాయి. ఉదయం షిఫ్టుకు సంబంధించి 1193 మంది అభ్యర్థులను కేటాయించగా 1087 మంది హాజరయ్యారు. 106 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్టుకు సంబంధించి 1190 మంది అభ్యర్థులను కేటాయించగా 1041 మంది హాజరయ్యారు. 255 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అభ్యర్థులను గంట ముందుగా పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

జనరల్ పోస్టాఫీసుగా హెడ్ ఆఫీసు

విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌వీఆర్ మూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ తపాలా దినోత్సవాల్లో భాగంగా విజయవాడ హెడ్ పోస్టాఫీసు పేరును విజయవాడ జనరల్ పోస్టాఫీసుగా మారుస్తున్నట్లు విజయవాడ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి ప్రకటించారు. గాంధీనగర్‌లోని పోస్టాఫీసులో బుధవారం జాతీయ తపాలా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 9న జాతీయ తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ ఏడాది '150 సంవత్సరాలుగా ప్రజలకు కమ్యూనికేషన్, సాధికారత చేకూర్చడం' అనే థీమ్‌తో తపాల దినోత్సాన్ని చేసుకుంటున్నట్లు చెప్పారు. కొత్త పోస్టల్ ఉత్పత్తులు, సేవలను పరిచయం, ప్రచారం చేయడానికి ఈవెంట్‌ను వినియోగించుకుంటున్నామని వెల్లడించారు. ఇండియా పోస్ట్ తన సాంకేతిక అంశాలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తన ఇంటర్ ఫేస్‌ను మారుస్తోందని వివరించారు. తపాలా దినోత్సవంలో భాగంగా 10న అంత్యోదయ దివస్...పేరిట సమాజంలోని పేద, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సంబంధించిన అంశాలు, పథకాలపై వివిధ శాఖల అధికారులతో డివిజనల్ స్థాయిలో సెమినార్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలు, ఇతర పట్టణ ప్రాంతాలలో అవగాహన, ఆధార్ నమోదు, నవీకరణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆధార్ సేవలకు ప్రత్యేకంగా 51 కేంద్రాలను గుర్తించామని ప్రకటించారు. 11న విత్తీయ సశక్తీకరణ్ దివస్ (ఆర్థిక సాధికారత దినం) నిర్వహిస్తామన్నారు. ఇందులో ఆర్థిక అక్షరాస్యత, బాలికా సాధికారతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇన్సూరెన్స్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. ఫిట్ ఇండియాకు సంబంధించి అక్టోబర్ 13వ తేదీన గుంటూరులో 'ఇండియా పోస్ట్ రన్' అనే ప్రత్యేక కార్యక్రమం ఉందని తెలిపారు. దీనిలో ప్రజలతో పాటు ఇండియా పోస్ట్ కుటుంబ సభ్యులలో ఆరోగ్య అవగాహన కల్పిస్తామని చెప్పారు. రన్‌లో విజేతలకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు.

శక్తిగుడిని సందర్శించిన జిల్లా ఎస్పీ



కోనేరుసెంటర్: దేవీ నవరాత్రులను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు మచిలీపట్నంలోని శక్తిగుడిలోని అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. మూలా నక్షత్రం నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం మచిలీపట్నంలో జరగనున్న శక్తిపటాల ఊరేగింపులో భాగంగా ఏర్పాటుచేసిన పోలీస్ బందోబస్తును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్‌కు ఆయన బందోబస్తుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేయటంతో పాటు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భక్తుల రద్దీ ఎక్కువ ఉండే నేపథ్యంలో సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బందోబస్తు నిర్వహించేలా సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు. మద్యం సేవించి అల్లర్లు, అలజడులు సృష్టించాలని ప్రయత్నించే వారిపై దృష్టి పెట్టి అవసరమైతే అలాంటి వ్యక్తులను ఊరేగింపులకు దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా ఊరేగింపులు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా చూడాలని డీఎస్పీకి సూచించారు.

అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

రాష్ట్ర వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వార్డు సచివాలయ కార్యదర్శులపై విజయనగరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ (డబ్ల్యుఎఎస్ఎ) నాయకులు తీవ్రంగా ఖండించారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ విధుల్లో పని చేస్తున్న తమను హిజ్రాలతో పోలుస్తూ అసభ్యకర పదజాలంతో దూషించటంపై మండిపడ్డారు. తమ గౌరవ మర్యాదలు, ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కమిషనర్ నల్లనయ్య చేసిన వ్యాఖ్యలు తమను కలిచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాంకులు, రోజువారీ టార్గెట్‌లు పేరుతో వార్డ్ పరిపాలనా కార్యదర్శులను, సచివాలయ ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయనగరం కమిషనర్ నల్లనయ్యకు అనుకూలంగా మునిసిపల్ ఉద్యోగులు ఇచ్చిన ప్రకటనను పునఃపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వార్డ్ సచివాలయ ఉద్యోగులను చిన్న చూపు చూడటం సరికాదని, ప్రభుత్వ ఉద్యోగులలో భాగంగా చూడాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సుభాని, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాదాసు శశిధర్, వైస్ ప్రెసిడెంట్ బాజీ, బోరుగడ్డ శ్వేత, ఎల్ అర్చన, విజయవాడ నగర అధ్యక్షులు కొప్పుల శ్యామ్ ప్రసాద్, ప్రవీణ్, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ వ్యవస్థ పునరుద్ధరణ దిశగా అడుగులు

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పంచాయతీరాజ్ వ్యవస్థను పునరుద్ధరణ చేసే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. జిల్లాలోని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో బుధవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిందన్నారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలు మాత్రమే కాదని, ప్రత్యేకమైన ప్రభుత్వాలు, స్థానిక వనరులు వాడుకుంటూ స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో గ్రామానికి ఏయే అవసరాలు ఉన్నాయో జాబితాలు రూపొందించారని పీఆర్ ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో గుర్తించిన పనులను ప్రాధాన్యత క్రమంలో దశల వారీగా చేపట్టాలని సూచించారు. అభివృద్ధి చేసిన పనులు ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా ఉండాలన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయండి.....

పంచాయతీలకు ఉన్న ఆదాయంలో ఆస్తి పన్ను ప్రధానమైనదని ఉన్న వనరులను బలోపేతం చేయాలన్నారు. ఏ ఆస్తిని అసెస్మెంట్ చేయకుండా ఉండకూడదన్నారు. పన్నుల వసూళ్లు కరెక్ట్‌గా చేస్తే ఆదాయం పెరుగుతుందన్నారు. నూరుశాతం పన్నుల వసూళ్లు మన బాధ్యత అన్నారు. టాప్ డిఫాల్టర్స్ జాబితా తయారుచేసుకుని అత్యధిక బకాయిలు ఉన్న వారి నుంచి పన్నులు వసూళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

ఈ నెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం ద్వారా పరిపాలనా ఆమోదం పొందిన పనులకు భూమి పూజ ద్వారా గ్రౌండ్ చేయటం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. దీని కోసం మొబైల్ యాప్ కూడా ప్రభుత్వం రూపొందించిందని ఫోటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కె కన్నమనాయుడు, డీపీవో జె అరుణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్అండ్బీ శాఖ చిరుద్యోగులకు సాయం



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని ఆర్ అండ్బీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తూ, ఇటీవల వచ్చిన బుడమేరు వరదలో నష్టపోయిన చిరుద్యోగులకు ఆ శాఖ హెచ్ఓడీ కార్యాలయ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యాలయంలో 17 మంది పనిచేస్తుండగా, ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున రూ.1.70 లక్షలను ఇంజినీర్ ఇన్ చీఫ్ కె.నయీముల్లా, చీఫ్ ఇంజినీర్లు వి.రామచంద్ర, ఎల్.శ్రీనివాసరెడ్డి, ఎస్.మాధవిసుకన్య చేతుల మీదుగా బాధితులకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఇంజినీర్ ఇన్ చీఫ్ నయీముల్లా మాట్లాడుతూ.. తమ కార్యాలయంలో స్వీపర్లు, సెక్యూరిటీ, అవుట్సోర్సింగ్ సిబ్బందిలో కొందరు వరదతో నష్టపోయారని పేర్కొన్నారు. వారికి తమ శాఖ తరఫున చిరు సహాయాన్ని అందించామన్నారు. ఈ కార్యక్రమాన్ని హెచ్ఓడీ జేఏసీ చైర్మన్ టి.మునికేశవులు, సభ్యులు జి.సుకుమార్ రెడ్డి, ఎ.అనుపమ, టి.భారతి, టి.ఉషారాణి, మహేష్కుమార్, అజయ్కుమార్, మనోహర్ తదితరులు నిర్వహించారు.

మలబార్లో ప్రత్యేక దీపావళి ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బంగారు, వజ్రాభరణాల రిటైల్ చైన్లలో ఒకటైన మలబార్ పండుగల వేళ ప్రత్యేక దీపావళి ఆఫర్లు ప్రవేశ పెట్టినట్లు విజయవాడ షోరూమ్ హెడ్ ఎం.అర్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంజీరోడ్డులోని తమ షోరూమ్లో బుధవారం ప్రత్యేక ఆఫర్లను వివరించారు. బుధవారం ప్రారంభమైన ఆఫర్లు నవంబర్ మూడో తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి రూ.50 వేల విలువైన బంగారు ఆభరణాల కొనుగోలుపై 200 మిల్లీగ్రాముల బంగారు నాణెం, ప్రీషియస్, అన్కట్, పోల్కీ జ్యూవెలరీ కొనుగోలుపై 300 మిల్లీ గ్రాముల బంగారు నాణెం, వజ్రాభరణాల కొనుగోలుపై 400 మిల్లీ గ్రాముల బంగారు నాణెంను ఉచితంగా ఇస్తామన్నారు. ఈ ఆఫర్లతో పాటు పది శాతం నగదును ముందస్తుగా చెల్లించడం ద్వారా తమకు నచ్చిన ధనత్రయోదశి ఆభరణాలను ముందుగానే బుక్ చేసుకోవచ్చని సూచించారు.

వైభవంగా గరుడ వాహన సేవ



విజయవాడ కల్చరల్: లబ్బీపేట శ్రీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవం సందర్భంగా బుధవారం స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనమీద పురవీధుల్లో దర్శనమిచ్చాడు. భక్తుల గోవిందనామ స్మరణతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. అర్చకులు స్వామి వారిని గరడ వాహనంమీద అలంకరింపజేశారు. పలు ప్రాంతాలలో స్వామి వారిని ఊరేగించి, చతుర్వేదాల పారాయణం చేశారు. ఉదయం జియ్యంగార్ల గోష్ఠి, భక్తులు కోలాట సేవను నిర్వహించారు. చివరిగా స్వామి వారి కల్యాణ క్రతువును జరిపించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మాగంటి వేణుగోపాల్ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మధురంగా సాగిన సంకీర్తనం



విజయవాడ కల్చరల్: కంచికామకోటి పీఠ పాలిత శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం లబ్బీపేట శరన్నవరాత్రులు కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రముఖ సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత మూర్తి త్రయం రచించి స్వరపరచిన దేవీ కీర్తనలు అమ్మా ఆనందదాయనీ, శ్రీ సరస్వతీ, సారసముఖీ, తామ్రలోచని, శ్రీనీలోత్పల వారికే తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్పై పాలపర్తి ఆంజనేయులు, మృదంగంపై సద్గురు చరణ్ సహకరించారు. సంగీత విద్వాంసులు గాయత్రీ గౌరీనాథ్, వేమూరి విశ్వనాథ్, మల్లాది బ్రదర్స్ పాల్గొన్నారు. సంగీత విద్వాంసులను దేవాలయ చైర్మన్ మాగంటి వేణుగోపాల్ సత్కరించారు. కార్యక్రమాన్ని మేనేజర్ శర్మ నిర్వహించారు.

సరస్వతీ నమస్తుభ్యం

కనుల పండువగా సాగుతున్న ఆదిదంపతుల నగరోత్సవం



కృష్ణమ్మకు హారతులు ఇస్తున్న అర్చకులు





హారతి స్వీకరిస్తున్న భక్తులు



దుర్గమ్మను దర్శనం చేసుకుని బయటకు వస్తున్న భక్తులు



నగరోత్సవంలో పాల్గొన్న నృత్యకళాకారులు

ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభంగా జరుగుతున్నాయి. దుర్గమ్మ శ్రీ సరస్వతీదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక లక్ష కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేకచండీహోమంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



మహామండపంలో దుర్గమ్మ ఉత్సవమూర్తికి కుంకుమ పూజ



దుర్గమ్మకు మొక్కుతున్న భవానీభక్తుడు



నగరోత్సవంలో కళాకారుల నృత్యం



నగరోత్సవంలో మంగళ వాయిద్య కళాకారులు



సువాసినీ పూజ చేస్తున్న అర్చకులు

వారధి కూడలిలో ట్రాఫిక్ కష్టాలు

- రోడ్డు పక్కన అనధికార పార్కింగ్తో నిత్యం ట్రాఫిక్ జామ్
- ప్రయాణికుల కోసం కూడలిలో ఆగుతున్న ప్రైవేటు వాహనాలు
- అలంకారప్రాయంగా మారిన బస్షెల్టర్



వారధి కూడలిలో అడ్డదిడ్డంగా వాహనాలను ఆపడంతో నిలిచిన ట్రాఫిక్

కృష్ణలంక(విజయవాడతూర్పు): జాతీయ రహదారిపై కనకదుర్గ వారధి కూడలిలో వాహనదారులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో వాహనాల అనధికార పార్కింగ్తో గుంటూరు వైపు వెళ్లే రహదారిలో ట్రాఫిక్ జామ్ నిత్యకృత్యంగా మారింది. జాతీయ రహదారి నుంచి బెంజిసర్కిల్ వైపు నుంచి బస్టాండ్ వైపు వెళ్లాలన్నా, బస్టాండ్, బెంజిసర్కిల్ వైపుల నుంచి గుంటూరు వైపు ప్రయాణించాలన్నా వారధి కూడల మార్గమే శరణ్యం. ఆర్టీసీ బస్సులు, ట్రావెల్స్ బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు నిత్యం వేల సంఖ్యలో ఈ కూడలి మీదుగా ప్రయాణిస్తుంటాయి. గుంటూరు, ఒంగోలు, వినుకొండ, పొదిలి, కనిగిరి, తెనాలి, రేపల్లె తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్ వరకు వెళ్లకుండా వారధి కూడలిలోనే ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులు, తదితర వాహనాలు ఎక్కి తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. ప్రయాణికులను ఎక్కించుకునేందుకు కూడలిలో రోడ్డు పక్కనే ఆటోలు, కార్లను గంటల తరబడి ఆపుతున్నారు. ఆర్టీసీ బస్సులు, ట్రావెల్స్ బస్సులను కూడా నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. వాహనాలను అడ్డదిడ్డంగా ఆపడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. కూడలిలో రోడ్డు పైనే వాహనాలను ఆపుతుండడంతో బెంజిసర్కిల్ వైపు నుంచి బస్టాండ్ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం సాయంత్రం వేళల్లో కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో



బస్షెల్టర్ వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూడలిలో నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయడమే కాకుండా వాహనాలు నిలుపరాదని, బస్ షెల్టర్ వద్దనే ఆపాలని, అలా కాకుండా వాహనాలు నిలిపితే రూ.2 వేల జరిమానా విధిస్తామని ట్రాఫిక్ పోలీసులు నిత్యం లౌడ్ స్పీకర్ ద్వారా హెచ్చరిస్తున్నా వాహనాలు నిలపడం మాత్రం ఆగడం లేదు. హెచ్చరికలు ప్రకటనకే పరిమితమవడం, జరిమానా విధించడం ఆచరణలో అమలు కాకపోవడంతో కూడలిలోనే వాహనాలు ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. పోలీసులు అటుగా వెళ్లినప్పుడే అక్కడ నుంచి వెళ్లిపోతారు. ఆ తర్వాత షరా మామూలే. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కూడలిలో ట్రాఫిక్ జామ్ అవకుండా, వాహనాలు నిలపకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్ షెల్టర్ వద్ద ఆగని బస్సులు

గుంటూరు వైపు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా వారధి కూడలి నుంచే ప్రయాణిస్తుంటారు. బస్సులు, ఆటోలు, కార్లు కూడలిలోనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్కు అంతరాయం కలుగుతోంది. కూడలిలో షెల్టర్ లేకపోవడంతో ఎండచ్చినా, వాన వచ్చినా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను గుర్తించిన గత ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం కూడలి సమీపంలో వీఎంసీ ఆధ్వర్యంలో బస్ షెల్టర్ నిర్మించింది. అప్పటి నుంచి బస్సులు అక్కడ ఆపకపోవడంతో షెల్టర్ అలంకారప్రాయంగానే మిగిలింది. బస్ షెల్టర్ వద్ద బస్సులు ఆపకుండా కూడలిలోనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. బస్సులకు తోడు ఆటోలు, కార్లు కూడా అక్కడే ఆపుతుండడంతో తరచూ ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడుతోంది. కూడలిలో వాహనాలు ఆపకుండా బస్ షెల్టర్ వద్దనే బస్సులు, ఇతర వాహనాలు ఆపి ప్రయాణికులను ఎక్కించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అలరించిన నృత్యాభినయం

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనక దుర్గానగర్లోని కళావేదిక మీద కళాకారులు ప్రదర్శిస్తున్న అంశాలు రసవత్తరంగా సాగుతున్నాయి. జి.నాగమణి బృందం భక్తి సంగీత కార్యక్రమాలు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. మీనాక్షి, శ్రీనివాస్, సీహెచ్.అజయ్కుమార్, యువ సంగీత కళాకారులు మల్లాది సింధురాగేశ్వరి, బి.సింధు బృంద సభ్యులు వాగ్గేయకార కృతులను ఆలపించారు. సంప్రదాయ నృత్యకార్యక్రమంలో భాగంగా చదలవాడ ఆనంద్, సీహెచ్ ఆనంద్, ఎం.పావని సాత్విక్ మహాదేవేశ్వర్, ఎ.సంతోష్, బి.భవాని, ఎం.విజయలక్ష్మి, కె.పవిత్ర, దీప్తి నరేష్, మాగలూరి త్రినాథాచారి, నాట్యాచార్యుడు ఎస్.వి.సత్యనారాయణ, పి.మంజూష తమ బృందంలోని చిన్నారులు, సీనియర్ కళాకారులు పలు అంశాలను ప్రదర్శించారు. చక్కని తల్లికి ఛాంగ్భళా, ఇదిగో భద్రాద్రి, పలుకుతేనియ తల్లి, బ్రహ్మమొక్కటే, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు తదితర కీర్తనలనలకు నృత్యాలను అభినయించారు. నిర్వాహకులు కళాకారులకు ప్రశంసా పత్రాలు, అమ్మవారి లడ్డూప్రసాదాలను అందజేశారు.






కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

మల్లేశ్వరస్వామి దర్శనానికి దూరం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవ వేళ ఇంద్రకీలాద్రిపై సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శన భాగ్యం కలిగినా మల్లేశ్వర స్వామి దర్శనం కలగలేదని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం బంగారు వాకిలి, రూ.300 క్యూలైన్లో అమ్మవారిని దర్శించుకున్న భక్తులను మహా మండపం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు పంపారు. అయితే మల్లేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాలని పలువురు భక్తులు మెట్ల మార్గంలోని పోలీసులను ఆరా తీయగా వారికి సరైన అవగాహన లేకపోవడంతో కిందకు వెళ్లిన తర్వాత స్వామి దర్శనం చేసుకోవచ్చని పంపించారు. మహా మండపం కిందకు వెళ్లిన తర్వాత మల్లేశ్వరాలయానికి చేరుకునే వీలు లేకపోవడంతో భక్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మెట్ల మార్గంలో కిందకు దింపే క్రమంలో స్వామి ఆలయానికి చేరుకునే అవకాశం లేదని చెబితే మరో మార్గంలో స్వామి వారి ఆలయానికి వెళ్లేవారమని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

సరస్వతీదేవి అలంకారంలో మహాశక్తి



మహాశక్తి అమ్మవారి దేవస్థానంలో సరస్వతీదేవి అలంకారం



విశాలాంధ్రరోడ్డులో సరస్వతీదేవి అలంకారంలో దుర్గాదేవి



దత్తపీఠంలో సరస్వతీదేవిగా మరకతరాజరాజేశ్వరి అమ్మవారు



సిద్ధార్థ ప్రాంగణంలో శ్రీ సరస్వతీదేవిగా అమ్మవారు



త్రిశక్తి పీఠంలో సరస్వతీదేవిగా కాళీమాత అమ్మవారు

కృష్ణలంక(విజయవాడతూర్పు): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా రాణిగారితోట, 18వ డివిజన్లోని శ్రీ మహాశక్తి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం జరుగుతుందని అడపా శేషు తెలిపారు. బస్టాండ్ సమీపంలోని శ్రీకాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తిపీఠం)లో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక విశాలాంధ్ర రోడ్డు చలసాని చౌక్లో శ్రీకనకదుర్గాదేవిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక దుర్గాదేవి అమ్మ వారి ఆలయం (ధనకొండ)పై అమ్మవారు సరస్వతీదేవిగా పూజలందుకున్నారు. కుంకుమ పూజలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గాష్టమి సందర్భంగా గురువారం సాయంత్రం దుర్గామల్లేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పటమట దత్తపీఠంలో..

పటమట(విజయవాడతూర్పు): మూలా నక్షత్రం సందర్భంగా స్థానిక దత్తపీఠంలోని మరకత రాజరాజేశ్వరి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బాలికలను గౌరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం 19 మంది సువాసినీలతో పూజలు చేశారు. మూడేళ్ల వయస్సు దాటిన చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సాయంత్రం సరస్వతీదేవి మందిరంలో అమ్మవారికి విద్యార్థులతో క్షీరాభిషేకం చేయించారు. దర్శిపేటలోని రాజరాజేశ్వరి లలితాపరమేశ్వరి ఆలయంలో ఉభయ దాతలు వడ్లమూడి వెంకటరావు, లక్ష్మి, వడ్లమూడి శ్రీనివాసరావు, లత ప్రత్యేక పూజలు చేశారు. వెలంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులతో కుంకుమపూజ చేయించి కొనకళ్ల విద్యధరరావుతో పుస్తకాల పంపిణీ చేశారు. చక్రవర్తి శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి భారతనాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది. గుంటూరు జెడ్పీ మాజీ చైర్మన్ పాటూరి నాగభూషణం కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు తాండవ రంగలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, కోశాధికారి యమ శివన్నారాయణ పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ కళాశాల వర్క్షాప్లో సరస్వతి పూజ చేస్తున్న ప్రిన్సిపాల్ విజయసారథి, అధ్యాపకులు



చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కొనకళ్ల విద్యాధరరావు

పాలిటెక్నిక్ కళాశాలలో సరస్వతీ పూజ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని వర్క్షాప్లో బుధవారం సరస్వతీదేవికి కుంకుమ పూజ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి, వర్క్షాప్ సిబ్బంది బి.బి.ఆర్.కె.ప్రసాద్, మధుసూదనరావు, వెంకటేశ్వరరావు, రాంబాబు, లచ్చిరామ్, నాగార్జున, రవి, జయరామ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ జరిగింది.

నవరాత్రి ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): సిద్ధార్థ హోటల్ మేనేజ్మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నారు. అమ్మవారు బుధవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. విద్యార్థులు సరస్వతీదేవి పూజలో పాల్గొన్నారు. బృందావనకాలనీలోని అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. షోరూమ్ అధినేతలు జాస్తి వెంకట భానుప్రకాష్, విష్ణుప్రియ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ద్విశత చండీయాగం



వన్టౌన్(విజయవాడపశ్చిమ): స్థానిక కేబీఎన్ కళాశాల ఆవరణలో ఉన్న శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగం బుధవారం ఏడో రోజు శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీ కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి వెయ్యి మంది మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చండీ సప్తసతి హోమంతో పాటుగా అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూలమంత్ర సంపుటితో చండీ హోమం నిర్వహించారు. రుద్ర, శ్రీరామ, ఆంజనేయ, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మహాలక్ష్మీ, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు గొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

రేఖ... నేటితో 70 నిండి 71లోకి అడుగుపెడుతోంది.
కాని మొన్న ఐఫా వేడుకలో వేదిక మీద ఆమె చేసిన 15 నిమిషాల నృత్యం చూస్తే వయసు 17 దగ్గరే ఆగిపోయిందని అనిపించింది.
రేఖ -
ఎన్నో ఆటుపోట్లు
జీవితపు ఎదురుదెబ్బలు ఎదుర్కొంది.
కాని ముందుకు సాగడం
సౌందర్య భరితంగా జీవించడమే
జీవిత పరమార్థం అని నిరూపిస్తూనే ఉంది.
కొంచెం కలత చెందితే విరక్తి అవతారం దాల్చే
నేటి యువత రేఖ నుంచి ఎంత నేర్చుకోవాలి?


ఏజ్... సెవెంటీన్


లైఫ్... సెవెంటీ ఎంఎం స్క్రీన్

పన్నీరద్దుకున్న పసిడి రేఖ

1993.

ఫిల్మ్‌ఫేర్ మేగజైన్ వారు చెన్నైలో జెమినీ గణేశన్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు బహూకరిస్తున్నారు. వేడుకలో దక్షిణాది దిగ్గజాలంతా ఉన్నారు. ప్రతిష్టాత్మకమైన సందర్భం. జెమినీ గణేషన్ స్టేజ్ మీదకు వచ్చారు. మైక్‌లో వినిపించింది- ఇప్పుడు జెమినీ గణేశన్‌కు అవార్డు బహూకరించవలసిందిగా రేఖను ఆహ్వానిస్తున్నాము...

చప్పట్లు మిన్నంటాయి. రేఖ స్టేజ్ మీదకు వచ్చింది. జెమిని గణేశన్‌కు అవార్డు ఇచ్చింది. జెమిని మైక్ అందుకుని 'నా కూతురు రేఖ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది'...

రేఖ ఊహ తెలిసినప్పటి నుంచి ఈ మాట కోసం ఎదురు చూస్తోంది. 'రేఖ నా కూతురు' అని జెమిని అనాలని ఎదురు చూసిన మాట. ఇంతకాలానికి విన్నమాట. రేఖ సంతోషంతో వెక్కివెక్కి ఏడ్చింది.

• • •

స్త్రీకి మగవాడి తోడు ఉండాలని భారతీయ సంప్రదాయం అంటుంది. అలా తోడు ఉండక తప్పని పరిస్థితులు మన దేశంలో ఉంటాయి. రేఖకు బాల్యం నుంచి కూడా తండ్రి తోడు లేదు. తల్లి పుష్పవల్లి, తండ్రి జెమిని గణేశన్ వివాహ బంధంలో లేకుండానే రేఖను కన్నారు. రేఖ తన బాల్యంలో 'అక్రమ సంతానం' గా నింద అనుభవించింది. పుష్పవల్లిని భార్యగా, రేఖను కుమార్తెగా స్వీకరించడానికి జెమిని సిద్ధంగా లేడు. బతుకు గడవడానికి కుమార్తెను సినిమాల్లో ప్రవేశ పెట్టింది పుష్పవల్లి. కాని మద్రాసులో రేఖను హీరోయిన్‌గా చేయడానికి ఎవరూ సిద్ధంగా లేరు- జెమిని భయంతో. అదీగాక పుష్పవల్లికి నటిగా ఉన్న రోజుల్లో హిందీలో వెలగాలని ఆశ ఉండేది. ఆ ఆశను కనీసం కుమార్తె అయినా నెరవేర్చాలని కోరుకుంది. అప్పటికే ఆమెకు మద్రాసులో చాలా బాధలు ఉన్నాయి. అందుకని తన చెల్లెల్ని తోడు ఇచ్చి రేఖను బొంబాయి పంపింది. పద్నాలుగేళ్ల అమ్మాయి రేఖ. ఏమీ తెలియని రేఖ. బొంబాయిని చూసి బెంబేలెత్తిపోయిన రేఖ.

• • •

1970లో నవీన్ నిశ్చల్ పక్కన హీరోయిన్‌గా నటించిన 'సావన్ భాదో' సినిమా విడుదలైంది. బొంబాయి పత్రికలన్నీ రేఖను తెర మీద చూసి ఫక్కున నవ్వాయి. నల్లగా, లావుగా ఉన్న రేఖను గేలి చేశాయి. 'అగ్లీ డక్‌లింగ్' అని పేరు పెట్టాయి. '33 ఇంచుల నడుము హీరోయిన్' అని ఎద్దేవా చేశాయి. రేఖకు ఇవన్నీ ఏమీ అర్థం కాలేదు- తాను సినిమాల్లో నటిస్తే ఇంటి దగ్గర కష్టాలు తీరుతాయి అన్న ఒక్క సంగతి తప్ప. పబ్లిసిటీ కోసం రేఖ చేత ఇంటర్వ్యూల్లో అవాకులు చవాకులు మాట్లాడించేవారు నిర్మాతలు. 'ముద్దు సీన్లు నటించే' అమ్మాయిగా రేఖకు పేరు పడింది. రేఖను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు.


ఐఫా వేడుకలో రేఖ నృత్యం

• • •

రేఖ బి-గ్రేడ్ సినిమాల్లో నటిస్తూ ఉంటే ఆ సమయానికి పరిచయమైన జితేంద్రలో ఆమె భవిష్యత్ భాగస్వామిని ఊహించుకుంది రేఖ. అయితే అతను రేఖతో స్నేహంగా ఉన్నా తన గర్ల్‌ఫ్రెండ్, ఎయిర్ హోస్టెస్ శోభనే వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఆ తర్వాత వినోద్ మెహ్రా ఆమెకు ఎంత దగ్గరయ్యాడంటే అతడిని పొందలేక రేఖ ఆత్మహత్యాయత్నం చేసిందన్న వార్తలు వచ్చాయి. తర్వాతి రోజుల్లో విలన్‌గా చేసిన కిరణ్ కుమార్ కూడా ఆమె బోయ్ ఫ్రెండ్‌గా ఉన్నాడు. ఈ దశలన్నీ దాటాక 1976లో 'దో అంజానే'లో అమితాబ్‌తో కలిసి నటించాక రేఖ జీవితం మారిపోయింది. జీవితాన్నీ, కెరీర్‌నీ సీరియస్‌గా తీసుకోవడం అమితాబ్ నుంచి రేఖ నేర్చుకుంది. ఆమె అమితాబ్‌ను పేరు పెట్టి ఎప్పుడూ పిలవదు. 'ఓ' (వారు/ఆయన) అంటుంది. పత్రికలు కూడా 'ఓ' అనే రాసేవి. అమితాబ్-రేఖల జోడి సూపర్ హిట్ అయ్యింది. ఆలాప్, ఖూన్ పసీనా, మొకద్దర్ కా సికిందర్, మిస్టర్ నట్వర్‌లాల్, రామ్ బలరామ్, సుహాగ్, సిల్‌సిలా. ఆమ్‌స్టర్ డామ్ డచ్ తులిప్ పూల మధ్య రేఖ, అమితాబ్‌ల మధ్య సాగే 'దేఖా ఏక్ ఖ్వాబ్ తో ఏ సిల్‌సిలే హుయే' పాట హిందీ సినిమాలకు సంబంధించి అత్యంత రొమాంటిక్ గీతంగా నేటికీ అభిమానులను సంపాదించుకుంటూనే ఉంది.

రేఖ టాప్ 10 సాంగ్స్

1. తేరే బినా జియా జాయేనా - ఘర్
2. ఆజ్‌కల్ పావ్ జమీ పర్ - ఘర్
3. సున్ దీదీ సున్ తేరేలియే - ఖూబ్‌సూరత్
4. సలామే ఇష్క్ మేరీ జాన్ - ముకద్దర్ కా సికిందర్
5. దిల్ చీజ్ క్యా హై - ఉమ్రావ్ జాన్
6. ఛోటి సి కహానీ సే బారిషోంకే పానీ సే - ఇజాజత్
7. పర్దేశియా ఏ సచ్ హై పియా - మిస్టర్ నట్వర్‌లాల్
8. మన్ క్యూ బెహకా రే బెహకా - ఉత్సవ్
9. గుమ్ హై కిసీ కే ప్యార్ మే - రామ్‌పూర్ కా లక్ష్మణ్
10. ఏ కహా ఆగయే హమ్ - సిల్‌సిలా

• • •

ప్రతికూలతలను రేఖ అనుకూలంగా మార్చుకుంటూ పోరాటం సాగిస్తూ వచ్చింది. ఒక నటికి దేహానికి మించిన పెట్టుబడి లేదని, దాని పోషణ ప్రథమమని గ్రహించిన మొదటి హీరోయిన్ రేఖ. ఇందుకు అమితాబ్ గైడెన్స్ ఉపయోగపడింది. బరువు తగ్గడం ఒక వ్రతంగా పెట్టుకున్న రేఖ నెలల తరబడి కేవలం యాలకులు కలిపిన పాలు తాగి బతికింది. బాలీవుడ్‌లో ఆమె వల్లే యోగా, ఏరోబిక్స్ పరిచయం అయ్యాయి. మేకప్ రహస్యాలు నటికి తెలిసి ఉండాలని లండన్ వెళ్లి మేకప్ కోర్సు చేసి వచ్చిందామె. ఇప్పుడు బాలీవుడ్‌లో ఎలా కనపడాలో, ఎలా ముందుకు సాగాలో, ఎలా ఇమేజ్‌ను పెంచుకుంటూ వెళ్లాలో ఆమెకు తెలుసు. అంతవరకూ సినిమా స్టిల్స్ మాత్రమే పత్రికలకు అందేవి. రేఖ ప్రత్యేకంగా ఫొటో షూట్స్ చేసి ఆ స్టిల్స్ పత్రికలకు ఇచ్చేది. ఇది బొత్తిగా కొత్త. అందువల్ల ఆమె ఎప్పుడూ కవర్ గర్ల్‌గా నిలిచేది. ఆ తర్వాత హీరో హీరోయిన్లు ఆ ట్రెండ్‌ను ఫాలో అవక తప్పలేదు.

• • •

రేఖ కేవలం ఒక గ్లామర్ డాల్ కాదు ఆమె మంచి నటి అని చెప్పే సినిమా వచ్చింది. 'ఘర్'. గుల్జార్ దర్శకత్వంలో 1978లో వచ్చిన ఈ సినిమా రేఖలోని సమర్థమైన నటిని ప్రేక్షకులకు చూపింది. ఈ సినిమాలోని పాటలన్నీ పెద్ద హిట్. ఆ తర్వాత హృషికేశ్ ముఖర్జీ దర్శకత్వంలో వచ్చిన 'ఖూబ్‌సూరత్' (1980) రేఖను యూత్‌కు బాగా దగ్గర చేసింది. దాంతోపాటు ఫిల్మ్‌ఫేర్ అవార్డు తెచ్చి పెట్టింది. అదే సంవత్సరం విడుదలైన 'ఉమ్రావ్ జాన్' రేఖ ఒక ఉత్కృష్టమైన నటిగా ప్రపంచానికి చాటింది. ఈ సినిమాకు జాతీయ ఉత్తమ నటి పురస్కారం దక్కాక ఇక రేఖ గురించి విమర్శకులు ఎప్పుడూ తక్కువ చేసే పరిస్థితి రాలేదు. రేఖ ఇప్పుడు అన్ని విధాలుగా పరిపూర్ణమైన నటి.

• • •

రేఖను చాలా తెలివితేటలతో, గ్లామర్‌తో, పరిశ్రమతో ఇండస్ట్రీలో నిలిచింది తప్ప నిజానికి ఇండస్ట్రీ ఆమె టాలెంట్‌ను ఎప్పుడూ పూర్తిగా ఉపయోగించుకోలేదు. పెద్ద నిర్మాణ సంస్థలూ పెద్ద దర్శకులు ఆమెను సపోర్ట్ చేయలేదు. శ్యామ్ బెనగళ్ 'కలియుగ్' (1981), గిరిష్ కర్నాడ్ 'ఉత్సవ్' (1984), ఆస్థా (1997) రేఖకు చెప్పుకోవడానికి మిగిలాయి. ఆ తర్వాత ఆమె యాక్షన్ సినిమాలకు మళ్లి 'ఖూన్ భరీ మాంగ్', 'ఫూల్ బనే అంగారే' వంటి సినిమాలు చేసి 'లేడీ అమితాబ్' అనిపించుకునే వరకూ వెళ్లింది. ఒక దశలో ఆమె అమితాబ్‌లాగా కాస్ట్యూమ్స్ కూడా ధరించేది.

• • •

రేఖ అన్‌స్టాపబుల్. అన్‌లిమిటెడ్. ఆమె 'కల్ హోనా హో','క్రిష్' వంటి సినిమాల్లో తల్లి/బామ్మ పాత్రలు పోషించినా ప్రేక్షకులు ఎప్పుడూ నల్లజుట్టు రేఖనే ఇష్టపడ్డారు. ఆమె తన ఆకృతిని, ఫిట్‌నెస్‌ని 70 ఏళ్ల వయసు వచ్చినా ఎప్పుడూ కోల్పోలేదు. నేటికీ ఆమె ప్రత్యేకమైన ఫొటోషూట్స్ చేస్తూ కవర్‌గర్ల్ గానే ఉంది. ఇలా హాలీవుడ్ నటీమణులకు చెల్లింది గానీ మన దేశంలో రేఖకు మాత్రమే సాధ్యమైంది.

రేఖ గొప్ప డాన్సర్. పాటలు బాగా పాడుతుంది. కవిత్వం రాస్తుంది. ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది. 'నేను ప్రేమిస్తే సంపూర్ణంగా ప్రేమిస్తాను' అనే రేఖ ప్రేక్షకులకు కూడా అంతే సంపూర్ణంగా ప్రేమ అందించడం వల్లే నేటికీ నిలబడి ఉంది.

ఈ గొప్ప యోధ, కళాకారిణి తెలుగువారి అమ్మాయి కూడా కావడం తెలుగువారు గర్వపడాల్సిన విషయం.

రేఖకు జన్మదిన శుభాకాంక్షలు. ●

మన(సు)లో మాట

గంజాయ్‌తోనే ఎంజాయ్ అనుకుంటున్నాడు!

మా అబ్బాయి బీటెక్ ఫైనల్ ఇయర్‌లో ఉన్నాడు. గత రెండు సంవత్సరాల నుంచి వాడు కాలేజీకి సరిగా వెళ్లడం లేదు. మూడీగా... చికాకుగా ఉంటున్నాడు. బ్యాక్‌లాగ్స్ ఉన్నాయి. ఇంటిని, ఒంటిని నీట్‌గా ఉంచటం లేదు. రూములో ఒంటరిగా ఉంటున్నాడు. ప్యాంట్ జేబులో ఏవో పొట్లాలు దొరికాయి. ఇవేమిటని నిలదీస్తే, అప్పుడు చెప్పాడు... తాను గంజాయికి అలవాటు పడ్డానని, గంజాయి లేకుండా ఉండలేనని. అది విని మేము చాలా షాకయ్యాం. ఒక్కడే అబ్బాయని వాడు అడిగిందల్లా కాదనకుండా ఇచ్చాము. మంచి స్టూడెంట్. చివరకు చదువంతా పోయి, ఇలా గంజాయికి బానిసయ్యాడని చాలా బాధగా ఉంది. వాళ్ళ ఫ్రెండ్స్ కూడా చాలామంది ఇలాగే గంజాయికి అలవాటు పడ్డారని చెప్పాడు. మా వాడిని ఈ గంజాయి మత్తులోంచి బయటపడేసే మార్గం చెప్పండి డాక్టరుగారూ!

– కృష్ణవేణి, విజయవాడ

మొదట సరదాగా స్నేహితులతో కలిసి ఆరంభించి, చివరకు ఇది ఒక పెద్ద సమస్యగా 'అడిక్షన్' స్థాయికి తీసుకెళ్తుంది. గంజాయి తీసుకున్నప్పుడు కిక్కు లోనవుతారు. అది ఊహల్లో విహరించి, గాలిలో తేలిపోయేటట్లు భ్రమలు, భ్రాంతులలో ముంచెత్తి చివరకు ఉన్మాద స్థితికి తీసుకెళ్తుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, తెలివితేటలు మందగించటంతో మొదలై... చివరకు 'కెన్నాబిస్‌సైకోసిస్' అనే తీవ్రమైన మానసిక రుగ్మతకు దారితీస్తుంది. ఇలాంటి వారిని తల్లిదండ్రులు త్వరగా గుర్తించి సరైన చికిత్స చేయిస్తే దాంట్లోంచి బయటపడతారు. సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో మందులు, కౌన్సెలింగ్ ద్వారా వీరిని పూర్తిగా బాగు చేయవచ్చు. అవసరమైతే 'డీ అడిక్షన్ రిహాబిలిటేషన్' కేంద్రంలో కొంతకాలం ఉంచాల్సి ఉంటుంది. మీకు దగ్గర్లోని మానసిక వైద్యుడిని సంప్రదిస్తే మీ అబ్బాయి ఈ ఊబిలోంచి బయటపడి, మళ్ళీ పూర్తిగా మామూలు మనిషి అయేట్లు వారు చేయగలరు. విష్ యు ఆల్ ది బెస్ట్.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com




రమాదేవి

* బతుకమ్మ

'చిత్తూ చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ ..'
'కలవారి కోడలు ఉయ్యాలో...
కడుగుతున్నది పప్పు ఉయ్యాలో...'
తెలంగాణ అంతటా బతుకమ్మల దగ్గర రమాదేవి భక్తి పాటలు మార్మోగుతుంటాయి. దేవాలయాల వద్ద దేవతల పౌరాణిక కథనాలు పాటల వెల్లువై ప్రవహిస్తుంటాయి. ఇరవై ఏళ్లుగా వెయ్యికి పైగా భక్తి, పురాణేతిహాసాల పాటలు పాడి అలరిస్తున్నారు హైదరాబాద్ వాసి రమాదేవి. దేవీ నవరాత్రుల సందర్భంగా రమాదేవి పంచుకున్న విశేషాలు.

ఊరూ వాడా ఉయ్యాల పాటనై

''బతుకమ్మ పండగకు మా ఊళ్లో అడుగుపెడుతూనే 'రామ రామ రామ ఉయ్యాలో ... రామ ఓ శ్రీరామ ఉయ్యాలో...' అంటూ నేను పాడిన పాటలు నాకు స్వాగతం పలుకుతుంటాయి. ముస్తాబైన ఆడవాళ్లందరూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ అవే పాటలను కోరస్‌గా పాడుతుంటారు. 'ఏమీమి పువ్వప్పునే గౌరమ్మ...' అంటూ పాట తర్వాత పాట వింటూ బతుకమ్మలను కొలుస్తుంటే ఆ సమయంలో నా గొంతు అందరి గొంతుక అవడం చెప్పలేనంత సంబురంగా అనిపిస్తుంటుంది. అంతటితో ఆగకుండా చుట్టూ ఉన్నవారంతా మైకులు ఆపేసి, నాచేత పాటలు పాడించుకుంటారు. నేనూ వారితో కలిసి పాడి, ఆడి ఆనందిస్తాను. నవరాత్రుల సందర్భంగా తెలంగాణ ఊరూవాడలా బతుకమ్మ ఎక్కడ కొలువుదీరినా అక్కడ నా పాట రూపంలో నేనుండటం ఈ జన్మకు నాకు దక్కిన అదృష్టం.

ప్రతి దైవానికీ...

నేను పుట్టి పెరిగింది కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో... డిగ్రీ వరకు చదువుకున్నాను. స్కూల్ రోజుల్లో జెండావందనం నుంచి ప్రతి వేడుకలో నా పాట ఉండేది. కాలేజీ రోజుల్లోనూ నా పాటలు విన్నవారు అక్కడక్కడా అవకాశాలు ఇచ్చేవారు. ఆ తర్వాత జానపద గీతాలు, పౌరాణికాలు, గణపతి, దుర్గ, శివుడు, రాముడు, అయ్యప్ప, సాయిబాబా... ఇలా ప్రతీ దైవానికి సంబంధించినవే కాదు గ్రామదేవతలపైనా పాటలు పాడాను. ఈ రికార్డ్స్ అన్నీ తెలంగాణ దేవాలయాల్లో నేటికీ వినిపిస్తుంటాయి. కొన్ని ప్రాంతాల ప్రత్యేకత, చారిత్రక కథనాల నేపథ్యంగా రచయితలు రాసిన పాటలు పాడాను. 20 ఏళ్లుగా ఈ పాటల తోటలో విహరిస్తున్నాను. వెయ్యికి పైగా పాటలు పాడగలగటం.. నాకు దక్కిన వరంగా భావిస్తున్నాను. ఇటీవల గణపతి పైన పాడిన 'గౌరమ్మ తనయుడు గణపతి చరితం వినరమ్మ..', దుర్గమ్మను స్తుతిస్తూ 'అష్టాదశ పీఠాలలోన ఆదిశక్తివి అయ్యి అవతరించినవో మా అమ్మ దుర్గమ్మ!' పాటలకు మంచి స్పందన వచ్చింది. జానపద బాణీలు, దేవుళ్ల కథనాలకు సంబంధించిన పాటలు అంటే రమాదేవి ఆల్బమ్ ఉంది అనేంతగా గుర్తింపు వచ్చింది.

చూసి నేర్చుకోమనేవారు..

వినాయక చవితి నవరాత్రుల్లోనూ నేను పాడిన పాటలకు డీజె మిక్స్ చేసి డీజె మిక్స్ చేసినవి పెడుతుంటారు. ముఖ్యంగా... అన్ని పూలను కొలుస్తూ ఉండే 'ఒక్కేసి పువ్వేసి సందమామ... అనే పాటను, చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ.... ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా!' ఉయ్యాల పాటలు బాగా ప్రాచుర్యం పొందాయి. ఇటీవల ప్రాచీన కాలం నుంచి వస్తున్న జానపద పాటలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. వీటిలో సీతాదేవి, శ్రీకృష్ణుడు, రాముడు, శివుడు మీద జానపద బాణీలలో ఉయ్యాల పాటలు ఉన్నాయి. నా గళానికి అవార్డులతో పాటు జానపద రత్న పేరుతో ఎంతో మంది చేత ప్రశంసలు అందుకున్నాను. చదువుకునే రోజుల్లో పాటలు పాడటానికి ఊరి నుంచి స్టూడియోలకు వెళుతుంటే మా అమ్మ కేతమ్మ, నాన్న ఓదేలుతో 'ఆడపిల్లను అలా బయటకు పంపిస్తున్నారు, ఇబ్బందులు పడతారు జాగ్రత్త!' అని కొంత మంది హెచ్చరించేవారు. కానీ, మా నాన్న వాళ్ల మాటలను పట్టించుకోలేదు. వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టిన. మంచి పేరు వచ్చిన తర్వాత ఊళ్లోవాళ్ల తమ పిల్లలకు నా గురించి గొప్ప గా చెప్పేవారు.


పెళ్లయిన తర్వాత పాటలు పాడటం తగ్గిపోతుంది అనుకున్నారు. కానీ, మా వారు కిశోర్ రచయిత, సింగర్ కూడా కావడం నా గళానికి మరింత మద్దతు లభించింది. పదేళ్ల క్రితం తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగావకాశం లభించింది. కానీ, నాలాంటి కళాకారులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని వదిలేశాం. ఇప్పుడు కళాకారులందరికీ ఉద్యోగావకాశాలు రావాలని కోరుకుంటున్నాం.'' అంటూ వివరించారు రమాదేవి.



– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

పూలతో ఆడపిల్ల ఇంటిని వెలిగిస్తుంది

నేడు సద్దుల బతుకమ్మ.
తెలంగాణ అంతటా స్త్రీలు పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో గౌరమ్మను కొలుస్తారు.
ఈ సందర్భంగా స్థానిక సంస్కృతిలో బతుకమ్మ విశిష్టతను వివరిస్తున్నారు ప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు జయధీర్ తిరుమలరావు.


జయధీర్ తిరుమలరావు

ఆదివాసీ సంస్కృతులలో అమ్మతల్లి ఆరాధన గురించి..?

ఆదివాసీ సంస్కృతిలో, వారి జీవితంలో స్త్రీ దేవతారాధన విడదీయరానిది. ఆదివాసీలలోనే కాదు శ్రామిక జీవితంలో, జానపద సమాజంలో అమ్మదేవతలు విశిష్ట స్థానంలో ఉంటారు. ఆదిమ కాలంలో వ్యవసాయానికి స్త్రీలే పునాది వేశారు. బీజం, క్షేత్రం స్త్రీ అనుభవం. పునరుత్పత్తి భావనకి స్త్రీ ఆలంబన. విత్తనాలు నాటడం, కలుపు తీయడం, కోత కోయడం అంతా స్త్రీలే. పొలంలో పంట తీయడం, గర్భంలో శిశువుని మోయడం రెండూ స్త్రీల వంతే. అంతేకాదు, దానికి కావలసిన భాషని సృజించుకున్నదీ స్త్రీయే. భాషని సాహితీకరించినదీ వారే. అనేక రకాల పాటలు పాడటం, పూజకు కావల్సిన కర్మకాండని తీర్చిదిద్దినదీ వారే. ఆ విధంగా స్త్రీ అనేక రంగాలలో, అనేక రూపాలతో తన శక్తి సామర్థ్యాలను వ్యక్తం చేసింది. మహత్తులను చూపి అమ్మదేవతారాధనకి ఆలంబన అయ్యింది. ఒక్కో అంశానికి ఒక్కో దేవతని ఏర్పరుచుకుని ఆయా రుతువులలో, పంటల కాలంలో దేవతారాధన చేశారు. ఆయా దేవతలను జ్ఞాపకం చేసుకోవడం, పూజించడం, రాబోయే తరాలకు వారిని జ్ఞాపకం చేయడం జరుగుతోంది. మాతృస్వామ్య వ్యవస్థ ప్రాధాన్యత అమ్మతల్లి ఆరాధనకు పట్టుగొమ్మ. అందులో భాగమే బతుకమ్మ. జన్మనిచ్చి, బతకడానికి అన్ని రకాలుగా చేయూతనిచ్చే ఆరాధన ఉంది. ప్రస్తుత కాలంలో ఆదివాసుల సమ్మక్క సారలమ్మలు, మైదాన ప్రాంతాల బతుకమ్మ పండగలు రోజు రోజుకూ ప్రాచుర్యం పొందుతున్నాయి.

ఈ పరంపరను ఎలా అర్థం చేసుకోవాలి?

బతుకమ్మ పండగ ప్రధానంగా తెలంగాణ స్త్రీల పండగ. దీనినే పూల పండగ అంటారు. ఎలాంటి బలి తంతు లేకుండా జరిగే క్రతువు. ఆ రోజు శాకాహారమే. బతుకమ్మలో ఆహారం, నృత్యం, పాట, సంగీతం అన్నీ సమపాళ్లలో కలగలసి ఉంటాయి. చాలారకాల ఆదివాసుల నృత్యాలు వర్తులాకార నృత్యాలే. పాల్గొనే స్త్రీలు అందరూ గుండ్రంగా చేరతారు. గుండ్రంగా కదులుతూ వంగుతూ, లేస్తూ, చప్పట్లు కొడుతూ చక్కని సంగీతాన్ని సృష్టిస్తారు. వారు తమ శరీర లయకు అనుగుణంగా పాటల్ని పాడతారు. ఒకరు ప్రధాన గాయనిగా పాటని అందుకుంటే మిగతావారు సామూహికంగా లయాత్మకంగా పాట పాడతారు. బొడ్డెమ్మ, బతుకమ్మ వంటి ఆటపాటలలో, పండగలో స్త్రీలదే ప్రధాన పాత్ర. ఈ పండగలో స్త్రీలు అందరూ సమానమే.

పాటల రాగం చేతులతో చప్పట్లు మోగించే శైలిలో పాడబడుతుంది. ఇదే విధానం తెలంగాణ అంతటా కనిపించడం విశేషం. ప్రతిరోజు కొత్త ధాన్యంతో రకరకాల పిండివంటలు చేసి అందరూ కలిసి పంచుకుని భుజించడం ఆనవాయితీ. ఇక్కడ కులాల, అంతస్తుల ప్రమేయం కనిపించదు. కాని మారిన కాలంలో కులాలవారీగా కట్టుకున్న అపార్ట్‌మెంట్ల మాదిరిగా అక్కడక్కడా కులభావన కనిపించడం మరీ ఆధునికం.

కాని బతుకమ్మ పండగలో స్త్రీల సంప్రదాయ బలం లోతు చాలా ఎక్కువ. అందుకే దేశంలోని వేరే రాష్ట్రాలలో జరిగే పూల పండగల కన్నా ఎంతో విలక్షణంగా, ప్రత్యేకంగా నేటికీ జరుగుతున్నది. ఈ పరంపర తెలంగాణకి ప్రత్యేకం. సుమారు వేయి సంవత్సరాల చరిత్ర దీనికి ఉందని చెప్పవచ్చు. పండగ సందర్భంగా సోదరిని పుట్టింటికి తీసుకురావడం అనే ఆచారం కూడా కొనసాగడం గమనించాలి.

బతుకమ్మ ఆంధ్ర, రాయలసీమలో ఎందుకు కానరాదు?

నిజానికి పూల పండగ మనదేశంలో కేరళ రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాలలో జరుపుతారు. విదేశాలలో కూడా జరుపుతారు. అంటే పూలను ప్రేమించడం, సేకరించడం, ఊరేగించడం, తలమీద ఎత్తుకుని తీసుకుపోవడం అనే ఆచారం ఉంది. కానీ తెలంగాణాలో జరిగే రీతి రివాజు మరెక్కడా కనపడదు. బతుకమ్మ పండగ విధానం కాదు. అది స్వభావం. దాని లక్ష్యం కుటుంబ అభివృద్ధి. స్త్రీని అత్తవారింటికి పంపి ఊర్కోవడం కాదు. పెళ్లి తదితర ఫంక్షన్లకి రావడం కాదు. హక్కుగా తల్లిగారింటికి వచ్చి పూలతో ఇంటిని వెలిగించడం ముఖ్యం. అన్న లేదా తమ్ముడు సోదరిని తోలుకుని వచ్చి గౌరవించడం, కట్నకానుకలను పెట్టడం తప్పనిసరి. ఇలాంటి సంప్రదాయాలు వేరే చోట్ల బలంగా కనబడవు. కాని పూలను పేర్చి పండగ చేయడం కృష్ణానది కింద చూశాను. ప్రకృతి ఆరాధన కూడా ఈ పండగలో ఒక ముఖ్య భాగం. నిండిన చెరువుల దగ్గర, కుంటల దగ్గర, జలాశయాల దగ్గర ఆట ఆడి ఆ నీటిలోనే పూలను కలుపుతారు. ఏ జలం ఆధారంగా పూసిన పువ్వులు ఆ జలానికే అంకితం కావడం ఒక గొప్ప తాత్వికత. ఇక్కడ ఆడపిల్లలు బొడ్డెమ్మలు ఆడతారు. ఆంధ్రాప్రాంతంలో గొబ్బెమ్మలు ఆడతారు.

తెలంగాణ గ్రామీణంలో దసరా ప్రత్యేకత ఏమిటి?

దసరా మంచికి, చెడుకి మధ్య జరిగిన యుద్ధం. జమ్మిచెట్టు చిన్నదే. కాని పాండవులు తమ ఆయుధాలు దానిపై దాచి ఉంచారు. కాబట్టి జమ్మి ఆకుని 'బంగారం' అంటారు. ఆ ఆకుని ఇచ్చిపుచ్చుకుని అలాయి బలాయి తీసుకుంటారు. అదేరోజు సాయంకాలం చాలా చోట్ల రావణుడి బొమ్మని తయారు చేసి, దానిని కొలుస్తారు. అలా కాకుండా చాలా ఆదివాసీ ప్రాంతాలలో సమూహాలలో రావణుడిని పూజిస్తారు. అక్కడ మనలా దసరా పండగ జరపరు.

తెలంగాణలో దసరా పండగ రోజున మద్యం, మాంసం తప్పనిసరి. బంధువులు, స్నేహితులతో కలిసి పేదలు సైతం పండగని ఘనంగా జరుపుకుంటారు. కుల భావన లేకుండా ఆలింగనం చేసుకుంటారు. కొన్ని తావులలో వైషమ్యాలు మరిచి కలసిపోతారు. బతుకమ్మ పండగకి ఇంటికి సోదరి వస్తుంది. దసరాకి అల్లుణ్ణి పిలుచుకుంటారు. లేదా సోదరిని దసరాకి అత్తగారింటికి పంపిస్తారు. ఆ విధంగా తెలంగాణలో దసరా అతి పెద్ద పండగ.

ఈ రెండు పండగలు ఒకే రుతువులో ఒకే వారంలో, ఒకదాని తరువాత మరొకటి జరగడం గమనించాలి. బతుకమ్మ స్త్రీల పండగ. దసరా ఒక రకంగా పురుష ప్రధానమైన పండగ. ●

సరస్వతీ నమస్తుభ్యం



మూల నక్షత్రం సందర్భంగా విజయనగరం జ్ఞాన సరస్వతి ఆలయంలో పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

విద్యాలక్ష్మీ నమోస్తుతే..



చదువుల తల్లి సరస్వతీదేవి జన్మనక్షత్రం మూల నక్షత్రం సందర్భంగా విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారు బుధవారం విద్యాలక్ష్మిగా దర్శనమిచ్చారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కవర్ కట్టు.. క్వాలిటీ పట్టు

పండ్లతోటల్లో నాణ్యమైన ఉత్పత్తి కోసం రైతులు ప్రస్తుతం కాయ దశలోనే కవర్లు కడుతున్నారు. దీనివల్ల కాయలకు తెగుళ్ల బెడద ఉండదని, నాణ్యమైన ఉత్పత్తి రావడంతో మంచి ధర లభిస్తోందని చెబుతున్నారు. అనంతపురం జిల్లా తిమ్మంపేటకు చెందిన రైతు నారపరెడ్డి తన జామతోటలో కాయలకు ఇలా కవర్లు కట్టాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



క్లుప్తంగా...

'సమాన పనికి సమాన వేతనం ప్రకటించాలి'

సాక్షి, అమరావతి: దసరా కానుకగా ఎన్టీఆర్ వైద్య మిత్రలకు సమాన పనికి సమాన వేతనం ప్రకటించాలని వైద్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 18 సంవత్సరాల నుంచి పథకం అమలులో కీలకంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. అయితే పథకం స్థానంలో బీమా ప్రవేశ పెడుతున్న క్రమంలో సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

20న రైతు నేస్తం అవార్డుల ప్రదానం

సాక్షి, అమరావతి: రైతు నేస్తం 20వ వార్షికోత్సవం సందర్భంగా 'రైతు నేస్తం' పురస్కారాలను వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విశేష ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన వారికి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వర్గీయ పద్మశ్రీ డాక్టర్ ఐ.వి.సుబ్బారావు పేరిట అవార్డులతో సత్కరించనున్నట్టు రైతు నేస్తం ఫౌండర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ ఏడాది ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తున్న 20 మంది రైతులను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈనెల 20న గన్నవరం సమీపంలోని ఆత్కూర్ గ్రామంలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందజేస్తామన్నారు. భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి నీతి ఆయోగ్ బృందం పర్యటన

సాక్షి, అమరావతి: ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలపై అవగాహన కోసం 8 మంది సభ్యులతో కూడిన నీతి ఆయోగ్ బృందం నేటి నుంచి రెండ్రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ బృందం 3 జిల్లాలలోని 7 గ్రామాల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించనుంది. నీతి ఆయోగ్ అగ్రి మెంబర్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ చందర్ నేతృత్వంలోని ఈ బృందంలో నీతి ఆయోగ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ నీలం పటేల్, ఐకార్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సురేష్ కుమార్ చౌదరి, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజ్బీర్ సింగ్, వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కమిషనర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ సింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మింగ్ సిస్టమ్స్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్, కేంద్ర వ్యవసాయ అనుబంధ విభాగం నుంచి పరేమల్ బనాఫర్, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి ఉన్నారు. ఈ నెల 10,11 తేదీల్లో ఏలూరు, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో బృందం పర్యటించనుంది.

అంబరాన్నంటే సిరిమాను సంబరం

పైడితల్లి ఉత్సవాలకు సిద్ధమవుతున్న విజయనగరం

14న తొలేళ్ల ఉత్సవం, 15న సిరిమానోత్సవం

సిరిమానోత్సవానికి 260 ఏళ్ల చరిత్ర

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి సిరిమాను సంబరానికి విజయనగరం సిద్ధమవుతోంది. ఊర్లకు ఊర్లే కదిలి వచ్చే ఈ జన జాతరతో విజయనగరం వీధులు ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిపోతాయి. దారులన్నీ జన సెలయేరులై విద్యలనగరివైపు సాగిపోతుంటాయి. కొలిచినవారికి కొంగు బంగారమై.. కోరిన కోర్కెలెల్లా నెరవేర్చే పైడిమాంబ అంటే ఉత్తరాంధ్రులకు అంత నమ్మకం మరి.. 260 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



విజయనగరం ప్రధానవీధిలో గత ఏడాది జరిగిన సిరిమానోత్సవం (ఫైల్)



సిరిమానుపై ప్రధాన పూజారి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ఉత్తరాంధ్రకే పరిమితం కాకుండా రాష్ట్ర పండుగగా వాసికెక్కింది. ఏటా విజయనగరం వీధుల్లో కనులపండువగా జరిగే ఈ జనజాతరకు లక్షలాది మంది తరలి వస్తారు. 260 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఉత్సవం నెల రోజుల పాటు జరుగుతుంది. మహిళలు ప్రతి రోజూ ఘటాలు నెత్తిన పెట్టుకుని అమ్మకు నివేదన చేస్తారు. ఆశ్వయుజ మాసంలో విజయదశమి మరుసటి సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ప్రకారం ఈనెల 14వ తేదీన తొలేళ్ల ఉత్సవం, 15వ తేదీన సిరిమానోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బొబ్బిలి యుద్ధం నేపథ్యంలో...

విజయనగరం రాజు పూసపాటి విజయరామగజపతిరాజు సోదరే పైడితల్లి. బొబ్బిలి సంస్థానంతో యుద్ధానికి వెళ్లవద్దని, తన మనసు కీడు శంకిస్తోందని సోదరుడిని వారించిందట. అయినా యుద్ధం ఆగలేదు. 1757 జనవరి 23న జరిగిన బొబ్బిలి యుద్ధంలో తాండ్ర పాపారాయుడు చేతిలో తన అన్న వీరమరణం పొందాడని తెలుసుకున్న పైడితల్లి విజయనగరం పెద్దచెరువులో ఆత్మార్పణ చేసుకుంది. సేవకుడైన పతివాడ అప్పలనాయుడికి కలలో కనిపించి ఆమె చెప్పిన ప్రకారం ఆ చెరువులో జాలర్లతో వెతికిస్తే విగ్రహం దొరికింది. అక్కడే గుడి కట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విజయనగరం రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న వనంగుడి అదే.

రసవత్తరంగా సిరిమానోత్సవం...

సిరిమానోత్సవం తిలకించడానికి ఈసారి ఐదు లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. సిరిమాను 55 నుంచి 60 అడుగుల పొడవుంటుంది. దాని చివరిభాగంలో ఇరుసు బిగించి పీట ఏర్పాటు చేస్తారు. ఆ పీటపై ఆలయ ప్రధాన పూజారి కూర్చుంటారు. సిరిమాను వేరొక చివర రథంపై అమర్చుతారు. సిరిమాను ఊరేగింపు మూడులాంతర్లు వద్ద గల పైడితల్లి అమ్మవారి గుడి నుంచి రాజాబజారు మీదుగా కోట వరకూ మూడుసార్లు సాగుతుంది. ఈ సిరిమాను ముందుండే బెస్తవారివల, పాలధార, తెల్ల ఏనుగు, అంజలి రథం ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. ఈ ఉత్సవానికి భక్తుల రద్దీ దృష్ట్యా 2వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయనగరం ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.



నెల రోజుల పండగ

సెప్టెంబర్ 20వ తేదీన పందిరి రాటతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అత్యంత అట్టహాసంగా జరిగే తొలేళ్ల ఉత్సవం, సిరిమానోత్సవం ఇందులో భాగమే. అలాగే ఈ నెల 22వ తేదీన తెప్పోత్సవం, 27న కలశ జ్యోతుల ఊరేగింపు, 29న ఉయ్యాలకంబాల ఉత్సవం, 30న చండీయాగం, పూర్ణాహుతితో పైడితల్లి అమ్మవారి జాతర ముగుస్తుంది. విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అమ్మవారి వనంగుడి, మూడులాంతర్లు జంక్షన్ వద్ద ఉన్న చదురుగుడిలో విశిష్ట కుంకుమార్చనలు, అభిషేకాలు నెల రోజులు కొనసాగుతాయి. నగరపాలక సంస్థ పరిధిలో 50 వార్డుల్లోని మహిళలు రోజుకొక వార్డు చొప్పున ఘటాలను సమర్పిస్తుంటారు. అమ్మవారికి చీర, రవికె, సారె ఇచ్చి చల్లదనం చేస్తారు. పప్పు బియ్యం, చలివిడి నైవేద్యంగా సమర్పిస్తారు.

పెండింగ్‌లోనే 2.79 లక్షల మంది రైతుల ఈ కేవైసీ

- వీరంతా విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉన్నారంటున్న అధికారులు
- 10 నుంచి రైతు సేవా కేంద్రాల్లో ఈ క్రాప్ జాబితాలు
- 16వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం
- 18న తుది జాబితా.. 22వ తేదీ వరకు రశీదులు



బాపట్ల జిల్లా పెదలంక రైతు సేవా కేంద్రంలో ఈ కేవైసీ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

సాక్షి, అమరావతి: ఈ క్రాప్ ముగిసింది. ఈకేవైసీ మాత్రం ఇంకా సాగుతూనే ఉంది. ఈ క్రాప్ ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా రైతు సేవా కేంద్రాల్లో (ఆర్బీకేల్లో) ప్రదర్శించనున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జాబితాలను ప్రదర్శిస్తారు. అదే సమయంలో రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తారు. 18న తుది జాబితాలు ప్రదర్శిస్తారు. 18 నుంచి 22వ తేదీ వరకు రైతులకు నేరుగా రశీదులు అందించడంతోపాటు వారి ఫోన్లకు డిజిటల్ అక్నాలెడ్జ్‌మెంట్లు పంపుతారు. మరోపక్క ఈ కేవైసీకి గడువు ముగిసినప్పటికీ, ఇంకా 2,78,953 మంది (5 శాతం) రైతుల ఈకేవైసీ నమోదు చేయాల్సి ఉంది. ఈకేవైసీ నమోదుకు వీరు ఆసక్తి చూపడంలేదని, వీరిలో చాలా మంది పొరుగు రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించిన వ్యవసాయ శాఖ.. ఇకపై పొడిగించేది లేదని చెబుతోంది.

మొక్కుబడిగా సూపర్ చెకింగ్

ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన, పట్టు తదితర పంటలన్నీ కలిపి 1.34 కోట్ల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 96.89 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఆ మేరకు ఈ క్రాప్ నమోదుతో పాటు వీఏఏలు, వీఆర్వోల అథంటిఫికేషన్ 100 శాతం పూర్తయింది. రైతుల ఈకేవైసీ మాత్రం 95 శాతం నమోదు చేశారు. ఇంకా 4,61,339 ఎకరాలలో పంటలకు 2,78,953 మంది రైతుల ఈ కేవైసీ నమోదు చేయాల్సి ఉంది. ప్రస్తుతం మండల, జిల్లా అధికారుల సూపర్ చెక్ జరుగుతోంది. ఎంఏవోలు, తహసీల్దార్లు 10 శాతం, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు 5 శాతం, జాయింట్ డైరెక్టర్లు 3 శాతం, జాయింట్ కలెక్టర్లు 2 శాతం, కలెక్టర్ స్థాయి అధికారులు ఒక శాతం చొప్పున ర్యాండమ్‌గా తనిఖీ చేస్తున్నారు. ఈసారి వరదలు, వర్షాల వల్ల దెబ్బతిన్న పంట నష్టం అంచనాలు రూపొందించే పనిలో యంత్రాంగమంతా నిమగ్నమవడంతో ర్యాండమ్ చెకింగ్ ఆలస్యమై, ఈ క్రాప్ గడువు ముగిసే వరకు ప్రారంభించలేదు. దీంతో లోటుపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండాపోయింది.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని అమలుచేయాలి
- అనకాపల్లి, గాజువాకలో ర్యాలీలు



అనకాపల్లిలో వలంటీర్ల ర్యాలీ

అనకాపల్లి/గాజువాక: రాష్ట్రంలో వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని.. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీని తక్షణమే అమలుచేయాలని అనకాపల్లిలో ఏపీ ప్రజా గ్రామ, వార్డు వలంటీరు స్టేట్ అసోసియేషన్ జిల్లా నాయకులు వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ.. గాజువాకలో ఆంధ్రప్రదేశ్ వలంటీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి దీప్తి డిమాండ్ చేశారు. అనకాపల్లిలో సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నెహ్రూచౌక్ వరకూ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టగా పాతగాజువాకలో ప్రారంభమైన ర్యాలీ జాతీయ రహదారి మీదుగా 100 అడుగుల రోడ్‌లోని జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.10 వేల జీతం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని 100 రోజుల పాలనలో అమలుచేయలేదన్నారు. వలంటీర్ల నాలుగు నెలల బకాయి జీతాలు తక్షణమే విడుదల చేయాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్లపాటు ప్రజలకు సేవచేసిన వలంటీర్ల పట్ల ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కరోనా సమయంలో తమ ప్రాణాలకు తెగించి పనిచేశామని వారు గుర్తుచేశారు. ప్రభుత్వం తమ హామీని నిలబెట్టుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వలంటీర్ల సంఘాల నేతలు, సీఐటీయూ నేతలూ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన తెలంగాణ అధికారులు



ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శించిన ప్రతినిధి బృందం


సాక్షి, అమరావతి/తెనాలి: తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఉన్నతాధికారుల బృందం రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బుధవారం సందర్శించింది. తెలంగాణ సీఎం కార్యదర్శి జి.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయశాఖ డైరెక్టర్ బి.గోపి, డిప్యూటీ డైరెక్టర్ కె.శివప్రసాద్, డైరెక్టర్ బి.జమునారాణి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ (ఆగ్రోనమి) డా.ఎ.వి.రామాంజనేయులతో కూడిన ఈ బృందం తొలుత గన్నవరం స్వర్ణభారతి ట్రస్ట్ శిక్షణా భవన్‌లో ఏపీసీఎన్ఎఫ్ అధికారులతో భేటీ అయ్యారు. గడిచిన ఐదేళ్లుగా రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు ఏ స్థాయిలో విస్తరించాయో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే తెనాలి రూరల్ మండల గ్రామం ఎరుకలపూడిలో ప్రకృతి వ్యవసాయంలో మాగాణిలో సాగుచేస్తున్న వరిపైరును, గట్లపై కూరగాయలను పండిస్తున్న రైతు విజయలక్ష్మి వ్యవసాయ క్షేత్రాన్ని కూడా సందర్శించారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 82,043 మంది స్వామిని దర్శించుకున్నారు. 30,100 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.10 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చదువుల తల్లిగా శక్తిస్వరూపిణి



శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. బుధవారం వివిధ ఆలయాల్లో అమ్మవారు చదువుల తల్లి సరస్వతీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తి రక్తబీజాక్షరి, బండాసుర వధ అవతారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి, రంగుల గోపురం వరకు ఊరేగించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో ఉత్సవమూర్తి కాళరాత్రి అలంకరణలో దర్శనమిచ్చారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ కోసం నగరంలోని విశాలాక్షినగర్‌కి చెందిన ఎ.ఎస్.ప్రకాశరావు, లలిత దంపతులు బుధవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆ మొత్తానికి చెక్కుని ఆలయంలో సూపరింటెండెంట్ త్రిమూర్తులకు అందజేశారు. ఆలయం తరఫున దాతకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

సరస్వతీ కటాక్షంతో విజయాలు తథ్యం



రాయవరం: సరస్వతీ కటాక్షం తోడుంటే విజయాలు తథ్యమని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. పీఠానికి వచ్చిన భక్తులను ఉద్దేశించి గాడ్ బుధవారం ప్రసంగించారు. జ్ఞాన ప్రదాయిని అయిన సరస్వతీమాత కరుణా కటాక్షాలు కలగడం పూర్వ జన్మ సుకృతంగా పేర్కొన్నారు.

ఆలయానికి రూ.30 లక్షల భూమి దానం



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలోని బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి నగరానికి చెందిన రెడ్డి ఆదిమూర్తి, అనురాధ దంపతులు రూ.30 లక్షల విలువైన 50 సెంట్ల భూమిని బుధవారం దానం చేశారు. దానపట్టాను కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు సమక్షంలో అందజేశారు.

సింహగిరిపై ఘనంగా ఆయుధపూజ



సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విజయదశమి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయుధపూజ చేశారు. స్వామి ఆయుధాలైన గద, ధనస్సు, బాణం, కత్తి, పరశురామ గొడ్డలి, ఖైజార్ తదితర ఆయుధాలకు సింహవల్లీ తాయారు సన్నిధిలో ఉంచి పూజలు చేశారు.

విద్యా సమాచారం

మహిళావర్సిటీలో కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా యూనివర్సిటీలో పలు యూజీ కోర్సులకు గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ సువర్ణలతాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ, ఒకేషనల్ న్యూట్రిషన్ అండ్ హెల్త్‌కేర్ సైన్స్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అపెరల్ డిజైన్, బ్యాచులర్ ఆఫ్ సైన్స్ ఇన్ స్టాటిస్టిక్స్, బ్యాచులర్ ఆఫ్ సోషియల్ వర్క్, మాస్టర్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

బీ ఫార్మసీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జరిగిన బీ ఫార్మసీ మూడో సెమిస్టర్, డీపీఈడీ రెండో సెమిస్టర్, మాస్టర్ ఆఫ్ డేటా సైన్స్ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

14న తెనాలి ఐటీఐ కళాశాలలో అప్రెంటీస్ మేళా

తెనాలి అర్బన్: తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 14న పీఎం నేషనల్ అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రావి చిన్నవెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు తమ బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్‌లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోలతో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని సూచించారు.

డీఎస్సీ శిక్షణకు అవకాశం


నెహ్రూనగర్: సాంఘిక, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 5,050 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సోషల్ వెల్ఫేర్ డీడీ డి.మధుసూదన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

40 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్‌లో 40 ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాల్లో ల్యాబ్ టెక్నీషియన్లు-3, ఫార్మసిస్టులు-11, డేటా ఎంట్రీ ఆపరేటర్లు-11, శానిటరీ అటెండర్లు-15 ఉన్నట్లు వివరించారు. గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలేశ్వరం: ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన ప్రభుత్వ, ప్రభుత్వేతర ఆర్థికసాయం దొరకని విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రతిభ స్కాలర్‌షిప్ ట్రస్టు కార్యదర్శి ఎండీ ఇబ్రహీంఖాన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 సంవత్సరంలో ఐఐటీ, నీట్, జేఈఈ, మెడిసిన్, ఇంజినీరింగ్‌ల్లో చేరటానికి ఎంసెట్‌లో పదివేలలోపు ర్యాంక్ సాధించి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారి ప్రతిభ ఆధారంగా కోర్సు పూర్తయ్యేవరకు ఉపకార వేతనాలు అందజేస్తామని తెలిపారు. దరఖాస్తులను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ప్రతిభస్కాలర్‌షిప్.కామ్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను వచ్చేనెల 11లోగా వరుపుల చిట్టిబాబు, శ్రీగణపతి వెంకటసాయి బ్యాంకర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా, ఏలేశ్వరం-533429 చిరునామాకు పంపాలని ఆయన తెలిపారు.



చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న పండితుడు. వేడుకలకు హాజరైన భక్తులు

బాసరలో అక్షరాభ్యాసాలు

నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతీ పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. నవరాత్రుల్లో బుధవారం అమ్మవారి మూలా నక్షత్రం కావడంతో ఘనంగా పూజలు నిర్వహించారు. మూలా నక్షత్ర శుభఘడియల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శుభముహూర్తాన తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు జరిపించారు.

- భైంసా/బాసర

బతుకమ్మ పుట్టినిల్లు!

పర్వతగిరి మండలంలోని చౌటపల్లి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు

- పదెకరాల ప్రాంగణంలో ఇక్కడ గుడి నిర్మించేందుకు ప్రణాళికలు
- ఇప్పటికే విరాళాల సేకరణలో శ్రీశాంతికృష్ణ సేవా సమితి
- నాలుగు నెలల్లో పనులు ప్రారంభించేందుకు కసరత్తు



చౌటపల్లిలో రామయ్య ఆచార్యులు నిర్మించిన చెరువు

సాక్షి, వరంగల్: బతుకమ్మ పండుగ అంటేనే తెలంగాణ పూల వేడుక. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే ఈ వేడుకలకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందింది వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామం. ఈ మేరకు పలు చారిత్రక ఆధారాలున్నాయి. ఈ గుర్తింపునకు చిహ్నంగానే ఆ ప్రాంతంలో పదెకరాల విస్తీర్ణంలో బతుకమ్మ ఆలయం నిర్మించే దిశగా అడుగులు పడుతున్నాయి. శ్రీశాంతి కృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్వ కళావిరాట్ డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య.. ఈ గ్రామం బతుకమ్మకు పుట్టినిల్లని పలు చారిత్రక పరిశోధనల్లో తేల్చారు. అటు రాష్ట్ర దేవాదాయ శాఖ, ఇటు కేంద్ర పర్యాటక శాఖను సమన్వయం చేసుకుంటూ, ఎన్ఆర్ఐలు, ప్రజల నుంచి విరాళాలు సేకరించే బృహత్తర కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. అంతా అనుకూలిస్తే మరో నాలుగు నెలల్లో ఈ ఆలయ నిర్మాణం ప్రారంభించే దిశగా అడుగులు పడతాయని అక్కడి ప్రజలు చెబుతున్నారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణమైతే ఓవైపు ఆధ్యాత్మికంగా, మరోవైపు పర్యాటకంగా చౌటపల్లి విరాజిల్లనుంది. ఇప్పటికే చారిత్రక నగరంగా పేరుగాంచిన వరంగల్ జిల్లాలో మరో చారిత్రక ప్రాంతం చేరనుంది.

రూ.100 కోట్లతో ఆలయ నిర్మాణం

గ్రామంలోని పదెకరాల్లో నిర్మించే బతుకమ్మ గుడికి రూ.100 కోట్ల వ్యయం కానుంది. ఇందులో రూ.70 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించనుండగా.. రూ.30 కోట్ల మేరకు భక్తుల నుంచి విరాళాలు సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటికే చౌటపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేసిన బెంగళూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ దాఖోజు రవిశంకర్ దాదాపు రూ.15 కోట్లు బతుకమ్మ గుడి నిర్మాణానికి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నారు.

బతుకునిచ్చిన అమ్మ!

17వ శతాబ్దంలో తెలంగాణను నిజాం నవాబులు పరిపాలిస్తున్నారు. ఆ సమయంలో ఓరుగల్లు పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన వంగాల రామయ్య 16వ ఏటనే నిజాం ప్రభువులకు చెందిన వెండి నాణేల ముద్రణ కర్మాగారంలో పనిచేస్తూ అనతికాలంలోనే పాలకులను ఆకట్టుకొని కొంత మాన్యం పొందారు. ఆ ప్రాంతమే ఇప్పటి పర్వతగిరి మండలంలోని చౌటపల్లి. రామయ్య ఆ స్థలంలో ప్రజల సౌకర్యార్థం చెరువు తవ్వించి వసతులు కల్పించారు. సౌటమట్టి కలిగిన ప్రాంతం కనుక సౌటపల్లిగా, కాలక్రమంలో చౌటపల్లిగా మారింది. కొంత కాలానికి చౌటపల్లి గ్రామ శివారు గ్రామాల ప్రజలు కలరా సోకి చనిపోతున్నారని తెలిసి గ్రామ ప్రజలు రామయ్యను సంప్రదించారు. సమస్య పరిష్కారానికి ఆయన గాయత్రిదేవిని ఉపాసించాడు. ఆ తల్లి నామస్మరణలో మూడు రోజులు గడిపాడు. దీంతో గాయత్రీమాత ఆయనకు స్వప్నంలో కనిపించింది. అశరీర వాణిగా గ్రామ సౌభాగ్యానికి తన సంతానాన్ని ఆర్పించాలని, ప్రత్యేక పూజా విధానం, పాత్ర కాని పాత్రలో ఎంగిలిపడని పూలను పేర్చి గౌరీమాత స్వయంగా వెలుగొందిన గుమ్మడి పూలను పేర్చాలి. పేర్చిన పూలపై పెట్టి గౌరీమాతను నవదినాలు గ్రామంలో అందరూ కలిసి పూజించాలని ప్రబోధించినట్లు ప్రచారంలో ఉంది. బతుకునీయమ్మా.. బతికించమ్మా అనే పదాల నుంచే బతుకమ్మ అవిర్భవించిందని చెబుతున్నారు. దీనిపై చారిత్రక పరిశోధన చేసిన డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య.. ఈ వివరాలన్నీ పుస్తక రూపంలోకి తెచ్చారు.



చౌటపల్లిలో రుద్రమదేవి నిర్మించిన వీరుని శిలా విగ్రహం

యాదాద్రి తరహాలోనే బతుకమ్మ గుడి..



40 ఏళ్ల పాటు నేను చేసిన చారిత్రక పరిశోధనలతో చౌటపల్లి బతుకమ్మ పుట్టినిల్లుగా తేలింది. అందుకే ఇక్కడా యాదాద్రి తరహాలోనే బతుకమ్మ గుడిని నిర్మించాలనుకుంటున్నాం. ఈ గుడి నిర్మాణ నమూనాకు యాదాద్రి టెంపుల్ డిజైనర్ ఆనంద్‌సాయి, స్థపతిగా పద్మశ్రీ వేణు ఆనందాచార్య వ్యవహరిస్తారు. తెలంగాణ తల్లి రూపశిల్పి బైరోజు వెంకటరమణాచార్యులు (బీవీఆర్ చార్యులు) ఇప్పటికే బతుకమ్మ చిత్రపటాన్ని విడుదల చేశారు. 2019లోనే బతుకమ్మపై బృంద నృత్యం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించాం. బతుకమ్మ గుడి నిర్మాణం పూర్తయ్యే వరకు అకుంఠిత దీక్షతో పనిచేస్తా.

- డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య,
శ్రీ శాంతికృష్ణ సేవా సమితి
వ్యవస్థాపక అధ్యక్షుడు

అంతర్రాష్ట్ర క్లోరల్‌హైడ్రేట్ ముఠా గుట్టురట్టు

- కల్తీకల్లు తయారీకి వినియోగించే క్లోరల్‌హైడ్రేట్ సరఫరా చేస్తున్న ముఠా
- మహారాష్ట్రలో కీలక వ్యక్తుల అరెస్టు
- వి.బి.కమలాసన్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కల్తీ కల్లు తయారీకి వినియోగించే క్లోరల్‌హైడ్రేట్ (సీహెచ్) సరఫరా చేసే అంతర్రాష్ట్ర ముఠా గుట్టును ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలోని పలు ప్రాంతాల్లో నిషేధిత క్లోరల్‌హైడ్రేట్ రసాయనాన్ని కల్తీ కల్లుగా మార్చి అమ్మకాలు చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గతంలో 560 కిలోల క్లోరల్‌హైడ్రేట్ పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు అందులోభాగంగా ఈ కేసులో ఎనిమిది మందికి సంబంధాలు ఉన్నాయని కేసు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరి కోసం అధికారులు మహారాష్ట్రలోని నవీ ముంబై కలోజా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎంఐడీసీ చీవండి ప్రాంతంలో రాజ్‌బాయ్ అలియాస్ రాజు పొన్నం అనే వ్యక్తి ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో 2 కిలోల సీహెచ్ స్వాధీనం చేసుకున్నారు. రాజు ఇచ్చిన సమాచారంతో బుర్ర రమేష్, రాజ్‌కుమార్ ఇళ్లపై దాడి చేయగా 54 కిలోల సీహెచ్ లభించింది. ఈ కేసులో రామాగౌడ్, రాజ్‌బాయ్, అక్కం మధుగౌడ్, రవీందర్‌రెడ్డి, గుండేల్లి బాల పవన్‌గౌడ్, సారా నరేష్ గౌడ్, బండారి రాజ్ కుమార్, వెంకటరమణ నిందితులుగా ఉన్నారు.

రూ.10 వేల విలువైన మందుల స్వాధీనం

ఎటువంటి అర్హత లేని వ్యక్తులకు ఔషధాలు సరఫరా చేస్తే హోల్‌సేలర్లు, డీలర్లపై కాస్మెటిక్స్ చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. లైసెన్స్ ఉందా..లేదా..అని నిర్ధారించుకున్న తర్వాతే మందులు సరఫరా చేయాలని సూచించారు.



వరంగల్ కాశీబుగ్గ ప్రాంతంలో ఎలాంటి అర్హతలు, అనుమతి లేకుండా గుర్రం సదానందం సుహానా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం డీసీఏ అధికారులు ఆ సెంటర్‌పై దాడి చేసినట్లు ఆయన తెలిపారు. రూ.10 వేల విలువ చేసే మందులను సీజ్ చేసినట్లు వెల్లడించారు.



ఘనంగా బతుకమ్మ: మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరుపుకొనే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పూల పండుగ సద్దుల బతుకమ్మను తెలంగాణ ప్రజలు అత్యంత వైభవంగా, ఘనంగా జరుపుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో ఆయన ఆకాంక్షించారు.

ఆడబిడ్డల అపురూప పండుగ: సీతక్క



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ ఉత్సవానికి ఘనమైన ముగింపు పలికే సద్దుల పండుగ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డలకు అపురూపమైన పూల పండుగ బతుకమ్మ సంబరాలను తొమ్మిది రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోవడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. బతుకమ్మ స్ఫూర్తితో ప్రకృతిని, చెరువులను కాపాడుకుందామని సీతక్క కోరారు.

బతుకమ్మ స్ఫూర్తితో ముందుకు: సురేఖ



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ పండుగ స్ఫూర్తితో.. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో బతికేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తోందన్నారు. గురువారం బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులు, ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు.

కెనడాలో ఘనంగా బతుకమ్మ

టీడీఎఫ్ చైర్మన్ సురేందర్ పెద్ది, ప్రెసిడెంట్ జితేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కెనడాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కెనడాలోని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) నేతృత్వంలో తంగేడు సాంస్కృతిక సంస్థ ఈ వేడుకలను టొరంటోలోని బ్రాంప్టన్ వేదికగా సెకండరీ స్కూల్‌లో నిర్వహించింది. అక్కడ స్థిరపడిన వందలాదిమంది తెలంగాణ వాసులు కుటుంబాలతో సహా హాజరై బతుకమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకొన్నారు. పుట్టి పెరిగిన తెలంగాణ నేలకు వేల మైళ్ల దూరంలో ఉన్నా, తమ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించాలని టీడీఎఫ్ చైర్మన్ సురేందర్ పెద్ది, ప్రెసిడెంట్ జితేందర్‌రెడ్డి గార్లపాటి కోరారు. కెనడాలో పుట్టిన పిల్లలకు పండుగల ప్రాధాన్యం తెలియజేయాలనే ఉద్దేశంతో ఏటా బతుకమ్మతో సహా బోనాలు, ఇతర పండుగలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రకృతి అందాలు, పర్యావరణంతో అలరారే కెనడాలో లభించే రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు పండుగ సంబరాలకు మరింత వన్నె తెచ్చాయన్నారు. కెనడాలో స్థిరపడినా తమ మూలాలు, అస్థిత్వం కొనసాగించాలనే ఉద్దేశంతో ఇరవై ఏళ్లుగా తెలంగాణ ఉత్సవాలను, బతుకమ్మ పండుగను ఏటా నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో టీడీఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ శ్రీకాంత్ నేరవేట్ల, వైస్ ప్రెసిడెంట్ ప్రమోద్ ధర్మపురి, సుష్మ సాయి, అమితారెడ్డిలు, వెంకట రమణా రెడ్డి మేద, తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ చెల్లింపు పేరుతో కోట్లు కొట్టేసిన
సైబర్ నేరగాడు అరెస్టు

- ట్యాక్స్ చెల్లింపు పేరుతో రూ.7.19 కోట్లు వసూలు
- బెంగళూరులో సైబర్ నిందితుడిని అరెస్ట్ చేసిన టీజీసీఎస్‌బీ

సాక్షి, హైదరాబాద్ : విదేశాల నుంచి విరాళాల రూపంలో వచ్చిన నగదు తీసుకోవాలంటే కస్టమ్స్ అధికారులకు ట్యాక్సులు చెల్లించాలని నమ్మించి ఒక బాధితుడి నుంచి రూ.7.19 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాడిని టీజీసైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) అధికారులు అరెస్టు చేశారు. బెంగళూరులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నల్లగొండ జిల్లాకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి తన వ్యాపార భాగస్వామి అయిన గిరి ద్వారా బెంగళూరుకు చెందిన సునీల్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. సునీల్ కార్పొరేట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ వ్యాపారం నిర్వహిస్తుంటాడు. అయితే తనకు తెలిసిన వారికి విదేశాల నుంచి విరాళాల రూపంలో పెద్ద మొత్తంలో నగదు వచ్చిందని బాధితుడిని నమ్మించాడు. విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు నగదు మొత్తం పట్టుకున్నారని, ట్యాక్సులు చెల్లిస్తే నగదు విడుదల చేస్తారని నమ్మించాడు. కస్టమ్స్, ఇతర విభాగాల పేరుతో నకిలీ పత్రాలు వాట్సాప్‌లో చూపించాడు. సునీల్ మాటలు నమ్మి గతేడాది ఆగస్టు నుంచి ఈ సంవత్సరం ఏప్రిల్ వరకు 10 నెలల్లో 80 బ్యాంకు ఖాతాలకు 280 దఫాల్లో రూ.7.19 కోట్లు పంపారు. అందులో సునీల్ పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాకు రూ.38.50 లక్షలు బదిలీ చేశాడు. కస్టమ్స్ ట్యాక్సులు, ఇతర చెల్లింపుల పేరుతో మొత్తంగా బాధితుడి నుంచి రూ.7.19 కోట్లు వసూలు చేసి ఎంతకీ తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు నిందితుడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.



‘బతుకమ్మ’ కాంతులు

పూల పండుగకు హైదరాబాద్ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. గురువారం జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సచివాలయం, ట్యాంక్‌బండ్ తదితర భవనాలు, ప్రదేశాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.



దేశమంతటా పెద్దఎత్తున జరుపుకొనే పండగల్లో ఒకటైన 'దసరా'ను పదిరోజుల పాటు వేడుకగా జరుపుకుంటారు. అందులో భాగంగా ఆ అమ్మను సేవించడం, ఆమె కొలువు తీరి ఉన్న ప్రాంతాలను దర్శించుకుని భక్తితో తన్మయులం కావడం సహజం. అందుకే ఈ పండుగ రోజులలో దేశ వ్యాప్తంగా వెలసిన అష్టాదశ శక్తిపీఠాలు, అమ్మవారి ఆలయాలు భక్తజన సంద్రాలుగా మారతాయి. అయితే ఇలా విభిన్న పేర్లతో, వేర్వేరు రూపాల్లో ఆయా ప్రాంతాల్లో కొలువైన ఆ ఆదిపరాశక్తి నామాల మీదుగా ఏకంగా కొన్ని నగరాలు... ఆ మాటకొస్తే మహానగరాలే వెలశాయంటే నమ్మశక్యం కాకపోవచ్చు కానీ అది ముమ్మాటికీ నిజం. దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారి పేర్ల మీద వెలసిన కొన్ని నగరాలు, వాటి ప్రాశస్త్యం గురించి తెలుసుకుందాం..



అమ్మవారి నామాలే ఆ నగరాలకు పేర్లు



కాళీ ఘాట్ పేరు... కోల్‌కతా

మామూలుగానే కోల్‌కతా పేరు చెప్పగానే కాళీమాత నిండైన విగ్రహమే మనో ఫలకంలో మెదులుతుంది. ఇక దసరా సందర్భంగా అయితే కోల్‌కతా మహా నగరంలో అమ్మవారి మండపాలే దర్శనమిస్తుంటాయి. ఇంతకూ కోల్‌కతాకు ఆ పేరు రావడానికి కారణమేమిటో తెలుసా? కోల్‌కతా అనేది బెంగాలీ భాషలోని కాలిక్ క్షేత్ర అనే పదం నుంచి ఉద్భవించింది. కాలిక్ క్షేత్ర అంటే.. కాళికా దేవి నిలయమైన ప్రాంతం అని అర్థం. ఎర్రటి కళ్లతో, నల్లటి రూపంతో, నాలుక బయటపెట్టి ఎంతో గంభీరంగా కనిపించే ఈ దేవి తనను భక్తి శ్రద్ధలతో పూజించే భక్తులను దయతో కాపాడుతుంది. అలాగే 'కాళీఘాట్' అనే పదం నుంచి ఈ నగరానికి కోల్‌కతా అనే పేరొచ్చినట్లు మరో కథనం ప్రచారంలో ఉంది. ఇక్కడ కాళీమాత కొలువైన 'కాళీఘాట్ కాళీ దేవాలయా'నికి 200 ఏళ్ల చరిత్ర ఉన్నట్లు స్థల పురాణం.



ముంబయి - ముంబాదేవి

ముంబాయికి దక్షిణ ముంబయిలోని బులేశ్వర్ అనే ప్రాంతంలో కొలువైన ఆలయంలోని ముంబాదేవి పేరు మీదుగానే ఆ పేరు వచ్చిందని ప్రతీతి. వెండి కిరీటం, బంగారు కంఠసరి, ముక్కుపుడకతో అత్యంత శోభాయమానంగా విరాజిల్లుతుంటుంది అమ్మవారు. పార్వతీమాత కాళికా దేవిగా అవతారమెత్తే క్రమంలో పరమ శివుని ఆదేశం మేరకు ఇప్పుడు ముంబయిగా పిలుస్తోన్న ప్రాంతంలో ఓ మత్స్యకారుల వంశంలో జన్మించిందట. మత్స్యాంబ అనే పేరుతో పుట్టిన అమ్మవారు అవతారం చాలించే సమయంలో మత్స్యకారుల కోరిక మేరకు 'మహా అంబ'గా వెలిసిందని, కాలక్రమేణా ఆమె పేరు 'ముంబా దేవి'గా మారినట్లు స్థల పురాణం చెబుతోంది.



శ్యామలా దేవి పేరే సిమ్లాకు

సిమ్లా.. సాక్షాత్తూ ఆ కాళీ మాతే శ్యామలా దేవిగా వెలసిన నగరం కాబట్టే సిమ్లాకు ఆ పేరు వచ్చిందని స్థలపురాణం చెబుతోంది. ఈ గుడిని 1845లో బ్రిటిష్ పరిపాలనా కాలంలో బెంగాలీ భక్తులు జకు అనే కొండపై నిర్మించారట! ఎంతో ప్రశాంతమైన వాతావరణంలో శ్యామవర్ణంలో మెరిసే దుర్గామాత రూపం చూపరులను కట్టిపడేస్తుంది.



చండీ మందిర్...చండీగఢ్

చండీ అంటే పార్వతీ దేవి ఉగ్ర రూపమైన చండీ మాత అని, గఢ్ అంటే కొలువుండే చోటు అని అర్థం.. ఇలా ఈ నగరానికి చండీగఢ్ అని పేరు రావడానికి అక్కడ కొలువైన 'చండీ మందిర్' దేవాలయమే కారణం. చండీగఢ్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచకుల జిల్లాలో కల్క పట్టణంలో కొండపై వెలసిందీ దేవాలయం. ఈ చండీ గుడి, మాతా మానసి దేవి ఆలయం నుంచి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడి నుంచి కనుచూపు మేరలో గల శివాలిక్ కొండలు ఈ ఆలయానికి అదనపు సొబగులు.



మంగళూరు... మంగళాదేవి

కర్ణాటకలోని ముఖ్య పట్టణాల్లో ఒకటైన మంగళూరుకు ఇక్కడ కొలువైన మంగళాదేవి పేరు మీదే ఆ పేరొచ్చింది. పురాణాల ప్రకారం.. మంగళాదేవి ఆలయాన్ని పరశురాముడు నెలకొల్పినట్లు తెలుస్తుంది. నేపాల్ నుంచి వచ్చిన కొందరు సాధువుల సూచన మేరకు 9వ శతాబ్దంలో తులునాడును పరిపాలించిన అలుపా రాజ వంశస్థుడు కుందవర్మన్ ఈ ఆలయాన్ని కేరళ శిల్పకళా రీతిలో కట్టించాడు. ప్రతిసారీ దసరా శరన్నవరాత్రుల సమయంలో మంగళాదేవికి ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దశమి రోజు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించిన తర్వాత నిర్వహించే రథయాత్ర అంగరంగ వైభవంగా జరుగుతుంది.



పటన్ దేవి పేరుతో పట్నా

పట్నాకు ఆ పేరు రావడానికి శక్తి స్వరూపిణి అయిన 'పతన్ దేవి' అమ్మవారు కొలువైన ఆలయమే కారణం. ఈ ఆలయం 51 సిద్ధ శక్తిపీఠాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. పురాణ గాథల ప్రకారం.. దక్షయజ్ఞం సమయంలో ఆత్మాహుతి చేసుకున్న సతీదేవి శరీరాన్ని మహావిష్ణువు ముక్కలుగా ఖండించగా, కుడి తొడభాగం ఈ ప్రాంతంలో పడిందట! అలా వెలసిన అమ్మవారిని మొదట్లో 'సర్వానంద కారి పతనేశ్వరి' అనే పేరుతో కొలిచేవారు. కాలక్రమంలో.. ఆ పేరు 'పతనేశ్వరి'గా, ఇప్పుడు 'పతన్ దేవి'గా రూపాంతరం చెందుతూ వచ్చింది.



నైనాదేవి పేరుతో నైనితాల్ నగరం

దక్షయజ్ఞంలో దహనమైన సతీదేవి శరీరాన్ని ఖండించినప్పుడు ఆమె నేత్రాలు ఈ ప్రదేశంలో పడినట్లుగా స్థలపురాణం చెబుతోంది. మహిషాసురుడిని సంహరించిన కారణంగా నైనాదేవిని, మహిషపీత్ అని కూడా పిలుస్తారు. అలా మహిషుణ్ణి సంహరించిన సమయంలో దేవతలందరూ అమ్మవారిని 'జై నైనా' అంటూ నినదించడం వల్ల ఈ అమ్మవారు ''నైనా దేవి'గా పూజలందుకుంటోందట. శక్తిపీఠాలలో ఒకటైన ఈ ఆలయంలో విజయదశమి ఉత్సవాలు మహాద్భుతంగా జరుగుతాయి.

మరికొన్ని ప్రదేశాలు

త్రిపుర – త్రిపుర సుందరి
మైసూరు – మహిషాసుర మర్దిని
కన్యాకుమారి – కన్యాకుమారి దేవి
తుల్జాపూర్ – తుల్జా భవాని (మహారాష్ట్ర)
హస్సాన్ – హసనాంబె (కర్ణాటక)
అంబాలా – భవానీ అంబా దేవి (హరియాణా)

– డి.వి.ఆర్. భాస్కర్

వినాయకుడే వీళ్లకు పెళ్లి పెద్ద



కర్ణాటకలోని బంధి అనే జాతివారు ఇడగుంజి వినాయకుని తమ పెళ్లి పెద్దగా భావిస్తారు. ఏదన్నా పెళ్లి సంబంధాన్ని కుదుర్చుకోగానే పెళ్లికూతురు, పెళ్లికొడుకుకి చెందిన కుటుంబం వారు ఈ ఆలయానికి చేరుకుంటారు. అక్కడ వినాయకుని పాదాల చెంత ఒక రెండు చీటీలను ఉంచుతారు. కుడికాలి దగ్గర ఉన్న చీటీ కింద పడితే దానిని వినాయకుని అనుగ్రహంగా భావించి పెళ్లి ఏర్పాట్లను చూసుకుంటారు. అలా కాకుండా ఎడమ కాలి దగ్గర ఉన్న చీటీ కింద పడితే, దాన్ని అశుభంగా భావించి మరో పెళ్లి సంబంధాన్ని వెతుక్కుంటారు. ఇలా వైభవోపేతమైన స్థలపురాణానికి తోడుగా, చిత్ర విచిత్రమైన ఆచారాలు కలగలిసిన ఈ ఆలయాన్ని చేరుకునేందుకు ఏటా పదిలక్షలకు పైగా భక్తులు ఇడగుంజికి చేరుకుంటారు.

ఇక్కడి మూలవిరాట్టైన వినాయకుడు చూడముచ్చటగా ఉంటాడు. ఒక చేత మోదకాన్నీ, మరో చేత కలువమొగ్గనీ ధరించి మెడలో పూలదండతో నిరాడంబరంగా కనిపిస్తాడు. సాధారణంగా వినాయకుని చెంతనే ఉండే ఎలుక వాహనం ఇక్కడ కనిపించదు. ఇడగుంజి ఆలయంలోని వినాయకుడికి గరికను సమర్పిస్తే చాలు, తమ కోరికలను ఈడేరుస్తాడని భక్తుల నమ్మకం.

ధర్మ సందేహాలు



నాకు తరచు కలలో పాములు కనిపిస్తుంటాయి. ఇది దేనికి సంకేతం?

కలలో పాములు కనిపిస్తున్నాయని మీరు ఆందోళన పడనక్కరలేదు. ఇది శుభానికే సంకేతం. మీకు త్వరలో ఆకస్మిక ధన ప్రాప్తి కలగబోతోందనడానికి సూచన అది. అంతేకాదు, మీకు సంతానం కలగబోతోందనడానికి కూడా సంకేతం కావచ్చు. సాధారణంగా కలలో పాములు కనిపించడం అనేది తీరని కోరికలకు సంకేతం. ఒకోసారి ఆ కోరికలు కార్యరూపం దాల్చబోతున్నాయనడానికి కూడా సూచికగా తీసుకోవచ్చు.

దిష్టి తీయడానికి ఎర్రనీళ్లనే ఎందుకు ఉపయోగిస్తారు?

వివాహాది శుభకార్యాలలో, నూతన వధూవరుల గృహప్రవేశ సమయంలోనూ, ఇంటిలో ఎవరైనా జబ్బుపడి లేచి స్వస్థత చేకూరి ఇంటికి వచ్చేటప్పుడూ ఎర్రనీళ్లతో దిష్టితీస్తారు. పసుపు, సున్నం నీళ్ల కలిపితే ఎర్రనీళ్ల తయారవుతాయి. ఈ ఎర్రనీళ్లను పళ్లెంలో పోసి దిష్టి తీస్తారు. ఆ నీళ్లను ఎవరూ తొక్కనిచోట పారబోస్తారు. గృహప్రవేశానికి ముందు తియ్యగుమ్మకు చిన్న రంధ్రం చేసి పారాణి ముద్దను ఉంచుతారు. దాన్ని దిష్టితీసి పగలగొడతారు. కొంతమంది ఎండుమిరపకాయలతో, మరికొందరు నూనెలో తడిపి వెలిగించిన గుడ్డపీలికలతోటీ దిష్టి తీస్తారు. ఘాటైన పదార్థాలు, ఎర్రని వస్తువులు దిష్టిని పోగొట్టడంలో శక్తిమంతంగా పని చేస్తాయని ఇలా చేస్తారు.

ఇంటిలోకి దుష్ట శక్తులు రాకుండా ఉండాలంటే ఏం చేయాలి?

తులసి చెట్టు, నిమ్మ, వేప వంటివి ఇంటిలోకి దుష్టశక్తులను రానివ్వకుండా చేస్తాయని శాస్త్రం చెబుతోంది. అంతేకాకుండా దిష్టి తగలకుండా ఉండడం కోసం వాకిలి వద్ద కొంతమంది బూడిద గుమ్మడి కాయలు కట్టుకుంటారు. అదేవిధంగా పటికను ఎర్ర లేదా నల్లటి వస్త్రంలో మూటగట్టి ఇంటి గుమ్మానికి వేలాడదీస్తారు. ఇష్టదైవానికి సంబంధించిన చిన్న పటాలను గుమ్మానికి తగిలించడం కూడా మంచిదే.

ఇస్లాం వెలుగు

సత్కార్యం... దుష్కార్యం

మనిషి పాపం చేయడం సహజం. అది పెద్ద పాపమా? చిన్న పాపమా? అనేది కాదు ఏది చేసినా పాపం పాపమే. ఎందుకంటే మనిషి పాపం చేస్తే హఠాత్తుగా చెయ్యడు. పాపం చేయడానికి ఎన్నో విధాల ప్రయత్నించ వలసి ఉంటుంది. పాపం చేస్తుండగా ఎవరైనా చూస్తున్నారా, నేనెవరి కంటైనా పడుతున్నానా అని ఆచితూచి అడుగులు వేస్తాడు. అసలు పాపం అంటే ఏమిటి? అసంబద్ధమైన ప్రతి చిన్న పెద్ద మాట, అశ్లీలమైన మాట, అశ్లీలమైన చూపు, అశ్లీలంగా పర స్త్రీ పర పురుషుల శరీరాలు తాకడం కూడా పాపమే. ఒక పర స్త్రీ ఒక పరపురుషుడు దొంగ చాటుగా కలుసుకోవడం పాపం, అబద్ధం చెప్పడం పాపం, అబద్ధం చెప్పడం వల్ల ఎదుటి వారికి నష్టం కలగవచ్చు. అబద్ధం అందమైన మాట! ఈరోజుల్లో ప్రతి విషయంలోనూ అబద్ధం చెప్పడం, అబద్ధం ప్రచారం చేయడం వంటివి ఫ్యాషన్ అయిపోయింది.

అంతెందుకు ఇంటి నుండి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నా రండి అని భార్య గాని, స్నేహితుడు గాని, యజమాని గాని, అప్పు ఇచ్చిన వ్యక్తి గాని అడిగితే ఒకచోట ఉండి మరొక చోట చెబుతుండగా మనం వింటూ ఉంటాం అలాగే అప్పు ఇచ్చిన వాడికి అప్పుడు ఇప్పుడు అంటూ అబద్ధాలు చెప్తుంటారు. ఇలా వ్యక్తిగతంగా అబద్ధాలు నడుస్తూనే ఉంటాయి. ఒక్క అబద్ధమాడితే దానిని నిభాయించుకోవడానికి వంద అబద్ధాలు ఆడవలసి ఉంటుంది. అందువల్ల ఆ ఒక్క విషయం నిజం చెబితే ఎంత ఈజీగా ఉంటుందో నిజం చెప్పి చూడండి. ఫోన్లో నిజం చెబితే విన్నవారికి కూడా సంతృప్తి కలుగుతుంది. నిజం సత్యం మాటలు బరువుగా ఉంటాయి. వీటి ప్రకారంగా నడుచుకునే వారికి గౌరవం కలుగుతుంది. ఎవరు అబద్ధం చెబుతారో వారి జీవితంలోని అడుగడుగునా అటంకాలే ఎదురవుతూ ఉంటాయి. సంపాదనలో, సంసారంలో (బర్కత్) సమృద్ధి లేక పోవడం, ఎప్పుడూ అయ్యో తెల్లారితే ఎలా పొద్దుగూకితే ఎలా అని అబద్ధీకులు తల్లడిల్లి పోతుంటారు. అలాంటివారు నడి బజారులో నగుబాటు అవుతుండడం కూడా మనం చూస్తూ ఉంటాం. అబద్ధం చెప్పి పూట గడిపితే ఆ పూట గడుస్తుంది కానీ రాబోయే పూట గడవడానికి గగనం అయిపోతుంది. అబద్ధం చెప్పే వారికి అబద్ధపు దారులు తెరిచి ఉంటాయి. అబద్ధాలు నడిపిస్తూ ఉంటే ఆపదలు, రోగాలు, యాక్సిడెంట్లు, జగడాలు, అనుమానాలు శంకలు, అపనమ్మకాలు, అవిశ్వాసాలు కలుగుతూనే ఉంటాయి. అవమానం పాలవుతూనే ఉంటారు. నిజం చెబితే ఎదుటి వారిలో నమ్మకం కుదురుతుంది. నిజం చెప్పే వారికి నిజమార్గపు ద్వారాలు తెరుచుకుంటాయి. ఆ ప్రకారంగా వారి గౌరవం పెరుగుతుంది. అందుకే చిన్నారులకు టీచర్లు 'సచ్కో ఆంచ్ నహి' అని నేర్పిస్తూ ఉంటారు. అంటే సత్యానికి చావు లేదు అని అర్థం. అందువల్ల వంద అబద్ధాలు చెప్పి నలుగురిలో నగుబాటు అయ్యే బదులు ఒక్క నిజం చెప్పి గౌరవంగా బతకడానికి ప్రయత్నిద్దాం. ఆచరిద్దాం. ఈ విషయంలో దివ్య ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

'ప్రజలు తమ కర్మలను చూసుకునేందుకుగాను ప్రళయ దినాన భిన్న పరిస్థితుల్లో దేవుని వైపునకు మరలుతారు. ఆ తర్వాత ఎవడైనా రవ్వంత సత్కారం చేసి ఉన్నా సరే దానిని అతడు చూసుకుంటాడు రవంత దుష్కర్యం చేసి ఉన్నా సరే దానిని అతడు చూసుకుంటాడు. (99: 7–8)



– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

సువార్త

కార్యసాధక ప్రేమను కలిగి ఉండాలి

సృష్ట్యారంభంలో దేవుడు పురుషుని, స్త్రీని సృజించాడు. (ఆది 1: 26–27). తదుపరి సంతానోత్పత్తి కలిగింది. తదుపరి వర్ణవ్యవస్థలు వాడుకలోనికి వచ్చాయి. ప్రస్తుత రోజుల్లో రెండే రెండు వర్ణాల ప్రజలు ధనవంతులు, పేదలు ఉన్నారు. పేదలు ఆనాటి నుండి నేటి వరకు ఉన్నారు. వారికి తినడానికి తిండి, ధరించడానికి వస్త్రాలు, నివాస గృహాలు లేవు. కనుక పేదసాదలైన తోడి జనులకు ఉదార బుద్ధితో సహాయం చేయవలసిందిగా ఇశ్రాయేలీ ప్రజలను మోషే ప్రవక్త ఆజ్ఞాపించాడని వాక్యం స్పష్టీకరించింది. (ద్వితియోప 15:11). పేదరికం, బీదల స్థితిగతులను తెలుసుకొనేందుకు యేసు పేదవానిగా పశువులపాకలో ఒక వడ్రంగి కుటుంబంలో జన్మించాడు. దేవుడు అందరినీ సమానంగా, ఒకే రీతిని సృజించాడు. కానీ ఈ మానవుడే మానవుని పేదరికంలో ఉంచిన స్థితి. అయితే దేవుని స్పందన ఏమిటి?

దేశంలో బీదలను మ్రింగివేయమని, దరిద్రులను మాపివేయుమని కోరువారలారా! తూము చిన్నదిగాను, రూపాయి ఎక్కువదిగాను చేసి, దొంగ త్రాసుచేసి మనం ధాన్యం అమ్మునట్లుగా, అమావాస్య ఎప్పుడైపోవునో, మనం గోధుమలను అమ్మకం చేయునట్లు, విశ్రాంతి దినము



ఎప్పుడు గతించిపోవునోయని చెప్పుకొనువారలారా! దరిద్రులను వెండి కొనునట్లును, పాదరక్షలనిచ్చి బీదవారిని కోరునట్లుగాను, చచ్చుధాన్యం మనం అమ్ముదాం రండని విశ్రాంతి దినము ఎప్పుడు గతించిపోవునో చెప్పుకొనువారలారా! ప్రభువగు యెహోవా (సర్వశక్తిగల దేవుడు) ప్రమాణం చేసి చెబుతున్నాడు – యేమనగా మీ క్రియలను ఎరుగుదును... భూమి కంపించదా? నివాసులందరు అంగలార్చరా? నైలునది పొంగదా? భూమి ఉబుకదా? ప్రభువు సెలవిచ్చాడు. (ఆమోను 8:4 – 8).

బీదలను కనికరించువాడు యెహోవా (దేవుడు)కు అప్పిచ్చువాడు, వాని ఉపకారాలకు ఆయన ప్రత్యుపకారం చేయువాడు. (సామెతలు 19:7)

సంఘ కాపరులు కేవలం సందేశాలతోనే కాదు అవసరతలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందించటానికి కార్యోన్ముక్తులు కావాలి. దుప్పి నీటి వాగుకొరకు, దేవుని కొరకు ఆశపడునట్లు తృష్ణతో పేదరికంలో వున్న బీదలకు సహకారం అందిస్తున్నారు.

సహోదరులారా! క్రియలు లేకుండా విశ్వాసం వున్నదని చెప్పడం లో ఏమి ప్రయోజనం. నీ సోదర సోదరీమణులు వస్త్రహీనులుగా వున్నప్పుడు, భోజనం లేనప్పుడువట్టిమాటలు చెప్పి పంపడంలో ప్రయోజనం ఎట్లో.. క్రియలు లేని విశ్వాసం అట్లే నిష్ఫలమైనది. కావున క్రియా రూపకంగా సహాయ సహకారం పేదలకు అందించాలి (యాకోబు 2:14–18)

యేసును నమ్మిన వారికి సున్నతి పొందుటయందు ఏమీ లేదు. కానీ ప్రేమ వలన కార్యసాధకమగు విశ్వాసం బీదల పట్ల, పేదరికం పట్ల కార్యసాధక ప్రేమ కలిగి వుండాలని వాక్యం సెలవిస్తుంది. (గలతీ 5:6–7). లేమిగలవారిని పెంటకుప్పల మీద నుండి లేవనెత్తువాడు ఆయనే (1సమూ 2:8). అటువంటి విశ్వాసం కలిగి జీవించుదురుగాక.

– కోట బిపిన్ చంద్రపాల్

బిజినెస్ రీల్

గ్రీన్‌కో వాటా విక్రయించనున్న జీఐసీ!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సింగపూర్‌కు చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ జీఐసీ.. గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్‌లో తనకున్న 50 శాతం వాటాను విక్రయించే ప్రయత్నాల్లో ఉన్నట్టు సమాచారం. గ్రీన్‌కోలో తన హోల్డింగ్‌ను పూర్తిగా లేదా పాక్షికంగా విక్రయించడంలో భాగంగా మదింపు చేయడానికి ఆర్థిక సలహాదారులతో జీఐసీ ప్రాథమిక చర్చలు జరుపుతోంది. గ్రీన్‌కో ఎనర్జీ విలువను 10 బిలియన్ డాలర్లుగా లెక్కించినట్టు తెలుస్తోంది. గ్రీన్‌కో ఎనర్జీలో పెట్టుబడిదారులైన అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), జపనీస్ ఫైనాన్షియల్ గ్రూప్ ఓరిక్స్ కార్పొరేషన్‌తో సహా ఇతర ఇన్వెస్టర్లు సంస్థ వృద్ధికి సహాయపడటానికి రాబోయే నెలల్లో నిధులను సేకరించే అవకాశం ఉంది. గ్రీన్‌కో భారత్‌లోని 15 రాష్ట్రాల్లో పవన, సౌర, జల విద్యుత్ విభాగాల్లో కలిపి 7.5 గిగావాట్ల నికర స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉంది. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టడానికి జీఐసీ, ఏడీఐఏ, ఓరిక్స్ తోపాటు కంపెనీ వ్యవస్థాపకుల నుండి 700 మిలియన్ డాలర్లను గతేడాది గ్రీన్‌కో సమీకరించింది.

సుంకం పెంపు తాత్కాలిక ఉల్లంఘన

మలేషియా మంత్రి వ్యాఖ్య



కౌలాలంపూర్: పామాయిల్ దిగుమతి సుంకాన్ని ఇటీవల భారత్ పెంచడాన్ని తాత్కాలిక ఉల్లంఘనగా మలేషియా ప్లాంటేషన్, కమోడిటీస్ మంత్రి దాతుక్ సేరి జోహరీ అబ్దుల్ ఘనీ అభివర్ణించారు. ఎలాంటి ఉల్లంఘన జరిగినా అది తాత్కాలికమేనని, పామాయిల్‌కు డిమాండ్ స్థిరంగా ఉందని మంగళవారం చెప్పారు. యుద్ధ విమానాల బదిలీకి బదులుగా పామాయిల్ సరఫరా కోసం మలేషియా-భారత్ మధ్య ఏర్పాట్ల గురించిన ఊహాగానాలను ఘనీ తోసిపుచ్చారు. భారత్ ఇటీవల చేసిన టారిఫ్ పాలసీ మార్పులు ఎటువంటి సమస్య సృష్టించదని అన్నారు. భారత్‌తో తాము మంచి భాగస్వామిగా కొనసాగుతామని, స్థిరంగా పామాయిల్ సరఫరాను కొనసాగిస్తామని చెప్పారు. భారత్‌లో పామాయిల్ సాగుకు మలేషియా మద్దతు ఇచ్చింది. మలేషియా స్వంత పామాయిల్-ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ భారత్‌లో పామాయిల్ సాగుకు ఎందుకు మద్దతు ఇస్తుందనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. ప్రత్యేక ద్వైపాక్షిక సంబంధాన్ని ఉదహరించారు. బియ్యం, ఉల్లి, పంచదార వంటి భారతీయ వస్తువులపై మలేషియా ఆధారపడుతోందని గుర్తు చేశారు. 2023లో భారత్‌కు 2.84 మిలియన్ టన్నుల పామాయిల్‌ను మలేషియా సరఫరా చేసింది. మలేషియా నుంచి పామాయిల్ ఎగుమతుల్లో 18.8 శాతం వాటాతో భారత్ తొలి స్థానంలో ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-10-2024	
విశాఖ	525-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	525-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
CIPLA	1,683.00	2.58
TRENT	8,230.00	2.34
TATAMOTORS	939	2.09
SBIN	795.8	1.84
TECHM	1,658.00	1.77

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ITC	492.5	-3.04
NESTLEIND	2,518.80	-2.44
ONGC	288.5	-1.69
RELIANCE	2,748.00	-1.67
HINDUNILVR	2,777.80	-1.45

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,908
ఎన్ఎస్ఈ	1,07,912
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,53,327
ఎఫ్ఐఐ	- 4,563
డీఐఐ	+ 3,509

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72.76	$ 73.57
బ్రెంట్	76.17	$ 77.18

సగటు యూజర్ నుంచి రూ.157.45



- టెలికం కంపెనీలకు 8 శాతం పెరిగిన ఆదాయం
- 1,205.64 మిలియన్లకు టెలిఫోన్ చందాదారులు
- ట్రాయ్ త్రైమాసిక నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: టెలికం కంపెనీల బ్యాలన్స్ షీట్లు ఆర్థికంగా బలపడుతున్నాయి. ఒక్కో మొబైల్ యూజర్ నుంచి వచ్చే నెలవారీ సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 8 శాతం పెరిగి జూన్‌తో ముగిసిన త్రైమాసికం చివరికి రూ.157.45కు చేరినట్టు ట్రాయ్ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది మార్చి చివరికి ఇది రూ.153.54గా ఉంది. త్రైమాసికం వారీ పనితీరు సూచిక నివేదికను ట్రాయ్ విడుదల చేసింది. టెలికం రంగం సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్) 0.13 శాతం పెరిగి రూ.70,555 కోట్లుగా ఉంది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే ఏజీఆర్ 7.51 శాతం పెరగడం గమనార్హం. టెలిఫోన్ చందాదారులు మార్చి చివరికి 1,199.28 మిలియన్లుగా ఉంటే, జూన్ చివరికి 1,205.64 మిలియన్లకు చేరింది. వైర్‌లైన్ టెలిఫోన్ చందాదారుల సంఖ్య 35.11 మిలియన్లకు పెరిగింది. క్రితం ఏడాది జూన్ నాటి గణాంకాలతో పోల్చి చూస్తే 16% పెరిగింది. నికరంగా జూన్ క్వార్టర్‌లో వైర్‌లెస్ చందాదారులు 54 లక్షల మేర పెరిగారు. దీంతో మొత్తం వైర్‌లెస్ చందాదారుల సంఖ్య 1,170.53 మిలియన్లకు చేరింది. ఈ ఏడాది మార్చి నాటికి వైర్‌లెస్ చందాదారులు 1,165.49 మిలియన్లుగా ఉన్నారు. వైర్‌లైన్ టెలీ సాంద్రత 2.50 శాతంగా ఉంటే, వైర్‌లెస్ టెలీ సాంద్రత 85.95 శాతానికి చేరింది.

పల్లెల్లో పెరిగిన టెలికం వినియోగం

గ్రామీణ ప్రాంతాల్లో టెలీ సాంద్రత మార్చి చివరికి ఉన్న 59.19 శాతం నుంచి జూన్ చివరికి 59.65 శాతానికి పెరిగింది. కానీ, ఇదే సమయంలో పట్టణ ప్రాంతాల్లో టెలీ డెన్సిటీ (టెలికం సదుపాయం ఉన్నవారు) 133.72 శాతం నుంచి 133.46 శాతానికి తగ్గింది. ఇంటర్నెట్ చందాదారులు 1.59 శాతం పెరిగి 969.60మిలియన్లకు చేరారు.

అదుపులో ద్రవ్యోల్బణ 'గుర్రం'

ముంబై: ద్రవ్యోల్బణ అదుపు చేయడానికి సంబంధించిన ఉదాహరణను పాలసీ సమీక్ష సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ 'ఏనుగు' నుంచి 'గుర్రం' వైపునకు మార్చడం విశేషం. ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద కట్టడిపై ఆయన గతంలో మాట్లాడుతూ, ''ఏనుగు అడవికి తిరిగి వచ్చి అక్కడే ఉండాల్సిన అవసరం ఉంది'' అని వ్యాఖ్యానించారు. తాజాగా ఇదే అంశంపై మాట్లాడుతూ, ''చాలా కృషితో ద్రవ్యోల్బణం గుర్రాన్ని స్థిరత్వానికి తీసుకురావడం జరిగింది. రెండేళ్ల క్రితం ద్రవ్యోల్బణం పెరిగిన స్థాయిలతో పోలిస్తే ప్రస్తుతం ఈ రేటు ఆమోదయోగ్యమైన లక్ష్యాలకు దగ్గరలో ఉంది'' అని పేర్కొన్నారు. 'గుర్రం మళ్లీ అదుపు తప్పే అయ్యే అవకాశం ఉన్నందున గేట్ తెరవడం గురించి మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. మనం అదుపు కోల్పోకుండా గుర్రాన్ని గట్టిగా పట్టి ఉంచాలి'' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ద్రవ్యోల్బణంతో పోల్చే విషయంలో జంతువును మార్చడంపై అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ, ''ఇందుకు కారణం ద్రవ్యోల్బణంపై యుద్ధం. యుద్ధంలో ఏనుగులను గుర్రాలను ఉపయోగించడం జరుగుతుంది'' అని చమత్కరించారు. అవసరమైతే పౌరాణిక కథానాయకుడు అర్జునుడు (2022 చివర్లో ఆయన ద్రవ్యోల్బణం కట్టడిని అర్జునుడి గురితో పోల్చిన సంగతి తెలిసిందే) కూడా తిరిగి రాగలడని స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడంపై సెంట్రల్ బ్యాంక్ నిస్సందేహంగా దృష్టి సారించిందని ఆయన స్పష్టం చేశారు.



పాలసీ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్. ముంబైలోని ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్లు (కుడి నుంచి) స్వామినాథన్ జానకిరామన్, ఎం.రాజేశ్వరరావు, దేబబ్రత పాత్ర, టీ. రబీ శంకర్‌లు పాల్గొన్నారు

కొత్త కమిటీ తొలి భేటీ

కేంద్రం ఈ నెల ప్రారంభంలో ముగ్గురు కొత్త సభ్యులను నియమించిన తర్వాత గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలో జరిగిన తొలి ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షా సమావేశం ఇది. ఆర్‌బీఐ తాజా ద్రవ్య పరపతి విధాన కమిటీని ప్రభుత్వం ఈ నెలారంభంలో పునర్వ్యవస్థీకరించిన సంగతి తెలిసిందే. ఎక్స్‌టర్నల్ సభ్యులుగా రామ్ సింగ్, సౌగత భట్టాచార్య, నగేష్ కుమార్‌లను కేంద్ర ఈ నెల ప్రారంభంలో నియమించింది. పదవీ కాలం ముగిసిన అషిమా గోయల్, శశాంక భిడే, జయంత్ ఆర్ వర్మ స్థానంలో వీరి నియామకం జరిగింది. గత ద్వైమాసిక సమావేశాల్లో అషిమా గోయల్, జయంత్ ఆర్ వర్మలు రేటు తగ్గింపునకు వోటు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా నియమితులయిన వారితో పాటు కమిటీలో అంతర్గత (ఆర్‌బీఐ తరపున) సభ్యులుగా గవర్నర్ శక్తికాంతదాస్, డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్‌బీఐ పరపతి విధాన విభాగం) రాజీవ్ రంజన్‌లు ఉన్నారు.

మార్కెట్లోకి మెర్సిడెస్ కొత్త ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ

ధర రూ. 78.5 లక్షల నుంచి ప్రారంభం

పుణె: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ సరికొత్త లాంగ్ వీల్‌బేస్ (ఎల్‌డబ్ల్యూబీ) ఈ-క్లాస్ కారును ఆవిష్కరించింది. దీని ధర రూ. 78.5 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. వేరియంట్‌ను బట్టి డెలివరీలు ఈ వారం నుంచి మొదలవుతాయి. ప్రత్యేకంగా భారత మార్కెట్ అవసరాలకు అనుగుణమైన కొన్ని ఫీచర్లను ఇందులో చేర్చినట్లు సంస్థ తెలిపింది. ఈ కారులో సెల్ఫీకెమెరా, బర్మేస్టర్ 4డీ సరౌండ్ సౌండ్ సిస్టం, తొలిసారిగా సెంటర్ ఎయిర్‌బ్యాగ్, ఎంబీయూఎక్స్ సూపర్‌స్క్రీన్ మొదలైనవి ఉన్నట్లు పేర్కొంది. కఠినతరమైన క్రాష్, ఉద్గారాల టెస్టులను జర్మనీ, స్పెయిన్‌లో నిర్వహించినట్లు వివరించింది.



9 బిలియన్ డాలర్లకు 'ఆన్‌లైన్ గేమింగ్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ వచ్చే అయిదేళ్లలో 8.92 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నట్లు ఈ-గేమింగ్ ఫెడరేషన్ (ఈజీఎఫ్) సీఈవో అనురాగ్ సక్సేనా తెలిపారు. ప్రస్తుతం ఇది 3.1 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నట్లు చెప్పారు. ఇటీవలి గ్రాంట్ థార్న్‌టన్ భారత్, ఈజీఎఫ్ నివేదిక ప్రకారం 2018-23 మధ్య కాలంలో ఈ రంగంలో పనిచేసేవారి సంఖ్య 20 రెట్లు పెరిగిందని పేర్కొన్నారు. ఏడాదికి దాదాపు రూ. 7వేల కోట్ల స్థాయిలో జీఎస్‌టీ వసూళ్లు ఉంటున్నాయన్నారు. అయితే, పరిశ్రమ ఇంత భారీగా విస్తరిస్తున్నప్పటికీ ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల స్కిల్ గేమింగ్, గ్యాంబ్లింగ్ మధ్య తేడా తెలియక గందరగోళం నెలకొంటోందని సక్సేనా చెప్పారు. ఈ నేపథ్యంలోనే పరిశ్రమకు నియంత్రణపరమైన విధివిధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఆయన పేర్కొన్నారు. దీనిపై కసరత్తు జరుగుతోందని వివరించారు. నియంత్రణ వ్యవస్థ ఉంటే గేమింగ్ రంగంలోకి భారీగా పెట్టుబడులు వస్తాయని సక్సేనా చెప్పారు. గేమింగ్‌పై అవగాహన పెంచేందుకు ప్రత్యేకంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెక్ రంగంలో హైదరాబాద్ వేగంగా పురోగమిస్తోందని, స్థానికంగా 4,369 టెక్ స్టార్టప్‌లు, దాదాపు 77 గేమింగ్ స్టార్టప్‌లు ఉన్నాయని వివరించారు.



జేఎం ఫైనాన్షియల్ విస్తరణ

JM FINANCIAL

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గృహ రుణ రంగంలో ఉన్న జేఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించింది. ఏలూరులో నూతన కేంద్రాన్ని ప్రారంభించింది. ఏపీలో ఇప్పటికే తమకు 9 శాఖలు ఉన్నాయని కంపెనీ ఎండీ, సీఈవో మనీష్ శేఠ్ ఈ సందర్భంగా తెలిపారు. దేశవ్యాప్తంగా బ్రాంచ్‌ల సంఖ్య 126కు చేరుకుందన్నారు.

హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు 19% డౌన్

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 11,564 యూనిట్ల అమ్మకాలు
- దేశవ్యాప్తంగా ఎనిమిది పట్టణాల్లో 5 శాతం క్షీణత
- ప్రాప్‌టైగర్ 'రియల్ ఇన్‌సైట్స్' నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: సెప్టెంబర్ త్రైమాసికంలో ఇళ్ల మార్కెట్ కొంత నీరసించింది. హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు 19 శాతం క్షీణించగా, దేశవ్యాప్తంగా ఎనిమిది పట్టణాల్లో సగటున 5 శాతం మేర విక్రయాలు తగ్గాయి. ఎనిమిది పట్టణాల్లో 96,544 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 1,01,221 యూనిట్లుగా ఉన్నాయి. కొత్త ఇళ్ల ఆవిష్కరణలు (తాజా సరఫరా) సెప్టెంబర్ త్రైమాసికంలో 25 శాతం తక్కువగా 91,863 యూనిట్లుగానే ఉన్నాయి. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ సంస్థ ప్రాప్‌టైగర్ విడుదల చేసింది. నూతన ఇళ్ల సరఫరా తగ్గడానికి తోడు, ధరలు పెరగడం విక్రయాలు క్షీణించడానికి కారణమని ఈ నివేదిక పేర్కొంది. ముఖ్యంగా ఎనిమిది పట్టణాల్లో ఇళ్ల ధరలు 20 శాతం పెరగడంతో ధరల అందుబాటుపై ప్రభావం చూపించినట్టు వివరించింది.

పట్టణాల వారీగా..

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబర్ కాలంలో హైదరాబాద్‌లో 11,564 యూనిట్ల ఇళ్ల విక్రయాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 14,191 యూనిట్లుగా ఉండడం గమనార్హం. అంటే 19 శాతం క్షీణత కనిపిస్తోంది.
- బెంగళూరులోనూ 11% తక్కువగా 11,160 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదయ్యాయి.
- చెన్నైలో 8 శాతం తక్కువగా 3,560 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- కోల్‌కతాలో అమ్మకాలు 2,796 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలం అమ్మకాలతో పోల్చి చూస్తే 22 శాతం తగ్గాయి.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో అమ్మకాలు ఒక శాతం తక్కువగా 30,010 యూనిట్లుగా నమోదయ్యాయి.
- పుణెలోనూ విక్రయాలు 3 శాతం తగ్గి 18,004 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో మాత్రం ఇళ్ల అమ్మకాలు 29% పెరిగాయి. 10,098 యూనిట్ల విక్రయాలు జరిగాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 7,800 యూనిట్లుగా ఉన్నాయి.
- అహ్మదాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు 9 శాతం క్షీణించి 9,352 యూనిట్లుగా నమోదయ్యాయి.

పండుగల సీజన్‌తో అమ్మకాలకు ఊతం

''వార్షికంగా చూస్తే సెప్టెంబర్ క్వార్టర్‌లో ఇళ్ల అమ్మకాలు, కొత్త ఇళ్ల ఆవిష్కరణలు తగ్గడం ధరల పెరుగుదలకు స్పందనగా కనిపిస్తోంది. మార్కెట్ కార్యకలాపాలు మోస్తరు స్థాయికి చేరడం చూస్తున్నాం. ఇది స్థిరమైన వృద్ధిని తీసుకొస్తుంది. అంతిమంగా వినియోగదారులకు మేలు చేస్తుంది. గడిచిన కొన్ని త్రైమాసికాల్లో ఇళ్ల ధరలు కొన్ని ప్రాంతాల్లో 3 శాతం నుంచి 50 శాతం వరకూ పెరిగాయి. ఇది తక్షణ ఇళ్ల కొనుగోలు నిర్ణయాలపై ప్రభావం చూపిస్తోంది''అని ప్రాప్‌టైగర్ బిజినెస్ హెడ్ వికాస్ వాధ్వాన్ వివరించారు. కొత్త ధరలకు వినియోగదారులు సర్దుకోవడానికి కొంత సమయం పడుతుందన్నారు. దేవీ నవరాత్రులతో పండుగల సీజన్ ఊపందుకుందని, అమ్మకాలు పెరుగుతాయని భావిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్, పుణె మార్కెట్లో డెవలపర్లు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యూహాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు.

డిస్కౌంట్ బ్రోకరేజీలకు దెబ్బ

- డెరివేటివ్స్‌లో సవరణల ఎఫెక్ట్
- రేటింగ్స్ దిగ్గజం క్రిసిల్ వెల్లడి



ముంబై: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఇటీవల డెరివేటివ్స్ ట్రేడింగ్‌ను కట్టడి చేసే సవరణలు చేపట్టడంతో ప్రధానంగా డిస్కౌంట్ బ్రోకరేజీలు జిరోధా, గ్రో తదితరాలపై ప్రతికూల ప్రభావం పడనున్నట్లు రేటింగ్స్ దిగ్గజం క్రిసిల్ పేర్కొంది. ఎఫ్అండ్‌వో విభాగం నుంచి అధిక ఆదాయం సాధిస్తుండటం దీనికి కారణమని క్రిసిల్ డైరెక్టర్ శుభ శ్రీ నారాయణన్ పేర్కొన్నారు. డెరివేటివ్ లావాదేవీల ద్వారానే వీటి ఆదాయంలో 80 శాతం సమకూరుతున్నట్లు తెలియజేశారు. అయితే పూర్తిస్థాయి సేవలందించే బ్రోకరేజీలపై సెబీ చర్యలు పెద్దగా ప్రభావం చూపబోవని అభిప్రాయపడ్డారు. ఈ సంస్థల ఆదాయంలో మూడో వంతు మాత్రమే ఎఫ్అండ్‌వో ట్రేడ్స్ నుంచి లభిస్తున్నట్లు తెలియజేశారు. ఇతర విభాగాల నుంచి తక్కువస్థాయిలో ఆదాయం లభిస్తున్న కారణంగా డిస్కౌంట్ బ్రోకరేజీలకు భారీగా దెబ్బతగలవచ్చని అంచనా వేశారు. ఇందుకు రిటైల్ కస్టమర్లపై పెరిగిన నియంత్రణలు సైతం జత కలవనున్నట్లు తెలియజేశారు. రిటైల్ విభాగం ఆధిపత్యం వహిస్తున్న నేపథ్యంలో వీటి ఆదాయాలకు గండి పడనున్నట్లు వివరించారు. దీంతో కొత్త కస్టమర్లను జత కలుపుకోవడం నెమ్మదించవచ్చని తెలియజేశారు. మరోపక్క తీవ్ర పోటీ కారణంగా బ్రోకరేజీ చార్జీలను సైతం పెంచేందుకు డిస్కౌంట్ బ్రోకరేజీ సంస్థలకు అవకాశాలు తక్కువేనని అసోసియేట్ డైరెక్టర్ ఆయేషా మారు పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ఎఫ్అండ్‌వో విభాగంలో రిటైలర్ల లావాదేవీలు భారీగా పెరిగిపోవడానికి తోడు 93 శాతంమంది నష్టపోతున్న నేపథ్యంలో సెబీ డెరివేటివ్స్‌పై కఠిన నియంత్రణలకు తెరతీసిన విషయం విదితమే.

భారత్‌లో డెవూ విస్తరణ

- త్వరలో 100కుపైగా ఉత్పత్తుల రాక
- 2026 మార్చికల్లా 130 ఔట్‌లెట్స్
- డెవూ ఇండియా ఎండీ భాటియా



ముంబై: కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న కొరియా దిగ్గజం డెవూ భారత్‌లో భారీ విస్తరణకు ప్రణాళిక చేసింది. 2026-27 నాటికి భారత మార్కెట్ నుంచి రూ.500 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేయాలని లక్ష్యంగా చేసుకుంది. ఇందులో భాగంగా 100 ఉత్పత్తులను పరిచయం చేయనున్నట్టు ప్రకటించింది. 2026 మార్చి నాటికి 130 బ్రాండ్ స్టోర్స్‌ను తెరవాలని నిర్ణయించామని డెవూ ఇండియా ఎండీ హెచ్.ఎస్.భాటియా తెలిపారు. 'అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల ప్రవర్తన కంపెనీ ఉత్పత్తులను తిరిగి పరిచయం చేయడానికి మాకు సరైన అవకాశాన్ని సృష్టిస్తోంది. అనేక గృహాలలో ఇప్పటికీ అవసరమైన ఉపకరణాలు లేవు. మార్కెట్ అంతరం, పెరుగుతున్న వినియోగదారుల ఆకాంక్షలు.. వెరశి ఇక్కడి మార్కెట్లో గణనీయ ప్రభావాన్ని చూపేలా చేస్తుంది' అని వివరించారు. 2023 అక్టోబర్‌లో భారత మార్కెట్లో రీఎంట్రీ ఇచ్చిన డెవూ.. బ్యాటరీలు, సోలార్ ప్యానెల్స్, ఇన్వర్టర్స్, ఎల్ఈడీ టీవీలు, వంటింటి ఉపకరణాలను తయారు చేస్తోంది.

గ్యాప్‌ను పూడుస్తాం..

భారత్‌లో కంజ్యూమర్ డ్యూరబుల్స్ మార్కెట్‌లో అపార అవకాశాలు ఉన్నాయని డెవూ తెలిపింది. '18 శాతం ఇళ్లలో మాత్రమే ఎయిర్ కండీషనర్స్ ఉన్నాయి. రిఫ్రిజిరేటర్ల విషయంలో విస్తృతి 33 శాతం ఉంది. 80 శాతం గృహాల్లో వాషింగ్ మెషీన్స్ ఉన్నాయి. మారుతున్న కస్టమర్ల జీవనశైలి అవసరాలకు అనుగుణంగా వినూత్న, అత్యంత నాణ్యమైన ఉత్పత్తులతో ఈ గ్యాప్‌ను పూడుస్తాం. చిన్న కుటుంబాలు, ద్వంద్వ ఆదాయ గృహాల పెరుగుదలతో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్ల వంటి అవసరమైన ఉపకరణాలకు డిమాండ్ పెరుగుతూనే ఉంది. అందుకే విభిన్న విభాగాల్లో 100 ఉత్పత్తులను ప్రవేశపెడతాం. వృద్ధి వ్యూహంలో భాగంగా ప్రతి త్రైమాసికంలో రెండు-మూడు ఉత్పత్తులను విడుదల చేయాలని యోచిస్తున్నాం. వినియోగదారు ఉపకరణాలకు పెరుగుతున్న డిమాండ్‌లో గణనీయమైన వాటాను పొందాలన్నది మా భావన. ఆన్‌లైన్‌లోనూ పాగా వేసేందుకు ఈ-కామర్స్ కంపెనీలతో చర్చిస్తున్నాం' అని భాటియా వివరించారు.

ఐపీవోకు ఎన్‌ఎస్‌డీఎల్ రెడీ

న్యూఢిల్లీ: డిపాజిటరీ సేవల దిగ్గజం నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్) పబ్లిక్ ఇష్యూకి లైన్ క్లియర్ అయ్యింది. ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ బాటలో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ, జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్ సైతం సెబీ నుంచి లిస్టింగ్‌కు అనుమతులు పొందాయి. వివరాలు చూద్దాం..

ఎన్ఎస్‌డీఎల్

ఐపీవో చేపట్టేందుకు వీలుగా ఎన్ఎస్‌డీఎల్ 2023 జులైలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. అయితే 14 నెలల తదుపరి అనుమతులు సాధించడం గమనార్హం! ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవోలో 5.72 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనుంది. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ, బ్యాంకింగ్ దిగ్గజాలు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌సహా కంపెనీలో వాటాదారు సంస్థలు షేర్లను ఆఫర్ చేయనున్నాయి. ప్రధానంగా ఐడీబీఐ బ్యాంక్ 2.22 కోట్ల షేర్లు, ఎన్ఎస్ఈ 1.8 కోట్ల షేర్లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 56.25 లక్షల షేర్లు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 40 లక్షల షేర్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 40 లక్షల షేర్లు చొప్పున విక్రయానికి ఉంచనున్నాయి. వెరసి ఐపీవో ద్వారా ఎన్ఎస్‌డీఎల్‌కు ఎలాంటి నిధులు అందబోవు!

ఇదీ బ్యాక్‌గ్రౌండ్

సెబీ వద్ద రిజిస్టరైన ఎన్ఎస్‌డీఎల్ మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసులందించే కంపెనీ. దేశీయంగా ఫైనాన్షియల్, సెక్యూరిటీస్ మార్కెట్లో వివిధ సర్వీసులు, ప్రొడక్టులను ఆఫర్ చేస్తోంది. 1996లో ప్రవేశపెట్టిన డిపాజిటరీల చట్టం ప్రకారం అదే ఏడాది నవంబర్‌లో సెక్యూరిటీల డీమ్యాట్ సేవలకు తెరతీసింది. కాగా.. డిపాజిటరీ సేవలందించే మరో కంపెనీ సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్(సీడీఎస్ఎల్) 2017లో ఎన్ఎస్ఈలో లిస్టయ్యింది. దీంతో పబ్లిక్‌గా ట్రేడయ్యే రెండో డిపాజిటరీగా ఎన్ఎస్‌డీఎల్ నిలవనుంది.


NSDL
Technology, Trust & Reach

జింకా లాజిస్టిక్స్



వస్తు రవాణా రంగ కంపెనీ జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్ ఈ ఏడాది(2024) జులైలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 550 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 2.16 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అమ్మకాలు, మార్కెటింగ్ వ్యయాలకు, భవిష్యత్ అవసరాలరీత్యా బ్లాక్‌బక్ ఫిన్‌సర్వ్ మూలధన పటిష్టతకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

స్టాండర్డ్ గ్లాస్



హైదరాబాద్ కంపెనీ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఈ ఏడాది(2024) జులైలో సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 250 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 350 కోట్ల విలువైన 1.84 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ రూ. 600 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. కంపెనీ ప్రధానంగా ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలలో వినియోగించే స్పెషలైజ్డ్ ఇంజినీరింగ్ పరికరాల తయారు చేస్తోంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, ఇతర సంస్థల కొనుగోళ్లు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.



యువ భారత్‌దే టెస్టు సిరీస్

- ఆస్ట్రేలియా అండర్ 19 జట్టుపై ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో ఘనవిజయం
- తిప్పేసిన అన్‌మోల్‌జీత్, ఇనాన్

చెన్నై: ఆద్యంతం నిలకడగా రాణించిన యువ భారత్ జట్టు అదరగొట్టింది. ఆస్ట్రేలియా అండర్–19 జట్టుతో జరిగిన రెండో అనధికారిక టెస్టులో భారత జట్టు ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఫలితంగా రెండు మ్యాచ్‌ల యూత్ సిరీస్‌ను టీమిండియా 2–0తో కైవసం చేసుకుంది. అంతకుముందు యూత్ వన్డేల్లోనూ ఆస్ట్రేలియాను క్లీన్‌స్వీప్ చేసిన యువ భారత్... సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. భారత బౌలర్ల ధాటికి మూడు రోజుల్లోనే మ్యాచ్ ముగియగా... బుధవారం ఒక్క రోజే 17 వికెట్లు నేలకూలడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 142/3తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా అండర్–19 జట్టు చివరకు 80.2 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఒలీవర్ పెక్ (199 బంతుల్లో 117;16 ఫోర్లు, ఒక సిక్స్) సెంచరీతో రాణించగా... అలెక్స్ లీ యాంగ్ (66; 9 ఫోర్లు) ఆకట్టుకున్నాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 166 పరుగులు జోడించి ఆదుకునే ప్రయత్నం చేశారు. ఒకసారి ఈ జోడీ విడిపోయాకా ఆసీస్ ప్లేయర్లు పెవిలియన్‌కు వరుస కట్టారు. 59 పరుగుల వ్యవధిలో ఆసీస్ చివరి 6 వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్లలో మొహమ్మద్ ఇనాన్, అన్‌మోల్‌జీత్ సింగ్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. దీంతో యువ భారత జట్టుకు 215 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. దీంతో ఆస్ట్రేలియా జట్టును ఫాలోఆన్ ఆడించింది. అప్పటికే తొలి ఇన్నింగ్స్‌లో పేలవ ప్రదర్శన చేసి ఉన్న కంగారూలు... రెండో ఇన్నింగ్స్‌లో ఆ మాత్రం కూడా పోరాడలేకపోయారు. 31.3 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలారు. మొత్తం జట్టులో ముగ్గురు ప్లేయర్లు మాత్రమే రెండంకెల స్కోరు అందుకోగలిగారు. సిమోన్ బడ్జ్ (26; 3 ఫోర్లు, ఒక సిక్సర్), స్టీవెన్ హోగన్ (29;4 ఫోర్లు), పదకొండో స్థానంలో బరిలోకి దిగిన హ్యారీ హొక్‌స్ట్రా (20 నాటౌట్; 2 ఫోర్లు, ఒక సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. మిగిలినవాళ్లంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో అన్‌మోల్ జీత్ సింగ్‌కు 5, లెగ్ స్పిన్నర్ మొహమ్మద్ ఇనాన్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకు ముందు యువ భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 492 పరుగులు చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టిన అరంగేట్ర ఆఫ్ స్పిన్నర్ అన్‌మోల్‌జీత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ మ్యాచ్‌లో అన్‌మోల్‌జీత్, ఇనాన్ కలిసి 16 వికెట్లు పడగొట్టడం విశేషం.

దక్షిణాఫ్రికా ధమాకా

- స్కాట్లాండ్‌పై 80 పరుగుల తేడాతో విజయం
- రాణించిన మరిజాన్ కాప్, వోల్‌వార్ట్, తజ్మీన్

దుబాయ్: అటు బ్యాటింగ్‌లో మెరిపించి... ఇటు బౌలింగ్‌లో అదరగొట్టి... మహిళల టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా జట్టు రెండో విజయం నమోదు చేసింది. సెమీఫైనల్ రేసులో ముందుకొచ్చింది. స్కాట్లాండ్‌తో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 80 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 166 పరుగులు సాధించింది. ఓపెనర్లు లౌరా వొల్‌వార్ట్ (27 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్), తజ్మీన్ బ్రిట్స్ (35 బంతుల్లో 43; 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మరిజాన్ కాప్ (24 బంతుల్లో 43; 6 ఫోర్లు), సునె లుస్ (13 బంతుల్లో 18 నాటౌట్; 2 ఫోర్లు) ధాటిగా ఆడారు. దాంతో దక్షిణాఫ్రికా స్కోరు 160 పరుగులు దాటింది. 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ 17.5 ఓవర్లలో 86 పరుగులకే కుప్పకూలి ఈ టోర్నీలో వరుసగా మూడో పరాజయాన్ని చవిచూసింది. అలీసా లిస్టర్ (12; 2 ఫోర్లు), కేథరీన్ ఫ్రేసర్ (14; 1 ఫోర్)మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో నాన్‌కులులెకో ఎమ్‌లాబా 12 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... చోల్ ట్రయాన్, నదినె డి క్లెర్క్ రెండు వికెట్ల చొప్పున తీశారు. శనివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో దక్షిణాఫ్రికా ఆడుతుంది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లౌరా వొల్‌వార్ట్ (సి) ఒలివియా బెల్ (బి) ఫ్రేసర్ 40; తజ్మీన్ బ్రిట్స్ (సి) బ్రయిస్ (బి) ఒలివియా బెల్ 43; అనెక్ బోష్ (సి) బ్రయిస్ (బి) కార్టర్ 11; మరిజాన్ కాప్ (సి) కార్టర్ (బి) బ్రయిస్ 43; సునె లుస్ (నాటౌట్) 18; చోల్ ట్రయాన్ (సి) హోర్లీ (బి) స్లేటర్ 2; డెర్క్‌సెన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 166. వికెట్ల పతనం:** 1–64, 2–89, 3–119, 4–147, 5–160. **బౌలింగ్:** రాచెల్ స్లేటర్ 4–0–35–1, కేథరీన్ బ్రయిస్ 4–0–31–1, ఒలివియా బెల్ 4–0–34–1, అబ్‌తాహా మక్సూద్ 4–0–30–0, కేథరీన్ ఫ్రేసర్ 2–0–15–1, డార్సీ కార్టర్ 2–0–17–1.

స్కాట్లాండ్ ఇన్నింగ్స్: సస్కియా హోర్లీ (సి) బ్రిట్స్ (బి) ఖాక 6; సారా బ్రయిస్ (సి అండ్ బి) ట్రయాన్ 5; కేథరీన్ బ్రయిస్ (సి అండ్ బి) ట్రయాన్ 7; అలీసా లిస్టర్ (బి) ఎమ్‌లాబా 12; ప్రియానాజ్ చటర్జీ (బి) డిక్లెర్క్ 4; డార్సీ కార్టర్ (బి) ఎమ్‌లాబా 0; లోర్నా బ్రౌన్ (సి అండ్ బి) లుస్ 9; కేథరీన్ ఫ్రేసర్ (సి) బోష్ (బి) ఎమ్‌లాబా 14; రాచెల్ స్లేటర్ (సి) వొల్‌వార్ట్ (బి) డెర్క్‌సెన్ 8; అబ్‌తాహా (సి) ఎమ్‌లాబా (బి) డిక్లెర్క్ 7; ఒలివియా బెల్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (17.5 ఓవర్లలో ఆలౌట్) 86. వికెట్ల పతనం:** 1–14, 2–16, 3–30, 4–38, 5–39, 6–45, 7–56, 8–67, 9–82, 10–86. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 2–0–12–0, అయబొంగా ఖాక 3–0–8–1, చోల్ ట్రయాన్ 3–0–22–2, ఎమ్‌లాబా 4–0–12–3, నదినె డిక్లార్క్ 3.5–0–15–2, సునె లుస్ 1–0–9–1, డెర్క్‌సెన్ 1–0–5–1.


మరిజాన్ కాప్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గ్రూప్ 'ఎ'					
ఆస్ట్రేలియా	2	2	0	4	2.524
భారత్	3	2	1	4	0.576
పాకిస్తాన్	2	1	1	2	0.555
న్యూజిలాండ్	2	1	1	2	-0.050
శ్రీలంక	3	0	3	0	-2.564
గ్రూప్ 'బి'					
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.527
ఇంగ్లండ్	2	2	0	4	0.653
వెస్టిండీస్	2	1	1	2	1.154
బంగ్లాదేశ్	2	1	1	2	-0.125
స్కాట్లాండ్	3	0	3	0	-2.671


నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్


ఎమ్‌లాబా

రూట్ 176... బ్రూక్ 141

- సెంచరీలతో చెలరేగిన ఇంగ్లండ్ బ్యాటర్లు
- పాక్ భారీ స్కోరుకు పోప్ బృందం దీటైన జవాబు
- తొలి ఇన్నింగ్స్‌లో 492/3
- పాకిస్తాన్‌తో తొలి టెస్టు





ముల్తాన్: పరుగుల వరద పారుతున్న ముల్తాన్ టెస్టులో ఇంగ్లండ్ బ్యాటర్లు పండగ చేసుకున్నారు. బ్యాటింగ్‌కు స్వర్గధామం లాంటి పిచ్‌పై మాజీ కెప్టెన్ జో రూట్ (277 బంతుల్లో 176 బ్యాటింగ్; 12 ఫోర్లు) రికార్డు సెంచరీతో కదంతొక్కగా... హ్యారీ బ్రూక్ (173 బంతుల్లో 141 బ్యాటింగ్; 12 ఫోర్లు, ఒక సిక్స్) కూడా 'శత'క్కొట్టాడు. ఫలితంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 101 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 492 పరుగులు చేసింది. ఈ క్రమంలో జో రూట్ పలు రికార్డులు ఖాతాలో వేసుకున్నాడు. ఇంగ్లండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అలిస్టర్ కుక్ (12,473)ను అధిగమించి అగ్రస్థానానికి చేరాడు. టెస్టు క్రికెట్‌లో రూట్‌కిది 35వ శతకం కాగా... అత్యధిక సెంచరీలు చేసిన జాబితాలో ఆరో స్థానానికి చేరుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 96/1తో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు 'బజ్‌బాల్' ఆటతీరు కొనసాగిస్తూ వేగంగా పరుగులు రాబట్టింది. జాక్ క్రాలీ (85 బంతుల్లో 78; 13 ఫోర్లు), బెన్ డకెట్ (75 బంతుల్లో 84; 11 ఫోర్లు) టి20 తరహా షాట్లతో చెలరేగిపోయారు. రెండో వికెట్‌కు క్రాలీతో కలిసి 109 పరుగులు జోడించిన రూట్... మూడో వికెట్‌కు డకెట్‌తో 136 పరుగులు జత చేశాడు. తొలి రెండు సెషన్‌లలో ఒక్కో వికెట్ తీయగలిగిన పాకిస్తాన్ బౌలర్లు... చివరి సెషన్‌లో అయితే ఆ మాత్రం కూడా ప్రభావం చూపలేకపోయారు. కొత్త బంతి తీసుకున్నా... రూట్, బ్రూక్ వీర బాదుడుకు అడ్డుకట్ట వేయలేకపోయారు. ఈ ఇద్దరూ అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 243 పరుగులు జోడించారు. పాకిస్తాన్ బౌలర్లలో షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, ఆమేర్ జమాల్ తలా ఒక వికెట్ పడగొట్టారు. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండగా... చేతిలో ఆరు వికెట్లు ఉన్న ఇంగ్లండ్... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 64 పరుగులు వెనుకబడి ఉంది.

6 టెస్టు క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన జాబితాలో జో రూట్ (35) ఐదో స్థానానికి చేరాడు. సచిన్ టెండూల్కర్ (51 : భారత్), జాక్వెస్ కలిస్ (45 : దక్షిణాఫ్రికా), రికీ పాంటింగ్ (41 : ఆస్ట్రేలియా), సంగక్కర (38 : శ్రీలంక), రాహుల్ ద్రవిడ్ (36 : భారత్) తొలి ఐదు స్థానాల్లో ఉన్నారు.

1 సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన జాబితాలో జో రూట్ (12,578) అగ్రస్థానానికి చేరాడు. మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ (12,472) రెండో స్థానానికి పడిపోయాడు.

5 టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో రూట్ (12,578) ఐదో స్థానానికి దూసుకెళ్లాడు. సచిన్ టెండూల్కర్ (15,921 : భారత్), రికీ పాంటింగ్ (13,378 : ఆస్ట్రేలియా), జాక్వెస్ కలిస్ (13,289 : దక్షిణాఫ్రికా), రాహుల్ ద్రవిడ్ (13,288 : భారత్) టాప్–4లో ఉన్నారు.

విజయంతో ఐర్లాండ్ ముగింపు

అబుదాబి: మూడేళ్ల తర్వాత వన్డే ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుపై ఐర్లాండ్ విజయం అందుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి రెండు వన్డేల్లో ఓడిపోయి సిరీస్ చేజార్చుకున్న ఐర్లాండ్... నామమాత్రమైన మూడో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 284 పరుగులు సాధించింది. కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (92 బంతుల్లో 88; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), హ్యారీ టెక్టర్ (48 బంతుల్లో 60; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. ఆండీ బాల్‌బిర్నీ (45; 4 ఫోర్లు, 1 సిక్స్), కర్టిస్ కాంఫర్ (34; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో లిజాడ్ విలియమ్స్ 56 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. బార్ట్‌మన్, ఫెలుక్వాయోలకు రెండేసి వికెట్లు దక్కాయి. 285 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 46.1 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌటైంది. జేసన్ స్మిత్ (91; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) తొమ్మిది పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో గ్రాహమ్ హ్యూమ్ (3/29), క్రెయిగ్ యంగ్ (3/40) దక్షిణాఫ్రికాను దెబ్బ తీశారు. పాల్ స్టిర్లింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

మూడో వన్డేలో ఓడిన దక్షిణాఫ్రికా


పాల్ స్టిర్లింగ్

క్వార్టర్ ఫైనల్లో హుమేరా జోడీ


హుమేరా

మైసూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో తెలంగాణ క్రీడాకారిణి హుమేరా బహార్మస్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో హుమేరా–పూజా ఇంగాలె (భారత్) జోడీ 7–6 (10/8), 6–4తో యశస్విని పన్వర్–వన్షిత పథానియా (భారత్) జంటపై గెలుపొందింది. తెలంగాణకే చెందిన స్మృతి భాసిన్ కూడా డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. తొలి రౌండ్ మ్యాచ్‌లో స్మృతి భాసిన్ (భారత్)–ఎలీనా జంషీది (డెన్మార్క్) ద్వయం 6–4, 6–4తో సోనల్ పాటిల్ (భారత్)–ప్రిషా వ్యాస్ (అమెరికా) జోడీపై విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో అభయ వేమూరి, అపూర్వ వేమూరి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. అభయ 4–6, 3–6తో పూజా ఇంగాలె చేతిలో, అపూర్వ 5–7, 2–6తో యశస్విని చేతిలో ఓడిపోయారు.

తొలి టెస్టుకు విలియమ్సన్ దూరం



భారత్‌తో సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ప్రకటన

ఆక్లాండ్: టీమిండియాతో జరగనున్న తొలి టెస్టుకు న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ దూరం కానున్నాడు. గజ్జల్లో గాయంతో ఇబ్బంది పడుతున్న విలియమ్సన్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో చివరి రెండు టెస్టులకు అందుబాటులో ఉంటాడని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. భారత్, న్యూజిలాండ్ మధ్య ఈ నెల 16 నుంచి మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా... దీనికోసం బోర్డు బుధవారం 17 మందితో కూడిన జట్టును ప్రకటించింది. టిమ్ సౌతీ టెస్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోగా... అతడి స్థానంలో టామ్ లాథమ్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించింది. ఆల్‌రౌండర్ మైకేల్ బ్రేస్‌వెల్ తొలి టెస్టుకు మాత్రమే అందుబాటులో ఉండనుండగా... స్పిన్నర్ ఇష్ సోధి చివరి రెండు టెస్టులకు జట్టుకు ఎంపికయ్యాడు. 'శ్రీలంకతో రెండో టెస్టు సందర్భంగా విలియమ్సన్ గాయపడ్డాడు. అతడు పూర్తిగా కోలుకునేందుకు ఇంకా సమయం పట్టనుంది. దీంతో చివరి రెండు మ్యాచ్‌లకు అతడు జట్టుతో కలుస్తాడు. కీలక సిరీస్ ఆరంభంలో విలియమ్సన్ సేవలు కోల్పోవడం ఇబ్బందికరమే. మార్క్ చాప్‌మన్ తొలిసారి టెస్టు జట్టులోకి వచ్చాడు' అని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. వ్యక్తిగత కారణాల వల్ల తొలి టెస్టు అనంతరం బ్రేస్‌వెల్ తిరిగి స్వదేశానికి వెళ్లనున్నట్లు పేర్కొంది. ఇరు జట్ల మధ్య ఈ నెల 16 నుంచి 20 వరకు బెంగళూరులో తొలి టెస్టు, 24 నుంచి 28 వరకు పుణేలో రెండో టెస్టు, నవంబర్ 1 నుంచి 5 వరకు ముంబైలో మూడో టెస్టు జరగనున్నాయి.

న్యూజిలాండ్ జట్టు: టామ్ లాథమ్ (కెప్టెన్), బ్లండెల్, మైకేల్ బ్రేస్‌వెల్ (తొలి టెస్టుకు మాత్రమే), మార్క్ చాప్‌మన్, కాన్వే, హెన్రీ, మిచెల్, విల్ ఓ రూర్కె, ఎజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, సాన్‌ట్నర్, బెన్ సీర్స్, ఇష్ సోధి (రెండో, మూడో టెస్టుకు మాత్రమే), టిమ్ సౌతీ, కేన్ విలియమ్సన్, విల్ యంగ్.

జనవరిలో జాతీయ క్రీడలకు ఉత్తరాఖండ్ ఆతిథ్యం



న్యూఢిల్లీ: భారత జాతీయ క్రీడలు వచ్చే ఏడాది జనవరిలో ఉత్తరాఖండ్‌లో జరుగుతాయని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) బుధవారం ప్రకటించింది. జనవరి 28న మొదలయ్యే 38వ జాతీయ క్రీడలు ఫిబ్రవరి 14న ముగుస్తాయని ఐఓఏ తెలిపింది. ఈనెల 25న ఐఓఏ జనరల్ అసెంబ్లీలో జాతీయ క్రీడల షెడ్యూల్‌కు ఆమోదం లభిస్తుందని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష పేర్కొంది. 38 క్రీడాంశాల్లో కలిపి మొత్తం 10 వేల మంది క్రీడాకారులు, క్రీడాధికారులు ఈ క్రీడల్లో పాల్గొనే అవకాశముంది. 37వ జాతీయ క్రీడలు గత ఏడాది గోవాలో జరిగాయి. మహారాష్ట్ర 80 స్వర్ణ పతకాలతో కలిపి మొత్తం 228 పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచింది.



కిరణ్ జార్జి సంచలన విజయం

వాంటా (ఫిన్‌లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత రైజింగ్ స్టార్ కిరణ్ జార్జి సంచలనం సృష్టించాడు. ప్రపంచ 25వ ర్యాంకర్ వాంగ్ జు వె (చైనీస్ తైపీ)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో కిరణ్ జార్జి 23–21, 21–18తో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గతంలో వాంగ్ జు వెతో ఆడిన రెండుసార్లూ ఓడిపోయిన కిరణ్ ఈసారి విజయం రుచి చూశాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో కిరణ్ జార్జి తలపడతాడు. మరోవైపు భారత స్టార్ లక్ష్య సేన్ ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో ఆడాల్సిన డెన్మార్క్ ప్లేయర్ రస్మస్ గెమ్కే గాయం కారణంగా వైదొలగడంతో భారత ప్లేయర్ కోర్టులో అడుగు పెట్టకుండానే విజయాన్ని అందుకున్నాడు.

కశ్మీర్ లోయలో ఎర్రజెండా

ఐదోసారి విజయం సాధించిన మహమ్మద్ యూసఫ్ తరిగామి

జమ్మూకశ్మీర్ రాజకీయ ముఖచిత్రం నెమ్మదిగా మారుతోంది. కానీ స్థిరంగా ఉన్నది ఒకే ఒక నాయకుడు మహమ్మద్ యూసఫ్ తరిగామి. పచ్చని కశ్మీరీ లోయలో ఎర్రజెండాను రెపరెపలాడిస్తున్న సీపీఎం వెటరన్ లీడర్. కుల్గాం జిల్లాలో 1996 నుంచి సీపీఎంను విజయపథాన నడిపిస్తున్న నేత. జమాతే వెన్నుదన్నుతో మతం పేర ఓట్లడిగిన స్వతంత్ర అభ్యర్థి సయార్ అహ్మద్ రేషిని తన అభివృద్ధితో ఓడించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



నిజానికి తరిగామి ఆయన ఇంటిపేరు కాదు.. ఊరి పేరు అసలే కాదు. షేక్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ఉన్న 1979లో యూసఫ్‌ను అరెస్టు చేశారు. ఆయన అరెస్టు గురించి ఓ జర్నలిస్టు సీఎంను ప్రశ్నించగా.. 'ఓ జో తరిగామ్ వాలా?'అంటూ ప్రస్తావించారు. అప్పటినుంచి తరిగామి ఆయన ఇంటిపేరుగా మారిపోయింది. ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో కూడా తరిగామి ఉంటుంది. దక్షిణ కశ్మీర్‌లో ఉన్న కుల్గాం.. 1996 నుంచి సీపీఎం పార్టీకి మంచి పట్టున్న ప్రాంతం. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ.. రాష్ట్రాన్ని ఏ పార్టీ అయినా పరిపాలించనీ. కుల్గామ్ మాత్రం తరిగామీదే. అందుకే మంగళవారం ఆయన గెలుపొందిన తరువాత 'హక్ కా హామీ తరిగామీ'అంటూ కుల్గామ్ వీధులన్నీ మారుమోగాయి.

జైలు జీవితం.. గృహ నిర్బంధం..

1949లో జన్మించిన తరిగామి.. అబ్దుల్ కబీర్ వని ప్రభావంతో చిన్న వయసులోనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. 18 ఏళ్ల వయసులో అనంత్ నాగ్ కాలేజీలో సీట్లను పెంచాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలో పాల్గొన్నారు. ఆ తర్వాత 1960, 1970 దశకాల్లో జమ్ముకశ్మీర్ లో జరిగిన పలు విద్యార్థి, రైతు ఉద్యమాల్లో పాలు పంచుకన్నారు. 1979లో పాకిస్తాన్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో ఉరిశిక్ష తర్వాత కశ్మీర్‌లో అల్లర్లు చెలరేగాయి. ఈ సందర్భంగా ఆయన జైలుకు వెళ్లారు. వివాదాస్పద ప్రజా భద్రతా చట్టం (పీఎస్ఏ) కింద నిర్బంధానికి గురైన వామపక్ష నాయకుల్లో తరిగామి ఒకరు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించినప్పుడు తరిగామిని శ్రీనగర్‌లో 35 రోజుల పాటు గృహనిర్బంధంలో ఉంచారు. నిర్బంధంలో ఉన్న సమయంలో అనారోగ్యంతో బాధపడుతున్న తరిగామిని ఎయిమ్స్‌కు తరలించేందుకు ఆయన సహచరుడు సీతారాం ఏచూరి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

గట్టిపోటీని తట్టుకుని..

ఈ ఎన్నికల్లో కుల్గాంలో గట్టిపోటీ నేలకొంది. నిషేధిత జమాతే ఇస్లామీ బలపరిచిన అభ్యర్థి సయార్ అహ్మద్ రేషితో తరిగామి తలపడ్డారు. మత తీవ్రవాదానికి పేరుగాంచిన జమాత్ 1980 తర్వాత ఈ ప్రాంతంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం ఇదే తొలిసారి. అంతకుముందు దాదాపు మూడు దశాబ్దాల పాటు ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని బహిష్కరించింది. దీన్ని కేంద్రం 2019లో నిషేధించింది. 2024 జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన 10 మంది జమాత్ మద్దతు గల స్వతంత్ర అభ్యర్థుల్లో రేషి ఒకరు. నేషనల్ కాన్ఫరెన్స్, జమ్మూకశ్మీర్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, సీపీఎం పార్టీలతో కూడిన పీపుల్స్ అలయన్స్ ఫర్ గుప్కర్ డిక్లరేషన్ (పీఏజీడీ) తమ అభ్యర్థిగా తరిగామికి మద్దతు ఇచ్చింది. 85 స్థానాలకు ఎన్నికలు జరగ్గా ఒక్క కుల్గాంలోనే సీపీఎం పోటీ చేసింది. జమాత్ సైద్ధాంతిక ఆకర్షణతో రేషి రంగంలోకి దిగారు. తాను ఓడిపోతే.. ఇస్లాం ఓడిపోయినట్టేనంటూ ప్రచార ర్యాలీలో చెప్పారు. కానీ తరిగామి తన అభివృద్ధి మంత్రంతోనే ముందుకెళ్లారు. ఆర్టికల్ 370 పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని తరిగామి ప్రాతినిధ్యం వహించిన (పీఏజీడీ) చెబుతూ వచ్చింది. తన హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి మాత్రమే ప్రచారంలో తరిగామి వివరించారు. నియోజకవర్గంలోని రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రుల వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపర్చాల్సి ఉందన్నారు. ప్రత్యర్థి రేషి ప్రచారం ఇందుకు విరుద్ధంగా ఉంది. కేవలం ఆర్టికల్ 370 చుట్టే తిరిగింది. అంతిమంగా, ఇస్లాం మతతత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్ట్ తరిగామి విజయం సాధించారు. కుల్గాంలో తరిగామి విజయం ప్రజాస్వామ్యం, లౌకికత్వం విజయమని సీపీఎం పార్టీ కొనియాడింది.

మరో నాలుగేళ్లు ఫోర్టిఫైడ్ రైస్

- 2028 వరకు వివిధ పథకాల ద్వారా ప్రజలకు ఉచిత సరఫరా
- ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మరో నాలుగేళ్ల పాటు ఉచిత ఫోర్టిఫైడ్ రైస్ అందించనున్నారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనతో పాటు ఇతర సంక్షేమ పథకాల ద్వారా 2028 డిసెంబర్ వరకు ఉచిత ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా కొనసాగింపునకు కేంద్ర కేబినెట్ ఆమోదించింది. సూక్ష్మపోషకాలైన ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12లను బియ్యానికి జోడిస్తారు. దీన్నే ఫోర్టిఫైడ్ రైస్‌గా పిలుస్తారు. 2024 జూలై నుంచి 2028 డిసెంబర్ వరకు ఈ కార్యక్రమం అమలు కోసం రూ.17,082 కోట్లు ఖర్చు చేయనున్నారు. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఫోర్టిఫైడ్ రైస్ ఉచిత సరఫరాను కొనసాగించడంతో పాటు పలు అంశాలకు ఆమోదముద్ర వేశారు. గుజరాత్‌లోని లోథాల్‌లో జాతీయ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ (ఎన్ఎంహెచ్‌సీ)ని ఏర్పాటు చేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎన్ఎంహెచ్‌సీ అభివృద్ధిలో 22 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్రం తెలిపింది. 'ఫేజ్ 1ఎ'లో జాతీయ మారిటైమ్ హెరిటేజ్ మ్యూజియం, ఆరు గ్యాలరీలు ఉంటాయని వివరించింది. భారత నావికాదళం, తీరప్రాంత రక్షకదళం గ్యాలరీలు ఉంటాయని, దేశంలోనే అతిపెద్దవిగా ఇవి నిలుస్తాయని తెలిపింది. ఫేజ్–2లో తీరప్రాంత రాష్ట్రాల పెవిలియన్‌లు, మారిటైమ్ ఇనిస్టిట్యూట్, హాస్టల్, నాలుగు థీమ్ బేస్డ్ పార్క్‌లను ఏర్పాటు చేస్తారు.

హరియాణా బీజేపీకి స్వతంత్రుల మద్దతు

ఛండీగఢ్: హరియాణాలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి బలం మరింత పెరగనుంది. స్వతంత్ర అభ్యర్థులు సావిత్రి జిందాల్‌తోపాటు దేవేందర్ కద్యన్, రాజేష్ జూన్‌లు బీజేపీ ప్రభుత్వానికి బయటినుంచే మద్దతివ్వాలని నిర్ణయించుకున్నారు. రాజేష్ జూన్ కాంగ్రెస్ రెబల్ కాగా, బీజేపీ టికెట్ ఇవ్వకపోవడంతో దేవేందర్ కద్యన్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. సావిత్రి జిందాల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రామ్ నివాస్ రారాపై విజయం సాధించారు. తన నియోజకవర్గ అభివృద్ధి కోసమే ప్రభుత్వానికి మద్దతివ్వాలని నిర్ణయించుకున్నట్టు సావిత్రి జిందాల్ తెలిపారు. హిసార్‌ను అందమైన నగరంగా తీర్చి దిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. అంతకుముందు బుధవారం ఉదయమే స్వతంత్ర అభ్యర్థులు కద్యన్, జూన్‌లు.. హర్యానా బీజేపీ ఎన్నికల ఇంచార్జ్‌గా ఉన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్‌లను కలిశారు. ప్రభుత్వానికి మద్దతిచ్చే అంశంపై చర్చించారు. ఈ విషయాన్ని హరియాణా బీజేపీ చీఫ్ మోహన్‌లాల్ బదోలీ ప్రకటించారు. అనంతరం సావిత్రి జిందాల్ ఢిల్లీలో బీజేపీ నేతలతో సమావేశమైన తన మద్దతు విషయం తెలిపారు.

ముంచుకొస్తున్న మిల్టన్

ఫ్లోరిడా పశ్చిమతీరం నుంచి వలసపోతున్న లక్షలాది అమెరికన్లు

టంపా(అమెరికా): అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్ర పశ్చిమతీరంపై మిల్టన్ తుపాను విరుచుకుపడనుంది. బుధవారం అర్ధరాత్రి లేదా గురువారం ఉదయం తీరాన్ని దాటి జనావాసాలను అతలాకుతలం చేయనుందన్న వార్త అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. గంటకు 260 కి.మీ.ల వేగంతో వీస్తున్న పెనుగాలులకుతోడు జాతీయ హరికేన్ కేంద్రం హెచ్చరికలతో అప్రమత్తమైన లక్షలాది మంది స్థానికులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని టంపా, సారాసోటా, సెయింట్ పీటర్స్ బర్గ్ నగరాల ప్రజలు కొందరు సొంతిళ్లను విడిచి వెళ్లలేక, తుపానును ఎలా తట్టుకోవాలో తెలీక బిక్కుబిక్కుమంటున్నారు. దాదాపు 33 లక్షల మంది నివసించే టంపా బే ప్రాంతంలో హరికేన్ దారుణంగా విరుచుకుపడి వినాశనం సృష్టించనుందని వాతావరణశాఖ అంచనావేసింది. ఈ ప్రాంతంపై ఐదో కేటగిరీ హరికేన్ ఇంతటి భారీ స్థాయిలో విరుచుకుపడుతుండటం ఈ శతాబ్దంలోనే తొలిసారి అనే విశ్లేషణలు వెలువడ్డాయి. బుధవారం సాయంత్రానికి టంపా నగరానికి 485 కిలోమీటర్ల దూరంలో సముద్రంపై కేంద్రీకృతమైన హరికేన్ గంటకు కేవలం 22 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా కదులుతోందని, తీరాన్ని తాకే సమయానికి కాస్తంత బలహీనపడే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.


ఫ్లోరిడాను వీడి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళుతున్న ప్రజలు

కుండపోత వర్షాలు

హరికేన్ కారణంగా వెస్ట్ సెంట్రల్ ఫ్లోరిడా ప్రాంతమంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం 18 అంగుళాల మేర వర్షపాతం నమోదుకావచ్చని తెలుస్తోంది. ద్వీపకల్పంలా ఉండే ఫ్లోరిడా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ జాగ్రత్తలు చెప్పింది. ఫ్లోరిడా నేషనల్ సెర్చ్, అండ్ రెస్క్యూ బృందాలు పెద్దమొత్తంలో జనాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఫ్లోరిడా రాష్ట్ర చరిత్రలో ఇంతటి భారీ ఆపరేషన్ చేపట్టడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. హరికేన్ తీరాన్ని తాకితే దాదాపు 5,00,000 ఇళ్లు నాశనమవుతాయని ఓ అంచనా. జనం ఇళ్లను వదిలేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని టంపా సిటీ మేయర్ జన్ కాస్టర్ విన్నవించుకున్నారు. ''మొండిపట్టుదలతో ఇంట్లోనే కూర్చుంటే అదే మీకు శవపేటికగా మారుతుంది''అని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే హెలెన్ హరికేన్ సృష్టించిన విలయం నుంచి సమీప పుంటా గోర్డా సిటీ ఇంకా కోలుకోలేదు. నగర వీధుల్లో ఎక్కడా చూసినా పాడైన ఫర్నీచర్లు, దుస్తులు, పుస్తకాలు, వస్తువులు కనిపిస్తున్నాయి. ''మొన్నటి హెలెన్ హరికేన్ ధాటికే వీధుల్లోకి బుల్ షార్క్‌లు కొట్టుకొచ్చాయి. ఇప్పుడేం జరుగుతుందో''అని స్థానిక అకౌంటెంట్ స్కాట్ జానర్ ఆందోళన వ్యక్తంచేశారు.


ఫ్లోరిడా బీచ్ దారిని మూసేసిన పోలీసులు

రాహుల్ కోసం బీజేపీ జిలేబి

న్యూఢిల్లీ: హరియాణాలో హ్యాట్రిక్ కొట్టి సంబరాల్లో మునిగిన బీజేపీ కాంగ్రెస్‌ను ఎద్దేవాచేయడం మాత్రం మర్చిపోలేదు. స్పష్టమైన ఆధిక్యత వచ్చినట్లు ఫలితాల సరళి వెల్లడైన వెంటనే విపక్షనేత రాహుల్‌గాంధీ కోసం కేజీ జిలేబీని ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టింది. ఎన్నో మిఠాయిలు ఉండగా పనిగట్టుకుని జిలేబీనే ఆర్డర్ చేయడం వెనుక ఆసక్తికర కారణం ఉంది. ఇటీవల హరియాణాలో ఎన్నికల ప్రచారంలో గొహనా పట్టణంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. అక్కడి మిఠాయిల వ్యాపారి మాథురామ్ హల్వాయి దుకాణం నుంచి తెచ్చిన భారీ జిలేబీలను రుచిచూసి అద్భుతం అని పొగిడారు. ఈ భారీ జిలేబీలను అందరూ కొనుగోలు చేయాలని, ప్రపంచ దేశాలకు సైతం ఎగుమతి చేసి స్థానిక ప్రత్యేక వంటకానికి ప్రపంచస్థాయి గుర్తింపు పెంచాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేసిన పెద్ద నోట్ల రద్దు నిర్ణయం కారణంగా మాథురామ్ వంటి చిరువ్యాపారులెందరో నష్టపోయారని, కొందరు జీవనోపాధి కోల్పోయారని రాహుల్ వ్యాఖ్యానించడం తెల్సిందే. దీంతో హరియాణాలో జిలేబీ సైతం ఒక ఎన్నికల ప్రచారాంశంగా మారింది. రాహుల్ చేసిన జిలేబీ విమర్శలపై మోదీ సైతం గతంలో ధీటుగా స్పందించారు. ఈ జిలేబీ రాజకీయాలను గుర్తుచేస్తూ బీజేపీ నేతలు రాహుల్ గాంధీకి ఒక కేజీ జిలేబీలను ఆర్డర్ పెట్టారు. ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపు జరపకుండా డెలివరీ పాయింట్ వద్ద చెల్లింపు చేసేలా 'క్యాష్ ఆన్ డెలివరీ'ఆప్షన్‌ను ఎంచుకున్నారు. ఢిల్లీలోని కన్నాట్ ప్రాంతంలోని ప్రముఖ మిఠాయిల దుకాణం నుంచి రూ.609 కు ఆర్డర్ పెట్టారు. డెలివరీ చేయాల్సిన చిరునామాగా ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఉన్న ''ఢిల్లీలోని అక్బర్‌రోడ్ 24''ను నమోదుచేశారు. హరియాణా బీజేపీ విభాగం తరఫున ఈ జిలేబీలు పంపుతున్నట్లు ఆ ఆర్డర్‌పై రాశారు. ''హరియాణా బీజేపీ కార్యకర్తలు అందరి తరఫున ప్రియతమ రాహుల్‌కు జిలేబీలు పంపుతున్నాం'అని సంబంధిత ఆర్డర్ స్క్రీన్‌షాట్‌ను బీజేపీ తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో పోస్ట్‌చేసింది.

దక్షిణ కొరియా సరిహద్దులు శాశ్వత మూసివేత

- ఉత్తర కొరియా ఆర్మీ ప్రకటన

దక్షిణ కొరియాను కలుపుతూ ఉన్న రోడ్లు, రైల్వే మార్గాలన్నింటినీ ఉత్తర కొరియా మూసివేయనుంది. తన దక్షిణ సరిహద్దును శాశ్వతంగా మూసివేయనున్నట్లు ఉత్తర కొరియా పీపుల్స్ ఆర్మీ (కేపీఏ) బుధవారం ప్రకటించింది. యుద్ధాన్ని నిరోధించడానికి, దేశ రక్షణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. ఈ చర్యలను దక్షిణ కొరియా యుద్ధ విన్యాసాలకు, ఈ ప్రాంతంలో అమెరికన్ అణు ఆస్తులకు ప్రతిస్పందనగా పేర్కొంది. ఈ చర్యలతో కొన్నేళ్లుగా ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరినట్లు కనిపిస్తోంది.

పుతిన్‌తో ట్రంప్ రహస్య స్నేహం

పదవి నుంచి దిగిపోయాక ఆరుసార్లు ఫోన్

- అధికారంలో ఉన్నప్పుడు పుతిన్‌కు కోవిడ్–19 కిట్లు
- బాబ్ వుడ్‌వర్డ్ 'వార్' పుస్తకంలో సంచలన విషయాలు

వాషింగ్టన్: రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రష్యా అధినేత పుతిన్ కోసం కోవిడ్–19 టెస్టింగ్ కిట్లు రహస్యంగా అందజేశారా? పుతిన్ వీటిని వ్యక్తిగతంగా వాడుకున్నారా? పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా పుతిన్‌తో ట్రంప్ రహస్యంగా స్నేహ సంబంధాలు కొనసాగించారా? అవుననే చెబుతోంది ఓ పుస్తకం. వాటర్‌గేట్ కుంభకోణంపై వార్తలు రాసిన విలేకరి బాబ్ వుడ్‌వర్డ్ రచించిన 'వార్'అనే పుస్తకంలో ఈ సంచలన విషయాలు ప్రస్తావించారు. ఈ పుస్తకం ఈ నెల 15న విడుదల కానుంది. ఇందులోని కొన్ని ముఖ్య అంశాలను అమెరికా పత్రికలు బయటపెట్టాయి. ట్రంప్ 2021లో అధికారం నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత ట్రంప్, పుతిన్ కనీసం ఆరుసార్లు ఫోన్‌లో సీక్రెట్‌గా మాట్లాడుకున్నారని ట్రంప్ సహాయకుడు చెప్పినట్లు పుస్తకాన్ని ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. ప్రస్తుతం ఈ వ్యవహారం మొత్తం అమెరికాలో సంచలనాత్మకంగా మారింది. ఇదిలా ఉండగా, వార్ పుస్తకంలోని అంశాలను ట్రంప్ ప్రచార బృందం ఖండించింది. అదొక చెత్త పుస్తకం, అందులోని కాగితాలు టాయిలెట్ టిష్యూగా వాడుకోవడానికి పనికొస్తాయని ఎద్దేవా చేసింది. ట్రంప్ సైతం స్పందించారు. కథలు చెప్పడంతో దిట్ట అయిన బాబ్ వుడ్‌వర్డ్ చెప్పే పనికిమాలిన విషయాలు నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. అతడొక చెడ్డవ్యక్తి అని విమర్శించారు. తాజా వివాదంపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ కూడా స్పందించింది. 'వార్'పుస్తకంలో ప్రస్తావించిన వాటిలో ఏమాత్రం వాస్తవం లేవని, అవన్నీ అభూత కల్పనలు అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తేల్చిచెప్పారు.

నిందితుడి డీఎన్ఏ, రక్తనమూనాలు సరిపోలాయి

- ఆర్.జి.కర్ వైద్యురాలి హత్యాచారంపై సీబీఐ చార్జిషీటు
- 11 సాంకేతిక ఆధారాలను చూపిన దర్యాప్తు సంస్థ

కోల్‌కతా: దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలకు కారణమైన ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ వైద్యురాలిపై హత్యాచారం ఘటన ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ ఒక్కడి పనేనని సీబీఐ తెలిపింది. వైద్యురాలి మృతదేహంపై ఉన్న డీఎన్ఏ, రక్తనమూనాలు నిందితుని నమూనాలతో సరిపోలాయని సీబీఐ చార్జిషీటులో పేర్కొంది. సంజయ్ రాయ్‌కు వ్యతిరేకంగా 11 సాంకేతిక ఆధారాలను చార్జిషీటులో పొందుపర్చింది. బాధితురాలి మృతదేహం నుంచి సేకరించిన డీఎన్ఏ సంజయ్ రాయ్ డీఎన్ఏతో సరిపోలిందని తెలిపింది. అలాగే కురచ వెంట్రుకలు, పెనుగులాటలో సంజయ్ రాయ్ ఒంటిపై అయిన గాయాలు, అతని శరీరంపై, ప్యాంటుపై బాధితురాలి రక్తపు మరకలు, సీసీటీవీ ఫుటేజీ, అతని మొబైల్ ఫోన్ లొకేషన్, ఫోన్‌కాల్ వివరాలు.. ఇవన్నీ సంజయ్ రాయ్ పాత్రను నిర్ధారిస్తున్నాయని పేర్కొంది. సంజయ్ రాయ్ ఒంటిపై బలమైన గాయాలున్నాయని, వైద్యురాలు తీవ్రంగా ప్రతిఘటించినపుడు ఇవి జరిగాయని వివరించింది. పాశవిక హత్యాచారం జరిగిన ఆగస్టు 9న సంజయ్ రాయ్ ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో మూడో అంతస్తులోని సెమినార్ హాల్ వద్ద ఉన్నట్లు సీసీటీవీ ఫుటేజీ, అతని కాల్ డేటా ధ్రువీకరిస్తోందని తెలిపింది. సంజయ్ రాయ్‌ను కోల్‌కతా పోలీసులు ఆగస్టు 10న అరెస్టు చేయగా.. తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును సీబీఐ చేపట్టిన విషయం తెలిసిందే. సెమినార్ హాల్ వైపు వెళుతున్నపుడు సంజయ్ రాయ్ మెడపై ఉన్న బ్లూటూత్ ఇయర్‌ఫోన్ నెక్‌బ్యాండ్ తర్వాత అతను తిరిగి వెళుతున్నపుడు లేదని, సంజయ్ రాయ్ ఫోన్‌తో ఇది అనుసంధానమైనట్లు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ నివేదిక ఇచ్చిందని స్థానిక కోర్టుకు సీబీఐ తెలిపింది.

పొడువాటి మీసం



బారెడు మీసాలున్న ఒక కళాకారుడితో బికనేర్‌లో ఫోటోకు ఫోజు ఇచ్చిన విదేశీ పర్యాటకురాలు

ఎగిరే ట్యాక్సీ


యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అభివృద్ధి చేస్తున్న ఎగిరే ట్యాక్సీ నమూనా ఇది. లండన్‌లో చారింగ్ క్రాస్ రైల్వేస్టేషన్ వద్ద బుధవారం దీన్ని ప్రదర్శించారు.

కళ్లుచెదిరే గార్బా


అహ్మదాబాద్ శివార్లలో గార్బా నృత్యాన్నిపైనుంచి డ్రోన్ల ద్వారా చిత్రీకరించిన దృశ్యం.

కలకాలం నిలిచి ఉండే కాకతీయుల ప్రాభవం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

చరిత్ర

కాకతీయ యుగ విశేషాలు

పన్నులు

కాకతీయుల కాలంలో స్థూలంగా అయిదు రకాల పన్నులుండేవి. అవి: 1. భూమి పన్ను, 2. పారిశ్రామిక, ఆస్తి పన్నులు, 3. వృత్తి పన్నులు, 4. వ్యాపార పన్నులు, 5. ఇతర పన్నులు.

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ మార్గం భూమి శిస్తు. వర్తకం, పరిశ్రమలు, వృత్తులపై విధించే పన్నులు రెండో ఆదాయ మార్గం. పశుగ్రాసానికి పనికి వచ్చే పచ్చికబయళ్లపై వసూలు చేసే పన్ను, అడవుల కలపపై వేసే పన్ను మూడో ఆదాయ మార్గంగా ఉండేది. వర్తక సరకులు, ఎగుమతి దిగుమతు లు, తయారైన వస్తువుల మీద వేసే పన్నును 'సుంకం'గా పేర్కొనేవారు. సాధారణంగా సుంకాలు వసూలు చేసే అధికారం వర్తక శ్రేణులకు ఇచ్చేవారు.

న్యాయ పాలన

సామాన్యమైన వివాదాలన్నింటినీ గ్రామ సభల్లో గ్రామ ప్రభువులు పరిష్కరించేవారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా 'తలారి' అనే గ్రామోద్యోగి చూసేవాడు. రాజే అంతిమ న్యాయ నిర్ణేత. యాజ్ఞవల్క్య స్మృతి లాంటి ప్రాచీన స్మృతి గ్రంథాల్లో పేర్కొన్న సూత్రాలను అనుసరించి ధర్మాసనాలు ఏర్పరిచేవారు. ఒకరిద్దరు రాజాధికారులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సభల్లో న్యాయ సమస్యలు పరిష్కారమయ్యేవి. వీరిని 'మహాజనులు'గా పేర్కొనేవారు. సమస్య పరిష్కారమైన వెంటనే సభ రద్దయ్యేది. ప్రస్తుతం గ్రామ పెద్దల మాదిరిగా ఈ మహాజనులు పనిచేసేవారు. తెగల్లో వివాదాలను 'సమయాలే' పరిష్కరించేవి.

సైనిక వ్యవస్థ

కాకతీయ సైన్యంలో చక్రవర్తి సైన్యం, నాయంకర సైన్యం అని రెండు విభాగాలు ఉండేవి. కాకతీయ చక్రవర్తులు సైన్యానికి స్వయంగా నాయకత్వం వహించేవారు. వీరి రాజ్యంలో స్థల, జల, వన, గిరి అనే నాలుగు రకాల కోటలు ఉన్నట్లు తెలుస్తోంది. కాకతీయుల కాలంలో ఓరుగల్లు, రాయచూరు, గోల్కొండ, భువనగిరి, రాచకొండ, దేవరకొండ, నల్లగొండ, పానుగల్లు కోటలు శత్రు దుర్భేద్యమైనవిగా పేరు పొందాయి.

ఆర్థిక పరిస్థితులు

కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం సిరి సంపదలతో విలసిల్లినట్లు అమీర్ ఖుస్రూ, అబ్దుల్లా వాసఫ్, మార్కోపోలో లాంటి విదేశీ యాత్రికుల రచనల ద్వారా తెలుస్తోంది.

వ్యవసాయం: తెలంగాణా ప్రాంతంలో సాగు భూమిని, నీటి వనరులను పెంచడానికి కాకతీయులు ఎనలేని కృషి చేశారు. వీరు చెరువులు నిర్మించి నీటి పారుదలపై శ్రద్ధ వహించారు. రెండో బేతరాజు సెట్టి సముద్రం, కెరె సముద్రం, కేసరి సముద్రం చెరువులను నిర్మించాడు. గణపతిదేవుడు రాజ్యం నలుమూలలా అనేక చెరువులు నిర్మించాడు. గణపతిదేవుడి సేనాని రేచర్లరుద్రుడు 17,258 ఎకరాలకు సాగు నీరు అందించేవిధంగా పాకాల చెరువును నిర్మించాడు. దీని విస్తీర్ణం 12 చ.కి.మీ. రామప్ప చెరువును నిర్మించింది కూడా ఇతడే. రేచర్ల రెడ్లు 35 నీటి వనరులను ఏర్పాటు చేశారు. కాటచమూపతి కాట సముద్రం; చౌడ చమూపతి చౌడ సముద్రం; నామిరెడ్డి సబ్బి సముద్రం, గౌర సముద్రం, కోమటి చెరువు; ఎరకసాని ఎరక సముద్రం నిర్మించారు. వీటితో పాటు చింతల సముద్రం, నామా సముద్రం కూడా ఉండేవి. చెరువుల నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులకు దినసరి వేతనాలు చెల్లించేవారు. చెరువులతో పాటు ఊట కాలువలను కూడా నిర్మించారు. మూసీ నది నుంచి సాగే మూసెటి కాలువ; ఆలేరు నది నుంచి ఆలేటి కాలువ; కూచినేని కాలువ, రావిపాటు కాలువ, బొమ్మకంటి కాలువ, ఉటుంకాలువ, చింతల కాలువల గురించి పిల్లలమర్రి శాసనాల్లో పేర్కొన్నారు. ఏతం, మోటలతో కూడా వ్యవసాయం చేసేవారు. కొత్తగా పొలాలను సాగు చేయడానికి కాకతీయ రాజులు కృషి చేశారు. ప్రతాపరుద్రుడి కాలంలో అడవులను నరికేసి విశాల భూభాగాలను సాగులోకి తీసుకువచ్చారు. నేటి రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ప్రతాపరుద్రుడి కాలంలో రూపొందినవేనని ఆ గ్రామ కైఫీయతుల ద్వారా తెలుస్తోంది. తెలంగాణలోని మంథెన, కాళేశ్వరం, చెన్నూరు, నర్సంపేట, అచ్చంపేట, ఖమ్మం మెట్టు, కొత్తగూడెం అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లో ఎక్కువ భాగం కాకతీయుల కాలంలోనే ఏర్పడినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. గ్రామం, చెరువును నిర్మించడం నాడు



పుణ్యకార్యంగా భావించేవారు. గ్రామాలను ఏర్పరచడానికి అన్ని వృత్తుల వారికి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. చాలా మంది కాకతీయ రాజులు, రాణులు అటవీ, బీడు భూములను వ్యవసాయ యోగ్యంగా చేశారు. వీరి పేరు మీద అనేక గ్రామాలు ఏర్పడ్డాయి. గణపవరం, ఘన్‌పూర్, మహాదేవపురం, రుద్రవరం, బయ్యారం, ముప్పవరం, కుందవరం మెదలైనవన్నీ వీటికి ఉదాహరణ. భూమిపై ప్రాథమిక స్వామ్యం రాజుది, ద్వితీయ స్వామ్యం వ్యక్తిది. రైతులు వరి, గోధుమలు, కొర్రలు, జొన్నలు, మొక్కజొన్నలు, నీలిమందు, ఆముదాలు, నువ్వు లు, పెసలు, కందులు, చెరకు, నూనెగింజలు, ఆవాలు, సజ్జలు, మినుములు, ఉలవలు, పత్తి, అల్లం, పసుపు, ఉల్లి తదితర పంటలు పండించేవారు. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలు వెదజల్లే బియ్యం తయారైనట్లు సాహిత్యం ద్వారా తెలుస్తోంది. ఆ కాలంలో కొబ్బరి, చెరకు, మామిడి, జామ, అరటి తోటలు విస్తారంగా ఉండేవి. సాధారణంగా ప్రతి గ్రామంలో బెల్లం, నూనె గానుగలు ఉండేవి. పశు సంపద పుష్కలంగా ఉండేది.

పరిశ్రమలు: నాడు వ్యవసాయంతో పాటు అనేక పరిశ్రమలు కూడా ఉండేవి. పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్య చరిత్ర'లో ఇరవైకి పైగా వస్త్రాల గురించి పేర్కొన్నాడు. ఓరుగల్లులో రత్నకంబళ్లు, ముఖమల్ వస్త్రాలు నేసేవారు. ఏకామ్రనాథుడు ఓరుగల్లులో చిత్తరువులు రాసే ఇళ్లు 1500 వరకు ఉండేవని పేర్కొన్నాడు. నాడు చిత్రకళకు మంచి ఆదరణ ఉండేది. పాల్కురికి 'బసవపురాణం'లో యాభై రకాల దుస్తుల పేర్లను ప్రస్తావించాడు. కాకతీయుల రాజ్యంలో శ్రేష్ఠమైన సన్నని వస్త్రాలు నేసేవారని, అవి సాలెపురుగు జాలె మాదిరిగా ఉండేవని మార్కోపోలో ప్రశంసించాడు. వీటి ఆధారంగా ఆ కాలంలో పద్మశాలీలకు మంచి నైపుణ్యం ఉండేదని తెలుస్తోంది.

పల్లకీల మీద చెక్కిన నగిషీల వర్ణనను పరిశీలిస్తే నాటి వడ్రంగుల పని నైపుణ్యం అర్థమవుతుంది. పంచలోహాలతో వివిధ రకాల వస్తువులను తయారు చేసేవారు. నిర్మల్‌లో తయారైన కత్తులకు డమాస్కస్‌లోనూ మంచి ఆదరణ ఉండేది. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులున్నట్లు మార్కోపోలో రాశారు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలను గ్రామాల్లోనే తయారు చేసేవారు. పానగల్లు, చండూరులో దేవాలయాల్లో ఉపయోగించే కంచు గంటలు, పళ్లాలు, పాత్రలను రూపొందించేవారు.

వర్తక - వాణిజ్యం: శాతవాహనుల తర్వాత క్రమంగా క్షీణించిన దేశీయ, విదేశీ వాణిజ్యాన్ని కాకతీయులు పునరుద్ధరించారు. కాకతీయుల కాలంలో దేశీయ వాణిజ్యానికి ప్రధాన కేంద్రం ఓరుగల్లు. ఆ తర్వాత తెలంగాణలో మంథెన, అలంపురం, జడ్చర్ల, మగతల, పేరూరు ప్రధాన వాణిజ్యకేంద్రాలుగా ఉండేవి. పలనాటి సీమ నుంచి వాడపల్లి, నకిరెకల్, పిల్లలమర్రి మీదుగా వ్యాపారులు వరంగల్ వచ్చేవారు. బళ్లారి-చిత్తూరు, రాయచూరు-కొలనుపాక, బీదరు-కొలనుపాక, కల్యాణి-కొలనుపాక-అనుమకొండ, బీదరు-పటాన్‌చెరువు-వరంగల్ మొదలైనవి ముఖ్యమైన వాణిజ్య మార్గాలుగా ఉండేవి.

కాకతీయుల పాలనలో తెలంగాణలో వర్తక శ్రేణుల నిర్మాణంలో గుర్తించదగిన మార్పు వచ్చింది. ఆ కాలంలో వ్యాపారం బలిజలకు, వైశ్యులకే పరిమితం కాలేదు. రెడ్లు, నాయుళ్లు, బోయలు, దాసర్లు, తెలికలు, పద్మశాలీలు, వ్యవసాయదారుల లాంటి ఉత్పత్తిదారులు, కమ్మరి, కంసాలి, మేదరి లాంటి వృత్తి కులాల వారు వ్యాపారంలోకి వచ్చారు. వివిధ వృత్తికారులు, ఉత్పత్తిదారులు సొంత సమయాలను ఏర్పరచుకొని తమ కులవృత్తులతో పాటు వ్యాపారాలను నిర్వహించుకునేవారు. వీరిలో కొంత మంది కేవలం తమ ఉత్పత్తులనే అమ్ముకునేవారు. అందువల్ల ఇంత మంది వ్యాపారంలోకి వచ్చినప్పటికీ ప్రధానంగా వ్యాపారం వైశ్యుల చేతిలోనే ఉండేది. గోధుమ, పెసలు, వడ్లు, జొన్నలు, ఉప్పు, నూనె, నెయ్యి, మిరియాలు, ఆవాలు, తేనె, తగరం, రాగి, కర్పూరం, కస్తూరి, పట్టు, రత్నాలు, ముత్యాలు, పూసలు, పసుపు, ఉల్లిగడ్డలు, అల్లం, నూలు, దుంపలు మొదలైన ఉత్పత్తుల వ్యాపారం జరిగేది.

విదేశీ వాణిజ్యం: కాకతీయుల కాలంలో 'మోటుపల్లి' విదేశీ వాణిజ్యానికి ప్రసిద్ధమైన రేవు పట్టణంగా గుర్తింపు పొందింది. చాళుక్య, చోళ రాజుల కారణంగా దెబ్బతిన్న విదేశీ వ్యాపారాన్ని గణపతిదేవుడు ఈ రేవు పట్టణం ద్వారా పునరుద్ధరించాడు. దీని ద్వారా ఇండోనేషియా, జావా, సుమత్రా, జపాన్, మలయా, బర్మాతో వ్యాపారం చేసేవారు. మార్కోపోలో ఈ రేవు పట్టణాన్ని సందర్శించాడు. ఇక్కడి నుంచి ఎగుమతయ్యే వస్తువుల్లో వజ్రాలు, పట్టుతో తయారయ్యే సన్నని వస్త్రాలు ముఖ్యమైనవని అతడు పేర్కొన్నాడు. కాకతీయుల నాణేలు ఎక్కువగా లభించలేదు. కానీ శాసనాలు, సాహిత్యంలో నాణేల ప్రస్తావన ఉండేది.

సాంఘిక పరిస్థితులు

కాకతీయుల కాలంనాటి సంఘంలో ప్రధానంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు ఉండేవి. ప్రతి కులంలో అనేక ఉపకులాలు ఏర్పడ్డాయి. ఏకామ్రనాథుడు 'ప్రతాపచరిత్ర'లో, వినుకొండ వల్లభరాయుడు 'క్రీడాభిరామం'లో కాకతీయుల కాలంనాటి వివిధ వృత్తుల గురించి ప్రస్తావించారు. కోమట్లు, ఈదురవారు, గొల్లవారు, అక్కలవారు (అగసాల), సాలెవారు, మంగలులు, కుమ్మరివారు, బోయవారు, రుంజులు, పిచ్చుకుంట్లు, పంబల, బవని, మేదర, గాండ్ల మొదలైన కులాల పేర్లను శాసనాల్లోనూ పేర్కొన్నారు.

హిందూ మతాన్ని సంస్కరించే ఉద్దేశంతో శైవ, వైష్ణవ మతాలు ఆవిర్భవించాయి. కుల నిర్మూలన కోసం పుట్టిన వీటి ద్వారా సంఘంలో కొత్త కులాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా శైవుల్లో లింగాయతులు, బలిజులు, జంగాలు, తంబళ్లు మొదలైన కులాలు ఏర్పడ్డాయి. వైష్ణవుల్లో నంబులు, సాతానులు, దాసర్లు మొదలైన కులాలు ఆవిర్భవించాయి. 'అష్టాదశ కులాలు' అప్పటికే ప్రాచుర్యంలో ఉన్నాయి.

కాకతీయుల కాలంలో బాల్యవివాహాలు జరిగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహ పద్ధతులు ఉండేవి. రుద్రమదేవి కుమార్తె రుయ్యమను బ్రాహ్మణ మంత్రి ఇందులూరి అన్నయ్య దేవుడు పెళ్లి చేసుకోవడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. అయినప్పటికీ కుల నిర్మూలన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాకతీయుల కాలంలో వెలమలు సంఘ సంస్కర్తలుగా, రెడ్లు పూర్వాచార పరాయణులుగా ఉన్నట్లు తెలుస్తోంది. నాడు రాజకీయంగా ప్రాబల్యం వహించిన రెడ్లు, వెలమల మధ్య అధికారం కోసం పోటీ ప్రారంభమైంది. ఈ కాలంలో అష్టాదశ వర్ణాల్లో అగ్రవర్ణమైన బ్రాహ్మణ వర్గానికి చెందినవారు రాజకీయ ప్రాబల్యాన్ని కోల్పోయారు. రాజకీయాధికారం చతుర్థ వర్ణ పరమైంది. క్షత్రియ వంశాలు నామమాత్రంగా అధికారంలో ఉండేవి.

కాకతీయుల కాలంనాటి సాంఘిక జీవితానికి సంబంధించిన ఒక ప్రధాన లక్షణం కుల సంఘాలు. వీటిని 'సమయములు' అనేవారు. నగరాలు, గ్రామాలు పేటలుగా విభజించి ఉండేవి. అక్కలవాడ, భోగంవీధి, వెలిపాళె, మేదరవాడ, మోహరినాడు మొదలైనవి ఇలాంటివే. పూటకూళ్ల ఇళ్లు ఉండేవి. బసవ పురాణం ఆధారంగా ఆనాటికే వెట్టి వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తోంది. మహిళలు పాత్ర, గొండ్లి, పేరణి, కోలాటం, గొబ్బిళ్లు, గుర్రం, భంజళి మొదలైన క్రీడలతో వినోదం పొందేవారు.

వాస్తు, శిల్ప కళ

కాకతీయ రాజులు, వారి సామంతులు అనేక జైన, శైవ, వైష్ణవాలయాలను నిర్మించారు. దేవాలయ నిర్మాణంలో కాకతీయులు పశ్చిమ చాళుక్యుల వాస్తు విధానాన్ని అనుసరించారు. వీరు త్రికూటాలయాలను ఇదే పద్ధతిలో నిర్మించారు. బేతిరెడ్డి భార్య ఎరకేశ్వరాలయం నిర్మించారు. నామిరెడ్డి పిల్లలమర్రిలో కాటేశ్వర, కాచేశ్వర, నామేశ్వర ఆలయాలను నిర్మించాడు. పాలంపేట, పిల్లలమర్రి, పానగల్లు, హన్మకొండలో ఉన్న ఆలయాలను త్రికూట పద్ధతిలోనే నిర్మించారు.

నంది విగ్రహాలు కాకతీయ శిల్ప ప్రాభవానికి నిదర్శనాలు. కాకతీయ శిల్పం చాళుక్యుల శిల్పం కంటే నిగ్గు తేలి ఉంది. ఇది కొంత ప్రాంతీయ లక్షణాలను సంతరించుకొని ఉంటుంది. దేశీయ నృత్య రీతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాట్యగత్తెల కోలాట దృశ్యాలు కూడా కాకతీయుల కళా నైపుణ్యానికి తార్కాణంగా ఉన్నాయి.

ఫిల్మ్ ప్రాజెక్టర్ ఏ రకం బోధనోపకరణం?

టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

బయాలజీ - మెథడ్స్ (ఎస్ఏ)



బోధనోపకరణాలు

1. బోధనోపకరణం ద్వారా దృష్టి, వినికిడిని ఏకకాలంలో ఉపయోగించి విద్యార్థి అభ్యసన అనుభవాన్ని పెంపొందిస్తే దాన్ని దృశ్య శ్రవణ బోధనోపకరణం అంటారని నిర్వచించిందెవరు?
   1) బర్టన్ 2) కార్టర్ గుడ్
   3) ఎడ్గర్ డేల్ 4) జేమ్స్ వాట్
2. చూడడం ద్వారా అభ్యసన స్థాయి శాతం?
   1) 11% 2) 35% 3) 83% 4) 100%
3. చెప్పడం, చేయడం ద్వారా స్మృతి స్థాయి శాతం?
   1) 60% 2) 75%
   3) 50% 4) 90%
4. అభ్యసనానుభవాలను బట్టి బోధనోపకరణాలను మూడు విధాలుగా వర్గీకరించినవారు?
   1) జి.ఎస్.బ్రూనర్ 2) కార్టర్ ఎ.గుడ్
   3) బర్టన్ 4) ఎడ్గర్ డేల్
5. నమూనాలు ఏ రకానికి చెందిన బోధనోపకరణాలు?
   1) ప్రత్యక్షానుభవాన్నిచ్చేవి
   2) ఆరోపిత అనుభవాన్నిచ్చేవి
   3) గుర్తులతో అనుభవాన్నిచ్చేవి
   4) సంకల్పిత అనుభవాన్నిచ్చేవి
6. ప్రయోగాలు చేయడం ఏ రకమైన బోధనోపకరణం?
   1) ఆరోపిత 2) ప్రత్యక్ష అనుభవ
   3) మాటలు లేదా గుర్తులతో 4) ఏవీకాదు
7. దృశ్య, శ్రవణ, దృశ్య-శ్రవణ, కృత్యాధార అనే బోధనోపకరణాల వర్గీకరణ దేన్ని బట్టి జరిగింది?
   1) అనుభవాలు 2) పరిమాణం
   3) లభ్యత 4) లక్షణాలు
8. క్షేత్ర పర్యటన ఏ రకం బోధనోపకరణం?
   1) దృశ్య 2) దృశ్య-శ్రవణ
   3) కృత్యాధార 4) శ్రవణ
9. ఎడ్గర్ డేల్ బోధనోపకరణాలను అనుభవాలను బట్టి ఏ ఆకారంలో అమర్చారు?
   1) గోళాకారం 2) చతురస్రాకారం
   3) శంఖాకారం 4) చతుర్భుజాకారం
10. ఎడ్గర్ డేల్ శంఖువులో ప్రత్యక్ష అనుభవాల స్థానం?
    1) పీఠ భాగం 2) శిఖర భాగం
    3) మధ్య భాగం 4) కింది భాగం
11. ఎడ్గర్ డేల్ శంఖువులో శాబ్దిక చిహ్నాల స్థానం?
    1) పీఠ భాగం 2) శిఖర భాగం
    3) మధ్య భాగం 4) ఎక్కడైనా ఉండొచ్చు
12. పోషకాహార విలువలను నృత్య రూపకంగా చేసి బోధించడం?
    1) ప్రత్యక్ష అనుభవం 2) క్షేత్ర పర్యటన
    3) ప్రదర్శన 4) నాటకీకరణ
13. ఫ్లానెల్ బోర్డ్ ఏ రకానికి చెందిన బోధనోపకరణం?
    1) ప్రదర్శనా ఉపకరణాలు
    2) త్రిపరిమాణ ఉపకరణం
    3) రేఖీయ చిత్రం 4) ప్రక్షేపిత ఉపకరణం
14. మాతృకలు (స్పెసిమన్) ఏ రకం బోధనోపకరణం?
    1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
    3) కృత్యాధార 4) త్రిపరిమాణ
15. ఫిల్మ్ ప్రాజెక్టర్ ఏ రకం బోధనోపకరణం?
    1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
    3) కృత్యాధార 4) త్రిపరిమాణ
16. ఎడ్గర్ డేల్ అనుభవ శంఖువులో ప్రాజెక్టర్‌ల స్థానం?
    1) ప్రదర్శన బల్లలపైన 2) చార్టు తర్వాత
    3) చలనచిత్రాలపైన 4) శాబ్దిక చిహ్నాలపైన
17. జంతువుల వర్గీకరణ రాయడానికి ఏ రకం చార్ట్ అవసరం?
    1) వ్యవస్థానుక్రమ 2) దత్తాంశ
    3) వంశవృక్ష 4) క్రమానుగత
18. బార్ గ్రాఫ్‌లను ఏ విధంగా పిలుస్తారు?
    1) హిస్టోగ్రామ్‌లు 2) లైన్ గ్రాఫ్‌లు
    3) సెక్టర్ గ్రాఫ్‌లు 4) వ్యంగ్య చిత్రాలు
19. వీటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉంటుంది?
    1) రేఖా చిత్రం 2) త్రిమితీయ ఉపకరణం
    3) రేడియో 4) శాబ్దిక చిహ్నం
20. తోలుబొమ్మలు ఏ రకం బోధనోపకరణం?
    1) కృత్యాధార 2) ప్రదర్శన
    3) ప్రక్షేపిత 4) త్రిమితీయ
21. అపార దర్శక వస్తువులను ఏ ఉపకరణం ద్వారా ప్రక్షేపితం చేయొచ్చు?
    1) ఫిల్మ్ ప్రాజెక్టర్ 2) ఓవర్‌హెడ్ ప్రాజెక్టర్
    3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రాజెక్టర్
22. మైక్రో ప్రాజెక్టర్ ప్రత్యేకత ఏమిటి?
    1) ఉపాధ్యాయుడి వెనుక ప్రతిబింబం
    2) అపారదర్శకత కలిగిన వస్తువుల ప్రక్షేపణ
    3) సూక్ష్మదర్శినిలోని స్లైడుల ప్రక్షేపణ
    4) సెల్లోఫెన్ పేపర్‌పైన వేసిన బొమ్మల ప్రక్షేపణ
23. ప్రాజెక్టర్ ఉపాధ్యాయుడి దగ్గరే ఉండి ప్రతిబింబం కూడా అయన వైపే ప్రక్షేపించడం ఏ ప్రాజెక్టర్ లక్షణం?
    1) స్లైడ్ ప్రాజెక్టర్ 2) ఓవర్ హెడ్ ప్రాజెక్టర్
    3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రాజెక్టర్
24. భారతదేశంలో దూరదర్శన్ ప్రయోగాత్మక ప్రసారాలు ప్రారంభించిన సంవత్సరం?
    1) 1959 2) 1961
    3) 1987 4) 1998
25. బడి తోట పెంచడం ఏ కమిటీ సూచించిన SUPWలో ఒక భాగం?
    1) మొదలియార్ 2) తారాదేవి
    3) ఈశ్వరీబాయి 4) కొఠారీ
26. వైజ్ఞానిక సంఘాలు ఏ రకం బోధనోపకరణాల కిందకు వస్తాయి?
    1) ప్రక్షేపిత 2) కృత్యాధార
    3) పరోక్ష 4) దృశ్య శ్రవణ
27. 1959లో మొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) కోల్‌కతా 2) ముంబై
    3) హైదరాబాద్ 4) ఢిల్లీ
28. 1977లో ముంబైలో ఏ విజ్ఞాన శాస్త్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశారు?
    1) బిర్లా ప్లానిటోరియం
    2) విశ్వేశ్వరయ్య మ్యూజియం
    3) నెహ్రూ విజ్ఞాన కేంద్రం
    4) జాతీయ విజ్ఞాన కేంద్రం
29. మొక్కలను లేదా వాటి భాగాలను కొంతకాలం ఎండబెట్టి భద్రపర్చే విధానం?
    1) వివేరియం 2) ఛేధనం
    3) టెర్రేరియం 4) హెర్బేరియం
30. అక్వేరియం అనేది ఒక?
    1) అందాన్నిచ్చే వస్తువు
    2) కృత్రిమ జీవావరణ వ్యవస్థ
    3) అన్ని రకాల జీవులుండే స్థలం
    4) చీకటి జీవులను తెలుసుకునేది
31. ప్రత్యేక స్థలాల్లో జీవించి ఉన్న జంతువులకు సహజ స్థితులను ఏర్పర్చి పరిశీలించడాన్ని ఏమంటారు?
    1) వివేరియం 2) అక్వేరియం
    3) హెర్బేరియం 4) టెర్రేరియం
32. కీటకాల జీవిత చరిత్రను బోధించేందుకు దేన్ని ఉపయోగించవచ్చు?
    1) అక్వేరియం 2) వివేరియం
    3) హెర్బేరియం 4) టెర్రేరియం
33. భూచరాలయాన్ని ఏ విధంగా పిలుస్తారు?
    1) వివేరియం 2) హెర్బేరియం
    3) అక్వేరియం 4) టెర్రేరియం
34. అక్వేరియంలో ఉండే జీవులు?
    1) కీటకాలు 2) చేపలు
    3) వృక్షాలు 4) మానవులు
35. అక్వేరియంలో ఏ మొక్కలను పెంచుతారు?
    1) గులాబీ మొక్కలు 2) కాక్టస్
    3) హైడ్రిల్లా 4) గడ్డి మొక్కలు

సమాధానాలు

1) 2;	2) 3;	3) 4;	4) 1;	5) 2;
6) 2;	7) 4;	8) 3;	9) 3;	10) 1;
11) 2;	12) 4;	13) 1;	14) 4;	15) 2;
16) 3;	17) 3;	18) 1;	19) 2;	20) 4;
21) 3;	22) 3;	23) 2;	24) 1;	25) 3;
26) 2;	27) 1;	28) 3;	29) 4;	30) 2;
31) 1;	32) 2;	33) 4;	34) 2;	35) 3.

అనియత విజ్ఞాన శాస్త్ర విద్య



1. ఏ రకమైన నియమ నిబంధనలు లేకుండా సైన్స్‌పై అవగాహన ఏర్పర్చి, శాస్త్రీయ వైఖరులను అభివృద్ధి చేయడానికి పాటించే పద్ధతులేవి?
   1) విద్యా సాంకేతిక శాస్త్ర కార్యక్రమాలు
   2) నిర్బంధ విద్యా కార్యక్రమాలు
   3) అనియత విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
   4) పాఠ్యేతర విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
2. వైజ్ఞానిక సంఘాలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, మ్యూజియాలు, సైన్స్ కమ్యూనిటీ సెంటర్‌లు.. సైన్స్ ఫెయిర్స్ (ప్రదర్శన)ల ద్వారా అందించే విజ్ఞాన శాస్త్ర విద్య?
   1) నియత విజ్ఞాన శాస్త్ర విద్య
   2) నిర్బంధ విజ్ఞాన శాస్త్ర విద్య
   3) విద్య సాంకేతిక శాస్త్రం
   4) అనియత విజ్ఞాన శాస్త్ర విద్య
3. వైజ్ఞానిక సంఘాలు ఏ రంగాలను ప్రభావితం చేస్తాయి?
   1) జ్ఞానాత్మక - భావావేశ
   2) భావావేశ, మానసిక చలనాత్మక
   3) మానసిక చలనాత్మక, జ్ఞానాత్మక
   4) జ్ఞాన, భావావేశ, మానసిక చలనాత్మక
4. వైజ్ఞానిక సంఘాలు విద్యార్థులకు పని - అనుభవం కలిగించే ప్రక్రియలు అని తెలిపినవారు?
   1) మొదలియార్ 2) కొఠారీ
   3) తారాదేవి 4) రాధాకృష్ణన్
5. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ లక్ష్యం కాదు?
   1) విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను పెంపొందించడం
   2) అనాదిగా వస్తున్న ఆచారాలను నమ్మడం
   3) విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, పెంపొందించడం
   4) విరామకాలాన్ని సద్వినియోగపర్చుకునేలా చేయడం
6. సాధారణ సంఘాలు, ప్రత్యేక అభిరుచి సంఘాలు అనేవి ఏ సంఘంలో రకాలు?
   1) వైజ్ఞానిక సంఘం 2) విహార యాత్ర సంఘం
   3) సేవా సంఘం 4) శాస్త్రవేత్తల సంఘం
7. ఫొటోగ్రాఫర్ క్లబ్ ఏ రకమైన సంఘం?
   1) సాధారణ సంఘం
   2) సాంస్కృతిక సంఘం
   3) ప్రత్యేక అభిరుచి సంఘం
   4) సేవా సంఘం
8. పాఠశాలలో వైజ్ఞానిక సంఘానికి మార్గదర్శి లేదా ప్రతిపాదకుడుగా వ్యవహరించాల్సిన వారు?
   1) ప్రధానోపాధ్యాయుడు
   2) డీఈవో
   3) ఆ ప్రాంతంలోని శాస్త్రవేత్త
   4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
9. కిందివాటిలో వైజ్ఞానిక సంఘం ఏర్పాటుకు పరిగణనలోకి తీసుకోని అంశం ఏది?
   1) ప్రభుత్వ గుర్తింపు 2) కమిటీల ఏర్పాటు
   3) నియమాలు
   4) సమావేశాలు, కార్యక్రమాలు
10. NCERT సూచనల ప్రకారం వైజ్ఞానిక సంఘంలో ప్రధానోపాధ్యాయుని పాత్ర?
    1) మార్గదర్శి 2) నియంత
    3) పోషకుడు 4) సేవకుడు
11. సంఘం ఉద్దేశాలను, సంఘ కార్యక్రమాలను, ప్రదర్శనలు, వైజ్ఞానిక నాటకాల గురించి పరిసర సమాజానికి తెలియజేసే వైజ్ఞానిక సంఘ నిర్వాహక కమిటీ వ్యక్తి?
    1) అధ్యక్షుడు 2) కార్యదర్శి
    3) పోషకుడు 4) ప్రచారాధికారి
12. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ కార్యక్రమం కాదు?
    1) క్షేత్ర పర్యటన
    2) మాక్ పార్లమెంట్ నిర్వహణ
    3) బడి తోట నిర్వహణ
    4) పర్యావరణ దినోత్సవ నిర్వహణ
13. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు, తగిన నైపుణ్యాలు పెంపొందించి వారు భావి శాస్త్రవేత్తలుగా రూపుదిద్దుకొనేందుకు ప్రతి ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు?
    1) మండల విద్యాశాఖ 2) రాష్ట్ర విద్యాశాఖ
    3) NCERT 4) CBSE
14. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల వైజ్ఞానిక ప్రదర్శనలు ఎవరి ఆర్థిక సహాయంతో జరుగుతాయి?
    1) NCERT- SCERT 2) విద్యా శాఖా మంత్రి
    3) ముఖ్యమంత్రి 4) డీఈవో
15. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన కమిటీ చైర్మన్‌గా వ్యవహరించేవారు?
    1) కలెక్టర్ 2) డీఈవో 3) డైట్ ప్రిన్సిపాల్
    4) జిల్లాలో అవార్డు తెచ్చుకున్న సైన్స్ టీచర్

సమాధానాలు

1) 3;	2) 4;	3) 4;	4) 2;	5) 2;
6) 1;	7) 3;	8) 4;	9) 1;	10) 3;
11) 4;	12) 2;	13) 3;	14) 1;	15) 2;

ఉద్యోగాలు

కేజీబీవీల్లో 604 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ (పాఠశాల విద్యా శాఖ) ఆధ్వర్యంలో.. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)ల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఏడాది కాలానికి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 604.
- **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపల్-10, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)-165, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ)-163, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)-04, పార్ట్ టైం టీచర్(పీటీటీ)-165, వార్డెన్-53, అకౌంటెంట్-44.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, బీఈడీ, యూజీడీపీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు ప్రిన్సిపల్‌కు రూ.34,139, పీజీటీకి రూ.26,759, సీఆర్టీకి రూ.26,759, పీఈటీకి రూ.26,759, అకౌంటెంట్‌కు రూ.రూ.18,500, వార్డెన్‌కు రూ.18,500, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.18,500.
- **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, సర్వీస్ వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.10.2024.
- **వెబ్‌సైట్:** https://apkgbv.apcfss.in/



గది ఉష్ణోగ్రత వద్ద ద్రవరూపంలో ఉండే లోహం ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

మాదిరి ప్రశ్నలు

1. మానవ శరీరంలో అత్యధిక శాతం ఉండే మూలకం ఏది?
   1) కార్బన్ 2) ఆక్సిజన్
   3) నైట్రోజన్ 4) సోడియం
2. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజల్లో ఎక్కువగా కనిపించే వ్యాధి ఏది?
   1) కంటి శుక్లాలు 2) రక్తహీనత
   3) గాయిటర్ 4) ఫ్లోరోసిస్
3. అయోడిన్‌కు సంబంధించి సరికాని వాక్యం ఏది?
   1) సముద్రపు ఆహారంలో ఎక్కువగా లభిస్తుంది
   2) ఎత్తైన ప్రదేశాల్లోని నీటిలో అయోడిన్ లభ్యత తక్కువగా ఉంటుంది
   3) పిల్లల ఆహారంలో అయోడిన్ లోపిస్తే మందకొడిగా ఉండటంతో పాటు పెరుగుదల లోపిస్తుంది
   4) అయోడిన్ ఫ్లోరోసిస్ వ్యాధికి కారణమవుతుంది
4. కింది వాటిలో నీటిని శుద్ధి చేయడానికి దేన్ని ఉపయోగించవచ్చు?
   1) అయోడిన్ 2) ఫ్లోరిన్
   3) ఆక్సిజన్ 4) క్లోరిన్
5. కింది వాటిలో కాల్షియం ఉపయోగం కానిది ఏది?
   1) ఆరోగ్యవంతమైన ఎముకలు, దంతాల కోసం కాల్షియం అవసరం
   2) కండరాల సంకోచానికి అవసరం
   3) రక్తం గడ్డకట్టడానికి అవసరం
   4) ఆక్సిజన్ రవాణాకు అవసరం
6. రక్తంలోని హిమోగ్లోబిన్‌లో ఉండే లోహ అయాన్ ఏది?
   1) మాంగనీస్ 2) కాపర్
   3) ఐరన్ 4) జింక్
7. రక్తహీనతతో సంబంధం ఉన్న లోహం ఏది?
   1) ఐరన్ 2) జింక్
   3) అయోడిన్ 4) కార్బన్
8. కింది వాటిలో మాంసకృత్తుల తయారీకి అవసరం లేని మూలకాలేవి?
   i. కార్బన్ ii. నైట్రోజన్
   iii. ఆక్సిజన్ iv. హైడ్రోజన్
   v. ఐరన్ vi. కాల్షియం
   1) i, ii మాత్రమే 2) iii, iv మాత్రమే
   3) v, vi మాత్రమే 4) ii, iv మాత్రమే
9. కిరోసిన్‌లో ఏ లోహాన్ని నిల్వ చేస్తారు?
   1) సోడియం 2) మెగ్నీషియం
   3) ఐరన్ 4) ఫాస్ఫరస్
10. సిలికాన్ మూలకం ప్రధానంగా దేనిలో లభిస్తుంది?
   1) బొగ్గు 2) ఇసుక
   3) సున్నపురాయి 4) ఉప్పు
11. అయోడిన్ కలిగి ఉండే హార్మోన్ ఏది?
   1) ఇన్సులిన్ 2) టెస్టోస్టిరాన్
   3) థైరాక్సిన్ 4) ప్రొజెస్టిరాన్
12. కింది ఏ విటమిన్‌లో కోబాల్ట్ ఉంటుంది?
   1) B_1 2) B_6 3) B_{12} 4) B_2
13. కింది వాటిలో ఫెర్రో అయస్కాంత లోహాలని వేటిని అంటారు?
   1) ఐరన్, కోబాల్ట్, నికెల్
   2) ఐరన్, నికెల్, జింక్
   3) కాపర్, క్రోమియం, జింక్
   4) కాపర్, నికెల్, జింక్
14. గోర్లు, వెంట్రుకల పెరుగుదలకు అవసరమయ్యే లోహం ఏది?
   1) కాల్షియం 2) మాంగనీస్
   3) జింక్ 4) క్రోమియం
15. విటమిన్ B_1 (థయమిన్)లో ఉండే ప్రత్యేక మూలకం ఏది?
   1) ఫాస్ఫరస్ 2) క్లోరిన్
   3) అయోడిన్ 4) సల్ఫర్
16. కింది వాటిలో దేనిలో ఇనుము అధికంగా లభిస్తుంది?
   1) బెల్లం 2) కాలేయం
   3) తోటకూర 4) పైవన్నీ
17. కేన్సర్ చికిత్సలో ఉపయోగించే కోబాల్ట్ – 60 నుంచి విడుదలయ్యే వికిరణాలేవి?
   1) ఆల్ఫా కిరణాలు 2) బీటా కిరణాలు
   3) ఎక్స్ కిరణాలు 4) గామా కిరణాలు
18. సమయాన్ని కచ్చితంగా కొలవడానికి ఉపయోగించే పరమాణు గడియారాల్లో ఏ లోహాన్ని వాడతారు?
   1) కాడ్మియం 2) సీజియం
   3) టైటానియం 4) ఐరన్
19. గుండె కొట్టుకోవడంలో ముఖ్య పాత్ర పోషించే లోహం ఏది?
   1) పొటాషియం 2) కాల్షియం
   3) సీజియం 4) కాపర్
20. థర్మామీటర్‌లో ఉపయోగించే లోహం?
   1) పొటాషియం 2) ఐరన్
   3) కాపర్ 4) మెర్క్యురీ
21. జతపరచండి.

   జాబితా – I
   a) హిమోగ్లోబిన్‌లో ఆక్సిజన్ వాహకం
   b) క్లోరోఫిల్‌లోని ఆకుపచ్చ పదార్థం
   c) రబ్బర్ వల్కనైజేషన్
   d) కండరాల కదలిక

   జాబితా – II
   i) ఫాస్ఫరస్ ii) ఐరన్
   iii) మెగ్నీషియం iv) సల్ఫర్

	a	b	c	d
1)	iv	iii	ii	i
2)	iii	iv	i	ii
3)	ii	iii	iv	i
4)	i	iii	ii	iv

22. కింది వాటిలో కందెనగా వాడే పదార్థాలేవి?
   i. గ్రీజు ii. గ్రాఫైట్
   iii. టెప్లాన్ iv. డైమండ్
   1) i మాత్రమే 2) i, ii మాత్రమే
   3) i, ii, iii మాత్రమే 4) i, ii, iii, iv
23. కింది వాటిలో ఎమల్షన్ ఏది?
   1) పాలు 2) మీగడ
   3) వెన్న 4) పైవన్నీ
24. ఆక్వాడాగ్ (Aquadag) అంటే ఏమిటి?
   1) డాగ్ వాటర్
   2) గ్రాఫైట్ కొల్లాయిడల్ ద్రావణం
   3) గోల్డ్ కొల్లాయిడ్ 4) లేటెక్స్
25. ఆక్వాడాగ్‌ను ప్రధానంగా వేటి తయారీలో ఉపయోగిస్తారు?
   1) కాథోడ్ రే ట్యూబ్ (CRT)
   2) థర్మామీటర్ 3) పెయింట్ 4) పైవన్నీ
26. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) పచ్చి కాయలను పక్వానికి తీసుకురావడం – ఇథిలీన్
   2) నీటిశుద్ధి – బ్లీచింగ్ పౌడర్
   3) మత్తు మందు – క్లోరోఫామ్
   4) దంతాల్లో ఎనామిల్ ఏర్పర్చడం – సోడియం క్లోరైడ్
27. టీ, కాఫీలను ఎక్కువగా తాగేవారిలో ఏ లోహం శోషణ తక్కువగా ఉంటుంది?
   1) కోబాల్ట్ 2) ఇనుము
   3) సోడియం 4) మెగ్నీషియం
28. వాణిజ్యపరంగా తయారు చేసే ఇన్సులిన్‌లో ఉండే లోహం ఏది?
   1) జింక్ 2) ఐరన్
   3) సెలీనియం 4) మెర్క్యురీ
29. రక్తం గడ్డకట్టడానికి అవసరమయ్యే విటమిన్ ?
   1) ఎ 2) కె 3) డి 4) ఇ
30. ఏ విటమిన్ లోపిస్తే కండరాల బలహీనత, వంధ్యత్వం కలుగుతుంది?
   1) ఎ 2) బి 3) సి 4) ఇ
31. కింది వాటిలో కృత్రిమ తీపికారిణి కానిదేది?
   1) సుక్రలోజ్ 2) ఆస్పార్టేమ్
   3) సుక్రోజ్ 4) శాకరీన్
32. జతపరచండి.

జాబితా – I	జాబితా – II
a) విటమిన్ – సి	i) స్కర్వీ
b) విటమిన్ – డి	ii) రికెట్స్
c) విటమిన్ – ఎ	iii) రేచీకటి
d) విటమిన్ – $బి_{12}$	iv) రక్తహీనత

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	iii	ii	i
3)	iii	iv	i	ii
4)	ii	i	iv	iii

33. ఏ విటమిన్ లోపం వల్ల పెదాల మూలల్లో ఉండే చర్మం పగిలి పుండ్లు ఏర్పడతాయి?
   1) రైబోఫ్లేవిన్ (B_2)
   2) థయమిన్ (B_1) 3) పిరిడాక్సిన్ (B_6)
   4) సయనోకోబాలమిన్ (B_{12})
34. దేనికి యాంటీసెప్టిక్ ధర్మం ఉండదు?
   1) అయొడోఫామ్ 2) టింక్చర్ అయోడిన్
   3) బోరిక్ ఆమ్లం 4) క్లోరోఫామ్
35. ఎసిటైల్ శాలిసిలిక్ ఆమ్లం ఏ ఔషధంగా ప్రసిద్ధి చెందింది?
   1) ఓమిప్రజోల్ 2) ఆస్పిరిన్
   3) క్లోరోక్విన్ 4) డెట్టాల్
36. కింది వాటిలో ఆస్పిరిన్ ఉపయోగం కానిదేది?
   1) నొప్పులను తగ్గిస్తుంది
   2) రక్తం త్వరగా గడ్డకట్టకుండా పనిచేస్తుంది
   3) కీళ్ల వాతానికి సంబంధించిన నొప్పులను తగ్గిస్తుంది
   4) ఆమ్ల విరోధిగా పనిచేస్తుంది
37. కింది వాటిలో ఆమ్ల విరోధి కానిదేది?
   1) బేకింగ్ సోడా
   2) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   3) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   4) ఆస్పిరిన్
38. కింది వాటిలో కొల్లాయిడ్ ఏది?
   i. పాలు ii. రక్తం
   iii. జున్ను iv. పెయింట్
   1) i, ii మాత్రమే 2) ii, iv మాత్రమే
   3) i, ii, iii మాత్రమే 4) i, ii, iii, iv
39. జతపరచండి.

జాబితా – I	జాబితా – II
a) బాక్సైట్	i) థోరియం
b) హెమటైట్	ii) యురేనియం
c) పిచ్‌బ్లెండ్	iii) ఐరన్
d) మోనోజైట్	iv) అల్యూమినియం ఇసుక

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	iii	i	ii
3)	iv	iii	ii	i
4)	iii	iv	i	ii

40. కింది వాటిలో ఫెర్మెంటేషన్ ప్రక్రియ ద్వారా దేన్ని తయారు చేస్తారు?
   i. ఆల్కహాల్ ii. వెనిగర్ iii. టీ
   1) iii మాత్రమే 2) ii మాత్రమే
   3) ii, iii మాత్రమే 4) i, ii మాత్రమే
41. గది ఉష్ణోగ్రత వద్ద ద్రవ రూపంలో ఉండే లోహం ఏది?
   1) ఐరన్ 2) మెర్క్యురీ
   3) జింక్ 4) అల్యూమినియం
42. జతపరచండి.

జాబితా – I	జాబితా – II
a) హిమోగ్లోబిన్	i) కోబాల్ట్
b) క్లోరోఫిల్	ii) సిలికాన్
c) సయనోకోబాలమిన్	iii) ఐరన్
d) ఇసుక, శిలలు	iv) మెగ్నీషియం

	a	b	c	d
1)	ii	iii	i	iv
2)	iii	i	ii	iv
3)	i	iv	iii	ii
4)	iii	iv	i	ii

43. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) నూనె నుంచి డాల్డా తయారీ – హైడ్రోజన్
   2) వెల్డింగ్ – ఎసిటిలీన్
   3) మంటలు ఆర్పడం – ఆక్సిజన్
   4) భోపాల్ గ్యాస్ దుర్ఘటన – మిథైల్ ఐసోసయనేట్
44. బెరిబెరి (ఆకలి మందగించడం) వ్యాధి ఏ విటమిన్ లోపం వల్ల వస్తుంది?
   1) B_{12} 2) B_1 3) B_6 4) B_2
45. కింది వాటిలో నీటిలో కరిగే విటమిన్లు ఏవి?
   i. ఎ ii. బి iii. సి iv. డి v. ఇ
   1) i, iv, v మాత్రమే 2) ii, iii మాత్రమే
   3) iii, iv మాత్రమే 4) i, ii, iii, iv, v
46. జతపరచండి.

   జాబితా – I
   a) డీఎన్ఏ అణు నిర్మాణం
   b) రేడియోధార్మికత
   c) పెన్సిలిన్ d) సల్ఫాడ్రగ్స్

   జాబితా – II
   i) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
   ii) జేమ్స్ డేవీ వాట్సన్
   iii) డోమాక్ iv) హెన్రీ బెక్వరల్

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	iii	i	ii
3)	ii	iv	i	iii
4)	iv	ii	iii	i

47. వాహనాల్లో ఉండే ఎయిర్ బ్యాగుల్లో ఏ రసాయనాన్ని ఉపయోగిస్తారు?
   1) సోడియం బై కార్బొనేట్
   2) సోడియం ఎజైడ్
   3) సోడియం పెరాక్సైడ్
   4) సోడియం క్లోరైడ్
48. కన్వేయర్ బెల్ట్, గాస్కెట్, హోజ్‌పైపుల తయారీలో వాడే రబ్బర్ ఏది?
   1) సహజ రబ్బర్ 2) బ్యున – S
   3) బ్యున – N 4) బ్యున – E
49. కింది వాటిలో దేని తయారీలో PVCని ఉపయోగించరు?
   1) నీటి పైపులు 2) రెయిన్ కోట్‌లు
   3) క్యారీ బ్యాగులు 4) స్విచ్ బోర్డులు
50. కింది వాటిలో ట్రాంక్విలైజర్ ఏది?
   1) సోఫ్రమైసిన్ 2) డయజీపామ్
   3) క్లోరాంఫెనికాల్ 4) క్లోరోమైసిటిన్
51. కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
   1) గాలిలో కార్బన్ మోనాక్సైడ్ గాఢత పెరిగితే తలనొప్పి, దృష్టి మందగించడం లాంటి దుష్పరిణామాలు కలుగుతాయి
   2) గాలిలో సల్ఫర్ డైఆక్సైడ్ అధికమైతే చారిత్రక కట్టడాలు దెబ్బతింటాయి
   3) కార్బన్ డైఆక్సైడ్ ఆమ్లవర్షానికి కారణం
   4) గాలిలో లెడ్ (Pb) గాఢత పెరిగితే మానసిక వ్యాధులు కలుగుతాయి
52. కింది వాటిలో 'భౌతిక మార్పు' ఏది?
   i. పాలు పెరుగుగా మారడం
   ii. మంచు కరిగి ద్రవ నీరుగా మారడం
   iii. ఇనుము తుప్పు పట్టడం
   iv. అయోడిన్ స్ఫటికాలు ఉత్పతనం చెందడం
   1) iii మాత్రమే 2) ii, iv మాత్రమే
   3) i, ii మాత్రమే 4) i, iii మాత్రమే
53. జతపరచండి.

జాబితా – I	జాబితా – II
a) క్వినైన్ క్లోరోక్విన్	i) బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌లు
b) ఎరిత్రోమైసిన్	ii) మలేరియా
c) సిప్రోఫ్లోక్ససిన్	iii) టైఫాయిడ్
d) AZT	iv) HIV/AIDS

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iii	iv	i	ii
3)	ii	i	iii	iv
4)	iv	i	ii	iii

54. జతపరచండి.

జాబితా – I	జాబితా – II
a) ఫ్లోరైడ్	i) ఎంజైమ్ ఉత్తేజకం
b) క్లోరిన్	ii) దంతక్షయాన్ని నివారిస్తుంది
c) అయోడిన్	iii) నీటిశుద్ధి
d) పొటాషియం	iv) గాయిటర్ వ్యాధి

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	ii	iii	iv	i
3)	iv	i	ii	iii
4)	ii	iii	i	iv

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 4	5) 4
6) 3	7) 1	8) 3	9) 1	10) 2
11) 3	12) 3	13) 1	14) 2	15) 4
16) 4	17) 4	18) 2	19) 1	20) 4
21) 3	22) 3	23) 4	24) 2	25) 1
26) 4	27) 2	28) 1	29) 2	30) 4
31) 3	32) 1	33) 1	34) 4	35) 2
36) 4	37) 4	38) 4	39) 3	40) 4
41) 2	42) 4	43) 3	44) 2	45) 2
46) 3	47) 2	48) 2	49) 4	50) 2
51) 3	52) 2	53) 3	54) 2	

How many rooms are there of the west..

BANK EXAMS

Reasoning

Model Questions

Directions (Q.No.1-5): Read the following information carefully to answer the given questions.

In a global environment summit, eight representatives, viz P, Q, R, S, T, V, W and Z are representing different countries, viz Australia, Canada, France, Iran, China, Korea, Nepal and Britain, but not necessarily in the same order. All of them are sitting around a circular table facing the center. V sits third to the left of T. R and Z and also their immediate neighbours do not represent France. Only one person sits between W and the representative of France. The representatives of Iran and Canada are immediate neighbours of each other. R represents neither China nor Iran. Only one person sits between P and the one who represents Korea. P does not represent either France or Canada. R sits third to the right of Z. Z represents Britain. T is not an immediate neighbour of either R or Z. The one who represents Australia is an immediate neighbour of T. Three people sit between Z and the representative of Nepal. Q is not representing either France or Australia. W is not representing Korea.

1. Who among the following represents Canada?
   1) Q 2) R 3) T 4) V
   5) Cannot be determined
2. Who among the following represent immediate neighbours of V?
   1) P, Q 2) P, S 3) T, W 4) P, R
   5) P and the representative of China
3. Which of the following is true regarding W?
   1) W sits second to the right of P.
   2) W represents Iran.
   3) W sits between Q and the representative of Britain.
   4) Only one person sits between W and the representative of Canada.
   5) None is true
4. How many persons sit between S and the representative of Iran, when counted anti clockwise from S?
   1) None 2) One 3) Two 4) Three
   5) Four
5. Which of the following is true?
   1) S represents France.
   2) Only one person is sitting between the representatives of Iran and China.
   3) The representative of Canada is an immediate neighbour of W.
   4) One person sits between Z and the representative of France.
   5) None is true

Directions (Q.No.6-10): Study the information carefully and answer the questions given below.

There are three floors in a given building such that floor 2 is above floor 1 and floor 3 is above floor 2. In the building there are two flats in each floor such that A is in the west of Flat B. In the building each Flat has an area of 1200 ft and each flat has certain number of rooms and no two flats have same number of rooms. The area of each room of one of the flats on the even number floor is 120ft. Total rooms on floor number three is seven. The flat which has rooms of area of 150 ft is on odd number floor. Area of rooms in the flat which is exactly below 10 rooms flat is 600 ft. There is only one floor between the flats whose each room area is 400 ft and the flat whose room's area is 150 ft. There is no flat on the west of the flat having 6 rooms.

6. What is the area of a room in Flat A on floor 2?
   1) 300 ft 2) 200 ft 3) 600 ft
   4) either (1) or (3)
   5) None of these
7. What is the total number of rooms on floor 2?
   1) 12 2) 14 3) 13 4) 16
   5) None of these
8. Which of the following statement is true?
   1) Total number of rooms on floor 2 is 16
   2) Area of each room is 150 ft of flat A on floor 1
   3) Total rooms in Flat A of all three floors is 17.
   4) All are correct 5) None is correct
9. What is the area of room of flat B on floor 3?
   1) 200 ft 2) 600 ft 3) 300 ft 4) 400 ft
   5) None of these
10. How many rooms are there of the west of the flat whose each room area is 600 ft?
   1) 6 2) 4 3) 3 4) 8
   5) None of these

Directions (Q.No.11-15): The following questions are based on the following three-digit numbers given below:

571 863 427 654 912

11. If all the three digits of each of the numbers are multiplied together, the product of which of the following numbers will be the second highest?
   1) 571 2) 863 3) 427
   4) 654 5) 912
12. If all the digits of each of the numbers are arranged in ascending order within the number, how many numbers thus formed will be divisible by three?
   1) None 2) One 3) Two 4) Three 5) More than three
13. If one is subtracted from each even digit of each of the numbers, in how many numbers thus formed will a digit appear twice within the number?
   1) One 2) Two 3) Three 4) Four
   5) Five
14. If the positions of the first and the second digits of each of the numbers are interchanged, what will be the product of the first and the third digits of the second highest number thus formed
   1) 14 2) 16 3) 12
   4) 18 5) None of these
15. What will be the product of the second digit of the second lowest number and the third digit of the second highest number?
   1) 21 2) 12 3) 24 4) 16
   5) None of these

(Q.No.16-17): Read each question carefully and choose the appropriate answer:


16. If the alphabet is written in the reverse order and every alternate letter starting with Y is dropped, which letter will be fourth to the right of the ninth letter from the left end?
   1) B 2) N 3) Z 4) Z or A 5) None of these
17. In a certain code, 'COMPATIBLE' is written as MXUWGYMENF. How is BENEFICIAL written in that code?
   1) LNVLLNGLMC
   2) LVNLLNGLCM
   3) LNVLNLGLCM
   4) LNVLLNGLCM
   5) None of these

(Q.No.18 -20): In a row of children facing North, Tagore is fifth to the right of Amar who is twentieth from the right end of the row. Pavan is tenth to the left of Tagore and is twentysixth from the left end.

18. How many children are there in the row ?
   1) 49 2) 50 3)51
   4) Cannot be determined
   5) None of these
19. What is Amar's rank from the left end of the row?
   1) 29th 2) 30th 3) 31st
   4) Cannot be determined
   5) None of these
20. How many children are there in the row between Amar and Pavan?
   1) 4 2) 5
   3) 3 4) 6
   5) None of these

SOLUTIONS

(1-5)



1) 4; 2) 4 3) 5
4) 3; Only two persons, i.e W and Z
5) 2

(6-10):

Floor	A	B
3rd	Room area = 400ft Number of Rooms = 3	Room area = 300ft Number of Rooms = 4
2nd	Room area = 200ft Number of Rooms = 6	Room area = 120ft Number of Rooms = 10
1st	Room area = 150ft Number of Rooms = 8	Room area = 600ft Number of Rooms = 2

6) 2; 7) 4; 8) 4;
9) 3; 10) 4;

(11-15):

11) 4;
$8 \times 6 \times 3 = 144$; $6 \times 5 \times 4 = 120$. Therefore, second highest number is 654.

12) 3;
654 when arranged in ascending order, becomes 456 which is divisible by 3.
912 when arranged in ascending order, becomes 129 is also divisible by 3.

13) 2;
In 654, if one is subtracted from each even digit, it becomes 553. The digit '5' appears twice.
In 912, when one is subtracted from the even digit, it becomes 911 where the digit '1' appears twice

14) 4;
In the given numbers,
571 863 427 654 912
after interchanging the first two digits, the numbers appear as follows:
751 683 247 564 192
Hence, the second highest number is 683. The product of the first and the third digits is 18.

15) 1;
second lowest number is 571, and the second digit is '7'
Second highest number is 863, and the third digit is '3'
The product of 7 and 3 is 21.

16) 1;
Step No: 1
ZYXWVUTSRQPONMLKJIHGFEDCBA
Step No: 2 ZXVTRPNLJHFDB (all the odd numbered position letters which amount to thirteen are dropped)
Step No: 3 4th letter to the right + 9th letter from left end = 13th from the left end which is 'B'

17) 4; Each letter in the word 'COMPATIBLE' is coded in the alphabetical order in the forward direction , but in the descending order.
C+ 10 = M, O + 9 = X, and so on.

18) 2; Tagore is 15th from the right end. Pavan is 25th from the right end. We know that Pavan is 26th from the left end.
Hence, number of children in the row
= 25 + 26 – 1 = 50

19) 3; Left position of Amar + Right position of Amar –1 = number of children in a row
Left position
= 50 + 1 –20 = 31st

20) 1; Pavan is 25th from the right end. Amar is 20th from the right end. Hence, there are four children between Amar and Pavan.